


# వి. ఐ. లెనిన్

## సంక్షిప్త జీవితచరిత్ర

ప్రపంచ శ్రామిక ప్రజల నాయకుడూ, ఉపదేశకుడూ, మార్క్సు, ఎంగెల్సుల విప్లవ సిద్ధాంతాల ప్రముఖ ప్రతిపాదకుడూ, సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ నిర్మాతా, సోషలిస్టు విప్లవ మేధావీ, సోవియట్ రాజ్య స్థాపకుడూ, పేరుకెక్కిన విద్వాంసుడూ, అదే సమయంలో అత్యంత ఆర్ద్ర హృదయుడూ, నిగర్వి — అలాంటివాడు లెనిన్ అని ప్రపంచానికి తెలుసు.

లెనిన్ జీవితంలోని, కృషిలోని ప్రముఖ ఘట్టాలనూ, సకల జాతులకూ కమ్యూనిజం అనే దీప్తివంతమైన భవిష్యత్తుకు దారిని చూపించే ఆయన అమర బోధనూ యీ పుస్తకం సంక్షేపంగా తెలుపుతుంది.

# వి. ఇ. లెనిన్
## సంక్షిప్త జీవితచరిత్ర



సకల దేశ కార్మికులారా ఏకం కండి!

# వి. ఐ. లెనిన్

## సంక్షిప్త జీవితచరిత్ర

"ప్రగతి" ప్రచురణాలయం
మాస్కో

అనువాదం: రాచమల్లు రామచంద్రారెడ్డి

రెండవ కూర్పు

సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీకి చెందిన మార్క్సిజం లెనినిజం సంస్థచే తయారుచేయబడిన "వి. ఐ. లెనిన్. సంక్షిప్త జీవితచరిత్ర" అనే గ్రంథంయొక్క ఆరవ రష్యన్ కూర్పు (మాస్కో, "పొలితిజ్డాత్" 1974) యీ అనువాదానికి మూలం. రచయితలు: జి. డి. ఒబిచ్కిన్, కె. ఎ. ఒస్త్రొవూహొవా, యం. వై. పన్క్రాతొవా, ఎ. పి. స్మిర్నోవా, వై. యన్. స్త్రెల్నిఫెరోవ్‌స్కయా.

В. И. ЛЕНИН
КРАТКИЙ БИОГРАФИЧЕСКИЙ ОЧЕРК

*На языке телугу*

© "పొలితిజ్డాత్" 1974

© తెలుగు అనువాదం "ప్రగతి" ప్రచురణాలయం 1978

Л $\frac{10103-203}{014(01)-78}$ 698-78

# విషయసూచిక


బాల్యమూ, యవ్వనమూ. తొలి విప్లవ కార్యకలాపాలు . . . 5

రష్యా విప్లవ కార్మికవర్గ నాయకుడు . . . . . . 18

సైబీరియా ప్రవాసం . . . . . . . . . . 30

కొత్త రకం మార్క్సిస్టు పార్టీని స్థాపించడానికి కృషి . . 38

జారిజంమీద మొదటి దాడి . . . . . . . . 55

ప్రగతి వ్యతిరేక సంవత్సరాలలో పార్టీకొరకు పోరాటం . . 74

విప్లవోద్యమంయొక్క నూతన విజృంభణ . . . . . 89

కార్మికవర్గ అంతర్జాతీయతకు విధేయత . . . . . . 109

అక్టోబర్ విప్లవ నాయకుడు . . . . . . . . 132

ప్రపంచ ప్రథమ సోషలిస్టు రాజ్య స్థాపకుడు . . . . 155

దేశ రక్షణకు నాయకత్వం వహించిన లెనిన్ . . . . . 171

సోషలిస్టు నిర్మాణానికి ఉత్తేజమూ, రూపమూ యిచ్చినవాడు 197

లెనినిజం మహత్తర భావాల దిగ్విజయం . . . . . 221

# బాల్యమూ, యవ్వనమూ.

# తొలి విప్లవ కార్యకలాపాలు

వ్లదీమిర్ ఇల్యీచ్ ఉల్యానొవ్ (లెనిన్) 1870 ఏప్రిల్ (10) (22)న, వోల్గా ఒడ్డున వున్న సిమ్‌బీర్స్క్ (యిప్పుడు ఉల్యానొవ్‌స్క్) పట్టణంలో జన్మించినాడు. ఆయన బాల్యమూ, యవ్వనమూ ఆ రష్యన్ మహానదియొక్క ఆరుబయలు ప్రదేశాలలో సిమ్‌బీర్స్క్, కజాన్, సమార (యిప్పుడు కూయ్‌బిషెవ్) పట్టణాలలో గడిచినాయి.

లెనిన్ తాత రష్యన్ ఫ్యూడల్ దాసుడైన రైతు. ఆయన నీజ్ని-నొవ్‌గొరొద్ గుబెర్నియాలో* (జిల్లా) నివసించేవాడు. అక్కడ నుండి 1791లో ఆయన ఆస్త్రహన్ గుబెర్నియాకూ, తర్వాత ఆస్త్రహన్ నగరానికీ పోయి, అక్కడ కటిక దారిద్ర్యంలో మరణించినాడు. లెనిన్ తండ్రి ఇల్యా నికొలాయెవిచ్ ఉల్యానొవ్ చిన్నప్పటినుండి దారిద్ర్య బాధ అనుభవించినాడు. తన అన్న సహాయంతోనూ, అసాధారణమైన సామర్థ్యంతో కూడిన కఠిన శ్రమతోనూ మాత్రమే ఆయన ఉన్నత విద్య పొందగలిగినాడు. కజాన్ విశ్వవిద్యాలయ పట్టభద్రుడైన తర్వాత ఆయన సెకండరీ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేసి, తర్వాత పాఠశాలల ఇన్‌స్పెక్టరై, ఆ తర్వాత సిమ్‌బీర్స్క్ గుబెర్నియాలో ప్రభుత్వ పాఠశాలల డైరెక్టర్ అయినాడు. అభ్యుదయ

---

* గుబెర్నియా — పాత రష్యాలో పరిపాలక విభాగం. యిది ఉయేజ్దులుగానూ, వోలొస్తులుగానూ విభజింపబడివుండేది. — సం.

భావాలు గల ఆయన సామాన్య ప్రజలలో విద్యావ్యాప్తికి చాలా కృషి చేసినాడు. ఆయన గ్రామాలలో పాఠశాలలు యేర్పాటుచేసినాడు, ఉపాధ్యాయులకు సాయంచేసినాడు, వోల్గా ప్రాంతంలోని నాన్ రష్యన్ ప్రజల విద్యపట్ల యెంతో శ్రద్ధ చూపించినాడు.

లెనిన్ తల్లి మరీయా అలెక్సాంద్రొవ్నా ఒక వైద్యుని కూతురు. ఆమె యింటివద్ద చదువుకున్నది. ఆమెకు కొన్ని విదేశ భాషలు తెలుసు. ఆమెకు సాహిత్యంలో మంచి అభినివేశమూ, సంగీతంలో గొప్ప అభిరుచీ వుండినాయి. దృఢమైన సంకల్పమూ, పట్టుదలా, తెలివీ, శాంతమూ, సౌజన్యమూ గల ఆమె తన పిల్లల విద్యాభివృద్ధికి పూర్తిగా అంకితమైంది.

ఉల్యానొవ్ కుటుంబంలో ఆరుగురు పిల్లలు వుండినారు – అన్నా, అలెక్సాంద్ర్, వ్లదీమిర్, ఓల్గ, ద్మీత్రీ, మరీయా. వాళ్లకు సర్వతోముఖమైన విద్య యివ్వడానికీ, వాళ్లను కష్టపడే స్వభావమూ, నిజాయితీ, నమ్రతా, పౌరహిత దృష్టీ గల పౌరులుగా పెంచడానికీ తలిదండ్రులు శాయశక్తులా కృషిచేసినారు. ఉల్యానొవ్ పిల్లలందరూ పెరిగి విప్లవకారులు కావడం యాదృచ్ఛికం కాదు.

గాఢ అన్యోన్యత గల యీ పెద్ద కుటుంబంలో వ్లదీమిర్ ఉల్యానొవ్ పెరిగినాడు. ఆయన ఉల్లాసవంతుడూ, వినోదప్రియుడూ అయిన కుర్రవాడుగా వుండినాడు. కేరింతలతో కూడిన ఆటలూ, ఈతా, స్కేటింగూ, మిత్రులతో కలిసి పెద్ద షికార్లు పోవడమూ ఆయనకు ప్రీతి.

అయిదేండ్ల వయసులో ఆయన చదవడం నేర్చుకొని, తొమ్మిదేండ్ల వయసులో సిమ్‌బీర్స్క్ గ్రామర్ పాఠశాలకు పోవడం ప్రారంభించినాడు. అసాధారణమైన సామర్థ్యం గల విద్యార్థిగా, శ్రద్ధగా కష్టపడి చదువుకుంటూ, ఆయన ప్రతి తరగతిలోనూ ప్రశంసాపత్రాలతో కృతార్థుడయ్యేవాడు. పాఠాలతో యిబ్బందులు పడే సహపాఠులకు

తోడ్పడడానికి ఆయన యెప్పుడూ సిద్ధంగా వుండేవాడు. పాఠశాలలోని చివరి సంవత్సరంలో ఆయన చువాష్ జాతీయుడైన యన్. యమ్. ఒహోత్నికొవ్‌కు, చివరి సంవత్సరం పరీక్షలకు తయారు కావడంలో, సాయంచేసినాడు.

వ్లదీమిర్ ఉల్యానొవ్ పుస్తకాలు బాగా చదివేవాడు. పూష్కిన్, లెర్‌మొన్‌తొవ్, గోగొల్, తుర్గేనెవ్, నెక్రాసొవ్, సల్తికోవ్ - శ్చెద్రీన్, లెవ్ తొల్‌స్తోయ్ లాంటి గొప్ప రష్యన్ రచయితల రచనలు ఆయనకు బాగా పరిచయం. విప్లవ ప్రజాస్వామికవాదులైన బెలీన్‌స్కీ, గెర్‌త్సెన్, చెర్నిషేవ్‌స్కీ, దొబ్రొల్యూబొవ్, పీసరెవ్‌ల రచనలు, ఆనాడు అధికారికంగా నిషేధింపబడిన గ్రంథాలతో సహా, ఆయన పఠనంలో ముఖ్యమైన స్థానం ఆక్రమించినాయి. ఆయన అభిమాన గ్రంథాల్లో ఒకటి చెర్నిషేవ్‌స్కీ రచించిన 'యేమి చేయాలి?' ప్రముఖ విద్వాంసుడుగా, జారిస్టు నిరంకుశత్వానికీ, ఫ్యూడల్ దాస్యానికీ రాజీలేని శత్రువుగా చెర్నిషేవ్‌స్కీ కార్యకలాపాల ప్రాముఖ్యాన్ని లెనిన్, తరువాతి కాలంలో, పదేపదే నొక్కిచెప్పినాడు. కఠినమైన సెన్సర్‌షిప్ పరిస్థితులలో కూడా చెర్నిషేవ్‌స్కీ తన వ్యాసాలద్వారా నిజమైన విప్లవకారులను తయారుచేయగలిగినాడని లెనిన్ అన్నాడు.

యింటిలోని వాతావరణమూ, ఆయన చదివిన ప్రగతిశీల రష్యన్ సాహిత్యమూ, తనచుట్టూ వుండిన జీవితాన్ని పరిశీలించడమూ — యివి బాల లెనిన్ వ్యక్తిత్వాన్నీ, అభిప్రాయాలనూ తీర్చిదిద్దిన ప్రభావాలు. ఆ రోజుల్లో రష్యాలో పెట్టుబడిదారీ విధానం వేగంగా అభివృద్ధి చెందుతూ వుండింది; యంత్రాలనూ, వేలాది కార్మికులనూ వినియోగించే ఫాక్టరీలూ, కార్ఖానాలూ తలయెత్తుతూ వుండినాయి. అయినప్పటికీ ఫ్యూడల్ దాస్య అవశేషాలు యింకా చాలా మిగిలి వుండినాయి. ఫ్యూడల్ పీడనకు పెట్టుబడిదారీ దోపిడీ తోడైంది. ఫలితంగా, పట్టణాలలోనూ, గ్రామీణ ప్రాంతాలలోనూ శ్రమజీవుల పరిస్థితి శోచనీ

యంగా వుండింది. జారిస్టు ప్రభుత్వపు క్రూర పరిపాలనా, భూస్వాముల, పెట్టుబడిదార్ల పీడనా, దారిద్ర్య పీడిత కార్మిక కర్షకుల అధోగతీ ఆ యువకునిలో పీడకులపట్ల గాఢమైన ద్వేషాన్నీ, పీడితుల పట్ల సానుభూతినీ కలిగించినాయి. వ్లదీమిర్ యింకా పాఠశాలలో విద్యార్థిగా వుండగానే యీ విప్లవ భావాలు కనిపించినాయి. ఒకసారి ఆయన రాసిన ఒక వ్యాసం వాపసు యిస్తూ హెడ్‌మాస్టరు యిలా హెచ్చరించినాడు: "మీరు రాసిన యీ పీడిత వర్గాలు యేమిటి? వాటికి యిక్కడ యేమి సంబంధం?"

ఆయన అన్న అలెక్సాంద్ర్ దృఢమైన సంకల్పమూ, ఉన్నత నైతిక సూత్రాలూ గల యువకుడు. వ్లదీమిర్‌మీద ఆయన ప్రభావం యెక్కువగా వుండింది. "తన ప్రియతమ సోదరుని ఆదర్శం వ్లదీమిర్‌కు ప్రచండమైన ప్రాముఖ్యం గలది" అని లెనిన్ సోదరి అన్నా ఉల్యానొవా అన్నది. చిన్నప్పటినుండి ఆయన ప్రతి విషయంలోనూ తన అన్నను అనుకరించడానికి ప్రయత్నించేవాడు. ఫలానా సందర్భంలో నీవు యెలా వ్యవహరిస్తావని అడిగితే ఆయన తప్పనిసరిగా "అలెక్సాంద్ర్‌లాగ" అని జవాబిచ్చేవాడు. అలెక్సాంద్ర్ సెంట్ పీటర్స్‌బుర్గ్ విశ్వవిద్యాలయంలో విద్యార్థి; ఆయన ఉజ్వలమైన శాస్త్రజ్ఞుడు కాగలిగినవాడు. కానీ, ప్రజలకు మరింత మంచి జీవితం సంపాయించే ఆశతో ఆయన తన జీవితాన్ని జారిస్టు నిరంకుశత్వంమీద చేసే విప్లవ పోరాటానికి అంకితం చేయడానికి యెన్నుకున్నాడు. అలెక్సాంద్ర్ ఉల్యానొవ్ అభిప్రాయాలు 'నరోద్నయ వోల్య'* భావాలకూ మార్క్సిజంకూ మధ్యన వుండినాయి. వ్లదీమిర్ మొదట మార్క్సిస్టు సాహిత్యం గురించి తెలుసుకున్నది తన అన్నద్వారానే.

---

* 'నరోద్నయ వోల్య' – 19 శతాబ్ది 80ల ప్రాంతంలో రష్యాలో ఉండిన విప్లవ టెర్రరిస్టు సంఘం. – సం.

వ్లదీమిర్‌మీద జీవితం తీవ్రమైన దెబ్బ తీసినప్పుడు ఆయన చాలా చిన్నవాడు. 1886లో ఆయన తండ్రి హఠాత్తుగా మరణించినాడు. కుటుంబం ఆ దెబ్బనుండి తేరుకోకముందే మళ్లీ ఉపద్రవం సంభవించింది. మూడవ అలెక్సాండ్ర్ చక్రవర్తిని హత్యచేసే ప్రయత్నంతో సంబంధం వుందనే అభియోగంమీద అలెక్సాండ్ర్ 1887 మార్చిలో, సెంట్ పీటర్స్‌బుర్గ్‌లో అరెస్టు అయినాడు. అదే సంవత్సరం మేలో ఆయన ష్లిస్సెల్‌బుర్గ్ కోటలో ఉరితీయబడినాడు. "అలెక్సాండ్ర్ ఉల్యానొవ్ వీర మరణం పొందినాడు. ఆయన విప్లవ వీర మరణ పరివేషం తమ్ముడు వ్లదీమిర్‌యొక్క మార్గానికి వెలుగు చూపించింది" అని ఆయన సోదరి అన్నా రాసింది.

తన సోదరుని మరణం వ్లదీమిర్‌కు దారుణమైన ఆఘాతం. తన జీవితాన్ని విప్లవ పోరాటానికి అంకితం చేయాలనే ఆయన నిశ్చయాన్ని అది దృఢపరిచింది. కానీ, తన సోదరునియొక్క, ఆయన సహచరులయొక్క సాహసాన్నీ, స్వార్థత్యాగాన్నీ మెచ్చుకుంటూనే, ఆయన వాళ్లు యెన్నుకున్న మార్గాన్ని నిరాకరించినాడు. ప్రభుత్వ అధికారులైన వ్యక్తులను, జారునైనాసరే, హత్యచేయడం నిష్ప్రయోజనమైన తప్పు మార్గం అని వ్లదీమిర్‌కు, చిన్నవాడైనప్పటికీ, నమ్మకం కలిగింది. "వద్దు, మనం ఆ మార్గం అనుసరించవద్దు; అనుసరించవలసిన మార్గం అది కాదు" అన్నాడు ఆయన.

శ్రామిక జన విమోచనకు భిన్న మార్గం కొరకు వ్లదీమిర్ ఉల్యానొవ్ అన్వేషణ ప్రారంభించినాడు. విప్లవ కార్యకలాపాలకు సన్నద్ధుడు కావడంలో ఆయన సామాజిక శాస్త్రాలలో ప్రత్యేక ఆసక్తి కనబరిచి, వాటిని లోతుగా అధ్యయనం చేసినాడు. 1887 ఆగస్టులో, బంగారు పతకంతో ఉన్నత పాఠశాలను పూర్తిచేసిన తర్వాత, ఆయన కజాన్ విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్ర విభాగంలో చేరినాడు.

యిక్కడ యువ ఉల్యానొవ్ విప్లవ భావాలు గల పురోగామి విద్యార్థులతో సంబంధాలు నెలకొల్పుకున్నాడు. 1887 డిసెంబర్ తొలి రోజుల్లో ఆయన, విద్యార్థుల రహస్య సమావేశంలో పాల్గొన్నందుకు గాను, విశ్వవిద్యాలయంనుండి బహిష్కరింపబడి, తరువాత అరెస్టు చేయబడినాడు. తనను జైలుకు తీసుకపోయిన పోలీసు అధికారితో తనకు జరిగిన సంభాషణను లెనిన్ తదనంతర కాలంలో జ్ఞాపకం చేసుకొన్నాడు. "తిరుగుబాటువల్ల యేమి లాభం, యువకుడా? మీ ముందర ఒక గోడ వుంది, కనపడడం లేదూ?" అన్నాడు ఆ అధికారి. ఉల్యానొవ్ యిలా జవాబిచ్చినాడు: "గోడ సమూలంగా పుచ్చిపోయింది, ఒక తాపు యిస్తే అది కూలిపోతుంది!"

17 యేండ్ల లెనిన్ జారిస్టు నిరంకుశత్వంమీద విప్లవ పోరాటం చేసే జీవిత మార్గంలో ప్రయాణం ప్రారంభించినాడు.

కజాన్ గుబెర్నియాలోని కొకూష్కినొ (యిప్పుడు లెనినొ) గ్రామానికి ఆయన బహిష్కరింపబడినాడు. ఆనాటినుండి ఆయన పోలీసు తనిఖీకింద వుండినాడు. యీ చిన్న మారుమూల గ్రామంలో జీవిస్తూ ఆయన స్వీయ విద్యాభ్యాసానికి చాలా పుస్తకాలు చదివినాడు. "కొకూష్కినొ గ్రామానికి బహిష్కరింపబడిన తర్వాత ఆ సంవత్సరం చదివినంత నా జీవితంలో నేను యెప్పుడూ చదవలేదనుకుంటాను, సెంట్ పీటర్స్‌బుర్గ్‌లోని జైలులో కూడా, సైబీరియాలో కూడా. నేను ఆబగా చదివినాను, వేకువనుండి రాత్రి పొద్దుపోయిందాకా" అని తరువాతి కాలంలో లెనిన్ అన్నాడు.

ఒక సంవత్సరం తర్వాత, తిరిగి కజాన్‌కు పోవడానికి ఆయనకు అనుమతి యివ్వబడింది. అక్కడ ఆయన విశ్వవిద్యాలయంలో పునః ప్రవేశానికి అర్జీ పెట్టుకున్నాడు. అది నిరాకరింపబడగా, విద్య కొనసాగించడానికి విదేశాలకు పోవడానికి అనుమతి కొరకు ఆయన అర్జీ పెట్టుకున్నాడు. కానీ జారిస్టు అధికార్లు ఆయన అభ్యర్థనను తిర

స్కరించినారు. ఉల్యానొవ్ యిప్పుడు "రాజకీయంగా అవిశ్వసనీయుడు"గా లెక్కింపబడినాడు.

ఆ కాలంలో కజాన్‌లో కొన్ని చట్ట వ్యతిరేక (రహస్య) విప్లవ బృందాలు వుండినాయి. ప్రథమ రష్యన్ విప్లవ మార్క్సిస్టులలో ఒకడైన యన్. వై. ఫెదొసేయెవ్‌చేత నిర్మింపబడినవి అవి. లెనిన్ కొందరు సభ్యులతో పరిచయం కలిగించుకొని, ఒక బృందంలో చేరినాడు.

మార్క్సిజంను, దాని స్థాపకుడైన కార్ల్ మార్క్స్ పేరుమీద వెలసిన విప్లవ సిద్ధాంతాన్ని, నిష్ఠగా అధ్యయనం చేయడానికి ఆయన పూనుకున్నాడు. కార్మికవర్గాన్నీ, సకల శ్రామిక ప్రజలనూ పెట్టుబడిదారీ శృంఖలాలనుండి విముక్తి చేయడానికి మార్క్స్, తన మిత్రుడైన ఎంగెల్సుతో కలిసి, తన జీవితమంతా అంకితం చేసినాడు. 19వ శతాబ్ది మధ్యలో మార్క్స్, ఎంగెల్సులు సామాజిక అభివృద్ధి నియమాల శాస్త్రం స్థాపించి, సమాజ విప్లవ పరివర్తన మార్గాన్ని నిర్ణయించినారు.

కార్మిక జనంయొక్క ఖర్చుమీద పెట్టుబడిదార్లు ధనవంతులయ్యే సామాజిక వ్యవస్థ శాశ్వతంగా వుండదని యీ కార్మికవర్గ మహా దేశికులు శాస్త్రీయంగా నిరూపించినారు. పెట్టుబడిదారీ పీడన నుండి మానవజాతిని విముక్తి చేయడానికి బూర్జువావర్గ పాలనను కూలదోసి, నూతన, సోషలిస్టు సమాజాన్ని నిర్మించగల శక్తి అవసరం. ఆ శక్తే – కార్మికవర్గం, కూలి సంపాయించే వర్గం. బూర్జువా సమాజంలో కార్మికవర్గం అత్యంత పీడితమైన, అత్యంత సంఘటితమైన, అత్యంత విప్లవకరమైన వర్గం. తదనంతర కాలంలో మార్క్సిజం సారాన్ని వివరిస్తూ లెనిన్ యిలా రాసినాడు: "పెట్టుబడిమీద విప్లవ పోరాటంలో మొదటి వాళ్లుగా వుండడమూ, సమస్త శ్రామిక పీడిత జనాన్నీ తమ చుట్టూ సమీకరించడమూ అనే తమ పాత్రనూ,

తమ కర్తవ్యాన్నీ, తమ జీవిత విధినీ కార్మికవర్గానికి సూచించడం మార్క్సు, ఎంగెల్సుల గొప్ప, చరిత్రాత్మకమైన ఘనత.''

కార్మికవర్గానికీ పెట్టుబడిదార్లకూ మధ్య జరిగే పోరాటం చివరకు సోషలిస్టు విప్లవానికి దారితీస్తుందనీ, అందులో కార్మిక వర్గం పెట్టుబడిదార్ల అధికారాన్ని కూలదోసి, శ్రామికజన ప్రయోజనాల కొరకు కార్మికవర్గ నియంతృత్వాన్ని, అనగా తన సొంత అధికారాన్ని, స్థాపిస్తుందనీ మార్క్సు, ఎంగెల్సులు బోధించినారు.

కార్మికవర్గ నియంతృత్వ సమస్య మార్క్సిజంకు మౌలికమైనది. పెట్టుబడిదార్లూ భూస్వాములూ అనే దోపిడీ వర్గాల ప్రతిఘటనను అణచివేయడానికీ, రైతులను తమ వెంట నడిపించడానికీ, నూతన, సోషలిస్టు సమాజం నిర్మించడానికీ కార్మికులకు కార్మికవర్గ నియంతృత్వం అవసరం. యీ చరిత్రాత్మకమైన కర్తవ్యాన్ని నిర్వహించడానికి కార్మికవర్గానికి వుండాలి తన సొంత విప్లవకర పార్టీ — శాస్త్రీయ సిద్ధాంతంచేత నడిపించబడుతూ, కార్మికవర్గానికి దాని గమ్యాన్ని చూపించి, సోషలిజం కొరకు అది చేసే పోరాటంలో అగ్రస్థానం వహించే పార్టీ.

లెనిన్ విప్లవోద్యమంలో చేరిన కాలంలో, మార్క్సిస్టు భావజాలం పశ్చిమ యూరపియన్ కార్మికోద్యమంలో ఉచ్చస్థితికి చేరి, రష్యాలో వ్యాపించడం ప్రారంభించి వుండింది. రష్యాలో మార్క్సిజంయొక్క ప్రథమ ప్రముఖ ప్రచారకుడు జి. వి. ప్లెహానొవ్. జారిస్టు హింసల చేత దేశం వదలవలసివచ్చి, ప్లెహానొవ్, ఆయన సహచరులూ జెనీవా (స్విట్జర్లెండు)లో, 1883లో రష్యన్ మార్క్సిస్టుల ప్రథమ బృందాన్ని, 'శ్రమ విమోచన' అనే పేరుతో, నిర్మించినారు. ఆ బృందం సభ్యులు మార్క్సు, ఎంగెల్సుల రచనలు రష్యన్ భాషలోకి అనువదించి, రష్యాలోకి దొంగగా చేరవేసినారు. 1880లలో రష్యాలో ప్రథమ మార్క్సిస్టు అధ్యయన బృందాలు తలయెత్తినాయి.

తన విమోచనను సాధించి, సోషలిజంయొక్క విజయాన్ని సాధించే సామర్థ్యాన్ని కార్మికవర్గానికి యిచ్చే సిద్ధాంత ఆయుధం యువ లెనిన్‌కు కనిపించింది మార్క్సిజంలోనే. ఆయన మార్క్స్ ప్రధాన రచన అయిన 'పెట్టుబడి'ని లోతుగా అధ్యయనం చేసినాడు. "మార్క్స్ సిద్ధాంతపు మౌలిక సూత్రాలనూ, అవి ఆవిష్కరించిన నూతన దిజ్మండలాలనూ" లెనిన్ యెంత ప్రగాఢ ఉత్సాహంతో తనకు వివరించిందీ ఆయన సోదరి అన్నా తెలియజేసింది. "ఆయనలోనుండి ఆశావహమైన ఆత్మవిశ్వాసం, యితరులకు కూడా అంటుకునేది, వెలిజిమ్ముతున్నట్లు వుండేది. ఆ తొలి రోజుల్లో కూడా ఆయన మాటలకు యితరులను ప్రభావితం చేసి, ఒప్పించే శక్తి వుండింది." లెనిన్ దృఢమైన మార్క్సిస్టూ, శాస్త్రీయ సోషలిజంయొక్క ప్రగాఢ ప్రచారకుడూ అయినాడు.

1889 మేలో లెనిన్, కుటుంబంతో సహా, సమార గుబేర్నియాకు పోయి, తరువాతి నాలుగున్నర సంవత్సరాలు అక్కడ వుండినాడు. వేసవిలో ఆ కుటుంబం అలకాయెవ్క గ్రామం దగ్గర ఒక పొలంలోని యింటిలో వుంటూ, శరదృతువులో సమార చేరేది. తీవ్రమైన అధ్యయనం సంవత్సరాలు యివి. లెనిన్ తన మార్క్స్, ఎంగెల్సుల రచనల ప్రగాఢ అధ్యయనం కొనసాగించి, విదేశ భాషలు, ముఖ్యంగా జర్మన్ భాష, నేర్చుకోడానికి తన సమయంలో అత్యధిక భాగం వినియోగించినాడు. ఆ కాలంలో ఆయన 'కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక'ను — మార్క్స్, ఎంగెల్సుల అత్యంత ముఖ్య కార్యక్రమాత్మక రచనల్లో ఒకదాన్ని — రష్యన్ భాషలోకి అనువదించినాడు. యువ విప్లవకారుల బృందాలు ఆయన అనువాదాన్ని చేతిరాతలో చదివినారు. తన విలక్షణమైన చురుకుదనంతోనూ, విశ్వాసంతోనూ లెనిన్ యువకులలో మార్క్సిస్టు బోధలు ప్రచారం చేయడానికి పూనుకున్నాడు.

ఆయన సమార చేరినప్పుడు, విప్లవ భావాలు గల యువకులు, అత్యధికంగా విద్యార్థులు, రష్యాలోని విప్లవోద్యమంలో అప్పటికింకా ప్రబలంగా వుండిన నరోద్నిక్కుల అభిప్రాయాలచేత ప్రభావితులై వుండినారు. యేమిటి ఆ అభిప్రాయాలు? రష్యా అభివృద్ధి యెలా వుం టుందని వాళ్లు ఊహించినారు? జారిజంతో వాళ్లు యెలా పోరాడినారు?

రష్యాలో పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి కాదనీ, రష్యా తన సొంత మార్గాన్ని, యితర దేశాలకంటె భిన్నమైనదాన్ని, అనుసరి స్తుందనీ నరోద్నిక్కులు వాదించినారు. వాళ్లు కార్మికవర్గ చరిత్రాత్మక పాత్రను నిరాకరించి, రైతాంగాన్ని ప్రధాన విప్లవ శక్తిగా పరిగణించి, నిరంకుశత్వ వ్యతిరేక ఆచరణకు వాళ్లను పురికొల్పడానికి ప్రయత్నించి నారు. యీ లక్ష్యంతో విప్లవ మేధావులు గ్రామీణ ప్రాంతంలోకి, "ప్రజలమధ్యకు,"* పోయినారు. కానీ వాళ్ల బోధలు రైతులకు నమ్మ కం కలిగించలేదు.

ప్రభుత్వ అధికారులైన వ్యక్తులను హత్యచేయడంద్వారా నిరంకుశత్వాన్ని భయపెట్టి, తన విధానాన్ని మార్చుకునేటట్లు దాన్ని నిర్బంధించవచ్చుననే ఆశతో నరోద్నిక్కులు, నిరంకుశత్వంమీద తాము చేసే పోరాటంలో, టెర్రరిజంకు గొప్ప ప్రాముఖ్యం యిచ్చినారు. ఆవిధంగా వాళ్లు జారిజంను కూలదోయడానికి వ్యక్తులు, ప్రజలు కాదు, సమర్థులని నమ్మినారు. మరి యిది పరమమైన భ్రమ. ప్రముఖ జారిస్టు అధికార్ల హత్య గానీ, చివరకు సాక్షాత్తు జారు హత్య గానీ వున్న వ్యవస్థను మార్చజాలదు. జారిస్టు వ్యవస్థ కొనసాగుతూనే వుండింది. హత్య చేయబడిన మంత్రుల స్థానంలో జారుకు కొత్త సేవకులు, అంత విశ్వాసమూ గలవాళ్లు, నియమింపబడే వాళ్లు; నరో

---

* రష్యన్ భాషలో "నరోద్" అంటే ప్రజలు. దానినుండి నరోద్నిక్కులు అనే పేరు వచ్చింది. — సం.

ద్నిక్కులమీద క్రూరమైన శిక్షాచర్యలు జరపబడేవి, వాళ్ళు జైలులో పెట్టబడేవాళ్ళు, ఉరితీయబడేవాళ్ళు, కఠిన శిక్షకు గురి అయ్యేవాళ్ళు. నరోద్నిక్కుల వీరత్వమూ, స్వార్థత్యాగమూ విప్లవకారులుగా వాళ్లకు గుర్తింపును సంపాయించి, వాళ్ల ప్రభావాన్ని మేధావులలోనూ, కార్మిక వర్గ పురోగామి భాగంలోనూ వ్యాప్తిచేయడానికి తోడ్పడేవి. 1870ల నరోద్నిక్కులకు వాళ్ల విప్లవతత్వానికీ, అనుభవానికీ, సాహసానికీ గాను లెనిన్ ప్రగాఢ గౌరవం చూపిస్తూనే, వాళ్ల తప్పు అభిప్రాయాలనూ, చర్యలనూ విమర్శించినాడు.

'నరోద్నయ వోల్య' అనే రహస్య సంస్థ నలిపివేయబడిన తర్వాత, నరోద్నిక్కులలో అత్యధిక భాగం విప్లవ పోరాటం విసర్జించి, నిరంకుశత్వంతో రాజీని బోధించసాగినారు. జారిజంతో పోరాటం చేసిన వెనకటి విప్లవ నరోద్నిక్కులకు భిన్నంగా, 1890 నరోద్నిక్కులు నిరంకుశత్వాన్ని వ్యతిరేకించక పోవడమే కాక, దాన్ని పట్టుకుని ప్రేలాడినారు కూడా. వాళ్లు ఉదారవాద నరోద్నిక్కులుగా పేరుకెక్కినారు. అభిప్రాయాలలోనూ, చర్యలలోనూ విప్లవకారులుగా వుండడం మానుకున్న యీ నరోద్నిక్కులతో లెనిన్ తీవ్ర పోరాటం చేసినాడు.

నరోద్నిక్కులకు వ్యతిరేకంగా లెనిన్ మొదట బహిరంగంగా అభిప్రాయాలు ప్రకటించింది సమారలో. ఆవేశపూరితమైన వాదాలలోనూ, చర్చలలోనూ ఆయన వాళ్ల సిద్ధాంతంలోని దోషాన్నీ, దాని అవాస్తవికతనూ చూపించినాడు.

తన స్వీయ విద్యాభ్యాసానికి లెనిన్ కఠిన పరిశ్రమ చేస్తూనే వుండినాడు. అలకాయెవ్కవద్ద, వేసవిలో, ఒక లైమ్‌చెట్ల తోపులో ఆయన నీడగల మూలను కనుక్కున్నాడు; అక్కడ ఒక బెంచీ, టేబులూ వుండేవి. "ప్రతి ఉదయమూ, ఉదయ భోజనం తర్వాత, చేతులలో బోలెడు పుస్తకాలతో ఆయన అక్కడికి సకాలంలో పోయేవాడు, కఠినమైన ఉపాధ్యాయుడు తనకోసం అక్కడ యెదురుచూస్తూ వున్నట్లు.

మధ్యాహ్న భోజన సమయందాకా ఆయన అక్కడ పూర్తిగా ఒంటరిగా వుండేవాడు'' అని ఆయన సోదరి అన్నా చెప్పింది. పరినిష్ఠిత అధ్యయనంతో ఆయన వినోదాన్ని మేళవించగలిగినాడు: ఆయన క్రమ బద్ధమైన వ్యాయామమూ, దీర్ఘ వాహ్యాళులూ సాగించేవాడు సంగీతానికీ, పాటలు పాడడానికీ, చదరంగానికీ వ్యవధి సంపాయించుకునేవాడు. ఆయనకు పరిహాసాలూ, నవ్వులూ యిష్టం, తన సంతోషాన్నీ, ఉల్లాసపూరిత యువకోత్సాహాన్నీ నిత్యం యితరులకు కూడా యెక్కించేవాడు.

పూర్తి నాలుగేండ్ల యూనివర్సిటీ కోర్సును ఆయన పద్దెనిమిది నెలలలో స్వయంగా అధ్యయనం చేసినాడు. 1891లో ఆయన సెంట్ పీటర్స్‌బుర్గ్ విశ్వవిద్యాలయ న్యాయశాస్త్ర పరీక్షలో ప్రశస్తంగా ఉత్తీర్ణుడై, ఆనర్స్ పట్టా పొందినాడు. మరు సంవత్సరం ఆయన సమార జిల్లా కోర్టులో ప్రతివాదుల న్యాయవాదిగా వృత్తి ప్రారంభించినాడు. ఆయన కక్షిదార్లు ప్రధానంగా బీద రైతులు. కానీ, న్యాయవాది వృత్తి పట్ల ఆయనకి గొప్ప ఆసక్తి లేదు. ఆయన మార్క్సిస్టు సాహిత్యం అధ్యయనంలో పూర్తిగా మునిగిపోయినాడు, క్రియాశీలమైన విప్లవ కార్యకలాపాలకు సన్నాహాలు చేసినాడు.

1892లో, సమారలో మార్క్స్, ఎంగెల్సుల రచనల అధ్యయనానికీ, మార్క్సిజం ప్రచారానికీ మొదటి బృందాన్ని లెనిన్ నిర్మించినాడు. దాని సభ్యులు విప్లవ భావాలు గల యువకులు. వాళ్లలో ఏ. పి. స్క్ల్యారేంకొ, ఐ. కె. లలయాన్త్స్, యమ్. ఐ. సెమ్యొనొవ్, ఐ. ఏ. కుజ్నెత్సోవ్, యం. ఐ. లేబెదెవా వుండినారు. ఆ కాలంలో అప్పటికే లెనిన్ తన అసాధారణ పాండిత్యంచేతా, విశ్వాసంచేతా, సహాయకులను సంపాయించుకునే సామర్థ్యంచేతా తన సహవిప్లవకారులను ఆకట్టుకున్నాడు. "యీ 23 యేండ్ల వ్యక్తిలో సరళత్వమూ, సమయౌచిత్యమూ, నిత్య సంతోషమూ, ఉల్లాసమూ అచ్చెరువు కలిగించే విధంగా నెమ్మదితోనూ,



ఉల్యానొవ్ కుటుంబం
ఫోటో 1879



వి. ఐ. లెనిన్

ఫోటో 1887

ప్రగాఢ పాండిత్యంతోనూ, నిర్దాక్షిణ్యమైన సార్వత్రిక తర్కబద్ధతతోనూ, స్పష్టతతోనూ, నిర్ణయాల కచ్చితత్వంతోనూ కలిసివుండినాయి'' అని లలయాన్త్స్ రాసినాడు.

రష్యన్ గ్రామీణ జీవితాన్ని లెనిన్ సన్నిహితంగా గమనించేవాడు. తరుచు ఆయన రైతులతో మాట్లాడుతూ, వాళ్ల జీవిత పరిస్థితులను గురించి అడుగుతూ, వాళ్లు చెప్పేదాన్ని శ్రద్ధగా వినేవాడు. అదే సమయంలో ఆయన రైతాంగానికి సంబంధించిన ఆర్థిక రచనలూ, గణాంక వివరాలూ శ్రద్ధగా అధ్యయనం చేసేవాడు. సమారలో ఆయన 'రైతు జీవితంలో నూతన ఆర్థిక ఘటనలు' అనే వ్యాసం రాసినాడు – మనకు అందిన ఆయన మొట్టమొదటి రచన. యీ వ్యాసంలో ఆయన వ్యవసాయంలోకి పెట్టుబడిదారీ విధానం ప్రవేశించడాన్నీ, రైతాంగం బీద, మధ్య, ధనిక (కులాక్) రైతులుగా విభజింపబడడాన్నీ చూపించినాడు.

లెనిన్ తన కార్యకలాపాలను సమారకు పరిమితం చేయలేదు. కజాన్, సరాతొవ్, స్రీజన్, యితర వోల్గా తీర పట్టణాలలోనూ వుండిన మార్క్సిస్టులతో ఆయన సంబంధాలు నెలకొల్పుకున్నాడు.

సమారలో గడిపిన యేండ్లు ఆయన భవిష్యత్ రాజకీయ కార్యకలాపాలకు ప్రచండమైన ప్రాముఖ్యం గలవి. విప్లవ పోరాటపు విశాల మార్గం చేపట్టడానికి ఆయన బలం కూడగట్టుకున్న దశ యిది. ఆయన మార్క్సిస్టు కమ్యూనిస్టు విశ్వాసాలు రూపు దాల్చి, కరుడు గట్టింది యిక్కడే. ఆయన మార్క్స్, ఎంగెల్సుల మహోద్యమానికీ, బోధలకూ అంకితమైన ప్రచారకుడు అయినాడు. కానీ, చిన్న పట్టణమైన సమార లెనిన్ విప్లవ కార్యకలాపాలకు అతి పరిమిత రంగంగా వుండింది. కార్మికవర్గం విస్తృత సంఖ్యలో వుండి, విప్లవ పోరాటానికి మరింత విస్తృత అవకాశాలు యిచ్చే యేదైనా పెద్ద పారిశ్రామిక కేంద్రం కోసం ఆయన తపించినాడు. 1893 ఆగస్టులో లెనిన్ సమార వదిలి సెంట్ పీటర్స్‌బుర్గ్‌కు పోయినాడు.

# రష్యా విప్లవ కార్మికవర్గ

# నాయకుడు

సెంట్ పీటర్స్‌బుర్గ్ ఆనాడు రష్యా రాజధాని, కార్మికవర్గ ఉద్యమానికి ఒక ప్రధాన కేంద్రం. అక్కడ కొన్ని రహస్య బృందాలు వుండినాయి; వాటి సభ్యులు మార్క్సిజంను అధ్యయనం చేసి, పురోగామి కార్మికుల్లో మార్క్స్, ఎంగెల్సుల బోధలను ప్రచారంచేస్తూ వుండినారు. లెనిన్ ఒక బృందంలో చేరినాడు. "యిక్కడ, మా ఉత్తరాది మైదానాలలో, ఒక అసాధారణ వ్యక్తి ప్రత్యక్షమైనాడు; అందరికంటె యెక్కువగా ఆయన మార్క్స్ మహా మేధ సృష్టించిన ఆయుధంయొక్క శక్తిని గ్రహించినవాడు. ఆయనకు మార్క్సిస్టు అంటే అన్నిటినీ మించి విప్లవకారుడు" అని దీర్ఘకాల పార్టీ సభ్యుడైన జి. యం. క్రిజిజ నోవ్‌స్కియ్ తన స్మృతులలో రాసినాడు.

గొప్ప చురుకుదనంతోనూ, ఆవేశంతోనూ లెనిన్ విప్లవ కృషిలో దుమికినాడు. మార్క్సిజంను గురించి ఆయన ప్రగాఢ జ్ఞానమూ, దాన్ని రష్యన్ పరిస్థితులకు అనువర్తించే సామర్థ్యమూ, కార్మికోద్యమ దిగ్విజయంలో ఆయన విశ్వాసమూ, వీటికితోడు పార్టీ నిర్మాతగా ఆయన ప్రజ్ఞా త్వరలో ఆయన్ను సెంట్ పీటర్స్‌బుర్గ్ మార్క్సిస్టుల గుర్తింపబడిన నాయకునిగా చేసినాయి.

పీటర్స్‌బుర్గ్‌లో లెనిన్ కార్యకలాపాలూ, సామూహిక కార్మికవర్గ ఉద్యమంలో వెల్లువ ప్రారంభమూ ఏకకాలంలో జరిగినాయి. రష్యాలో పరిశ్రమలు విస్తరించడం 1890లలో ప్రారంభమైంది: కొత్త ఫాక్టరీలూ, మిల్లులూ తలయెత్తినాయి, కార్మికవర్గం వేగంగా పెరిగింది, పెట్టుబడిదార్లమీద పోరాటం స్థిరంగా బలం పుంజుకొంది. తన

చారిత్రక కర్తవ్యం నెరవేర్చగలగడానికి కార్మికవర్గానికి తన సొంత విప్లవ కార్మిక పార్టీ అవసరమై వుండింది. అలాంటి పార్టీని నిర్మించే కర్త వ్యాన్ని సెంట్ పీటర్స్‌బుర్గ్ మార్క్సిస్టులముందు పెట్టినవాడు లెనిన్.

మార్క్సిజంను కూడదీసి, కార్మిక పార్టీని నిర్మించడానికి ప్రధాన మైన అడ్డంకిగా వుండింది ఉదారవాద నరోద్నిక్కులు.

ప్రజల మిత్రులమని ఉద్ఘాటిస్తూ, తమ పుస్తకాలలోనూ, పత్రికలలోనూ మార్క్సిజంమీద తీవ్రమైన దాడులు ప్రారంభించిన ఉదారవాద నరోద్నిక్కులతో పోరాడడం పీటర్స్‌బుర్గ్‌లో లెనిన్ కొన సాగించినాడు. 1894లో లెనిన్ '"ప్రజల మిత్రులు" యెవరు, వాళ్ళ సోషల్ డెమోక్రట్లతో యెలా పోరాడుతారు' అనే గ్రంథం రాసినాడు. అందులో ఆయన నరోద్నిక్కుల సిద్ధాంత అభిప్రాయాలలోని ప్రతి పార్శ్వాన్నీ విమర్శించి, అవి యెలా దోషభూయిష్ఠమైనదీ, హానికర మైనదీ నిరూపించినాడు. నరోద్నిక్కులు యిప్పుడు చిల్లర సంస్కరణల కార్యక్రమం యిస్తూ, జారిజంమీద విప్లవ పోరాటాన్ని పూర్తిగా విసర్జించ డంతో, ఒకప్పుడు విప్లవోద్యమంగా వుండిన నరోద్నిక్ ఉద్యమం ఉదార వాదంగా పతనమైందని ఆయన నిరూపించినాడు. ఉదారవాద నరోద్ని క్కుల నిజస్వరూపాన్ని — వాళ్ళ కులాక్కుల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించే, ప్రజల బూటకపు మిత్రులు అని — ఆయన వెల్లడించినాడు. శ్రామిక ప్రజల నిజమైన ప్రతినిధులూ, రక్షకులూ నరోద్నిక్కులు కాదనీ, మార్క్సిస్టులనీ ఆయన రాసినాడు. తన గ్రంథంలో లెనిన్ మార్క్సిస్టు బోధను సమర్థించి, రష్యాయొక్క విప్లవ పునర్నిర్మాణానికి దాని ప్రాము ఖ్యాన్ని సమూలంగా పరిశీలించినాడు. సమాజంలోని అత్యంత ప్రముఖ, అగ్రగామి విప్లవ శక్తిగా రష్యన్ కార్మికవర్గంయొక్క చరిత్రాత్మక పాత్రను నిరూపించిన ప్రథమ రష్యన్ మార్క్సిస్టు ఆయన. జారి జంనూ, పెట్టుబడిదారీ వ్యవస్థనూ కూలదోసి, తమ సొంత కార్మిక ప్రభుత్వాన్ని స్థాపించడానికి చేసే పోరాటంలో సమస్త శ్రామిక జనా

లనూ పురికొల్పి, నడిపించగల ఏకైక వర్గం కార్మికవర్గమని ఆయన నిరూపించినాడు.

కార్మికవర్గ, రైతాంగాల పొత్తు అనే మహత్తర భావాన్ని లెనిన్ అభివృద్ధిచేసినాడు; యిది లేకుండా జారిజంనూ, భూస్వాములనూ, బూర్జువావర్గాన్నీ కూలదోసి, కార్మికవర్గ అధికారాన్ని స్థాపించి, నూతన, కమ్యూనిస్టు సమాజాన్ని సృష్టించడం అసాధ్యమౌతుంది. ఆ భావాన్ని ఆయన తన జీవిత మంతా ప్రచారంచేసి, దాన్ని సాధించడానికి అనేక సంవత్సరాలు శ్రమ అనకుండా కృషిచేసినాడు. విడివిడిగా వున్న మార్క్సిస్టు బృందాలను దృఢబంధిత విప్లవ పార్టీగా, కార్మికవర్గ ఉద్యమాన్ని నడిపించేదానిగా, సమైక్యపరచడం ప్రాథమిక కర్తవ్యమయినట్టు ఆయన పదేపదే వివరించినాడు.

' "ప్రజల మిత్రులు" యెవరు, వాళ్ళు సోషల్ డెమోక్రట్లతో యెలా పోరాడుతారు' కొద్ది ప్రతులు అచ్చువేయబడి, రహస్యంగా పంచ బడింది. సెంట్ పీటర్స్‌బుర్గ్ మార్క్సిస్టులు, అచ్చు సౌకర్యాలు లేనందున, యీ పుస్తకాన్ని హెక్టోగ్రాఫ్ చేసి, "పసుపురంగు కాపీ పుస్తకాలు" అనే పేరుతో ప్రతులను ఒకరినుండి మరొకరికి పంపకం చేసినారు; యీ పుస్తకంమీద ఉత్సాహపూరితమైన చర్చలూ, వ్యాఖ్యలూ జరిగి నాయి. పుస్తకం సెంట్ పీటర్స్‌బుర్గ్, మాస్కో, నీజ్ని - నోవ్‌గొరొద్, వ్లదీమిర్, కీయెవ్, రీగా, తదితర నగరాలలో పఠించబడింది. 'శ్రమ విమోచన' బృంద సభ్యులకు కూడా అది పరిచితంగా వుండింది. దాని ప్రభావం ప్రచండంగా వుండింది. నరోద్నిక్కులమీద పోరాటంలో అది అసాధారణమైన పాత్ర వహించి, పోరాటానికీ, విజయానికీ వున్న ఒకే ఒక సరైన మార్గాన్ని రష్యన్ విప్లవకారులకూ, కార్మికవర్గానికీ చూపించింది. "యీ గ్రంథం వెలువడిన తర్వాత, లెనిన్ మార్క్సిస్టు లలో మరింత ప్రసిద్ధుడూ, గుర్తింపబడిన ప్రామాణికుడూ అయినాడు, బాల రష్యన్ మార్క్సిస్టు ధోరణి ఆయనద్వారా తనకు అపారమైన

రాజకీయ, సిద్ధాంత శక్తి లభించిందని గుర్తించింది'' అని విప్లవోద్యమంలో పాల్గొన్న యస్. ఐ. మిచ్‌కేవిచ్ తన స్మృతులలో రాసినాడు.

లెనిన్ నరోద్నిక్కులమీదనే కాక, "చట్టబద్ధ మార్క్సిస్టుల" మీద కూడా తీవ్ర పోరాటం చేయవలసి వచ్చింది. యీ మార్క్సిస్టులు చట్టబద్ధ పత్రికలకు, అనగా జారిస్టు ప్రభుత్వంచేత లైసెన్సు యివ్వబడిన వార్తా పత్రికలకూ, పత్రికలకూ మార్క్సిజంమీద వ్యాసాలు రాసే బూర్జువా మేధావులు. మార్క్సిజంను బూర్జువావర్గ ప్రయోజనాలకు అనుగుణంగా మార్చే ప్రయత్నంతో వీళ్లు పెట్టుబడిదారీ వ్యవస్థమీద పోరాటాన్ని విసర్జించి, మార్క్సిజంనుండి దాని విప్లవ సారాన్ని — వర్గపోరాటాన్నీ, సోషలిస్టు విప్లవాన్నీ, కార్మికవర్గ నియంతృత్వాన్నీ గురించి బోధను — తోడేసినారు. కానీ "చట్టబద్ధ మార్క్సిస్టులు" నరోద్నిక్కులను విమర్శించినందున, వాళ్లతో తాత్కాలిక ఒప్పందం అంగీకారయోగ్యంగా లెనిన్ పరిగణించినాడు. అదే సమయంలో లెనిన్ మార్క్సిజంయొక్క యీ ప్రచ్ఛన్న శత్రువుల అభిప్రాయాలను తీవ్రంగా విమర్శించి, వాళ్ల ఉదారవాద బూర్జువా స్వభావాన్ని బట్టబయలు చేసినాడు. విప్లవ సిద్ధాంత స్వచ్ఛతను రక్షించాలనీ, దాని సకల వక్రరూపాలతోనూ, వికృతరూపాలతోనూ పోరాడాలనీ ఆయన మార్క్సిస్టులకు నేర్పినాడు.

లెనిన్ విప్లవ మార్క్సిస్టు పార్టీ నిర్మాణ కార్యంలో పట్టుదలగా నిమగ్నుడైనాడు. ఆయన పెద్ద ఫాక్టరీలలోని పురోగామి కార్మికులతో సంబంధం నెలకొల్పుకున్నాడు — బాల్టిక్ నౌక నిర్మాణ కర్మాగారానికి చెందిన వి. ఎ. షెల్గునోవ్‌తోనూ, నేవ్‌స్కి షిప్ అండ్ మెషీన్ వర్క్సుకి చెందిన ఐ. వి. బాబుష్కిన్‌తోనూ, అలెక్సాంద్రోవ్‌స్కి మెషీన్ వర్క్సుకు చెందిన యస్. వై. మెర్ఝ్కాలోవ్‌తోనూ, యింకా చాలామందితోనూ. వీళ్లు రష్యన్ కార్మికవర్గపు ప్రముఖ ప్రతినిధులు; లెనిన్ మార్గదర్శకత్వంకింద వీళ్లు కార్మికవర్గ పార్టీని నిర్మించడానికి పూనుకున్నారు.

పార్టీ నిర్మాతలుగా విప్లవ కార్మిక దళాలను లెనిన్ జాగ్రత్తగా పెంచి, వాళ్లకు శిక్షణ యిచ్చినాడు.

రాజధానిలోని నేవ్‌స్కయ జస్తావా, పీటర్స్‌బుర్గ్‌స్కయ, వీబోర్గ్‌స్కయ పేటలలోని కార్మికుల అధ్యయన బృందాలకు లెనిన్ దర్శకత్వం వహించినాడు. యీ బృందాలు కార్మికుల యిండ్లలో సమావేశమయ్యేవి. ఉదాహరణకు సెమ్యాన్నికొవ్ ఫాక్టరీ కార్మికులు ఐ. వి. బాబుష్కిన్ యింటిలో కలిసే వాళ్లు; తరువాతి కాలంలో ఈయన రష్యన్ కార్మిక వర్గ ఉద్యమంలో ప్రముఖ వ్యక్తి అయినవాడు, పార్టీకి గర్వకారణంగా, జాతీయ వీరుడుగా లెనిన్‌చేత ప్రస్తావించబడినవాడు. "జారిస్టు నిరంకుశత్వంనుండి గెలుచుకోబడిన ప్రతిదీ కేవలం బాబుష్కిన్ లాంటి వాళ్లచేత నడిపించబడిన జనాల పోరాటంద్వారా గెలుచుకోబడింది" అని లెనిన్ రాసినాడు.

మార్క్సిస్టు సిద్ధాంతంలోని అత్యంత జటిలమైన సమస్యలను అత్యంత సరళమైన, సులభగ్రాహ్యమైన మాటలలో వివరించే నేర్పు వుండింది లెనిన్‌కు. మార్క్సిస్టు బోధను నిత్య జీవిత సమస్యలతోనూ, శ్రామికజనుల అవసరాలతోనూ ముడిపెట్టి, దాన్ని కార్మికులకు సులభగ్రాహ్యంగా చేయడానికి ఆయన కృషిచేసేవాడు.

"మా ఉపన్యాసాలు అత్యంత ఉత్సాహపూరితంగా, ఆసక్తికరంగా వుండినాయి.... యీ ఉపన్యాసాలతో మేమందరమూ చాలా సంతోషించి, యెల్లప్పుడూ మా ఉపన్యాసకుని విజ్ఞతను కొనియాడేవాళ్లం" అని బాబుష్కిన్ చెప్పినాడు.

1894లో లెనిన్‌కు నదేజ్దా కొన్‌స్తంతీనొవ్నా క్రూప్‌స్కయాతో పరిచయమైంది. నేవ్‌స్కయ జస్తావా పేటలోని కార్మికుల ఆదివారం సాయంత్రం పాఠశాలలో ఆమె ఉపాధ్యాయురాలుగా వుండింది. ఆమె విద్యార్థులలో చాలామంది లెనిన్ నడిపే బృందాలలో సభ్యులు. యిది లెనిన్‌నూ, క్రూప్‌స్కయానూ దగ్గరికి తెచ్చింది.

కొరకు లెనిన్ తరుచుగా సాహిత్య ఉల్లేఖనలు వాడేవాడు. ఉదాహరణకు 'కొత్త ఫాక్టరీ చట్టం' అనే పుస్తకంలో ఆయన 'సింహ భాగం' అనే ప్రసిద్ధ క్రిలోవ్ కథను వ్యాఖ్యానించినాడు. ఓవర్ టైమ్‌కు సంబంధించిన కొత్త నియమాలు సింహం తన తోటి వేటకాళ్లతో వేటను పంచుకున్న కథను గుర్తుకు తెస్తున్నాయి, అని లెనిన్ రాసినాడు: "మొదటి భాగాన్ని సింహం తన హక్కుగా తీసుకున్నది, రెండవ భాగాన్ని మృగరాజు అయినందుకు తీసుకున్నది, మూడవ భాగాన్ని అందరికంటె బలవంతుడైనందుకు తీసుకున్నది, యిక నాల్గవ భాగం — దానివైపు యెవరు పంజా చాపడానికి సాహసించినా ప్రాణాలతో బయట పడరు." కార్మికులను క్రూరంగా దోపిడీ చేయడంలోనూ, కొల్లగొట్టడంలోనూ పెట్టుబడిదార్లు చేసేది అదే. యీ ఆందోళన సమ్మె ఉద్యమ వ్యాప్తికి తోడ్పడింది.

సెంట్ పీటర్స్‌బుర్గ్ మార్క్సిస్టుల ఆదేశాల మేరకు, 1895 వసంతంలో, 'శ్రమ విమోచన' బృందాన్ని కలుసుకోడానికీ, పశ్చిమ యూరప్‌లోని కార్మికోద్యమం గురించి మరికొంత తెలుసుకోడానికీ లెనిన్ విదేశాలకు పోయినాడు.

స్విట్జర్లెండులో ఆయన 'శ్రమ విమోచన' బృందం సభ్యులైన జి. వి. ప్లెహానొవ్‌నూ, పి. బి. అక్సెల్‌రోడ్‌నూ కలుసుకున్నాడు. 'రబోత్నిక్' ('కార్మికుడు') అనే సాధారణ శీర్షికకింద వుండిన వ్యాస సంకలనాన్ని సంయుక్తంగా ప్రచురించడానికి వాళ్లతో ఆయన యేర్పాట్లు చేసుకున్నాడు. లెనిన్ తనమీద యెంత గాఢమైన ముద్ర కలిగించిందీ ప్లెహానొవ్ రాసినాడు. తాను విదేశాలలో వుండిన సంవత్సరాలలో రష్యా నుండి వచ్చేవాళ్లను చాలా మందిని కలుసుకున్నాననీ, కానీ యువకుడైన ఉల్యానొవ్ లాగ అన్ని ఆశలు యెవరూ కలిగించలేదనీ ప్లెహానొవ్ ఒక జాబులో రాసినాడు. లెనిన్‌లో ప్లెహానొవ్‌కు నచ్చింది యేమిటంటే ఆయన కుశాగ్రబుద్ధీ, చురుకుదనమూ, విప్లవం జయించితీరుతుందనే దృఢమైన నమ్మకమూ.

స్విట్జర్లెండునుండి లెనిన్ పారిస్‌కూ, బెర్లిన్‌కూ పోయి, అక్కడ ఫ్రెంచి, జర్మన్ కార్మికుల సమావేశాలకు హాజరై, వాళ్ల జీవిత పరిస్థితులనూ, జీవిత విధానాన్నీ అధ్యయనం చేసినాడు. పారిస్‌లో ఆయన కార్ల్ మార్క్స్ అల్లుడూ, విప్లవ కార్మికోద్యమంలో ఒక ప్రముఖ వ్యక్తీ అయిన పాల్ లాఫార్గ్‌ను కలుసుకున్నాడు. ఫ్రెడరిక్ ఎంగెల్సును కలుసుకోవాలని ఆయన ఆశతో యెదురుచూసినాడు, కానీ ఆ అంతర్జాతీయ కార్మికవర్గ మహా నాయకుడూ, దేశికుడూ తీవ్రమైన జబ్బులో వుండినందున, వాళ్లు కలుసుకోవడం పడలేదు.

తన తీరిక సమయమంతా, రష్యాలో దొరకని సాహిత్యం గ్రంథాలయాల్లో చదువుతూ, మార్క్సిజం అధ్యయనానికి లెనిన్ వినియోగించినాడు.

విదేశాలనుండి తిరిగివచ్చిన తర్వాత, సెంట్ పీటర్స్‌బుర్గ్‌కు పోకముందే, లెనిన్ వీల్నొకూ, మాస్కోకూ, ఒరేహొవొ - జూయెవొకూ పోయి, స్థానిక సోషల్ డెమోక్రట్లతో, ఆనాడు ఆ పేరుగల విప్లవ మార్క్సిస్టులతో, సంబంధం నెలకొల్పుకున్నాడు. రెండు అడుగు పొరలు గల పెట్టెలో ఆయన మార్క్సిస్టు సాహిత్యం రష్యాలోకి దొంగగా తెచ్చినాడు; అది అనేక పట్టణాలలో పంపకం చేయబడింది.

లెనిన్ సోదరి అన్నా తన స్మృతులలో యిలా రాసింది: "కస్టమ్స్‌వాళ్లు వ్లదీమిర్ ఇల్యీచ్ పెట్టెను తలకిందులుగా తిప్పినారు, అడుగున తట్టినారు. అనుభవజ్ఞులైన కస్టమ్స్ ఉద్యోగులు దొంగ అడుగు పొర వుంటే తట్టడంద్వారా కనుక్కోగలరని తెలిసిన వ్లదీమిర్ ఇల్యీచ్ తన పని అయిందని అనుకున్నాడట. ఆయనను అక్కడ ఆపివేయకుండా, పెట్టె సెంట్ పీటర్స్‌బుర్గ్‌లో దాని గమ్యానికి చేర్చబడింది. అక్కడ వెంటనే తృప్తికరంగా అందులోని సరుకు వెలికి తీయబడింది. అందువల్లనే ఆయన మాస్కోలో మావద్దకు ఉత్సాహపూరితంగా వచ్చినాడు."

1895 సెప్టెంబర్ తొలి రోజుల్లో లెనిన్ సెంట్ పీటర్స్ బుర్గ్‌కు తిరిగివచ్చినాడు. అక్కడ మరింత చురుకుగా ఆయన విప్లవ కార్యంలో మునిగి, కార్మికులతో తరుచుగా సమావేశాలూ, సంభాషణలూ జరిపేవాడు తీవ్రతరమైన పోలీసు తనిఖీ కూడా యీ చర్యలను ఆపలేకపోయింది. పోలీసులకు టోకరా యివ్వడంలో ఆయన యుక్తి పరుడు; అరెస్టు తప్పించుకోడానికి తరుచు మకాం మార్చేవాడు.

1895 శరదృతువులో లెనిన్ సెంట్ పీటర్స్‌బుర్గ్‌లోని మార్క్సిస్టు బృందాలను ఏకైక రాజకీయ సంస్థగా సమైక్యం చేసినాడు. తర్వాత దానికి 'కార్మికవర్గ విముక్తి పోరాట సమితి' అని పేరు వచ్చింది. లెనిన్ అగ్రేసరత్వాన ఒక కేంద్ర బృందం దానికి నాయకత్వం వహించింది. సమితి సభ్యులలో యన్. కె. క్రూప్‌స్కయా, జి. యం. క్రిజిజనోవ్‌స్కియ్, యల్ మార్తోవ్, ఎ. యన్. పొత్రేసొవ్, యస్. ఐ. రాద్‌చెంకొ, వి. వి. స్తర్కోవ్, ఎ. ఎ. వనేయెవ్, పి. కె. జపొరోజెత్స్ వుండినారు.

ఫాక్టరీలలోనూ, మిల్లులలోనూ వుండిన కార్మిక అధ్యయన బృందాలు 'పోరాట సమితి' ఆవరణలోకి వచ్చినాయి. యీ బృందాలను పేట కమిటీలలాగ వ్యవహరించే పేట బృందాలు నడిపించేవి. సమితి సభ్యులలో లెనిన్ క్రమశిక్షణ, కేంద్ర సంఘంపట్ల గౌరవం, దాని ఆదేశాలను నెరవేర్చడం అనే భావాలు కలిగించినాడు. సంస్థ అన్ని స్థాయిలలోనూ తన కార్యకలాపాలకు జవాబుదారీ చేయబడింది.

'పోరాట సమితి' రష్యాలోని విప్లవ మార్క్సిస్టు పార్టీకి బీజం; అందులో వుంది దాని మహత్తర చరిత్రాత్మక ప్రాముఖ్యం. అది సామూహిక కార్మికవర్గ ఉద్యమంనుండి అండదండలు పొంది, కార్మిక వర్గపు వర్గపోరాటానికి నాయకత్వం వహించింది. రష్యాలో మొట్ట మొదటి సారి 'సమితి' శాస్త్రీయ సోషలిస్టు భావాలను కార్మికవర్గ ఉద్యమంతో జతపరిచింది.

1890ల మధ్యవరకు రష్యాలోని ఏకాకి మార్క్సిస్టు బృందాలకు కార్మికోద్యమంతో స్వల్ప సంబంధం వుండింది. వాళ్లు కేవలం పురోగామి కార్మికులలో మార్క్సిజం ప్రచారం చేసినారు, జనాలలో రాజకీయ కృషి యేమీ చేయలేదు. లెనిన్‌యొక్క 'పోరాట సమితి' సామూహిక రాజకీయ ఆందోళనను అభివృద్ధిచేసి, సమ్మె పోరాటాన్ని నడిపించ నారంభించింది. కార్మికుల విప్లవ చైతన్యాన్ని రేపే కరపత్రాలు అది విడుదల చేసింది. కొద్ది కాలంలో అది డజన్ల కరపత్రాలు ప్రచురించింది — ఫాక్టరీ యజమానుల నియమరహిత పద్ధతులను బట్టబయలుచేస్తూ, కార్మికులకు తమ ప్రయోజనాల కోసం యెలా పోరాడవలసిందీ, పెట్టుబడిదార్లకూ, జారిస్టు ప్రభుత్వానికీ యే డిమాండ్లు సమర్పించవలసిందీ తెలియజేసేవాటిని.

1896 వేసవిలో 30,000 మంది కార్మికులు పాల్గొన్న ప్రసిద్ధమైన సెంట్ పీటర్స్‌బుర్గ్ జవుళీ కార్మికుల సమ్మె 'పోరాట సమితి'చేత నడిపించబడింది. యీ సమ్మె సెంట్ పీటర్స్‌బుర్గ్ సోషల్ డెమోక్రట్ల ప్రతిష్ఠను పెంచింది. దాని విస్తృత వ్యాప్తికీ, బలమైన రాజకీయ ప్రభావానికీ వాళ్ల నాయకత్వమే కారణం. సమితి పలుకుబడి సెంట్ పీటర్స్‌బుర్గ్ దాటి చాలా దూరం ప్రాకింది. దాని చొరవనూ, ఆదర్శాన్నీ అనుసరించి మాస్కో, కీయెవ్, వ్లదీమిర్, యరొస్లావ్ల్, ఇవానొవొ-వొజ్నెసేన్స్క, తదితర పట్టణాలలోనూ, గుబెర్నియాలలోనూ వుండిన కార్మిక బృందాలు సోషల్ డెమోక్రటిక్ సమితులుగానూ బృందాలుగానూ యేకమైనాయి. 'పోరాట సమితి' కార్యకలాపాలు రష్యా అంతటా విప్లవోద్యమానికి ఊపు యిచ్చి, తద్వారా రష్యాలో కార్మికవర్గంయొక్క మార్క్సిస్టు పార్టీ సృష్టికి వీలు కలిగించినాయి.

జారిస్టు ప్రభుత్వం 'పోరాట సమితి' కార్యకలాపాలను కనిపెట్టుతూ వుండి, దానిమీద తీవ్రంగా దెబ్బతీసింది. 1895 డిసెంబర్ ప్రారంభంలో దాని నాయకులలో అత్యధిక భాగం, లెనిన్‌తో సహా,

అరెస్టు చేయబడినారు. సమితి సభ్యులు అచ్చుకు తయారుచేసిన వార్తా పత్రిక 'రబోచెయె దేలొ' ('కార్మికుల లక్ష్యం') యొక్క మొదటి సంచికను పోలీసులు వశపరుచుకొన్నారు. రహస్య కార్మిక వార్తాపత్రికను వెలువరించడానికి రష్యన్ సోషల్ డెమోక్రట్లు చేసిన యీ మొదటి ప్రయత్నం యిలా అంతమైంది.

సెంట్ పీటర్స్‌బుర్గ్ జైలులో లెనిన్ పద్నాలుగు నెలలు ఏకాంత నిర్బంధంలో గడిపినాడు. కానీ విప్లవం కొరకు ఆయన చేసే కృషి జైలులో ఆగలేదు. జైలునుండి కూడా సమితి కార్యకలాపాలను నడిపించే మార్గాలూ, సాధనాలూ ఆయన కనుక్కొన్నాడు. బయట వున్న కామ్రేడ్లతో ఆయన సంబంధం కలిగించుకొని, ఉత్తరాలూ, కరపత్రాలూ, ప్రచార పత్రాలూ రాసి, వాటిని దొంగగా బయటికి చేరవేయించినాడు. జైలులో వుండగా ఆయన మార్క్సిస్టు పార్టీ కార్యక్రమంయొక్క మొదటి చిత్తునూ, దానికి వివరణలూ రాసినాడు.

పుస్తకాలలోనూ, పత్రికలలోనూ పంక్తులమధ్య ఆయన పాలతో విప్లవ పత్రాలు రాసినాడు. కాగితం వేడి చేసిందాకా యీ రాత కనిపించదు; వేడిచేస్తే చదవడానికి తగినంత స్పష్టంగా వుంటుంది. విప్లవకారులు తమ ఉత్తర ప్రత్యుత్తరాలలో తరుచుగా యీ పద్ధతి వాడినారు. పాలు పోసుకోడానికి బ్రెడ్డుతో లెనిన్ చిన్న "ఇంకి బుడ్లు" తయారు చేసి, జైలర్లు సమీపించినప్పుడు వాటిని వేగంగా దిగమింగేవాడు. "యీ రోజు ఆరు ఇంకి బుడ్లు తిన్నా" అని ఆయన ఒక జాబులో హాస్యంగా రాసినాడు.

లెనిన్ జైలులోని యితర కామ్రేడ్లతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపేవాడు. యీ పనికి ఆయన జైలు గ్రంథాలయంనుండి తెచ్చుకొన్న పుస్తకాలు ఉపయోగించేవాడు; అవసరమైన పదాలు నిర్మించడానికి అక్షరాలకింద చుక్కలు పెట్టేవాడు. ఆయన ఉత్తరాలు ఉత్సాహ పూరితంగానూ, కార్మికవర్గ అంతిమ విజయంలో విశ్వాసం గలవిగానూ

వుండేవి. జైలులో ఆయన రాసిన ప్రతి ఉత్తరంలోనూ తన కామ్రేడ్ల పట్ల ఆయనకు గల శ్రద్ధ వ్యక్తమయ్యేది. తన బంధువులకు ఆయన నిత్యం పనులు అప్పగించేవాడు: ఫలానా కామ్రేడుకు వెచ్చని దుస్తులు పంపాలని ఒక జాబులో వుండేది; జైలులోని ఒక కామ్రేడును చూడడానికి వచ్చేవాళ్లు యెవరూ లేరు, అతన్ని వచ్చి చూడడానికి ఒక "కాబోయే భార్య"ను యేర్పాటుచేయాలని మరొక జాబులో వుండేది.

జైలులో వుండగా లెనిన్ తన ముఖ్య రచనల్లో ఒకటి రాయడం ప్రారంభించినాడు – 'రష్యాలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి' అనేది. దీనికి సమాచారం సేకరించడానికి ఆయన వందలకొలది పుస్తకాలూ, పత్రికలూ చదివినాడు. తన బంధువులకు రాసే ఉత్తరాల్లో ఆయన తన రచనకు కావలసిన పుస్తకాల పట్టీలు పంపేవాడు; అవి ఆయనకు అందేటట్లు ఆయన అక్క అన్నా చూసేది.

లెనిన్ జైలులో తన కొక కచ్చితమైన క్రమచర్య యేర్పరచుకున్నాడు. తన సమయంలో అత్యధిక భాగం ఆయన పనిచేసుకోవడంలో గడిపేవాడు, రాత్రిపూట పడుకోబోయే ముందు వ్యాయామం చేసేవాడు. "ఒకోసారి కండరాలు యెంతగా సళ్లబారుతా యంటే, జైలుగది మంచు బావి లాగ వున్నప్పుడు ఆ పాపిష్ఠి చలిలో కూడా ఒళ్లు వేడెక్కుతుంది, తరువాత యెంతో బాగా నిద్రపట్టుతుంది" అని తరువాతి కాలంలో లెనిన్ అన్నాడు. రాబోయే పోరాటానికి ఆయన శారీరకంగానూ, బౌద్ధికంగానూ తన్ను తాను గట్టిపరుచుకొని, తన సహచరులకు అలాగే చేయమని బోధించినాడు. ఆయన కనిష్ఠ సోదరి మరీయా జైలులో వున్నప్పుడు ఆమెకు లెనిన్ యిలా రాసినాడు: "పుస్తకాలమీద నీవు చేసే పనిలో మార్పు వుండేటట్లు యేర్పాటు చేసుకోవాలని కూడా నా సలహా. పఠనంలో లేక పనిలో మార్పు – అనువాదంనుండి పఠనానికీ, రాతనుండి వ్యాయామానికీ, బరువైన పఠనంనుండి కథాసాహిత్యానికీ – చాలా ఉపయోగపడుతుందని నాకు చాలా బాగా జ్ఞాపకం."

సెంట్ పీటర్స్‌బుర్గ్‌లో లెనిన్, కార్మికవర్గ నాయకుడుగా, దాని నిర్మాతగా మార్గదర్శకుడుగా తయారైనాడు, రష్యాలో విప్లవ ఉద్యమానికి సిద్ధాంత నిర్వచన యిచ్చి, కార్మికవర్గ పార్టీకి పునాది వేసినాడు.

# సైబీరియా ప్రవాసం

1897 ఫిబ్రవరి 13న లెనిన్ శిక్ష – తూర్పు సైబీరియాలో మూడేండ్ల ప్రవాసం – ఆయనకు తెలియజేయబడింది. ఆయన విప్లవ కార్యకలాపాలకు గాను జారిస్టు ప్రభుత్వం ఆయనకు యిచ్చిన శిక్ష అది.

1897 మేలో లెనిన్ నిర్ణీత ప్రవాస స్థలం – యెనిసేయ్ గుబెర్నియాలో, మినుసీన్‌స్క్ తాలూకాలో, షూషెన్‌స్కాయె గ్రామం – చేరుకున్నాడు; ఆనాడు అది రైలుమార్గానికి వందల మైళ్ల దూరంలో వుండిన మారుమూల సైబీరియన్ గ్రామం. (యీనాడు అది క్రస్నొయార్‌స్క్ ప్రాంతంలో ఒక పెద్ద తాలూకా కేంద్రం. అక్కడ ఒక పాల డబ్బాల ఫాక్టరీ, రెండు గ్రంథాలయాలూ, ఒక సెకండరీ పాఠశాలా, ఒక సంస్కృతీ భవనమూ, ఒక పయొనీర్స్ భవనమూ వున్నాయి. లెనిన్ నివసించిన భవనం 1937లో మ్యూజియంగా మార్చబడింది.)

లెనిన్‌కు అది కష్టకాలం. ఆయన తన సోదరికి రాసిన ఒక జాబులో యిలా అన్నాడు: "నా ప్రవాసపు తొలి దశలో, యూరపియన్ రష్యా పటం గానీ, యూరప్ పటం గానీ చూడకూడదని నిర్ణయించుకున్నాను. ఆ పటాలు తెరిచి, వాటిమీద వున్న వివిధ నల్లని చుక్కలు చూస్తే, యెప్పుడూ అంత బాధ కలిగేది." ప్రత్యక్ష విప్లవ కార్యకలాపాలనుండి విడగొట్టబడినా, ఆయన ధైర్యమూ, చురుకుదనమూ,

ఆశాదృష్టి కోల్పోలేదు. ఆయన తన మామూలు ఉత్సాహంతో తన పనిలో నిమగ్నుడై, సైబీరియా గ్రామీణ ప్రాంతాన్నీ, రైతుల జీవిత పరిస్థితులనూ నిశితంగా అధ్యయనం చేసినాడు. స్థానిక ప్రజలకు ఆయనపట్ల గొప్ప గౌరవం వుండింది; వాళ్లు తరుచు ఆయనవద్దకు సహాయం కోసమూ, సలహా కోసమూ వచ్చేవాళ్లు. ఒకసారి ఒక కార్మికుడు బంగారు గని సొంతదారుడైన తన యజమానిమీద కేసు గెలవడానికి ఆయన తోడ్పడినాడు. ఆ తర్వాత రైతులు తమ యిబ్బందులతో, ఆయన సహాయం కోరుతూ, మరింత తరుచుగా ఆయనవద్దకు రాసాగినారు. యిరవై అయిదేండ్ల తర్వాత లెనిన్ యిలా అన్నాడు: "సైబీరియా ప్రవాసంలో ఉండగా నేను లాయర్‌గా పనిచేసే సందర్భం యేర్పడింది. నేను అనుమతి పొందిన లాయర్‌ను కాదు; నేను ప్రవాస శిక్షితుణ్ని గనుక, వృత్తి చేసుకోడానికి నాకు అనుమతి లేదు. కానీ ఆ ప్రాంతంలో మరొక లాయర్ లేదు గనుక, జనం వచ్చి తమ యిబ్బందులు నాతో చెప్పుకునేవాళ్లు." లెనిన్ వాళ్లకు సలహా యిచ్చి, స్థానిక అధికార్ల, ధనిక యజమానుల జులుంనుండి యెలా రక్షించుకోవలసిందీ నేర్పినాడు.

ఒక సంవత్సరం తర్వాత షూషెన్‌స్కొయెలో, క్రూప్‌స్కయా లెనిన్‌తో కలిసింది ఆమె కూడా 'పోరాట సమితి' కేసు సందర్భంగా అరెస్టు చేయబడి, ఉఫా గుబెర్నియాకు బహిష్కరింపబడింది. కానీ లెనిన్‌కు కాబోయే భార్యగా, షూషెన్‌స్కొయెలో శిక్ష చేయడానికి ఆమె అనుమతింపబడింది. అక్కడ వాళ్లు వివాహం చేసుకున్నారు. క్రూప్‌స్కయా లెనిన్ భార్య అయి, ఆయన జీవితాంతం ఆయనకు విశ్వాసం గల కామ్రేడ్‌గా, ఆత్మార్పణ చేసుకున్న సహాయకురాలుగా నిలిచింది.

బంధువుల, మిత్రుల సహాయంతో లెనిన్ తనకు అవసరమైన పుస్తకాలూ, పత్రికలూ ప్రవాసంలో పొందేవాడు. ఆయన మార్క్స్, ఎంగెల్సుల రచనలు అధ్యయనం కొనసాగించినాడు, పత్రికలు చదు

వుతూ వుండినాడు, విదేశ గ్రంథాలను రష్యన్‌లోకి అనువాదం చేసినాడు. నిద్రాముద్రితమైన గ్రామపు చీకటిలో ఆయన కిటికీలోని దీపం తరుచు రాత్రి యెంతో పొద్దుపోయిందాకా వెలిగేది.

ప్రవాసంలో వుండగా లెనిన్ పార్టీకి చిత్తు కార్యక్రమం తయారు చేసి, ముప్పైకి పైగా రచనలు చేసినాడు. వీటిలో ప్రత్యేకమైన స్థానం గలది 'రష్యన్ సోషల్ డెమోక్రట్ల కర్తవ్యాలు' అనే పుస్తకం.

యీ కాలంలో చేసిన రచనలలో ఆయన రష్యన్ సోషల్ డెమోక్రట్ల కర్తవ్యాలను చిత్రించి, సమైక్య కార్మిక పార్టీయొక్క అవసరాన్ని నిరూపించి, మార్క్సిజంయొక్క శత్రువులమీద దాడిచేసినాడు.

'రష్యాలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి' అనే పుస్తకం కూడా ఆయన అక్కడ పూర్తిచేసినాడు. అది 1899లో ప్రచురింప బడింది.


రష్యా ఆర్థిక అభివృద్ధిమీద రాసిన యీ పెద్ద శాస్త్రీయ రచన మార్క్స్ 'పెట్టుబడి'కి ప్రత్యక్ష కొనసాగింపు. రష్యన్ ఆర్థిక విషయాల్లో లెనిన్ పరిశోధనలు మార్క్సిస్టు అర్థశాస్త్రానికి ఒక ముఖ్యమైన చేర్పు. రష్యాలో పెట్టుబడిదారీ వ్యవస్థ పరిశ్రమలలోనే కాక, వ్యవసాయంలో కూడా పురోగమిస్తున్నదని, వాస్తవ సమాచారంమీద ఆధారపడి లెనిన్ నిరూపించినాడు. యీ పుస్తకం నరోదిజంమీద చావుదెబ్బ తీసింది. అందులో, పెట్టుబడిదారీ సమాజంలోని సహజ మైన ఆమూల వైరుధ్యాలను లెనిన్ వెల్లడించినాడు. పెట్టుబడి దారీ వ్యవస్థ మారకుడూ, నూతన, సోషలిస్టు సమాజ నిర్మాతా అయిన కార్మికవర్గం యెలా పెట్టుబడిదారీ సమాజంలో పెరుగు తున్నదీ, పరిణతి చెందుతున్నదీ ఆయన చూపించినాడు. రష్యన్ కార్మిక వర్గం తక్కిన జనాభాతో పోలిస్తే చిన్నదైనప్పటికీ, లెనిన్ దాని నొక గొప్ప శక్తిగా గుర్తించి, విప్లవోద్యమంలో అది విధాయకంగా నిర్వహించే ప్రముఖ పాత్రను వెల్లడించినాడు. అదే సమయంలో ఆయన కార్మికవర్గా



ప్రవాసంలో లెనిన్ నివసించిన షూషెన్‌స్కాయెలోని యిల్లు
ఫోటో



యన్. కె. క్రూప్స్కయా
ఫోటో 1895



వి. ఐ. లెనిన్

ఫోటో 1910



మారువేషంలో, లెనిన్
ఫోటో 1917 ఆగస్టు

నికీ, రైతాంగానికీ మధ్య పొత్తుయొక్క అవసరాన్ని నొక్కిచెప్పినాడు; అది లేకుండా రాబోయే విప్లవంలో విజయం అసాధ్యం. యీ గ్రంథం కార్మికవర్గ పార్టీయొక్క సిద్ధాంత, కార్యక్రమ, యెత్తుగడల శాస్త్రీయ విస్తరణకు ఒక ముఖ్యమైన చేర్పు. యిది అభ్యుదయ భావాలు గల మేధావులలోనూ, విద్యార్థులలోనూ, కార్మికుల అధ్యయన బృందాలలోనూ వేగంగా పూర్తిగా అమ్ముడుపోయింది. మార్క్సిస్టు కార్యకర్తల సిద్ధాంత విద్యాభ్యాసంలో దీనికి ప్రచండమైన ప్రాముఖ్యం వుండింది.

లెనిన్ మార్క్సిజంను సజీవ, వర్ధమాన సిద్ధాంతంగా, ఆచరణలో ప్రయోగింపబడవలసిందిగానే కాక, విస్తరింపబడవలసిన, అభివృద్ధిచేయబడవలసిన దానిగా యెల్లప్పుడూ పరిగణించినాడు. "మేము మార్క్స్ సిద్ధాంతాన్ని పూర్తిచేయబడినదిగా, అనుల్లంఘనీయమైనదిగా పరిగణించము. తద్వ్యతిరేకంగా, అది శాస్త్రంయొక్క పునాదిరాయిని మాత్రమే వేసిందనీ, సోషలిస్టులు జీవితంతో సమంగా నడవాలనుకుంటే దానిని సకల దిశలలోనూ అభివృద్ధి చేసి తీరాలి అనీ మా నమ్మకం" అని ప్రవాసంలో వున్నప్పుడు లెనిన్ రాసినాడు. మార్క్సిస్టు సిద్ధాంతం పట్ల అలాంటి సృజనాత్మక ధోరణి లెనిన్ కార్యకలాపా లన్నిటికీ విలక్షణమైనది.

లెనిన్ కష్టపడి పనిచేసేవా డైనప్పటికీ, విశ్రమించడం కూడా ఆయనకు తెలుసు. తీరిక సమయంలో ఆయన స్కేటింగు చేసేవాడు, లేదా వేటకు వెళ్లేవాడు, లేదా అడవుల్లోనూ, పచ్చికబయళ్లలోనూ దూరపు షికార్లు చేసేవాడు. ఆయన అభిమాన స్థలాలు చెట్లతో నిండిన షూష తీరమూ, ఆ సమీపంలో వున్న అందమైన సరస్సులూ. సైబీరియన్ దృశ్యంయొక్క ఠీవిగల సౌందర్యాన్నీ, కూలంకషంగా పారే గొప్ప యెనిసేయ్ నదినీ ఆయన మెచ్చుకునేవాడు. ప్రవాసపు కష్టాలలో తెరపి వుండేది యెప్పుడంటే, దగ్గరలో నివసించే ప్రవాసిత కామ్రేడ్లు ఆయనవద్దకు వచ్చే అరుదైన సమయాల్లో లేదా వాళ్ల

వద్దకు ఆయన వెళ్లినప్పుడు. ఆ కాలంలో మినుసీన్‌స్క్ తాలూకాలో ప్రవాస శిక్ష అనుభవిస్తూ వుండిన సెంట్ పీటర్స్‌బుర్గ్ సోషల్ డెమోక్రట్లలో జి. యం. క్రిజిజనోవ్‌స్కీయ్, వి. వి. స్తర్కోవ్, ఎ. ఎ. వనేయెవ్, వి. కె. కుర్నతోవ్‌స్కీ, వి. యన్. లెపెషిన్‌స్కీయ్, తదితరులు వుండినారు. లెనిన్ మినుసీన్‌స్క్‌నూ, తెసీన్‌స్కాయె గ్రామాన్నీ, క్రస్నోయార్‌స్క్‌నూ దర్శించినాడు సౌహార్దపు సమావేశాల్లో ఆయన బృందగానంలో పాల్గొనేవాడు. ఆయనకు విప్లవ గేయాలు మరీ యిష్టం.

బంధువులతో ఆయన క్రమబద్ధంగా ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపేవాడు; వాళ్లదగ్గరనుండి వచ్చే ఉత్తరాలు ఆయనకు గొప్ప ఆనందహేతువు. ఆయన యింటికి రాసే ఉత్తరాలు ప్రేమానురాగాలతో తొణికిసలాడేవి; వాటిలో దిగులు గానీ, తన కష్టాలను గురించి చెప్పుకోవడం గానీ సూచనప్రాయంగా కూడా వుండేవి కాదు. "ఆయన ఉత్తరాలు యెల్లప్పుడూ ఉత్సాహపరిచేవిగానూ, నిరుత్సాహానికీ, ఆందోళనకూ విరుగుడుగానూ వుండేవని నాకు జ్ఞాపకం" అని ఆయన సోదరి ఆన్నా చెప్పింది. "అవి ఉత్సాహం కలిగించేవి.... ఆయన చతుర హాస్యోక్తులు యెవరినైనా జీవితానందంతో నింపుతాయి; యే పనికైనా యిది శ్రేష్ఠమైన కందెన."

లెనిన్ తన తల్లికి రాసిన ఉత్తరాలు మరీ అనురాగపూర్ణంగా వుండినాయి; ఆమెపట్ల ఆయనకు గొప్ప ప్రేమ. ఆమె ఆరోగ్యంపట్ల ఆయన యెప్పుడూ శ్రద్ధ కనబరుస్తూ, తనను గురించి దిగులుపడవద్దని అర్థిస్తూ, తన జీవితం గురించీ, తన పథకాల గురించీ సమస్తం ఆమెకు తెలియజేసేవాడు. లెనిన్‌కు తన బంధువులతో రక్తబంధాలే కాక, సమాన అభిప్రాయాలూ, విశ్వాసాలూ అనే బంధం కూడా వుండింది. వాళ్లతో ఆయన ఉత్తర ప్రత్యుత్తరాలకు యిది వ్యక్తిగత స్వభావాన్ని మించిన స్వభావాన్ని యిచ్చింది. ఉత్తరాలలో మార్క్సిస్టు సిద్ధాంతానికీ, ఆచరణకూ, రాజకీయాలకూ సంబంధించిన అనేక

అత్యవసర, సమకాలిక సమస్యలు ప్రస్తావించబడినాయి — సెన్సర్‌షిప్‌కు లోబడిన ఉత్తరాలలో యిది సాధ్యమైనంత మేరకు.

యీ సుదూర ప్రవాసంలో కూడా లెనిన్ కార్మికవర్గ ఉద్యమ అభివృద్ధిని జాగ్రత్తగా గమనిస్తూ వుండినాడు. రష్యాలోనూ, విదేశాల లోనూ వుండిన దాని ప్రతినిధులతో ఆయన విస్తృతమైన ఉత్తర ప్రత్యుత్తరాలు సాగిస్తూ, సోషల్ డెమోక్రటిక్ సంస్థల గురించీ వాటి కష్టాల గురించీ, అవసరాల గురించీ బాగా తెలుసుకున్నాడు.

ఆ కాలంలో కొందరు రష్యన్ సోషల్ డెమోక్రట్లు, కొంత విజయం సంపాయించివుండిన సమ్మె చర్య ప్రభావానికి లోబడి, కార్మి కులు ఆర్థిక పోరాటానికి — అనగా యెక్కువ వేతనాల కొరకూ, తక్కువ పనిగంటల కొరకూ, మేలైన పని పరిస్థితుల కొరకూ పోరాటానికి — పరిమితం కావాలని కార్మికులకు బోధించ సాగినారు. రాజకీయ పోరాటం బూర్జువావర్గానికి వదిలేయాలని వాళ్లు వాదించినారు. యీ సోషల్ డెమోక్రట్లకు "ఆర్థికవాదులు" అనే పేరు వచ్చింది. వాళ్లు బూర్జువా వర్గంతో రాజీ పడడానికి కార్మికవర్గాన్ని ప్రోత్సాహపరుస్తున్నారనీ, కార్మిక వర్గ విప్లవకర పాత్రను తక్కువపరిచి, దాన్ని రాజకీయ పోరాటంనుండి పక్కకు మళ్లిస్తున్నారనీ లెనిన్ గమనించి, ఆర్థికవాదుల కార్యకలాపాలను తీవ్ర ప్రమాదంగా పరిగణించినాడు. కార్మికవర్గ ప్రయోజనాలను బూర్జువావర్గ ప్రయోజనాలకు లోబరచబూనుకున్న "ఆర్థికవాదులు" రష్యన్ కార్మికవర్గ ఉద్యమంలోని మొదటి అవకాశవాదులు. వాళ్లతో నిర్ణయాత్మక పోరాటం చేయాలని లెనిన్ నిశ్చయించుకున్నాడు.

"ఆర్థికవాదుల" అభిప్రాయాలను ప్రకటించే ఒక పత్రాన్ని 1899 వేసవిలో తన సోదరి ఎ. ఐ. ఉల్యానొవ - యెలిజారొవానుండి అందిన తర్వాత లెనిన్ 'రష్యన్ సోషల్ డెమోక్రట్ల నిరసన' రాసి నాడు; మినుసీన్‌స్క్ తాలూకాలో నివసిస్తూవుండిన పదేడుమంది ప్రవా సిత మార్క్సిస్టులు దానిని ఆమోదించి, సంతకాలు చేసినారు. యీ

'నిరసన'లో లెనిన్ "ఆర్థికవాదుల" లోపభూయిష్ఠ, హానికర అభిప్రాయాలు గుట్టుకడిగి రష్యన్ సోషల్ డెమోక్రట్ల మౌలిక కర్తవ్యాలను చిత్రించినాడు. యీ 'నిరసన' కార్మికజన విమోచన పోరాటంలో కార్మికవర్గ పార్టీయొక్క మహత్తర ప్రాముఖ్యాన్ని నొక్కిచెప్పింది. "స్వతంత్ర కార్మికవర్గ పార్టీ మాత్రమే నిరంకుశత్వంతో చేసే పోరాటంలో బలమైన కోటగా వుండగలదు" అని యీ అసాధారణ పత్రం వెల్లడించింది.

1898 మార్చిలో మిన్‌స్క్‌లో జరిగిన రష్యన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ ప్రథమ మహాసభను గురించి క్రూప్‌స్కయాద్వారా లెనిన్ తెలుసుకున్నాడు. ఆ మహాసభ పార్టీ స్థాపనను ప్రకటించింది. అందులో వుంది ఆ మహాసభయొక్క చరిత్రాత్మక ప్రాముఖ్యం. మహాసభ ప్రాముఖ్యాన్ని గురించి చెప్తూ లెనిన్, "రష్యన్" అనే పేరు ద్వారా పార్టీ రష్యా ప్రజలందరి అగ్రగామి కార్మికులను సమైక్యపరుస్తుందని నొక్కిచెప్పినాడు. మహాసభచేత ఆమోదింపబడిన ప్రణాళికలో పార్టీ లక్ష్యాలు బాహాటంగా ప్రకటింపబడినాయి. ప్రణాళికలోని ముఖ్యమైన ప్రాతిపదికలతో యేకీభవించినాడు. కానీ, ఆ మహాసభ చెల్లాచెదరుగా వుండిన మార్క్సిస్టు బృందాలనూ, సంస్థలనూ ఏకం చేయలేదు. అది యే కార్యక్రమాన్నీ, నిబంధనలనూ చేపట్టలేదు; తరువాత కొద్ది కాలానికి ఆ మహాసభలో యెన్నుకోబడిన కేంద్ర కమిటీ అరెస్టు చేయబడింది. సోషల్ డెమోక్రటిక్ సంస్థలలో సామరస్య రాహిత్యం కొనసాగడమే కాక, వృద్ధి అయింది. వాటి కార్యకలాపాలు పరిమితంగానూ, స్థానికంగానూ వుండి, వాటి పనిలో పరస్పర సంబంధం గానీ, అనుస్యూతి గానీ లేదు. యీ ప్రాంతీయతత్వాన్నీ, అపరిణతత్వాన్నీ అధిగమించడానికి రష్యన్ సోషల్ డెమోక్రట్ల బలమైన సంస్థ ఒకటి అవసరమై వుండింది.

లెనిన్ ప్రవాసంలో వుండగా, రష్యాలో విప్లవ మార్క్సిస్టు పార్టీ నిర్మాణానికి ఆయన బుర్రలో ఒక పథకం పరిపక్వమైంది. ప్రగతి

వ్యతిరేక నియంతృత్వపు కఠిన పరిస్థితుల మూలంగా అలాంటి పార్టీని చాలా రహస్యంగా నిర్మించవలసివుండింది. లెనిన్‌యొక్క మహత్తర పథకంలో ఒక అఖిల రష్యా రాజకీయ వార్తాపత్రిక స్థాపనకు ప్రధాన పాత్ర కేటాయించబడింది. ఆ పత్రిక విప్లవ మార్క్సిస్టు ప్రాతిపదికమీద స్థానిక కమిటీలనూ, బృందాలనూ సమీకరించి, రెండవ మహాసభకు సమగ్రమైన సన్నాహాలు ప్రారంభించి, పార్టీకి ఏకైక కార్యక్రమాన్నీ, నిబంధనావళినీ తయారు చేయవలసి వుండింది. కానీ, లెనిన్ వార్తాపత్రిక పాత్రను ప్రచారానికీ, ఆందోళనకూ మాత్రమే పరిమితం చేయలేదు. అది పార్టీ శక్తుల సంఘటన కర్త కూడా కావాలనీ, స్థానిక సోషల్ డెమొక్రట్ల బృందాలను ఒకే సంస్థగా సమైక్యంచేయాలనీ ఆయన నిర్ణయానికి వచ్చినాడు. మార్క్సిస్టు వార్తాపత్రిక పాత్రమీద యిది సారభూతంగా నూతన దృక్పథం; సోషల్ డెమొక్రట్లలో వార్తాపత్రిక పాత్రను గురించీ, ప్రాముఖ్యం గురించీ అంతకు ముందు వుండిన భావాల నన్నిటినీ యిది తలక్రిందులు చేసింది. మంచుపడే ఒక చలికాలం సాయంత్రం యెనిసేయ్ నదీతీరాన తాను లెనిన్‌తో కలిసి చేసిన షికారును గురించి జి. యం. క్రజిజనోవ్‌స్కియ్ జ్ఞాపకం చేసుకున్నాడు; అప్పుడు లెనిన్ ఆయనతో తన యీ కొత్త, సాహసపూరిత పథకాన్ని ఉత్సాహంతో వెల్లడించినాడట.

తన ప్రవాస సమాప్తి కొరకు లెనిన్ ఆతురతతో యెదురుచూసినాడు. తన ప్రవాసపు యీ చివరి మాసాలలో "వ్లదీమిర్ ఇల్యీచ్ దాదాపు బొత్తిగా నిద్రపోలేదు; ఆయన దారుణంగా చిక్కిపోయినాడు. ఆయన రాత్రంతా మేలుకొని, తన పథకాన్ని సంపూర్ణ వివరాలతో తయారు చేస్తూ కూర్చునేవాడు.... కాలం గడిచేకొద్దీ కార్యరంగంలో దుమకాలనే కుతూహలంతో ఆయనకు అంతకంతకూ తహతహ పెరిగింది" అని నదేజ్దా క్రూప్‌స్కయా రాసింది.

దీనికి తోడుగా, పోలీసులు సోదా వారంటుతో హఠాత్తుగా వచ్చిపడినారు. లెనిన్ అన్నిటికంటె యెక్కువగా భయపడింది యేమిటంటే, తన ప్రవాసాన్ని పొడిగించడానికి అధికారులు యేదైనా సాకు కోసం వెదకుతారేమో అని. కానీ, అదృష్టవశాత్తు, అంతా సక్రమంగా జరిగిపోయింది.

ప్రవాసం పూర్తి అయినప్పుడు, 1900 జనవరి 29 ఉదయం, లెనిన్ సకుటుంబంగా షూషెన్స్కోయె వదలినాడు. ముందర దీర్ఘమైన ప్రయాణం వుండింది, గుర్రాలు లాగే మంచుబండిమీద సుమారు 200 మైళ్ల దూరం. తీవ్రమైన చలి వున్నప్పటికీ వాళ్లు రేయింబగలూ ప్రయాణం చేసినారు. చురుకైన విప్లవ కృషి మళ్లీ ప్రారంభించడానికి ఆయన తొందర పడినాడు.

రష్యాయొక్క రాజధానిలోనూ, పారిశ్రామిక కేంద్రాలలోనూ ఆయన వుండడం నిషేధింపబడింది. కనుక, సెంట్ పీటర్స్‌బుర్గ్‌కు దగ్గరగా వుండడానికి ఆయన ప్స్కోవ్‌లో మకాం పెట్టడానికి నిశ్చయించుకున్నాడు.

# కొత్త రకం మార్క్సిస్టు పార్టీని స్థాపించడానికి కృషి

లెనిన్‌కు తిరిగి స్వేచ్ఛ లభించిన వెంటనే, తన పథకాన్ని సాధించే కృషిలో ఆయన చురుకుగా నిమగ్నుడైనాడు; దాని కొరకు ఆయన జాగ్రత్తగా కట్టుదిట్టమైన సన్నాహాలు చేసినాడు. 1900వ సంవత్సర మంతా ఆయన ఒక అఖిల రష్యా వార్తాపత్రికను యేర్పాటు చేయడానికి తీవ్రమైన కృషిలో గడిపినాడు. పోలీసు హింసల మూలంగా

రష్యాలో పత్రిక నడపడం దాదాపు అసాధ్యం; కనుక పత్రికను విదేశాలలో ప్రచురించడానికి లెనిన్ నిశ్చయించినాడు. కానీ మొదట ఆయన రష్యాలోని అనేక సోషల్ డెమోక్రటిక్ సంస్థలతో సంప్రదించి, పత్రికకు ఆర్థిక యేర్పాట్లు చేసి, వ్యాస రచయితలనూ, విలేకరులనూ యేరుకున్నాడు. దీనికిగాను ఆయన, పోలీసు నిషేధం వున్నప్పటికీ, మాస్కో, సెంట్ పీటర్స్‌బుర్గ్, రీగ, సమార, స్మ్రిజన్, నీజ్ని - నోవ్‌గొరొద్, ఉఫా, స్మొలేన్స్క్‌లు దర్శించినాడు.

1900 మేలో ఒకసారి లెనిన్ రహస్యంగా సెంట్ పీటర్స్‌బుర్గ్‌కు పోయినప్పుడు ఆయన్ను పోలీసులు పట్టుకున్నారు. ఒక బిల్లుమీద వెనకవైపున రాసుకున్న విదేశ చిరునామాల పట్టీ ఒకటి ఆయనవద్ద వుండింది. అదృష్టవశాత్తు పోలీసులు దాన్ని కనుక్కోలేదు; త్వరలోనే ఆయన్ను వదిలేసినారు. ఆయన యింకా రష్యాలో వుండడం స్పష్టంగా ప్రమాదకర మౌతూవుండింది. లెనిన్‌ను బలీయమైన శత్రువుగా జారిజం పసికట్టింది. పోలీసు కర్నల్ అయిన జుబాతొవ్ 1900లో తన ప్రధానాధికారికి రాసిన రహస్య లేఖలో "విప్లవంలో యీనాడు ఉల్యానొవ్‌ను మించినవాడు లేడు" అని తెలిపి, ఆయన్ను హత్యచేయడానికి యేర్పాటు చేయాలని సూచించినాడు.

యెంతో కష్టంతో లెనిన్ దేశం వదలిపెట్టగలిగినాడు. 1900 జూలై 16న ఆయన జర్మనీకి బయలుదేరినాడు. ఆయన మొదటి వలస దశ ప్రారంభమైంది. అది అయిదేండ్లకు పైగా వుండింది.

అఖిల రష్యా విప్లవ వార్తాపత్రికకు 'ఇస్క్రా' ('మిణుగురు') అనే పేరు యెన్నుకోబడింది. లెనిన్ మ్యూనిచ్ చేరుకున్నాడు; పత్రికను ప్రచురించవలసింది అక్కడే. రహస్య గోపనార్థం, జారిస్టు రహస్య పోలీసు గూఢచారులు 'ఇస్క్రా' ప్రచురణ స్థలాన్ని తెలుసుకోకుండా వుండడానికి, రష్యాతో ఆయన ఉత్తర ప్రత్యుత్తరాలు ప్రాగ్ ద్వారా జరిగినాయి. ఆయన శ్రద్ధ అంతా వార్తాపత్రికకు అర్పించబడింది.

1900 సెప్టెంబర్‌లో న్యూరెన్‌బెర్గ్‌కు రాసిన ఒక జాబులో ఆయన యిలా అన్నాడు: "మన జీవసారమంతా మన పుట్టబోయే బిడ్డను పోషించడానికి వినియోగించాలి." నిజంగానే 'ఇస్క్రా' ఆయన మానస పత్రిక.

పత్రికను ప్రారంభించే సందర్భంలో అనేక సమస్యలు ఉత్పన్నమైనాయి – డబ్బు ప్రోగుచేయడమూ, ముద్రణకు యిల్లు కుదుర్చుకోవడమూ, రష్యన్ వైపు సంపాయించడమూ. యీ విషయంలో జర్మన్ సోషల్ డెమోక్రట్లు చాలా సహాయం చేసినారు.

అదే సంవత్సరం డిసెంబర్‌లో 'ఇస్క్రా' మొదటి సంచిక వెలువడింది. ప్రతి సంచికలోనూ "మిణుగురు మంటను ముట్టిస్తుంది!" అనే సూక్తి వుండింది. చివరకు జరిగింది అదే. రష్యాలో ఒక మహా విప్లవాగ్ని చెలరేగింది; దాని మంటలలో జారిస్టు నియంతృత్వమూ, పెట్టుబడిదారీ వ్యవస్థా హతమైనాయి.

రష్యాలో కార్మికవర్గ అగ్రేసరత్వాన విప్లవోద్యమం పెరుగుతూ వుండిన తరుణంలో 'ఇస్క్రా' ప్రారంభమైంది. తరుచైన సమ్మెలవలన ఫాక్టరీలు స్తంభించిపోతూ వుండినాయి, రైతులు భూస్వాములమీదికి తిరుగబడుతూ వుండినారు, విద్యార్థులలో అశాంతి వుండింది. యీ ఉద్యమానికి నాయకత్వం వహించడానికి బలమైన, సంఘటిత మార్క్సిస్టు పార్టీ అవసరమై వుండింది. అలాంటి పార్టీని సృష్టించడానికి లెనినిస్టు 'ఇస్క్రా' ఉద్యమం ప్రారంభించింది.

లెనిన్ చొరవతో, ఆయన మార్గదర్శకత్వంకింద రష్యాలో 'ఇస్క్రా' ప్రచార బృందాలూ, ఏజెంట్ల సమాహారమూ నిర్మింపబడినాయి. వాళ్లు పత్రికను పంపకం చేసినారు, పత్రికకు లేఖలూ, వ్యాసాలూ, యితర సమాచారమూ పంపినారు, పత్రిక సహాయార్థం విరాళాలు వసూలుచేసినారు. పోలీసుల, పోలీసు గూఢచారుల నిరంతర హింసలను ధిక్కరించి 'ఇస్క్రా' ఏజెంట్లు తమ ప్రమాదకర, వీరోచిత కార్యం

నిర్వహించినారు. అరెస్టు అయితే, వాళ్లకు జైలు శిక్షలూ, గొలుసులతో అందరినీ కలిపి కట్టివేయడమూ, ప్రవాసమూ విధింపబడేవి. 'ఇస్క్రా' ఏజెంట్లలో ఐ. వి. బాబుష్కిన్, యన్. ఇ. బౌమన్, యస్. ఐ. గూసెవ్, యం. ఐ. కలీనిన్; వి. జడ్. కెచ్‌హొవేలి, యం. యం. లిత్వీనొవ్, వై. డి. స్తాసొవా, టి. యస్. జెలిక్సోన్-బొబ్రోవ్‌స్కయా, ఆర్. యస్. జెమ్‌ల్యాచ్క వుండినారు.

'ఇస్క్రా' ఏజెంట్ల పనికి లెనిన్ గొప్ప ప్రాముఖ్యం యిచ్చినాడు. ఆయన మార్గదర్శకత్వం, శిక్షణలకింద వాళ్లు సాహసపూరితమైన, అంకితమైన పార్టీ ఆర్గనైజర్లుగా, ప్రజా ప్రయోజనం కొరకు యోధులుగా తయారైనారు. మనుషులకు లెనిన్ నిర్దిష్టమైన సలహాలు యిచ్చినప్పుడూ, చాలా ముఖ్యం అని ఆయన యెల్లప్పుడూ యెంచినట్టి కొత్త సంబంధాలు నెలకొల్పుకోడానికి వాళ్లను పంపినప్పుడూ, ఆయన యెంత జాగ్రత్తగా స్థానిక పరిస్థితులు అధ్యయనం చేసేందీ ఆ కాలానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలు తెలియజేస్తాయి. "కొత్త శక్తులతో, యువకులతో, కొత్తగా యేర్పడిన బృందాలతో మాకు <u>ప్రత్యక్ష</u> సంబంధం కలిగించడం యేమరవద్దు" అని ఆయన యస్. ఐ. గూసెవ్‌కు రాసినాడు. "విప్లవ సంస్థయొక్క బలం దాని సంబంధాల సంఖ్యలో వుందనేది మరిచిపోవద్దు." పార్టీ బలాలకు 'ఇస్క్రా' సమీకరణ కేంద్రమూ, శిక్షణ కేంద్రమూ అయింది.

పత్రికను రష్యాకు చేరవేయడం యెంతో కష్టంగా వుండింది; రవాణా సౌకర్యం కోసం దానిని పల్చని గట్టి కాగితంమీద అచ్చువేసేవాళ్లు. పోలీసు అడ్డంకులను తప్పించుకోడానికి 'ఇస్క్రా'ను దొంగ అడుగుపొరలు గల పెట్టెలలో పంపేవాళ్లు, లేదా పుస్తకాల బైండింగులో దాచిపెట్టి నమ్మకమైన అడ్రసులకు పంపేవాళ్లు, లేదా రష్యాకు పోయే కామ్రేడ్ల వేస్టుకోట్లలో కుట్టేసేవాళ్లు. వార్తాపత్రిక కొరకు స్థిరంగా పెరిగే డిమాండు మూలంగా, దాన్ని పునర్ముద్రించడానికి త్వరలోనే రష్యాలో

బాకూలోనూ, కిషినేవ్‌లోనూ రహస్య ప్రింటింగు ప్రెస్సులు నెలకొల్ప బడినాయి.

పార్టీని నిర్మించడంలో నిర్ణయాత్మక పాత్ర వహించిన వార్తా పత్రికకు లెనిన్ దానిని నడిపించే అధిదేవతగా వుండినాడు. ఆయనది కనీసం ఒక వ్యాసమైనా లేకుండా వెలువడే సంచిక అరుదు. పార్టీని సంఘటితపరచడానికీ, నిర్మించడానికీ అత్యుత్తమ పద్ధతి యేది అనేదాని మీదా, విప్లవ పోరాటంలోకి జనాలను ఆకర్షించడం యెలా అనేదాని మీదా పత్రికలో వ్యాసాలు వచ్చేవి. రష్యాలోని వివిధ పట్టణాలలోని విప్లవోద్యమంమీద అది రిపోర్టులు ప్రచురించి, ఫాక్టరీలలోనూ, మిల్లుల లోనూ జరిగేదాన్ని గురించీ, గ్రామీణ ప్రాంతంలోని సన్నివేశం గురించీ పాఠకులకు తెలియజేస్తూ వుండింది. త్వరలో అది కార్మికులకు ప్రీతి పాత్రమైంది. ప్రతి సంచికా చేతులు మారుతూ, పేలిక లయ్యేదాకా చదవబడేది. ఒక కార్మికుడు యిలా రాసినాడు: ''నేను 'ఇస్క్రా'ను నా తోటి కార్మికులకు చూపించినాను; ఆ ప్రతిని పేలిక లయ్యేదాకా చదివినారు. కానీ దాన్ని మేము నిధిలాగ దాచుకుంటాము.... 'ఇస్క్రా' మా ప్రయోజనాన్ని గురించి రాస్తుంది, అఖిల రష్యా ప్రయోజనాన్ని గురించి. దీనిని కోపెక్కులలో విలువగట్టలేము, గంటలలో కొలవలేము. పత్రిక చదివినప్పుడు అర్థమౌతుంది, మన కార్మికులన్నా, మనం అనుసరించే మేధావులన్నా పోలీసులు యెందుకు భయపడేదీ.''

1901 ఉత్తర భాగంలో వ్లదీమిర్ ఇల్యీచ్ తన రచనలలో కొన్నిటిమీద లెనిన్ అని సంతకం చేయడం ప్రారంభించినాడు. యీ మారుపేరు ఆయన యెందుకు యెన్నుకున్నాడని తరుచుగా అడుగు తుంటారు. ఆయన భార్య చెప్పేదాన్నిబట్టి, యీ యెన్నిక గుడ్డిగా జరిగినట్లు కనపడుతుంది. బహుశా, 'ఇస్క్రా'లో ప్లెహానొవ్‌తో కలిసి పనిచేస్తూ వుండినప్పుడు, ప్లెహానొవ్ తన రచనలమీద వోల్గిన్ (వోల్గా అనే రష్యన్ నదినిబట్టి యేర్పడిన పేరు) అని సంతకం చేయగా, లెనిన్

తన మారుపేరును లెనా అనే సైబీరియన్ మహానదినిబట్టి రూపొం దించుకొని వుండవచ్చు.

1902లో 'యేమి చెయ్యాలి?' అనే లెనిన్ పుస్తకం ప్రచు రింపబడింది. పార్టీ సృష్టిలో ప్రచండ ప్రాముఖ్యం గల పాత్ర నిర్వ హించిన అసాధారణ గ్రంథం యిది. యిందులో లెనిన్ కార్మికవర్గ మార్క్సిస్టు పార్టీ నిర్మాణానికి తాను వేసిన పథకాన్ని సవివరంగా, ప్రగాఢ తర్కబద్ధంగా వ్యాఖ్యానించినాడు. పార్టీని ఆయన కొత్త రకమైన, సర్వేసర్వత్రా విప్లవకరమైన, సమరశీల పార్టీగా ఊహించినాడు.

రష్యాలో కార్మికవర్గ పార్టీని యేర్పరచడానికి చాలా పూర్వమే పశ్చిమ యూరప్‌లో కార్మిక పార్టీలు వుండినాయి. లెనిన్ దృష్టిలో, ఆ పార్టీలకంటె రష్యన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ యేవిధంగా భిన్నంగా వుండాలి? పశ్చిమ యూరప్‌లోని సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీలు పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క సాపేక్ష శాంతియుత అభివృద్ధి పరిస్థితులలో రూపుదాల్చినాయి. అవి విప్లవ పోరాటానికి అనుగుణంగా తీర్చబడలేదు; అవి అవకాశవాదులను సహించినాయి. క్రమ క్రమంగా అవకాశవాదులు వాటిలో ప్రధాన పాత్ర వహించ నారంభించి నారు. సోషలిస్టు విప్లవం లేకుండానే, కార్మికవర్గ నియంతృత్వం లేకుండానే, దోపిడీని అంతమొందించి, సోషలిజంలోకి పోవడం సాధ్యమని వాళ్లు వాదించినారు. దీని ద్వారా వాళ్లు కార్మికులను క్రియారహి తులను చేసి, తాము వాస్తవంగా పెట్టుబడిదారీ వ్యవస్థ సామర్ధ్యకులు అయినారు. వాళ్లు మార్క్సిజంను సవరించి, దాని విప్లవ సారాన్ని తోడేసినారు. వాళ్లు బూర్జువావర్గ సేవకుల, ఏజెంట్ల పాత్రను నిర్వహించే రాజీవాదులు. అత్యధిక సోషల్ డెమోక్రటిక్ పార్టీల నాయకులు సిద్ధాంతంలో మాత్రం అవకాశవాదాన్ని ఖండించి, ఆచరణలో దానిని సహించినారు.

లెనిన్ పూర్తిగా భిన్నమైన పార్టీని ఊహించినాడు, నిజంగా విప్లవకరమైన కార్మికవర్గ పార్టీని, జారిస్టు నిరంకుశత్వంమీదా, పెట్టు బడిదారీ వ్యవస్థమీదా దాడికి రష్యా కార్మికవర్గాన్ని సంఘటితపరిచి నడి పించే సామర్థ్యం గలదాన్ని. కార్మికుల ఉద్యమాన్ని నడిపించడానికీ, దానికి మార్గదర్శకత్వం వహించే శక్తి కావడానికీ, పార్టీ పురోగామి విప్లవ సిద్ధాంతమైన మార్క్సిస్టు సిద్ధాంత మనే ఆయుధం ధరించవలసి వుండింది. అది ఆ సిద్ధాంతాన్ని కార్మికవర్గ ఉద్యమంలోకి తీసుకపోయి, తద్వారా ఆ ఉద్యమాన్ని సోషలిస్టు చైతన్యపూరితం చేయవలసి వుండింది. "విప్లవ సిద్ధాంతం లేకుండా విప్లవ ఉద్యమం వుండజాలదు" అనేది విప్లవ సిద్ధాంత పాత్రను గురించి లెనిన్ అంచనా.

బూర్జువా సమాజ పరిస్థితులలో బూర్జువావర్గ భావజాలం గానీ, కార్మికవర్గ భావజాలం గానీ ఒకటి మాత్రమే వుండగలదని లెనిన్ నిరూపించినాడు. మధ్య మార్గం యేదీ లేదు. బూర్జువావర్గం పాలక వర్గం గనుక, తన భావజాలాన్ని ప్రచారం చేయడానికి దానికి కార్మిక వర్గంకంటె యెక్కువ సాధనాలూ, అవకాశాలూ వుండినాయి. కనుక, "ఆర్థికవాదులు" ఉద్బోధించినట్లు చైతన్యంయొక్క పాత్రను తగ్గించి, సద్యోజనితత్వాన్ని పొగడే ప్రతి ప్రయత్నమూ వాస్తవంలో కార్మికవర్గంమీద బూర్జువా భావజాలంయొక్క పలుకుబడిని బలపరచడ మౌతుంది. దీన్ని బట్టి తేలేదేమంటే, సోషల్ డెమోక్రట్ల తక్షణ కర్తవ్యం బూర్జువా భావజాలంతో పోరాడడమూ, కార్మికవర్గాన్ని సోషలిస్టు చైతన్య స్థాయికి తెచ్చేటట్లు దాని రాజకీయ విద్యను సాగించడమూ.

కట్టుదిట్టమైన కేంద్రీకృత పార్టీ నిర్మాణానికి గొప్ప ప్రాముఖ్యం యిస్తూ, లెనిన్ అలాంటి పార్టీని నిర్మించడానికి ఒక పథకం వివరంగా తయారుచేసినాడు. పార్టీలో రెండు భాగాలు వుండాలని ఆయన నమ్మి నాడు: పూర్తిగా విప్లవానికి అంకితమైన వృత్తి విప్లవకారుల పరి

మిత బృందమూ, సభ్యత్వంలో అత్యధిక భాగానికి సంబంధించిన స్థానిక పార్టీ శాఖల విస్తార సమాహారమూ.

కార్మికులనుండి వృత్తి విప్లవకారులను తయారుచేయడానికి లెనిన్ ప్రత్యేక ప్రాముఖ్యం యిచ్చినాడు. ఆయన అవగాహన ప్రకారం, వృత్తి విప్లవకారుడు యెప్పుడూ ప్రజలమధ్యన వుండి, వాళ్ల అవసరాలూ, భావాలూ తెలుసుకోవాలి, క్రౌర్యంయొక్క, పీడనయొక్క ప్రతి వ్యక్తీకరణకూ, అది యెక్కడ జరిగినా, యే వర్గాన్ని బాధించినా, ప్రతిస్పందించగలిగి వుండాలి, "తన సోషలిస్టు విశ్వాసాలనూ, తన ప్రజాతంత్ర డిమాండ్లనూ అందరి యెదుటా పెట్టడానికీ, కార్మికవర్గ విమోచన పోరాటంయొక్క ప్రపంచ చరిత్రాత్మక ప్రాముఖ్యాన్ని అందరికీ, ప్రతి ఒకరికీ వివరించడానికీ ప్రతి ఘటననూ, అది యెంత చిన్నదైనా" వినియోగించుకోగలిగి వుండాలి.

పార్టీని నిర్మించడానికి లెనిన్ వేసిన పథకాన్ని "ఆర్థికవాదులు" వ్యతిరేకించినారు. వాళ్లు కార్మికవర్గానికి స్వతంత్ర రాజకీయ పాత్రను నిరాకరించి, స్వతంత్ర విప్లవ పార్టీని సృష్టించడానికి కూడా వ్యతిరేకంగా వుండినారు. 'యేమి చెయ్యాలి?' అనే పుస్తకంలో లెనిన్ "ఆర్థికవాదుల"మీద చావుదెబ్బ కొట్టినాడు. "ఆర్థికవాదం" అంతర్జాతీయ అవకాశవాద రూపాల్లో ఒకటి అని ఆయన నిరూపించినాడు. ఆవిధంగా ఆ పుస్తకం రష్యన్ అవకాశవాదంతోపాటు అంతర్జాతీయ అవకాశవాదంమీద కూడా దాడి చేసింది. పార్టీ సభ్యులను మార్క్సిస్టు వేదికమీద సమీకరించడంలోనూ, నిజంగా విప్లవకరమైన మార్క్సిస్టు పార్టీని సృష్టించిన ఆర్.యస్.డి.యల్.పి. రెండవ మహాసభకు సన్నాహం చేయడంలోనూ అది ముఖ్యమైన అంశం.

తన పుస్తకాన్ని పాఠకులు యెలా స్వీకరించిందీ తెలుసుకోవాలని లెనిన్‌కు చాలా ఆసక్తి వుండింది. 1902 ఆగస్టులో ఆయన ఆర్.యస్.డి.యల్.పి. మాస్కో కమిటీకి యిలా రాసినాడు: " 'యేమి

చెయ్యాలి?' రచయితకు కృతజ్ఞత తెలుపుతూ మీరు రాసిన ఉత్తరం నాకు అందింది. 'యేమి చెయ్యాలి?' పుస్తకం ప్రతులు చాలినన్ని మీకు అందినాయా? కార్మికులు దానిని చదివినారా? వాళ్ల ప్రతిస్పందన యేమిటి?''

కార్మికవర్గ విప్లవ పార్టీని గురించిన తన సిద్ధాంతాన్ని విస్తరించడంలో లెనిన్ పార్టీకి సమరశీల శాస్త్రీయ కార్యక్రమాన్ని యిచ్చే విషయానికి అత్యంత ప్రాముఖ్యం యిచ్చినాడు. ''కార్యక్రమం అంటే పార్టీ వేటికొరకు కృషిచేస్తున్నదో, పోరాడుతున్నదో ఆ సమస్త విషయాల సంక్షిప్తమైన, స్పష్టమైన, కచ్చితమైన ప్రకటన'' అని ఆయన రాసినాడు. పార్టీ మొదటి కార్యక్రమాన్ని తయారుచేయడంలో లెనిన్ ప్రధాన పాత్ర వహించినాడు. నూతన, సోషలిస్టు సమాజ నిర్మాణం అనే కార్మికవర్గ ఉద్యమ అంతిమ గమ్యాన్నీ, ఆ గమ్యానికి చేరే మార్గాలనూ, అనగా సోషలిస్టు విప్లవాన్నీ, కార్మికవర్గ నియంతృత్వాన్నీ స్పష్టంగా అసందిగ్ధంగా నిర్వచించిన విప్లవ పార్టీ కార్యక్రమాన్ని లెనిన్‌యొక్క నిర్విరామ ప్రయత్నాలవల్ల మాత్రమే 'ఇస్క్రా' తయారుచేయగలిగింది. జారిజంను కూలదోయడమూ, ప్రజాతంత్ర రిపబ్లిక్కును స్థాపించడమూ అనే తక్షణ కర్తవ్యాలను కూడా ఆ కార్యక్రమం రూపొందించింది. ఆవిధంగా ప్రజాస్వామ్యం కొరకూ, సోషలిజం కొరకూ జరిగే పోరాటాల ఐక్యత నొక్కిచెప్పబడింది.

పార్టీ కార్యక్రమం రైతుల మనస్సుల్లో నాటుకునేటట్లు చేయడానికి లెనిన్ 1903 వసంతంలో 'గ్రామీణ బీదలకు' అనే చిన్న పుస్తకం రాసినాడు. అందులో, కార్మికుల పార్టీ యేమి సాధించ పూనుకున్నదీ, బీద రైతులు కార్మికులతో యెందుకు పొత్తు కలవ వలసిందీ ఆయన సరళంగా, స్పష్టంగా వివరించినాడు. ఆయన యిలా రాసినాడు: ''మేము కొత్త, మేలైన సమాజ వ్యవస్థను సాధించ దలచుకున్నాము: యీ కొత్త, మేలైన సమాజంలో ధనికులూ వుండకూడదు, బీదలూ

వుండకూడదు; అందరూ పనిచేయవలసి వుంటుంది. కొద్దిమంది ధనికులు కాక, శ్రమజీవు లందరూ తమ సమష్టి శ్రమయొక్క ఫలితాలను అనుభవించాలి. యంత్రాలూ, యితర మెరుగుదలలూ అందరి శ్రమనూ సులభపరచడానికి ఉపయోగపడాలి గానీ, కోటానుకోట్ల ప్రజల నష్టంతో కొద్దిమంది ధనికు లయ్యేటట్లు చేయకూడదు. యీ కొత్త, మేలైన సమాజాన్ని సోషలిస్టు సమాజం అంటారు. యీ సమాజం గురించిన బోధలను సోషలిజం అంటారు.''

1902 తొలి రోజుల్లో పోలీసు గూఢచారులు 'ఇస్క్రా'ను గురించిన వివరాలను పసిగట్టినారు. మ్యూనిచ్‌ని వదలిపెట్టడం అవసర మైంది; యెందుకంటే యింకా యిక్కడ వుండడం ప్రమాదకరం అయింది. వార్తాపత్రిక ప్రచురణను లండన్‌కు మార్చాలని సంపాదక వర్గం నిర్ణయించింది. 1902 ఏప్రిల్‌లో లెనిన్ లండన్ చేరినాడు.


యింగ్లండు రాజధానిలో జీవిస్తూ, లెనిన్ యింగ్లీషు కార్మికోద్యమాన్నీ, జీవితాన్నీ గాఢంగా అధ్యయనం చేస్తూ, సభలకూ, సమావేశాలకూ హాజరౌతూ వుండినాడు. లెనిన్ యెల్లప్పుడూ కార్మికులవైపు ఆకర్షితుడైనాడని క్రూప్‌స్కయా తన స్మృతులలో అన్నది. తరుచుగా ఆయన యేదైనా ఒక కార్మికుల సభ యెక్కడ జరిగేదీ వార్తాపత్రికలద్వారా తెలుసుకొని, అక్కడికి పోయి, ఒక మూల కూర్చొని, వినేవాడు.

తన సమయంలో చాలా భాగం లెనిన్ గ్రంథాలయాల్లో గడిపేవాడు, ముఖ్యంగా బ్రిటిష్ మ్యూజియం గ్రంథాలయంలో, తనకంటె ముందు కార్ల్ మార్క్స్ పోతూవుండిన చోట.

1903 వసంతంలో లెనిన్ లండన్‌నుండి జెనీవాకు, అప్పుడు 'ఇస్క్రా' అచ్చౌతూవుండిన చోటికి, పోయినాడు. ఆయనా, ఆయన భార్యా శివార్లలో ఒక చిన్న యిల్లు అద్దెకు తీసుకున్నారు. అక్కడ ఆయన రష్యానుండి వచ్చే కామ్రేడ్లకు ఆతిథ్యం యిచ్చేవాడు. వాళ్లలో

చాలామంది ప్రవాసంనుండి తప్పించుకొని వచ్చినవాళ్లు, జీవనాధారం యేదీ లేనివాళ్లు. లెనిన్ వాళ్లను జాగ్రత్తగా చూసుకుంటూ, వాళ్లకు తిండీ, వసతీ లభించేటట్లు చూసేవాడు. ఆయన సమయజ్ఞతా, ఔదర్యమూ, దయా గలవాడు. నిత్యం ఉత్సాహంగా, ఆహ్లాదకరంగా వుండే లెనిన్‌కు యితరులను స్వస్థమనస్కులను చేసే నేర్పు వుండింది. టి. యస్. జెలిక్సోన్ - బొబ్రోవ్‌స్కయా అనే ఒక 'ఇస్క్రా' ఏజెంటు ఆయన సరళత్వం గురించీ, నమ్రత గురించీ, ఉల్లాసం గురించీ చెప్పింది. "వ్లదీమిర్ ఇల్యీచ్ ముదురు నీలం రష్యన్ బ్లౌజ్ వేసుకున్నాడు; ఆయన దిట్టమైన శరీరానికి అది మరీ రష్యన్ రూపం యిచ్చింది." ఆర్.యస్.డి.యల్.పి.యొక్క ఎకతెరినొస్లావ్ కమిటీకి చెందిన ఒక సభ్యుడు, జెనీవాలో లెనిన్ యింటికి పోయినవాడు, ఆయన తనకు మిత్ర స్వాగతాన్ని మించినదాన్ని యిచ్చినాడనీ, తనను ఒక అన్నలాగా, పెద్ద కామ్రేడ్‌లాగా ఆదరించి, వెంటనే సరళ నిస్సంకోచ వాతావరణం సృష్టించినాడనీ చెప్పినాడు.

రెండవ పార్టీ మహాసభను సమావేశపరచడం యిప్పుడు తక్షణ కర్తవ్యం అయింది. దానికి యేర్పాట్లు చేయడంలో లెనిన్ తన సమయంలో చాలా భాగం వినియోగించినాడు. మహాసభ పనికి ఆయన పథకం వేసి, చిత్తు తీర్మానాలూ, పార్టీ నిబంధనావళీ తయారుచేసినాడు. మహాసభ ప్రారంభానికి ఆయన తహతహతో యెదురుచూసినాడు, ప్రతినిధులకు ఆప్యాయంగా స్వాగతమిచ్చి, రష్యాను గురించీ, కార్మికుల విప్లవ తీవ్రత గురించీ, వివిధ ప్రాంతాలలో పని పురోగతిని గురించీ వాళ్లను ప్రశ్నలతో ముంచెత్తినాడు. "వ్లదీమిర్ ఇల్యీచ్‌కి వినడంలోనూ, ప్రశ్నలడగడంలోనూ ఒక ప్రత్యేక పద్ధతి వుండింది" అని పార్టీలో దీర్ఘకాల సభ్యురాలైన వై. డి. స్తాసొవా అన్నది. "తన ప్రశ్నలద్వారా ఆయన సంభాషణను తాను కోరిన మార్గంలోకి మళ్లేటట్లూ, తనకు ఆసక్తి గల విషయాలను స్పృశించేటట్లూ చేస్తాడు." విదేశాల్లో వుంటూ, ఆయ



పుతీలొవ్ కర్మాగారం కార్మికులకు ఉపన్యసిస్తున్న లెనిన్. 1917 ఐ. బ్రోద్‌స్కీయ్ వర్ణచిత్రంనుండి



మాస్కో జిల్లా, వొలొకొలామ్స్కి తాలూకా, కాషినొ
గ్రామ రైతులమధ్య లెనినూ, క్రూప్స్కయా
ఫోటో 1920

నకు రష్యాపట్ల "యింటి బెంగ" వుండేది; అక్కడినుండి యే వార్త వచ్చినా ఆయనకు సంతోషం కలిగేది. యెక్కడ వుండినా ఆయన యెప్పుడూ తన మాతృదేశం గురించీ దాని విస్తార ప్రదేశాల గురించీ, కరకర లాడే మంచుగాలి గల రష్యన్ శీతకాలం గురించీ, తన చిన్ననాటి నది అయిన వోల్గాను గురించీ కలలు గనేవాడు.

రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ రెండవ మహాసభ 1903 జూలైలో ప్రారంభమైంది. దాని మొదటి సమావేశాలు బ్రస్సెల్స్‌లో జరిగినాయి, కానీ బెల్జియన్ పోలీసులు సృష్టించిన యిబ్బందుల కారణంగా సమావేశాలు లండన్‌కు మార్చబడినాయి. మహాసభ అంగనిర్మాణం ఏక స్వభావం లేనిదిగా వుండింది. స్థిరమైన కార్మిక వర్గ విప్లవకారులైన ఇస్క్రిస్టులు కాక, అవకాశవాదులూ, "బురదనేల" అనబడే ఊగిసలాడేవాళ్ళూ మహాసభలో వుండినారు. ఇస్క్రిస్టులు మెజారిటీగా వుండినప్పటికీ, వాళ్లలో అందరూ దృఢంగా లేరు. వాళ్లలో అస్థిరమైన, లేదా "మెతక" మనుషులు వుండినారు. అందువలన 'ఇస్క్రా' సూత్రాల విజయం కొరకు మహాసభలో అవకాశవాదులతో విప్లవ పక్షం భీషణ పోరాటం చేసింది.

మహాసభను నడిపించడంలో లెనిన్ చురుకైన పాత్ర వహించినాడు. తన అనుచరులతోపాటు ఆయన అవకాశవాదులను తీవ్రంగా యెదిరించినాడు. 'ఇస్క్రా' ధోరణి విజయంకొరకు కృషి చేసినాడు. లెనిన్ చేసిన ఉపన్యాసాలూ, అభిప్రాయ ప్రకటనలూ, జవాబులూ నూటికిపైగా మహాసభ మినిట్స్‌లో నమోదు చేయబడినాయి.

పార్టీ కార్యక్రమంమీద దీర్ఘ, ఆవేశపూరిత చర్చ జరిగింది. లెనినూ, ఆయన్ను బలపరిచేవాళ్ళూ విప్లవ కార్యక్రమమూ, కార్మికవర్గ నియంతృత్వ సిద్ధాంతమూ, కార్మికవర్గ రైతాంగాల పొత్తూ, జాతులకు స్వయంనిర్ణయ హక్కూ, కార్మికవర్గ అంతర్జాతీయతా కావాలన్నారు. యీ మౌలిక మార్క్సిస్టు సూత్రాలను బహిరంగ అవకాశవాదులు—

'బుంద్'* సభ్యులూ, "ఆర్థికవాదులూ," తదితరులూ — వ్యతిరేకించి నారు. వాళ్లను, వాస్తవంగా, ట్రాట్స్కీ బలపరచినాడు. కానీ, 'ఇస్క్రా' అనుయాయులు వాళ్ల దాడు లన్నిటినీ తిప్పికొట్టినారు.

మహాసభ 'ఇస్క్రా' సంపాదకవర్గం తయారుచేసిన విప్లవ కార్య క్రమాన్ని మెజారిటీ వోట్లతో ఆమోదించింది. కార్మికవర్గ నియంతృ త్వం కొరకు చేయవలసిన పోరాటాన్ని కార్మికవర్గ పార్టీయొక్క మౌలిక లక్ష్యంగా పెట్టుకున్న ప్రపంచంలోని ప్రథమ పార్టీ కార్యక్రమం అది.

యీ కార్యక్రమంచేత నడిపించబడి, పార్టీ రష్యాలో సోషలిస్టు విప్లవ విజయం కొరకు విజయవంతమైన పోరాటం చేయగలిగింది. తన మొదటి కార్యక్రమం నెరవేర్చడానికి పార్టీకి తీవ్ర, వీరోచిత పోరాటంతో, దీక్షాయుత, నిస్వార్థ కృషితో, కడగండ్లతో, త్యాగాలతో నిండిన పద్దెదు సంవత్సరాలు దాదాపుగా పట్టినాయి.

పార్టీ నిబంధనావళిని చర్చించేటప్పుడు మహాసభలో తీవ్రమైన అభిప్రాయభేదాలు వెల్లడైనాయి. ప్రతి సభ్యుడూ విప్లవ పోరాటంలో క్రియాశీల పాత్ర వహిస్తూ, పార్టీ క్రమశిక్షణకు లోబడేటట్టి ఏక శిలాత్మక, సమరశీల పార్టీకి లెనిన్ అనుకూలంగా వుండినాడు. కనుక, పార్టీ కార్యక్రమాన్ని ఆమోధించి, రుసుము చెల్లించి, యేదో ఒక పార్టీ శాఖకు చెంది, దాని పనిలో పాల్గొనేవా డెవడైనా పార్టీ సభ్యుడుగా పరిగణింపబడగలడని ఆయన వాదించినాడు. యీ సూత్రీకరణ ఆచరణలో కార్మికవర్గేతర, అస్థిర అంశాలను అరికట్టి, సంఘటిత, క్రమశిక్షణాయుత పార్టీని నిర్మించడానికి వీలు కలిగించింది.

---

* 'బుంద్' — 1897లో స్థాపించబడిన 'లిథువేనియా, పోలెండు, రష్యా సాధారణ యూదు కార్మికుల సంఘా'నికి సంక్షిప్త నామం. రష్యా పశ్చిమ ప్రాంతాలలోని యూదు చేతిపనివాళ్లను యిది అత్యధికంగా సమైక్యపరిచింది. — సం.

కానీ, మహాసభ తృణీకరించదగిన మెజారిటీ వోట్లతో మార్తొవ్ యొక్క అవకాశవాద తీర్మానాన్ని ఆమోదించింది. ఆ తీర్మానం ప్రకారం, పార్టీ కార్యక్రమాన్ని ఆమోదించి, పార్టీకి ఆర్థిక సహాయం చేసే వాడెవడైనా, యేదైనా ఒక పార్టీ శాఖకు చెందే బాధ్యతా, పార్టీ క్రమ శిక్షణకు లోబడే బాధ్యతా లేకుండా, పార్టీ సభ్యత్వానికి అర్హుడౌతాడు. సభ్యత్వం గురించి యీ వ్యాఖ్యానం పార్టీని రూపరహితమైన సంస్థగా చేసి, రకరకాల అస్థిర అంశాలు అందులో ప్రవేశించడానికి వీలు కలిగిస్తుంది. యీ పద్ధతిలో నిర్మింపబడిన పార్టీతో కార్మికులు తమ వర్గశత్రువులను యెన్నడూ ఓడించగలిగి వుండలేరు. పార్టీ నిర్మాణానికి లెనిన్‌యొక్క సంస్థానిర్మాణ పథకాన్ని వ్యతిరేకించడంలో ట్రాట్స్కీ మార్తొవ్‌తో కలిసినాడు.

మహాసభ చివరి సమావేశంలో, కేంద్ర సంఘాలకు యెన్నికలు జరిగేటప్పుడు — కొంతమంది అవకాశవాదులు మహాసభనుండి వెళ్లిపోయి వుండినందున — బలాబలాలు లెనిన్ అనుయాయులకు అనుకూలంగా మారినాయి. కేంద్ర కమిటీకీ, పార్టీ కేంద్ర పత్రికగా గుర్తింపబడిన 'ఇస్క్రా'యొక్క సంపాదకవర్గానికీ జరిగిన యెన్నికలలో లెనిన్ అనుయాయులకు మెజారిటీ వోట్లు వచ్చినాయి. అప్పటినుండి వాళ్లకు బోల్షెవిక్కులు అనే పేరు వచ్చింది. మైనారిటీగా వుండిన అవకాశవాదులకు మెన్షివిక్కులు అనే పేరు వచ్చింది.*

ఆర్.యస్.డి.యల్.పి. రెండవ మహాసభ రష్యా కార్మికోద్యమంలోనే కాక, ప్రపంచ కార్మికోద్యమంలో కూడా ఒక మలుపు. దాని చరిత్రాత్మక ప్రాముఖ్యం కొత్త రకం కార్మికవర్గ పార్టీని,

---

* రష్యన్ భాషలో బోల్షిన్‌స్త్వొ అంటే మెజారిటీ, మెన్షిన్‌స్త్వొ అంటే మైనారిటీ. — సం.

లెనినిస్టు బోల్షెవిక్ పార్టీని, సృష్టించడంలో వుంది. "ఒక రాజకీయ ఆలోచనా ధోరణిగా, ఒక రాజకీయ పార్టీగా బోల్షెవిజం 1903నుండి వుంది" అని లెనిన్ రాసినాడు.

భూస్వాముల, పెట్టుబడిదార్ల అధికారాన్ని కూలదోయడానికీ, సోషలిజం నిర్మించడానికీ రష్యా కార్మికవర్గాన్నీ, సమస్త శ్రామిక జనాన్నీ సమీకరించగల ఒక బలమైన శక్తి బోల్షెవిక్ పార్టీ రూపంలో అవతరించింది. లెనినూ, ఆయన్ను బలపరిచేవాళ్లూ నిర్మించిన బోల్షెవిక్ పార్టీ సకల కమ్యూనిస్టు పార్టీలకూ, కార్మికుల పార్టీలకూ నమూనా అయింది.

రష్యన్ కార్మికవర్గానికీ, అంతర్జాతీయ కార్మికవర్గానికీ లెనిన్‌లో ఒక అసాధారణ సిద్ధాంతవేత్త – మార్క్స్, ఎంగెల్సుల కృషినీ, బోధనూ కొనసాగించినవాడూ, కార్మికవర్గ ఉద్యమాన్ని అభివృద్ధి చేయడానికి గల అవకాశాలను స్పష్టంగా అవగాహన చేసుకున్నవాడూ – లభించినాడని విప్లవ మార్క్సిస్టు పార్టీని సృష్టించడానికి లెనిన్ వేసిన పథకంయొక్క విజయం నిరూపించింది.

రెండవ మహాసభ తర్వాత పార్టీలోని పరిస్థితి యెప్పుడూ లేనంత జటిలం అయింది. ఓడిపోయిన "ఆర్థికవాదుల" స్థానం యిప్పుడు మెన్షివిక్కులు తీసుకొని, వాళ్ల అవకాశవాద పంథాను కొనసాగించినారు. బోల్షెవిక్కులకూ మెన్షివిక్కులకూ మధ్య భీషణమైన, మొండి పోరాటం ప్రారంభమై, అనేక సంవత్సరాలు సాగింది. మెన్షివిక్కులు పార్టీని అవకాశవాద పంథాలోకి మళ్లించబూనుకున్నారు. వాళ్లు పార్టీ కేంద్ర పత్రిక అయిన 'ఇస్క్రా'ను వశపరుచుకొని, దానిలో లెనిన్‌మీదా, బోల్షెవిక్కులమీదా, రెండవ మహాసభ నిర్ణయాలమీదా దాడులు ప్రారంభించినారు. మెన్షివిక్కులతో నిర్ణయాత్మకంగా పోరాడడమూ, మెన్షివిజంద్వారా పార్టీకీ రష్యాలోని విప్లవోద్యమానికీ కలిగే ప్రమాదాన్ని చూపించడమూ అవసరమైనాయి. యీ పని లెనిన్ 'ఒక అడుగు

ముందుకు, రెండడుగులు వెనక్కి' అనే తన పుస్తకంలో చేసినాడు; యీ పుస్తకం 1904 మేలో వెలువడింది.

కార్మికవర్గ ఉద్యమంలో పార్టీ సంఘటితపరిచే శక్తిగా వుండడాన్ని మెన్షివిక్కులు వ్యతిరేకిస్తున్నారనీ, వాళ్లు దానిని ధ్వంసంచేస్తున్నారనీ లెనిన్ చూపించినాడు. పార్టీ కార్మికవర్గానికి మార్గదర్శక సంస్థగా వుండాలనీ, అది లేకుండా సోషలిస్టు విప్లవాన్ని జయించడమూ, కమ్యూనిస్టు సమాజాన్ని నిర్మించడమూ అసాధ్యమనీ చెప్పే మార్క్సిస్టు సిద్ధాంతాన్ని ఆయన విస్తృతపరిచినాడు. "అధికారం కొరకు తాను చేసే పోరాటంలో కార్మికవర్గానికి సంస్థ తప్ప మరొక ఆయుధం లేదు" అని ఆయన నొక్కిచెప్పినాడు. పార్టీ అనేది కార్మికవర్గంలో అవినాభావ భాగమనీ, దాని వర్గచైతన్యపూరిత అగ్రదళమనీ ఆయన బోధించినాడు. పార్టీలోని సభ్యులందరూ ఒకేఒక సంస్థలో ఏకమై, సమష్టి ఇచ్ఛచేతా, సమష్టి ఆచరణ పంథాచేతా, సమష్టి క్రమశిక్షణచేతా బంధింపబడి, విప్లవ సిద్ధాంతంచేత సాయుధమైనప్పుడు మాత్రమే పార్టీ కార్మికవర్గ పోరాటాన్ని విజయవంతంగా నడిపించగలదు.

పార్టీకి లక్షలాది కార్మికవర్గ జనాలతో తన సంబంధాలను విస్తృతపరుచుకోవడంపట్లా, గట్టిపరుచుకోవడంపట్లా నిరంతరం ఆదుర్దా వుంటుందని లెనిన్ స్పష్టపరిచినాడు. యీ సంబంధాలు లేకుండా అది జీవించలేదు, అభివృద్ధి కాలేదు.

'ఒక అడుగు ముందుకు, రెండడుగులు వెనక్కి' అనే పుస్తకంలో లెనిన్ పార్టీ జీవితానికి స్థిరమైన ప్రమాణాలూ, పార్టీ నాయకత్వ సూత్రాలూ యేర్పరిచినాడు; యివి పార్టీయొక్క తదనంతర కార్యకలాపాల నన్నిటినీ పాలించే శాసనం అయినాయి. వాటి ప్రకారం పార్టీ నిబంధనావళిని కచ్చితంగా అనుసరించడమూ, అందరికీ కఠినమైన క్రమశిక్షణా, మెజారిటీకి మైనారిటీ, పైసంస్థలకు కింది సంస్థలూ లోబడడమూ, పార్టీ సంస్థలు యెన్నిక కావడమూ, పైసంస్థలకు నివేదిక

పంపే బాధ్యత వాటిమీద వుండడమూ, సాధారణ సభ్యులలో క్రియాశీల తనూ, చొరవనూ అభివృద్ధి చేయడమూ జరుగుతాయి. లెనిన్ పుస్తకం పార్టీ సంస్థల హృదయపూర్వక ఆమోదం పొంది, పురోగామి కార్మికు లలో విస్తృతంగా ప్రచారమైంది.

1904 వేసవిలో లెనినూ, యితర బోల్షివిక్కులూ మూడవ పార్టీ మహాసభ జరపాలని ఉద్యమం ప్రారంభించినారు. రష్యాలోని సన్నివేశం దృష్ట్యా యిది తక్షణ అవసరమైంది. విప్లవం పతాక స్థాయికి చేరుతూ వుండింది; దానిని పూర్తి సన్నద్ధంగా యెదుర్కో డానికి పార్టీ సిద్ధంగా వుండాలి. మహాసభను జరపడానికి మరొక కారణం పార్టీలోపలి సన్నివేశం. మెన్షివిక్కుల విచ్ఛేదక చర్యలను అంతం చేయవలసి వుండింది; వాళ్లు రెండవ మహాసభ నిర్ణయాలను పక్కదారి పట్టించి, పార్టీ పనికి భంగం కలిగిస్తూ వుండినారు.

పార్టీ ఆంతరంగిక పోరాటపు క్లిష్ట దశలో రష్యాలోని పార్టీ కమిటీలలో అత్యధిక భాగం బోల్షివిక్కుల పక్షం వహించినాయి. వృత్తి విప్లవకారులలో అత్యధికులూ, కార్మికులలోని పార్టీ సభ్యులూ లెనిన్‌కు తమ హృదయపూర్వక అండదండలు యిచ్చినారు. పార్టీలోని విస్తారమైన మెజారిటీ తమ నాయకుని వెనుక సమీకృతమైనారు.

లెనిన్ ఆచరణాత్మక, సైద్ధాంతిక కార్యకలాపాలూ, అవకాశ వాదానికి, రివిజనిజానికి వ్యతిరేకంగా ఆయన సాగించిన రాజీలేని పోరాటమూ, కొత్త రకం కార్మికవర్గ పార్టీని స్థాపించడానికి ఆయన కృషీ, నూతన యుగం పరిస్థితులకు మార్క్స్, ఎంగెల్సుల బోధన అనువర్తించి, దానిని అభివృద్ధి చేయడమూ – యిదంతా మార్క్సిజం అభివృద్ధిలోనూ, రష్యన్, అంతర్జాతీయ కార్మికోద్యమాలలోనూ లెనినిస్టు దశకు ప్రారంభం అయింది.

లెనినిజం యీ యుగపు మార్క్సిజం అయింది.

# జారిజంమీద మొదటి దాడి

విదేశాలలో వుండగా లెనిన్ రష్యాలోని విప్లవోద్యమ అభివృద్ధిని బాగా గమనించినాడు. విప్లవం ప్రారంభం కావడానికి చాలాముందే, అది వస్తున్నదని ఆయన గ్రహించినాడు. చివరకు తుఫాను చెలరేగింది. 1905 జనవరి 9న జారు ఉత్తరువుమేరకు సైనికులు సెంట్ పీటర్స్‌బుర్గ్‌లో కార్మికుల శాంతియుత ఊరేగింపుమీద కాల్పులు సాగించినారు; ఆ కార్మికులు తమ భార్యాపిల్లలతో కలిసి, తమ అవసరాలను గురించి జారుకు ఒక మహజరు సమర్పించడానికి పోతూవుండినారు. యీ పాశవిక హత్యాకాండ జాతిని నిర్ఘాంతపరిచి, ప్రజలకు ఆగ్రహం కలిగించింది. సాయంత్రానికి రాజధానిలోని కార్మిక పేటలలో మార్గావరోధాలు లేస్తూ వుండినాయి. సెంట్ పీటర్స్‌బుర్గ్‌లోని ఘటనలు మొత్తం దేశాన్ని కదిలించినాయి. వాటిని విప్లవ ప్రారంభంగా లెనిన్ గ్రహించినాడు. "సెంట్ పీటర్స్‌బుర్గ్ వీర కార్మికవర్గపు 'మరణమో స్వేచ్ఛో!' అనే నినాదం రష్యా అంతటా మార్మోగుతున్నది" అని ఆయన రాసినాడు.

లెనిన్ ఆలోచనలన్నీ రష్యామీద కేంద్రీకృతమైనాయి. ఆయన పార్టీ కమిటీల ప్రత్యక్ష మార్గదర్శకత్వం తీసుకొని, వాటికి ఉత్తరాలు పంపుతూ, నూతన విప్లవ సన్నివేశంలో యెలా వ్యవహరించవలసిందీ వాటికి సవివరమైన సూచనలు యిస్తూవుండినాడు. "నేను తరుచు విదేశాలలో రహస్యంగా ప్రయాణించే సందర్భం వుండింది. యే వారం రోజులపాటో వుండడానికి వెళ్లి, ఇల్యీచ్‌కి వార్తలన్నీ చెప్పి, ఆయన సూచనలూ, సలహాలూ మోసేటాన్ని తీసుకొని, 'మెజారిటీ కమిటీల బ్యూరో' కామ్రేడ్లను వెదక్కుంటూ వెనక్కి వెళ్లేవాణ్ని. ఇల్యీచ్ అక్కడ జెనీవాలో కూర్చొని, పరిస్థితులను యెంత కచ్చితంగా అంచనా

వేయగలిగిందీ ప్రతిసారీ మాకు ఆశ్చర్యం కలిగేది....'' అని 'మెజారిటీ కమిటీల బ్యూరో' సభ్యుడైన యం. యన్. ల్యాదొవ్ అన్నాడు.

విప్లవం పెరగక తప్పదని లెనిన్ ముందుగానే గ్రహించినాడు. దీని వలన సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీమీద గొప్ప బాధ్యత పడింది. అది విప్లవంలో తాను వ్యవహరించవలసిన పంథాను నిర్వచించి, పోరాటపు రూపాలమీదా, పద్ధతులమీదా ఒక అంగీకారానికి రావలసి వుండింది, అనగా తన యెత్తుగడలను నిర్ణయించుకోవలసి వుండింది. యీ పని పార్టీ మహాసభ మాత్రమే చేయగలదు. అందువల్లనే పార్టీ మహాసభను వెంటనే జరపాలని డిమాండు చేయడంలో లెనిన్ అంత పట్టుదలగా వుండినాడు; దానికి ఆయన చురుకుగా సన్నాహాలు చేయడం ప్రారంభించినాడు.

ఆర్.యస్.డి.యల్.పి. మూడవ మహాసభ లండన్‌లో 1905 ఏప్రిల్‌లో జరిగింది. అది మొదటి బోల్షెవిక్ మహాసభ. మెన్షివిక్కులు ఆహ్వానింపబడినప్పటికీ, సభకు హాజరు కాకుండా, జెనీవాలో తమ సొంత కాన్ఫరెన్సును జరుపుకున్నారు. యిది స్పష్టంగా విచ్ఛేదక చర్య. రెండు మహాసభలు, రెండు పార్టీలు అని అప్పటి ఆర్.యస్.డి.యల్.పి.లోని సన్నివేశాన్ని లెనిన్ వర్ణించినాడు.

మహాసభ వర్ధమాన విప్లవంయొక్క కీలక సమస్య లన్నిటినీ పరిశీలించింది. లెనిన్ అధ్యక్షుడుగా యెన్నుకోబడి, మహాసభ పనికి దర్శకత్వం వహించినాడు. ఆయన అనేక నివేదికలూ, ఉపన్యాసాలూ యిచ్చినాడు, సాయుధ తిరుగుబాటుమీదా, తాత్కాలిక విప్లవ ప్రభుత్వంమీదా, రైతు ఉద్యమంపట్ల అవలంబించవలసిన వైఖరిమీదా ప్రధాన తీర్మానాల ముసాయిదాలు రచించినాడు. సాయుధ తిరుగుబాటును యేర్పాటు చేయడం పార్టీయొక్క ప్రధాన, అత్యవసర కర్తవ్యంగా మహాసభ గుర్తించి, కార్మికులను సాయుధం చేయడానికీ, వాళ్ల ప్రత్యక్ష నాయకత్వంకింద సాయుధ తిరుగుబాటుకు పథకం తయారు చేయడానికీ

నిర్దిష్ట చర్యలు తీసుకోవాలని పార్టీ సంస్థల కన్నిటికీ ఆదేశాలు యిచ్చింది.

తాత్కాలిక విప్లవ ప్రభుత్వంలో సోషల్ డెమోక్రట్లు పాల్గొనడంమీద లెనిన్ యిచ్చిన ఉపన్యాసాన్ని గుర్తుకు తెచ్చుకొని, ఆ మహాసభకు ప్రతినిధి అయిన యం. జి. త్స్ఖాకాయ యిలా రాసినాడు: "మహాసభ యావత్తూ వ్యగ్ర నిశ్శబ్దంతో ఆలకించింది. విప్లవానికి సిద్ధాంతవేత్తా, నాయకుడూ, నిర్మాతా అయిన ఆయన కరకు తర్కం ప్రతినిధులను మంత్ర ముగ్ధులను చేసింది.

"ఇల్యీచ్ మాట్లాడడం ముగిసినప్పుడు అంతులేని చప్పట్లు చెలరేగినాయి. మా ముందు ఒక మహా విప్లవకారుడూ, సిద్ధాంతవేత్తా, నాయకుడూ నిలబడివుండినాడు."

మహాసభ పార్టీ నిబంధనావళిలోని మొదటి నిబంధనను, పార్టీ సభ్యత్వానికి సంబంధించినదాన్ని, లెనిన్ సూత్రీకరించినట్లు ఆమోదించింది. అప్పటినుండి లెనిన్‌యొక్క అత్యంత ముఖ్యమైన సంస్థా నిర్మాణ సూత్రాలలో ఒకటి పార్టీ నిబంధనావళిలో ఒక శాశ్వత లక్షణమైంది. మహాసభ లెనిన్ నాయకత్వం గల కేంద్ర కమిటీని యెన్నుకుంది.

మహాసభ నిర్ణయాలు ఒక నిర్దిష్ట ఆచరణ పథకంతో పార్టీని సాయుధం చేసి, విప్లవం మరింత అభివృద్ధి కావడానికి మార్గాలూ, సాధనాలూ నిర్వచించి, నిరంకుశత్వంమీద పోరాటంలో విజయం సాధించే లక్ష్యం కార్మికవర్గంముందు వుంచినాయి. కేంద్ర కమిటీయొక్క ప్రప్రథమ విస్తృత సమావేశంలో పార్టీ కేంద్ర పత్రిక అయిన 'ప్రొలెతారియ్' వార్తాపత్రికకు సంపాదకుడుగా లెనిన్ నియమింపబడినాడు.

మహాసభ తర్వాత లెనిన్ జెనీవాకు తిరిగిపోయినాడు. మహాసభయొక్కా, దాని నిర్ణయాలయొక్కా ప్రాముఖ్యాన్ని లెనిన్ 1905 జూలైలో వెలువడిన 'ప్రజాతంత్ర విప్లవంలో సోషల్ డెమోక్రట్ల రెండు

యెత్తుగడలు' అనే తన గ్రంథంలో వివరించినాడు. యీ ఉజ్వల గ్రంథంలో లెనిన్ అప్పటికే ప్రారంభమై వుండిన విప్లవంయొక్క సమస్యల నన్నిటినీ ప్రముఖంగా వివరించి, పార్టీ కర్తవ్యాలను నిర్వచించి నాడు. బోల్షివిక్కులూ, మెన్షివిక్కులూ విప్లవం గురించీ, దాని చోదక శక్తుల గురించీ, అలాగే కార్మికవర్గంయొక్కా, పార్టీయొక్కా కర్తవ్యాల గురించీ భిన్న అభిప్రాయాలు కలిగి, భిన్న యెత్తుగడలు రూపొందించుకున్నారని ఆయన చూపించినాడు.

లెనిన్‌తో సహా బోల్షివిక్కులు రష్యాలో ప్రారంభమై వుండిన విప్లవాన్ని బూర్జువా ప్రజాతంత్ర విప్లవంగా, ఫ్యూడలిస్టు వ్యవస్థ అవశేషాలను అంతమొందించి, జారిజంను కూలదోసి, ప్రజాతంత్ర హక్కులను గెలుచుకోవడం లక్ష్యంగా గలదానిగా, పరిగణించినారు. సామ్రాజ్య వాద యుగంలో బూర్జువా ప్రజాతంత్ర విప్లవంయొక్క విశిష్ట లక్షణాలనూ, దాని చోదక శక్తులనూ, అవకాశాలనూ లెనిన్ మార్క్సి జంయొక్క చరిత్రలో మొదటిసారిగా వివరించినాడు. బూర్జువా విప్లవం యొక్క సంపూర్ణ విజయంలో కార్మికవర్గానికి ఆసక్తి వుందనీ, యెందు కంటే అది సోషలిజం కొరకు జరిగే కార్మికవర్గ పోరాటాన్ని త్వర పరిచి, సులభతరం చేస్తుందనీ ఆయన పరిగణించినాడు. అంతేగాక, కార్మికవర్గమే ఆ విప్లవానికి ప్రధాన చోదక శక్తిగా, నాయకుడుగా వుంటుంది. కార్మికవర్గానికి పొత్తుదారుడుగా వుంటుంది రైతాంగం, భూస్వాములనుండి భూములు లాక్కోవడంలోనూ, జారిజంను కూల దోయడంలోనూ ఆసక్తి గలది. కనుక విప్లవంయొక్క విస్తృతి దాని ప్రధాన చోదక శక్తులమీద — కార్మికవర్గంమీదా, రైతాంగంమీదా — ఆధార పడుతుంది. రష్యన్ బూర్జువావర్గం మాట యేమిటంటే, అది జారిజంను నిలుపుకోవాలని కోరుతుంది. కారణం, తన సొంత రాజకీయ డిమాండ్లతో ముందుకు వస్తున్న కార్మికవర్గమంటే దానికి భయం. అందువల్లనే, బూర్జువావర్గాన్ని పక్కకు తోసివేసి, జనాలనుండి ఏకా

కిని చేసి, దాని ప్రజాస్వామ్య మనబడేది బూటకమని నిరూపించాలని బోల్షివిక్కులు పరిగణించినారు.

మొదటి రష్యన్ విప్లవం, దాని చోదక శక్తులకు సంబంధించి నంత వరకు, ప్రజా విప్లవం. అందులో ఉపయోగించిన పోరాట పద్ధతులకు సంబంధించినంత వరకు అది కార్మికవర్గ విప్లవమని లెనిన్ వర్ణించినాడు. రాజకీయ సమ్మె, సాయుధ తిరుగుబాటు లాంటి ప్రజా పోరాటాలను అది ఉపయోగించింది.

సాయుధ తిరుగుబాటు జారిస్టు నిరంకుశత్వాన్ని కూలదోసే నిర్ణయాత్మక సాధనమని లెనిన్ స్పష్టపరిచినాడు. విజయవంతమైన తిరుగుబాటు గత విప్లవాలలో లాగ బూర్జువా అధికారాన్ని స్థాపించడానికి కాక, కార్మిక కర్షక అధికారాన్ని, అనగా విప్లవ ప్రజాతంత్ర నియంతృత్వాన్ని, స్థాపించడానికి దారితీస్తుంది. దాని కార్యనిర్వాహక వర్గం తాత్కాలిక విప్లవ ప్రభుత్వంగా వుంటుంది.

లెనిన్ రూపొందించిన యెత్తుగడలు విజయవంతమైన విప్లవాన్ని లక్షించి, దాన్ని యెలా సాధించాల్సిందీ నిరూపించినాయి. అవి నిజమైన విప్లవ యెత్తుగడలు.

మరి మెన్షివిక్కుల యెత్తుగడలు యేమిటి? విప్లవం బూర్జువా విప్లవం గనుక, బూర్జువావర్గం విప్లవ నాయకుడుగా వుండాలనీ, కార్మికవర్గ కర్తవ్యం కేవలం బూర్జువావర్గానికి అండదండలు యివ్వడమనీ వాళ్లు ఉద్ఘాటించినారు. కార్మికవర్గానికీ, రైతాంగానికీ మధ్య పొత్తుకు మెన్షివిక్కులు వ్యతిరేకం; యెందుకంటే రైతాంగాన్ని విప్లవ శక్తిగా వాళ్లు నమ్మలేదు. సాయుధ తిరుగుబాటును వాళ్లు బలంగా వ్యతిరేకించినారు. మెన్షివిక్కుల పంథా విప్లవానికి ద్రోహమనీ, కార్మిక వర్గాన్ని బూర్జువావర్గ నాయకత్వంకింద వుంచే ప్రయత్నమనీ, ప్రజల విజయావకాశం పట్ల వాళ్ల భయాన్ని వ్యక్తం చేసే పంథా అనీ లెనిన్ నిరూపించినాడు. విప్లవ పోరాటం పట్ల మెన్షివిక్కులకు గల యీ

భయాన్నీ, విప్లవాన్ని మాటల గలగలలలో ముంచివేయడానికి వాళ్ల సంసిద్ధతనూ చూసి లెనిన్ వాళ్లను "గుల్లలో జీవించిన మనుషులు"* అని వర్ణించినాడు.

కార్మికవర్గం మొత్తం రైతాంగం తోటి పొత్తుతో కేవలం బూర్జువా ప్రజాతంత్ర విప్లవంలో విజయం సాధించడంతో ఆగదని లెనిన్ తన గ్రంథంలో బోధించినాడు. పోరాట గతిలో అది తన బలాలను సంఘటితపరిచి, గ్రామీణ, పట్టణ బీదలను తనవెంట నడిపిస్తూ, పెట్టుబడిదారీ వ్యవస్థమీద దెబ్బతీస్తుంది. ఆవిధంగా బూర్జువా ప్రజాతంత్ర విప్లవం సోషలిస్టు విప్లవంగా అభివృద్ధి ఔతుంది. సోషలిస్టు విప్లవాన్ని లక్షించిన కొత్త మార్గం యిది. పట్టణ, గ్రామీణ అర్ధ కార్మిక జనాల గుప్త విప్లవ శక్తులను తక్కువ అంచనావేసిన రష్యన్ మెన్షివిక్కులూ, పశ్చిమ యూరపియన్ అవకాశవాదులూ అవలంబించిన పంథాను యిది నిరాకరించింది. సోషలిస్టు విప్లవంలో కార్మికవర్గం పొత్తుదార్లు లేకుండా తనంతకు తానే వ్యవహరిస్తుందనీ, అందువలన దేశ జనాభాలో కార్మికవర్గం మెజారిటీ అయిందాకా సోషలిస్టు విప్లవం జరగజాలదనీ అవకాశవాదులు నమ్మినారు. యీ తర్క పద్ధతి దోష భూయిష్ఠమనీ, హానికరమనీ లెనిన్ చూపించినాడు. విప్లవ గతిలో కార్మిక వర్గంతో పట్టణ, గ్రామీణ అర్ధ కార్మిక జనాలు తప్పక కలుస్తారని ఆయన రుజువుచేసినాడు. ఆయన చెప్పింది సరైనదని తదనంతర ఘటనలు నిరూపించినాయి.

'ప్రజాతంత్ర విప్లవంలో సోషల్ డెమోక్రట్ల రెండు యెత్తుగడలు' అనే తన పుస్తకంలో లెనిన్ సోషలిస్టు విప్లవం గురించిన

---

* "గుల్లలో జీవించిన మనిషి" — ఆ పేరుగల చేహొవ్ కథలోని ప్రధాన పాత్ర, అన్ని కొత్తదనాలకూ, చొరవకూ భయపడే సంకుచిత అల్ప బుద్ధికి ప్రతీక. — సం.

మార్క్సిస్టు బోధను కొత్త భావాలతో — ప్రజాస్వామ్యమూ, సోషలిజమూ విజయం పొందడానికి యావత్ప్రపంచ ప్రజలు చేసే పోరాటంలో వాళ్లకు గొప్ప ప్రాముఖ్యం గల కొత్త భావాలతో — సంపన్నం చేసినాడు. రష్యాలోని పార్టీ సంస్థలు ఆ పుస్తకానికి ఆమోదంతో స్వాగతమిచ్చినాయి. కజాన్ సంస్థకు చెందిన వి. వి. అదొరాత్‌స్కియ్ యిలా రాసినాడు: "విప్లవ అభివృద్ధియొక్క ప్రయోజనాలను వ్లదీమిర్ ఇల్యీచ్ చేసినంత కంటె సరిగా, మినహాయింపులు లేకుండా, ప్రజ్ఞతో యెవరూ బలపరచలేరని మా కందరికీ అనిపించింది."

రష్యాలో విప్లవోద్యమం వేగంగా పెరుగుతూ వుండింది. 1905 వసంతంలోనూ, వేసవిలోనూ పీటర్స్‌బుర్గ్, వార్సా, లోడ్జ్, బాకూ, ఒదేస్స లాంటి పారిశ్రామిక కేంద్రాలలో పెద్ద సమ్మెలు జరిగినాయి. రైతు ఉద్యమం విస్తరించి, రష్యాలోని మొత్తం వ్యవసాయ ప్రాంతాలలో అయిదింట ఒక భాగానికి వర్తించింది. జారిజంయొక్క ప్రధానమైన ప్రాపు — సైన్యం — కూడా సడలబారింది. 1905 జూన్‌లో నల్ల సముద్ర నౌకాదళానికి చెందిన 'పొత్యోమ్కిన్' అనే యుద్ధనౌకలో తిరుగుబాటు జరిగింది. యీ తిరుగుబాటుకు లెనిన్ ప్రచండమైన ప్రాముఖ్యం యిచ్చినాడు. తిరుగుబాటుదార్లకు సహాయం చేయడానికి ఆయన బోల్షెవిక్ అయిన యం. ఐ. వసీల్యెవ్-యూజిన్‌ను ఒదేస్సకు పంపినాడు, విజయం పొందడానికి యెలా వ్యవహరించవలసిందీ సూచన లిచ్చి; కానీ అతను ఒదేస్స చేరేటప్పటికి ఆ యుద్ధనౌక రేవు వదిలి, రుమేనియాకు ప్రయాణం చేయవలసి వచ్చింది.

సాయుధ తిరుగుబాటుయొక్క అవసరాన్ని గురించి లెనిన్ పట్టుబట్టుతూనే వుండినాడు. ఆ విషయంమీద మార్క్స్, ఎంగెల్సులు రాసిందంతా ఆయన చదివినాడు, మిలిటరీ యెత్తుగడలమీద యెన్నో పుస్తకాలు అధ్యయనం చేసినాడు. తిరుగుబాటుకు సన్నాహాలు చేయడానికి యేర్పాటుచేయబడిన సెంట్ పీటర్స్‌బుర్గ్ పోరాట కమిటీని దాని

మందకొడితనానికీ, అస్థిరత్వానికీ ఆయన విమర్శించి, దానికి ఒక నిర్దిష్ట ఆచరణ పథకం రూపొందించి యిచ్చినాడు. "యువకులవద్దకు వెళ్లండి" అని ఆయన సలహా యిచ్చినాడు. "వెంటనే ప్రతిచోటా, విద్యార్థులలోనూ, ముఖ్యంగా కార్మికులలోనూ పోరాట దళాలు యేర్పరచండి.... అవి వెంటనే తమకు చేతనైనంత బాగా ఆయుధాలు పొందాలి.... వెంటనే చర్యలు ప్రారంభించడంద్వారా దళాలు వెంటనే మిలిటరీ శిక్షణ ప్రారంభించాలి." అదే సమయంలో, విదేశాలలో ఆయుధాల కొనుకోలునూ, రష్యాలో వాటి అందజేతనూ యేర్పరచడానికి లెనిన్ చురుకైన చర్యలు తీసుకున్నాడు.

1905 శరదృతువులో రష్యాలో విప్లవోద్యమం యెన్నడూ లేనంత విస్తృతి నందుకుంది. అక్టోబర్‌లో సార్వత్రిక రాజకీయ సమ్మె జరిగింది. ఫాక్టరీలూ, మిల్లులూ, తపాలా, తంతె ఆఫీసులూ పని ఆపినాయి, దేశమంతా జీవితం స్తంభించిపోయింది. యిది యింతకు మునుపు యెన్నడూ యితర దేశాలు యెరగని ఒక నూతన కార్మికవర్గ పోరాట రూపం. కార్మికవర్గ పోరాటానికి జడిసి, జారిస్టు ప్రభుత్వం కన్సెషన్లు చేయవలసివచ్చింది. వ్యక్తిని గౌరవించడమూ, వాక్, పత్రికా, సభా స్వాతంత్ర్యాలూ, యితర పౌర స్వాతంత్ర్యాలూ వాగ్దానం చేస్తూ అక్టోబర్ 17న జారు ఒక ప్రకటన విడుదల చేసినాడు. యిది ముఖ్యమైన విజయం. కానీ జారు వాగ్దానాలను నమ్మకూడదని లెనిన్ హెచ్చరించినాడు. కార్మికవర్గ కర్తవ్యం విప్లవాన్ని ముందుకు తీసుకపోయి, సాయుధ తిరుగుబాటుకు జనాలను సంసిద్ధం చేయడం అని ఆయన చెప్పినాడు.

యీ కల్లోలిత విప్లవ దినాలలో సామూహిక రాజకీయ సంస్థలు — కార్మిక ప్రతినిధుల సోవియట్లు — పుట్టినాయి. యింతకు మును పెన్నడూ యే దేశంలోనూ యిలాంటి సంస్థలు ఉద్భవించలేదు. సోవియట్లను గురించి లెనిన్ గొప్పగా అభిప్రాయపడినాడు; వాటిని సాయుధ తిరుగుబాటు

అంగాలుగా, ప్రజా ప్రభుత్వపు బీజరూపంగా ఆయన పరిగణించినాడు. సోవియట్లకు గొప్ప భవిష్యత్తు వుందనీ, అవి యెప్పుడో పారిశ్రామిక ప్రజల రాజ్యాధికారం అవుతాయనీ ఆయన ఆనాటికే గ్రహించినాడు లెనిన్ జోస్యం నిజమైంది. 'మన కర్తవ్యాలూ, కార్మిక ప్రతినిధుల సోవియటూ' అనే తన వ్యాసంలో సోవియట్ల పాత్రను గురించి లెనిన్ గంభీరమైన పరిశీలన యిచ్చినాడు.

విప్లవ తరంగం స్థిరంగా పైకిలేచింది. విదేశాలనుండి ఉద్యమాన్ని నడిపించడం లెనిన్‌కు అంతకంతకూ కష్టమైంది. రష్యాకు తిరిగిపోవాలని ఆయన తహతహలాడినాడు. 1905 నవంబర్ తొలి రోజుల్లో ఆయన సెంట్ పీటర్స్‌బుర్గ్ చేరి, అప్పటికప్పుడే పార్టీకీ, విప్లవ పోరాటానికీ ప్రత్యక్ష నాయకత్వం వహించినాడు. ఆయన చురుకైన సంస్థా కార్యకలాపాలు అభివృద్ధిచేసినాడు. ఆయన బోల్షెవిక్కుల కేంద్ర కమిటీ పనికీ, సెంట్ పీటర్స్‌బుర్గ్ కమిటీ పనికీ దర్శకత్వం వహించి, పార్టీ సమావేశాలలోనూ, కాన్ఫరెన్సులలోనూ, సభలలోనూ మాట్లాడుతూ, రష్యా అంతటినుండీ వచ్చే పార్టీ కార్యకర్తలతో గోష్ఠులు జరిపినాడు. తాను సంపాదకుడుగా, మేనేజర్‌గా వుండిన చట్టబద్ధ బోల్షెవిక్ వార్తాపత్రిక 'నోవయ జీజ్న్' ('నూతన జీవితం')కు అనేక వ్యాసాలు రాసినాడు. ఉత్తేజపరచే యీ వ్యాసాలు పార్టీ సంస్థలకు వాటి రోజువారీ పనిలో మార్గదర్శక సూచనలుగా ఉపకరించినాయి.

ఆ పత్రికలో ప్రకటింపబడిన లెనిన్ వ్యాసాలలో 'పార్టీ సంస్థా, పార్టీ సాహిత్యమూ' అనే వ్యాసం గొప్ప ప్రాముఖ్యం గలది; ఆ వ్యాసంలో ఆయన సాహిత్యంలో పార్టీతత్వాన్ని ప్రతిపాదించి, సూత్రీకరించినాడు. కార్మికవర్గ దృష్టిలో సాహిత్యం వివిధ బృందాల, వ్యక్తుల సంపన్మయతకు సాధనంగా, కార్మికవర్గ సమష్టి ప్రయోజనంనుండి విడివడిన వ్యక్తిగత వ్యవహారంగా వుండజాలదని ఆయన వాదించినాడు. ఆయన

యిలా రాసినాడు: "సాహిత్యంలో పార్టీతత్వం ఉండాలి. బూర్జువా సంప్రదాయాలకూ, లాభార్జనకూ, వర్తకీకృత బూర్జువా పత్రికలకూ, బూర్జువా సాహిత్య కరియరిజానికీ వ్యక్తితత్వానికీ, 'అగ్రవర్గ అరాజకత్వానికీ,' లాభాల వేటకూ వ్యతిరేకంగా సోషలిస్టు కార్మికవర్గం పార్టీ సాహిత్య సూత్రాన్ని ప్రతిపాదించి, యీ సూత్రాన్ని అభివృద్ధిచేసి, సాధ్యమైనంత పూర్తిగా, నిశ్శేషంగా అమలుపరచాలి." సాహిత్యంలో పార్టీతత్వం అనే లెనినిస్టు సూత్రంనుండి యేమాత్రం వైదొలగినా, అది కార్మికవర్గ ప్రయోజనానికి, కార్మికవర్గం అధికారం కొరకు పోరాడే దశలోనే కాక, అధికారం సంపాయించినప్పుడు కూడా, ప్రచండమైన హాని చేస్తుందని చారిత్రక అనుభవం నిరూపించింది.

జారునుండి ప్రజలు కొద్ది హక్కులు సంపాయించుకున్నప్పటికీ, లెనినూ, యితర విప్లవకారులూ పోలీసులనుండి దాక్కోవలసి వుండింది. లెనిన్ రహస్యంగా జీవించవలసి వచ్చింది, తరుచుగా తన పాస్‌పోర్టూ, మకామూ మారుస్తూ, కొన్ని సందర్భాలలో ఫిన్లండుకు పోతూ.

మాస్కో కార్మికుల డిసెంబర్ సాయుధ తిరుగుబాటులో విప్లవం శిఖరస్థాయికి చేరుకుంది. తొమ్మిది రోజుల పాటు కొన్ని వేలమంది సాయుధ కార్మికులు పోలీసులతోనూ, సెంట్ పీటర్స్‌బుర్గ్‌నుండి పంపబడిన పోలీసులతోనూ, జారిస్టు సైనికులతోనూ వీరోచిత పోరాటం చేసినారు. ఆ సమయంలో మాస్కోలో వుండిన మక్సీమ్ గోర్కీ ఒక జాబులో కార్మికుల ధీర పోరాటంమీద ఉత్సాహంగా వ్యాఖ్యానించినాడు. "నేను యిప్పుడే వీధిలోనుండి వచ్చినాను" అని ఆయన డిసెంబర్ 10న రాసినాడు. "సందునోవ్ బాత్స్‌వద్దా, నికొలాయెవ్‌స్కీ స్టేషన్‌వద్దా, స్మొలేన్‌స్కీ మార్కెట్‌వద్దా, కూద్రినొలోనూ పోరాటం సాగుతున్నది. నిజమైన పోరాటం! ఫిరంగులు గర్జిస్తున్నాయి – అది నిన్న మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమై, రాత్రంతా కొనసాగి, పగలంతా నిర్విరామంగా గురగురలాడుతున్నది.... బ్రహ్మాండమైన విజయం! వీధుల్లో ప్రతిచోటా

పోలీసులు నిరాయుధులు చేయబడుతున్నారు.... కార్మికులు మహోదాత్తంగా ప్రవర్తిస్తున్నారు!''

పోరాటం ప్రేస్న్య పేట (యిప్పుడు క్రాస్నయ ప్రేస్న్య)లో మరీ తీవ్రంగా వుండింది. మాస్కో తర్వాత నిజ్నీ - నోవ్‌గొరొద్, రొస్తొవ్ ఆన్ దొన్, నొవొరొస్సియేస్క్, ఎకతెరినొస్లావ్, ఉఫా, క్రస్నొయార్స్క్, చితా, తదితర నగరాలలో తిరుగుబాట్లు చెలరేగినాయి. కానీ యీ చెదరుమదరు తిరుగుబాట్ల నన్నిటినీ జారిస్టు ప్రభుత్వం పాశవికంగా అణచివేసింది.

డిసెంబర్ సాయుధ తిరుగుబాటును లెనిన్ గొప్పగా అంచనావేసినాడు. అది రష్యన్ కార్మికుల అవిస్మరణీయ వీరకృత్యమనీ, కొత్త తరాల యోధులకు విప్లవ పాఠశాలగా ఉపకరించేదనీ ఆయన పరిగణించినాడు. కార్మికవర్గ విప్లవాల కన్నిటికీ అపారమైన విలువగల అనుభవంగా దాన్ని ఆయన పరిగణించినాడు. తిరుగుబాటుయొక్క అనుకూల లక్షణాలను గుర్తిస్తూనే ఆయన దాని నిర్మాణ లోపాలను బహిర్గతం చేసినాడు. మరింత స్థిరత్వంతో ఆయుధాలు ఉపయోగించి వుండవలసిందనీ, ఆత్మరక్షణ చర్యలు కాక, దాడి చేసివుండవలసిందనీ, సైనికులను మనవైపుకు తిప్పుకొని వుండవలసిందనీ రైతులను సమష్టి పోరాటంలోకి ఆకర్షించి వుండవలసిందనీ ఆయన గుర్తుచేసినాడు. తిరుగుబాటు గుణపాఠాలు అలాంటివి. వర్గచైతన్యం గల కార్మికులందరూ యీ గుణపాఠాలను అధ్యయనం చేసి తదుపరి పోరాటానికి సన్నద్ధం కావాలని లెనిన్ ఉద్బోధించినాడు.

డిసెంబర్ తిరుగుబాటు విఫలమైనప్పటికీ, విప్లవపు పోటు వెంటనే తగ్గలేదు. జనాలు తిరోగమించాలని కోరలేదు. సమ్మెలూ, రైతుల అల్లరులూ, సైన్యంలోనూ, నౌకాదళంలోనూ విప్లవకర అశాంతి తగ్గుముఖం లేకుండా కొనసాగినాయి. 1906 వేసవిలో స్వెయాబొర్గ్‌లోనూ, క్రోన్‌ష్టాడ్ట్‌లోనూ జరిగిన నావికుల, సైనికుల తిరుగుబాట్ల

నాయకులతో లెనిన్ నేరుగా సంబంధం కలిగివుండినాడు. క్రోన్‌ష్టాడ్ట్‌కు మద్దతుగా సమ్మె యేర్పాటుచేయడానికి ఆయన సెంట్ పీటర్స్‌బుర్గ్ పార్టీ కమిటీకి చెందిన బోల్షెవిక్ సభ్యులకు ఆదేశాలు యిచ్చినాడు. కానీ రెండు తిరుగుబాట్లూ నలిపివేయబడినాయి.

1905 అక్టోబర్ – డిసెంబర్‌లో జరిగిన రష్యన్ కార్మిక వర్గపు పోరాట అనుభవాన్ని లెనిన్ 1906 మార్చిలో రాసిన 'కాడెట్ల విజయమూ, కార్మిక పార్టీ కర్తవ్యాలూ' అనే చిన్న పుస్తకంలో క్రోడీకరించినాడు. అక్టోబర్ – డిసెంబర్ యుద్ధాలు కార్మికవర్గ చారిత్రక పోరాటంలో స్మరణీయమైన అడుగు, సామూహిక రాజకీయ సమ్మెను తిరుగుబాటుతో కలిపే యెత్తుగడలను మొట్టమొదటి సారి ప్రయోగించిన అడుగు, అని ఆయన పరిగణించినాడు. యీ పుస్తకంలో లెనిన్ కాడెట్ పార్టీ* ప్రవర్తనను గుట్టుకడిగి, వాళ్ల కపటత్వాన్నీ, పిరికితనాన్నీ, జారిజంతో రాజీపడే వాళ్ల విధానాన్నీ వెల్లడించి, కాడెట్లను "విప్లవ శవ(క్రిములు" అని అన్నాడు.

విప్లవ విజయం కొరకు మరింత ఫలవంతమైన పోరాటం చేయడానికి వీలుగా, పార్టీలో ఐక్యత వుండాలని కార్మికులలోని పార్టీ సభ్యులనేకులు డిమాండు చేసినారు. యీ సమస్యను పరిష్కరించడానికి మరొక మహాసభను సమావేశపరచవలసి వుండింది.

బోల్షెవిక్కులతో సహా లెనిన్ యీ డిమాండును బలపరిచినాడు. కానీ ఐక్యతను సాధించడం యెలా? యే ప్రాతిపదికమీద? యీ ప్రశ్నకు లెనిన్ సమాధానం యిచ్చినాడు. మెన్షివిక్కులతో ఐక్యత విప్లవ మార్క్సిజం ప్రాతిపదికమీద మాత్రమే సాధ్యమని ఆయన భావించినాడు. విప్లవపు

---

* కాడెట్లు (సంక్షిప్త నామం) – కాన్‌స్టిట్యూషనల్ డెమోక్రటిక్ పార్టీ సభ్యులు. యీ పార్టీ రష్యాలోని ఉదారవాద రాజరికవాద బూర్జువావర్గపు ప్రముఖ పార్టీ, 1905లో స్థాపించబడింది. – సం.

మౌలిక సమస్యలమీద గల మౌలిక విభేదాలను దాటవేయడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించినాడు. యీ ఐక్యత సాధించబడనున్న నాల్గవ పార్టీ మహాసభకు సిద్ధం కావడానికి ఆయన కష్టపడి పనిచేసినాడు. ఆయన బోల్షెవిక్కుల వేదికను – మౌలిక తీర్మానాల చిత్తును – తయారు చేసినాడు. మహాసభకు ఒక వ్యావసాయిక కార్యక్రమం తయారు చేయడానికి లెనిన్ 'కార్మిక పార్టీ వ్యావసాయిక కార్యక్రమ పునఃపరిశీలన' అనే పుస్తకం రాసినాడు.

ఐక్యతా మహాసభ ఆవశ్యకానికి యితర కారణాలు కూడా వుండినాయి. రష్యాలో ఆర్.యస్.డి.యల్.పి.కి తోడు, పోలెండు, లిథువేనియాల సోషల్ డెమోక్రసీతో సహా, లెట్టిష్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీతో సహా యితర సోషల్ డెమోక్రటిక్ పార్టీలు వుండినాయి. యీ పార్టీలలో ప్రతి వొకటీ తనపాటికి తాను వ్యవహరిస్తూవుండింది. జారిజంమీద పోరాటం సకల రష్యా జాతుల సంయుక్త కృషినీ, దేశంలోని సమస్త కార్మికుల ఐక్యతనూ డిమాండు చేసింది.

ఆర్.యస్.డి.యల్.పి.యొక్క నాల్గవ (ఐక్యతా) మహాసభకు హాజరుకావడానికి లెనిన్ 1906 ఏప్రిల్ ప్రారంభంలో స్టాక్‌హోమ్‌కు బయలుదేరినాడు. మహాసభ ఏప్రిల్ 10న పీపుల్స్ హౌస్‌లో జరిగింది; దానిని స్వీడిష్ సోషల్ డెమోక్రట్లు మహాసభ స్వాధీనంలో పెట్టినారు.

లెనిన్ వ్యవసాయ సమస్యమీదా, ప్రస్తుత సన్నివేశమూ, కార్మిక వర్గంయొక్క వర్గ కర్తవ్యాలూ అనే విషయాలమీదా నివేదికలు యిచ్చినాడు, దూమ పట్ల యే వైఖరి తీసుకోవాలి అనే సమస్యమీద ఒక సహనివేదిక యిచ్చినాడు, సాయుధ తిరుగుబాటుమీదా, సంస్థా నిర్మాణ సమస్యమీదా ఉపన్యాసాలు యిచ్చినాడు. ఆర్.యస్.డి.యల్.పి. నిబంధనావళిని తయారు చేయడానికి యెన్నుకోబడిన కమిటీ పనిలో కూడా ఆయన పాల్గొన్నాడు.

మహాసభ బోల్షివిక్కులకూ మెన్షివిక్కులకూ మధ్య మహా తీవ్ర పోరాటానికి రంగస్థల మైంది. వ్యవసాయ సమస్యమీద పెద్ద యుద్ధమే జరిగింది. లెనిన్‌తో కలిసి బోల్షివిక్కులు భూ యెస్టేట్లను నష్ట పరిహారం లేకుండా స్వాధీనపరుచుకోడానికీ, సమస్త భూమినీ జాతీయం చేయడానికీ, అనగా భూమిమీద సొంత యజమాన్యాన్ని రద్దుచేసి, అప్పటి నుండి భూమిని రాజ్యంయొక్క ఆస్తిగా చేయడానికి, అనుకూలంగా వుండినారు. నిరంకుశత్వం కూలదోయబడినప్పుడు మాత్రమే భూమి జాతీయకరణ సాధ్యమౌతుంది. తత్పర్యవసానంగా, జారుమీదా, భూస్వా ములమీదా తిరుగుబాటు చేయాలని బోల్షెవిక్ వ్యవసాయ కార్యక్రమం రైతులను ఉద్బోధించింది.

మరి, మెన్షివిక్కుల స్థావరం యేమిటి? వాళ్లు భూమి జాతీయ కరణను వ్యతిరేకించి, భూమిని మునిసిపాలిటీకరణ చేయాలని – అనగా భూ యెస్టేట్లు నన్నిటినీ మునిసిపాలిటీలకు బదలాయించి, వాటినుండి రైతులు భూమిని కౌలుకు తీసుకోవాలని – డిమాండు చేసినారు. లెనిన్ మెన్షివిక్ కార్యక్రమాన్ని తీవ్రంగా విమర్శించినాడు; అది భూస్వా ములతో బేరమాడడం; జారుయొక్క, భూస్వాములయొక్క పరిపాలనను కూలదోయకుండా వ్యవసాయ సమస్య పరిష్కారం కాగలదనే వ్యర్థ ఆశలు కలిగిస్తుంది అది.

మహాసభలో తమ సంఖ్యాధిక్యతను ఆసరాగా తీసుకొని మెన్షి విక్కులు అన్ని ముఖ్య సమస్యలమీదా, తమ మునిసిపాలిటీకరణ కార్య క్రమంతో సహా, తమ సొంత తీర్మానాలు ప్రవేశపెట్టినారు. వాళ్లు కేంద్ర కమిటీలో మెజారిటీ సంపాయించినారు, పార్టీ కేంద్ర పత్రిక అయిన 'సోత్సియాల్ డెమోక్రట్'ను వశంచేసుకున్నారు. కానీ, మెన్షివిక్ విజయం శాశ్వతమైనది కాజాలదు. విప్లవ మార్క్సిజమూ, విప్లవ వ్యూహమూ, యెత్తుగడలూ విజయం పొందుతాయని లెనిన్ దృఢంగా నమ్మినాడు. మెన్షివిక్కులు ఓడింపబడతారని ఆయనకు విశ్వాసం వుండింది.

రష్యాలోని జాతీయ సోషల్ డెమో్క్రటిక్ పార్టీలను ఒక సమైక్య రష్యన్ సోషల్ డెమో్క్రటిక్ లేబర్ పార్టీగా సమ్మేళనం చేయాలని మహాసభ ఒక నిర్ణయం చేసింది. రష్యాలో నివసిస్తున్న సకల జాతుల కార్మికులలో విస్తారమైన భాగాలను ప్రభావితం చేయడానికి యీ ఏకీకరణ బోల్షివిక్కులకు శక్తి కలిగించి, మెన్షివిక్కులను గుట్టు కడగడమూ, ఏకాకులను చేయడమూ సులభతరం చేసింది.

మహాసభ అయిన వెంటనే లెనిన్ తీవ్ర కృషి చేపట్టినాడు. మహాసభలో జరిగిన పోరాటాన్ని గురించి ఆయన విస్తృత కార్మిక జనాలకు తెలియజేసినాడు. ఆయన పార్టీకి 'బోల్షివిక్ బృంద ప్రతి నిధుల విజ్ఞప్తి'నీ, 'ఆర్.యస్.డి.యల్.పి. ఐక్యతా మహాసభమీద నివేదిక (సెంట్ పీటర్స్‌బుర్గ్ కార్మికులకు లేఖ)' అనే పుస్తకమూ రాసినాడు.

లెనిన్ శ్రమ యెరక్కుండా బోల్షివిక్ పంథాను సమర్థించడమూ, వివరించడమూ కొనసాగించినాడు. కార్మికులతోనూ, మేధావులతోనూ, ఆఫీసు ఉద్యోగులతోనూ, విద్యార్థులతోనూ సంభాషణలు సాగించడం కొరకు వాళ్లను కలుసుకోడానికి యే అవకాశాన్నీ ఆయన జారవిడువ లేదు. 1906 మే 9న, కార్పోవ్ అనే మారుపేరుతో ఆయన సెంట్ పీటర్స్‌బుర్గ్‌లో మూడు వేలమంది గల సభలో ఉపన్యసించినాడు; ఆ సభలో ఆయన బూర్జువా కాడెట్ పార్టీ జారిస్టు పరిపాలనతో చేసుకున్న ఒప్పందాన్ని ఖండించి, కార్మికవర్గ విప్లవ పంథాను సమర్థించినాడు. శ్రోతలు ఆయన ఉపన్యాసం మైమరిచిన శ్రద్ధతో విని, తీవ్రంగా చలించినారు. క్రూప్‌స్కాయా తన స్మృతులలో యిలా రాసింది: "హాలు అంతా నిశ్శబ్దం ఆవరించింది. ఇల్యీచ్ ఉపన్యాసం తర్వాత శ్రోతలు అసాధారణ ఉబలాటంతో ఊగిపోయినారు. ఆ క్షణంలో ప్రతి వొకడూ రాబోయే చివరి పోరాటం గురించి ఆలోచిస్తూ వుండినాడు." కార్మికులకు ఉపన్యసించి, సలహా యిచ్చి, విప్లవ పోరాటానికి సంబంధిం

చిన సకల సమస్యలనూ వివరించడమంటే యెల్లప్పుడూ లెనిన్‌కు శ్రద్ధ. ఆయన నార్వ డిస్ట్రిక్ట్‌లో సోషల్ డెమోక్రటిక్ కార్మికుల సభలోనూ, షొప్షలా పొగాకు ఫాక్టరీ మహిళా కార్మికుల సభలోనూ, సెమ్యాన్నికొవ్ డిస్ట్రిక్ట్‌లోని కార్మికుల సభలోనూ, యింకా అనేక కార్మిక సమావేశాల్లోనూ ఉపన్యసించినాడు.

కఠిన పోరాటం తర్వాత లెనిన్ పార్టీ సంస్థలను బోల్షెవిక్కుల చుట్టూ సమీకరించడంలో కృతకృత్యుడైనాడు. యిప్పు డాయన మరోక పార్టీ మహాసభను సమావేశపరిచే సమస్యను లేవనెత్తి, దానికి చురుకుగా తయారు కాసాగినాడు. 1907 ఫిబ్రవరిలో ఆయన ఆర్.యస్.డి.యల్.పి. అయిదవ మహాసభకు చిత్తు తీర్మానాలు రాసినాడు. మార్చిలో, మహాసభకు ప్రతినిధుల యెన్నికలు నిర్వహించడానికి స్థానిక ప్రాంతాలకు పోయే బోల్షెవిక్కులకు సూచనలిచ్చే సమావేశంలో ఆయన సమకాలిక సన్నివేశంమీదా, పార్టీ కర్తవ్యాలమీదా నివేదిక యిచ్చినాడు.

1907 ఏప్రిల్ అంతంలో, ఆర్.యస్.డి.యల్.పి. అయిదవ మహాసభకు హాజరు కావడానికి లెనిన్ లండన్‌కు బయలుదేరినాడు. ఆయన మహాసభ పనిని నడిపించి, అజెండాలోని ప్రధాన అంశంమీద — బూర్జువా పార్టీలపట్ల వైఖరి అనే అంశంమీద — నివేదిక యిచ్చినాడు. మహాసభకు హాజరైన కార్మికవర్గ మహా రచయిత మక్సీమ్ గోర్కీ వక్తగా లెనిన్‌యొక్క ప్రస్ఫుటమైన చిత్రాన్ని తన స్మృతులలో యిచ్చినాడు. ఆయన యిలా అన్నాడు: "లెనిన్ పసందైన నుడికారాలు సృష్టించేవాడు కాదు. ఆయన ప్రతి మాటనూ తన అరచేతిలో పెట్టి చూపించినట్లుండేది, దాని కచ్చితమైన అర్థాన్ని అచ్చెరువు కలిగించే సౌలభ్యంతో ఆవిష్కరిస్తూ.... తనకంటెముందు మాట్లాడినవాళ్లకంటె ఆయన తక్కువ మాట్లాడేవాడు, కానీ ఆయన సృష్టించే ముద్ర వాళ్లకంటె యెంతో గొప్పది. యిలా అనిపించింది నాకొక్కనికే కాదు; 'మట్టసంగా

చెప్పినాడు!' అన్న ఆహ్లాదంతో కూడిన గుసగుస నావెనకనుండి విన వచ్చింది. మట్టసంగానే వుంది అది; ఆయన చేసే వాదం ప్రతిఒకటీ దాని సొంత అంతర్గత శక్తితో విచ్చుకుంటుంది.''

మహాసభలో లెనిన్‌ను బోల్షివిక్ ప్రతినిధుల దృఢబంధిత బృందం బలపరిచింది. అందులో ఎ. యస్. బూబ్నోవ్, కె. వై. వొరొషీలొవ్, ఐ. యఫ్. దుబ్రోవిన్‌స్కియ్, యం. యస్. ల్యాదొవ్, యం. జి. త్స్ఖకాయ, యస్. జి. షౌమ్యాన్, వై. యం. యరొస్లావ్‌స్కియ్ వుండినారు.

మహాసభ బూర్జువా పార్టీలపట్ల వైఖరిమీది తీర్మానంలో లెనిన్ పదబంధాన్ని ఆమోదించింది. రష్యాలో విప్లవం గురించిన అంచనాతో యీ తీర్మానానికి ప్రత్యక్ష సంబంధం వుండింది. పార్టీలు నికరమైన వర్గాల ప్రయోజనాలను వ్యక్తం చేస్తాయి. ప్రజాతంత్ర విప్లవ నాయక పాత్రను నిర్వహించడానికి కార్మికవర్గం రాజకీయ పార్టీల వర్గస్వభావం తెలుసుకోవాలి. బ్లాక్ హండ్రెడ్* పార్టీలమీదా, బడా భూస్వాముల, బూర్జువాల పార్టీలమీదా నిర్విరామ పోరాటం చేయాలనీ, రైతులు తనకు మద్దతు యిచ్చేటట్లు ఉదారవాద బూర్జువావర్గపు పార్టీ అయిన కాన్‌స్టిట్యూషనల్ డెమోక్రట్లు రైతులను మోసగించకుండా వుండడానికి వాళ్ల బూటకపు ప్రజాస్వామ్యాన్ని గుట్టుకడగాలనీ లెనిన్ తీర్మానం డిమాండు చేసింది. ''త్రుదొవీక్కు''లపట్ల లెనిన్ భిన్నంగా అభిప్రాయపడినాడు (రైతులచేత యెన్నుకోబడిన ప్రతినిధులను దూమలో ''త్రుదొవీక్కు'' లనేవాళ్లు). వాళ్లు రైతుల, పట్టణ పెటీబూర్జువాల

---

* బ్లాక్ హండ్రెడ్స్ — విప్లవోద్యమాన్ని వ్యతిరేకించడానికి జారిస్టు ప్రభుత్వంచే స్థాపించబడిన రాచరిక ముఠాలు. అవి విప్లవకారులను హత్యచేసినాయి, ప్రగతిశీలమైన మేధావులను హింసించినాయి, యూదుల హత్యాకాండలు చేసినాయి. — సం.

ప్రయోజనాలను వ్యక్తం చేసినారు గనుక, జారిజంమీది పోరాటంలో వాళ్లతో ఒక ఒప్పందానికి వచ్చే అవకాశాన్ని లెనిన్ ఊహించినాడు.

విప్లవంలో బోల్షెవిక్ పంథా సరైనదని అయిదవ మహాసభ ధ్రువపరిచింది. యీ మహాసభలో, అనేక యితర సమస్యలమీద కూడా బోల్షెవిక్కులు మెన్షివిక్కులను ఓడించినారు. 'కార్మిక మహాసభ' అనే పేరుతో ఒక మహాసభ జరపాలనే సమస్యమీద మెన్షివిక్కులు ఓడిపోయినారు; దీని ఉద్దేశం సోషల్ డెమొక్రట్లూ, సోషలిస్టు రివల్యూషనరీలూ,* అరాజకవాదులూ, వగైరాలతో ఒక విశాలమైన కార్మిక పార్టీని స్థాపించడం. యీ మెన్షివిక్ భావం కార్మికవర్గ ఉద్యమానికి హానికరమైందనీ, క్రియలో యిది నిజమైన కార్మికవర్గ పార్టీని రద్దు చేస్తుందనీ దీన్ని మహాసభ నిరాకరించింది.

మహాసభలో లెనిన్ కార్మిక ప్రతినిధులతో హార్దికంగా, మైత్రీపూర్వకంగా మాట్లాడినాడు. లెనిన్‌ను మొట్టమొదటి సారి చూసిన కార్మికులమధ్య జరిగిన సంభాషణను గురించి మక్సీమ్ గోర్కీ తన స్మృతులలో చెప్పినాడు. ఒక కార్మికుడు యిలా అన్నాడు:

" 'ఆయన మనలో ఒకడు!'

" 'ప్లెహానొవ్ కూడా మనలో ఒకడే!' మరొక కార్మికుడు అన్నాడు.

" 'ప్లెహానొవ్ మన గురువు, మన యజమాని, కానీ లెనిన్ మన నాయకుడు, మన కామ్రేడ్' అని జవాబు వచ్చింది."

అయిదవ మహాసభ లెనిన్‌ను ఆర్.యస్.డి.యల్.పి. కేంద్ర కమిటీకి యెన్నుకుంది.

---

*సోషలిస్టు రివల్యూషనరీ పార్టీ – రష్యాలో పెటీబూర్జువా పార్టీ. వేర్వేరు నరోద్నిక్కుల బృందాలు ఐక్యమై 1901 అంతంలోనూ, 1902 ప్రారంభంలోనూ యీ పార్టీ ఏర్పడింది. – సం.

1907 జూన్ ప్రారంభంలో లెనిన్ లండన్‌నుండి రష్యాకు తిరిగివచ్చి, ఫిన్లండులో మకాం పెట్టినాడు. విప్లవం విఫలమైందని అప్పటికల్లా స్పష్టమైంది. జారిస్టు ప్రభుత్వం సర్వతోముఖమైన దాడి చేసింది. దీర్ఘమైన తీవ్ర ప్రగతి వ్యతిరేక దశ ప్రవేశించింది.

లెనిన్‌మీద రిపోర్టు కొరకు సెంట్ పీటర్స్‌బుర్గ్ గుబెర్నియా పోలీసు ప్రత్యేక శాఖ సెంట్ పీటర్స్‌బుర్గ్ రహస్య పోలీసుల ప్రధానాధికారిని కోరి, ''ఆయనను ఫిన్లండునుండి బహిష్కరించడానికి చర్యలు ప్రారంభించ'' మని అడిగింది. జారిస్టు గూఢచారులు తనను వెన్నాడుతున్నందువలన లెనిన్ ఫిన్లండు అంతర్భాగంలోకి మారవలసివచ్చింది. కానీ అక్కడ కూడా ఆయన ప్రమాదంలో వుండినాడు; అందువలన ఆయన దేశం వదలిపోవాలని బోల్షివిక్ కేంద్రం తీర్మానించింది.

కానీ, ఫిన్లండునుండి బయటికి పోవడం సులభమైన కార్యం కాదు. గూఢచారులను విదలించుకోడానికీ, అరెస్టు తప్పించుకోడానికీ లెనిన్ రేవులో కాక, ఒక దీవిలో ఓడ యెక్కవలసి వచ్చింది. ఆ దీవి చేరుకోడానికి ఆయన ఫిన్లండు సింధుశాఖలో అప్పటి కింకా పల్చగా వుండిన మంచును రాత్రి పూట దాటవలసి వచ్చింది. మంచుగడ్డ పగిలి, ఆయన కాళ్లకిందనుండి జారిపోవడం ప్రారంభించినప్పుడు, ఆయన దాదాపు మునిగిపోయేటంత పని జరిగింది. యీ అనుభవాన్ని తదనంతర కాలంలో జ్ఞాపకం చేసుకొని ఆయన చెప్పినాడు, ఆ క్షణంలో ఆయన మనసులో మెదిలింది ''యెంత బుద్ధిలేని చావు!'' అన్న భావమట. ఆవిధంగా, తన ప్రాణానికి పెద్ద ప్రమాదంతో, చివరకు ఆయన విదేశాలకు పోగలిగినాడు. యీసారి ఆయన దాదాపు పదేండ్లు బలవంతపు ప్రవాసంలో గడిపినాడు.

దాదాపు రెండున్నర సంవత్సరాలు సాగిన మొదటి రష్యన్ విప్లవం విఫలమైంది. కానీ అది రష్యా నిరంకుశత్వంలో గండికొట్టింది. విప్లవం సామ్రాజ్యవాద యుగంలో విప్లవ పోరాటాల దశను ప్రవేశ

పెట్టి, ప్రపంచమంతటా విమోచనోద్యమ అభివృద్ధిమీద ప్రచండ మైన ప్రభావం నెరపింది. ప్రపంచ విప్లవోద్యమ కేంద్రం రష్యాకు మారిందనీ, రష్యన్ కార్మికవర్గం అంతర్జాతీయ కార్మికవర్గ అగ్ర దళం అయిందనీ అది నిరూపించింది. 'మాస్కో తిరుగుబాటు గుణ పాఠాలు,' 'విప్లవ గుణపాఠాలు,' '1905 విప్లవంమీద నివేదిక,' తది తర వ్యాసాల్లో లెనిన్ 1905–1907 విప్లవం గురించిన అంచనా యిచ్చినాడు.

లెనిన్‌యొక్క బోల్షెవిక్ యెత్తుగడలు సరైనవని విప్లవం పూర్తిగా రుజువుచేసింది. విప్లవంలో కార్మికవర్గ నాయకపాత్రను గురించిన లెనిన్ ముఖ్య సిద్ధాంతం ఆచరణలో ధ్రువపరచబడింది.

నాయకుడుగా, గొప్ప సిద్ధాంతకారుడుగా, శ్రామిక జనాల అసా ధారణ ఆర్గనైజరుగా లెనిన్ ప్రజ్ఞలు కన్నులకు కట్టినట్లు ప్రద ర్శింపబడింది యీ విప్లవ సంవత్సరాలలోనే.

# ప్రగతి వ్యతిరేక సంవత్సరాలలో పార్టీకొరకు పోరాటం

1908 జనవరిలో లెనిన్ జెనీవాకు తిరిగిపోయినాడు. విప్లవ రష్యాను వదలి యీ ప్రశాంత పట్టణానికి పోవడం కష్టమైన పని.

లెనిన్ ఆలోచనలన్నీ రష్యన్ విప్లవంతో లంకెపడివుండినాయి. విప్లవ వైఫల్యం ఆయన పోరాట సంకల్పాన్ని ముక్కలు చేయలేదు. పార్టీ పనికీ, మరొక విప్లవానికి సన్నాహాలు చేసే పనికీ ఆయన ద్విగు ణీకృత చురుకుదనంతో పూనుకున్నాడు. కార్మికవర్గం తాత్కాలిక అప జయం మాత్రమే పొందిందనీ, జారిస్టు నిరంకుశత్వంమీద అంతిమ విజయం

అనివార్యమనీ ఆయన దృఢంగా నమ్మినాడు. పార్టీకి ఆయన చెప్పిన ఆవేశ పూరితమైన మాటలు శక్తివంతంగా వుండినాయి: "విప్లవానికి ముందరి దీర్ఘ సంవత్సరాలలో యెలా పనిచేయవలసిందీ మనకు తెలిసి వుండింది. మనం శిలాకఠినుల మన్నమాట వూరకే పుట్టలేదు. సోషల్ డెమోక్రట్లు యెలాంటి కార్మికవర్గ పార్టీని నిర్మించినారంటే, అది మొదటి సాయుధ దాడి వైఫల్యానికి నిరుత్సాహపడదు, మతి పోగొట్టు కోదు, సాహసచర్యలచేత కొట్టుకపోదు.... యీ కార్మికవర్గ పార్టీ విజయంవైపు నడుస్తున్నది."

అత్యంత తీవ్ర ప్రగతి వ్యతిరేక దశలో, లేశమాత్రంగా కూడా ఆశ కనిపించనప్పుడు, లెనిన్ ఆలోచనలు కార్మికవర్గ భవిష్యత్ విజయం గురించి వుండినాయి. యీ విజయాన్ని ఆయన భవిష్యద్దర్శనం చేసి నాడు; దానిలో ఆయన ప్రగాఢ విశ్వాసం యితరులలో విశ్వాసాన్ని కలిగించింది.

రష్యాలో జారిస్టు ప్రభుత్వం ప్రజల విప్లవ పోరాటానికి వాళ్లమీద కసి తీర్చుకుంది. పదుల వేల విప్లవకారులు ప్రవాసానికీ, నేరస్తుల జైళ్లకూ పంపబడినారు, యింకా వేలమంది ఉరితీయబడినారు. కార్మిక సంస్థలు పోలీసులచేత ధ్వంసం చేయబడినాయి. పార్టీలోని సన్ని వేశం మహా తీవ్రంగా తయారైంది. దాని సభ్యత్వం పడిపోయింది, వివిధ సంస్థల మధ్య సంబంధం బలహీనపడింది. పార్టీ అతి రహస్యంగా వుండవలసి వచ్చింది. ప్రభుత్వం పార్టీ సంస్థలలో కవ్వింపుదార్లను యేర్పరిచి, వాళ్ల సమాచారంమీద ప్రముఖ పార్టీ కార్యకర్తలను అరెస్టు చేసి, సంస్థలను సంస్థలనే విచ్ఛిన్నం చేసింది. విప్లవ సానుభూతి పరులలో, ముఖ్యంగా మేధావులలో, ద్రోహాలూ, వెనక్కి జారుకోవడాలూ, విప్లవోద్యమ పునర్విజృంభణలో అపనమ్మకమూ గల దశ ప్రవేశించింది.

కానీ, తీవ్ర ప్రగతి వ్యతిరేకత యెంత క్రూరంగా వుండినా, విప్లవ కాలంలో పైకి వచ్చిన ప్రగతి శక్తుల నన్నిటినీ నలిపివేయడానికి

అది శక్తిహీనంగా వుండింది. బోల్షెవిక్ పార్టీచే నడిపించబడుతూ కార్మికవర్గం యీ ప్రగతి శక్తుల అగ్రస్థానంలో కొనసాగింది.

జెనీవా చేరిన వెనువెంటనే లెనిన్ 'ప్రొలెతారియ్,' వార్తాపత్రిక పునఃప్రచురణ ప్రారంభించినాడు. ఆ సంవత్సరాలలో ఆ వార్తాపత్రిక క్రియలో బోల్షెవిక్కుల కేంద్ర పత్రికగా వుండింది. మక్సీమ్ గోర్కీ, అనతోలియ్ లునచార్స్కీ, మొదలైన ప్రముఖ పత్రికా రచయితలను లెనిన్ ఆ పత్రికకు వ్యాసరచయితలుగా కూర్చుకున్నాడు. పత్రిక యేర్పాట్లు ఆయన కాలంమీదా, శక్తిమీదా పెద్ద డిమాండ్లు చేసినాయి. ప్రచురణ పనికి తోడు ఆయన పత్రికను రష్యాకు చేరవేయడానికి యేర్పాట్లు చేసినాడు. పునరుద్ధరింపబడిన 'ప్రొలెతారియ్'యొక్క మొదటి సంచిక 1908 ఫిబ్రవరి అంతంలో వెలువడింది. యీ కరకు ప్రగతి వ్యతిరేక దశలో, బోల్షెవిక్ కార్యకర్తలను సమీకరించి, వాళ్లకు విద్యాబోధ చేసే ప్రముఖ సాధనంగా, విప్లవ నూతన ఆరోహణకు అనుగుణంగా పార్టీనీ, కార్మికవర్గాన్నీ దిద్దే సాధనంగా లెనిన్ పార్టీ పత్రికను చూసినాడు.

యిలాంటి కష్ట సన్నివేశంలో పార్టీ పనిచేయడం యెలా, విప్లవ పార్టీని నిలుపుకోవడమూ, జనాలతో దాని సంబంధాలను బలపరచడమూ యెలా, యే పోరాట రూపాలు వినియోగించాలి, అనే ప్రశ్న యిప్పుడు ఉత్పన్నమైంది.

చట్టవ్యతిరేక పార్టీ సంస్థలను బలపరచుకోవడమూ, అదే సమయంలో కార్మికుల చట్టబద్ధ సంస్థలను వినియోగించడమూ అవసరమని లెనిన్‌తో కలిసి బోల్షెవిక్కులు పరిగణించినారు. యెత్తుగడల విషయాలలో పట్టు విడుపులు కలిగివుండాలనీ, అవసరమైనప్పుడల్లా పూర్తి సువ్యవస్థతో, తన దళాలను చెదరిపోనీయకుండా, తిరోగమించ గలిగి వుండాలనీ లెనిన్ పార్టీకి బోధించినాడు. పురోగమించగలగడం యెంత ముఖ్యమో తిరోగమించగలగడం అంత ముఖ్యం. పార్టీ సభ్యులు విప్లవం కొరకు ఆడంబరంగా కనపడని రోజువారీ పనిని సాగించడానికీ,

డూమలో (మొదటి రష్యన్ విప్లవ కాలంలో జారిస్టు ప్రభుత్వం యేర్పరిచిన బూటకపు పార్లమెంటులో) బహిరంగంగా మాట్లాడ డానికి గల ప్రతి అవకాశాన్నీ వినియోగించుకోడానికీ, ట్రేడ్‌యూనియన్ల లోనూ, ఇన్సూరెన్స్, సహకార సంఘాలలోనూ, కార్మికుల క్లబ్బుల లోనూ పనిచేయడానికీ సిద్ధంగా వుండాలని లెనిన్ వాళ్లకు బోధించినాడు. ఆవిధంగా లెనిన్ బోల్షెవిక్కులకు చట్టవ్యతిరేక, చట్టబద్ధ పనులను నేర్పుగా మిళితం చేయడం నేర్పినాడు. లెనిన్‌యొక్క పట్టువిడుపులు గల, పొరపాటుపడని యీ యెత్తుగడలు ఆనాడు వుండిన కష్ట సన్నివేశంలో పార్టీ జనాలతో తన సంబంధాలను బలపరుచుకోడానికీ, వాళ్లను మరొక విప్లవానికి సిద్ధంచేయడానికీ తోడ్పడినాయి.

పార్టీని నిలుపుకోడానికీ, బలపరుచుకోడానికీ లెనిన్ చేసే పోరా టాన్ని ఆయన అనేక వ్యతిరేకులు శత్రుభావంతో చూసినారు. విప్లవం ఓడిపోయిన తర్వాత మెన్షివిక్కులు భయకంపంతో తిరోగమించి వుండినారు. వాళ్లు లజ్జారహితంగా పార్టీ కార్యక్రమాన్నీ, పార్టీ నినాదాలనూ విస ర్జించి, పార్టీ చట్టవ్యతిరేక సంస్థ లన్నిటినీ రద్దుచేయడానికీ, రహస్య విప్లవ చర్యలన్నిటినీ ఆపివేయడానికీ ప్రయత్నించినారు. యిందువలన వాళ్లకు "లిక్విడేటర్లు" అనే పేరు వచ్చింది. మెన్షివిక్ లిక్విడేటర్లు రష్యాలో మరొక విప్లవం వస్తుందని నమ్మలేదు; బూర్జువావర్గంతో ఒప్పందం చేసుకొని, ప్రగతి వ్యతిరేక వ్యవస్థను అంగీకరించవలసిందిగా కార్మికవర్గాన్ని వాళ్లు ఉద్బోధించినారు. యీవిధంగా, కార్మికుల పార్టీ బహిరంగంగా వుండడానికి అనుమతి పొందవచ్చునని వాళ్లు ఆశించినారు. కానీ, కార్మికవర్గ విప్లవ పార్టీ యేదీ రష్యాలో చట్టబద్ధంగా వ్యవ హరించలేదు గనుక, మెన్షివిక్కులు ఉద్దేశపూర్వకంగా అవకాశవాద, విప్లవేతర పార్టీని సృష్టించడానికి పూనుకున్నారని దీని అర్థం. యిది చాలా ప్రమాదకరమైన యెత్తుగడలు. లిక్విడేటర్లను నిర్విరామంగా పోరాడవలసిన పార్టీ శత్రువులుగా లెనిన్ విసుగు లేకుండా గుట్టుకడిగినాడు.

"పాత చట్టవ్యతిరేక పార్టీ ఉండడమా, ఉండకపోవడమా — అనేది సమస్య" అని యీ కాలంలో లెనిన్ రాసినాడు.

కొంతమంది అస్థిర బోల్షెవిక్కులు కూడా ప్రమాదకరమైన ఊగిసలాటలు ప్రదర్శించినారు. విప్లవ నుడికారాల ముసుగులో వాళ్లు చట్టబద్ధ కార్మిక సంస్థల పనినుండి పార్టీని దూరం చేయడానికి ప్రయత్నించినారు. దూమనుండి సోషల్ డెమోక్రటిక్ ప్రతినిధులను వెనక్కి రప్పించాలని ప్రతిపాదించినారు. అందువలన వాళ్లకు "ఒత్జొవీస్టులు" (వెనక్కి రమ్మనేవాళ్లు) అనే పేరు వచ్చింది. యీ హానికరమైన అభిప్రాయాలను లెనిన్ తీవ్రంగా ఖండించినాడు. చట్టబద్ధ రూపాల పనిని వదలివేస్తే పార్టీ జనాలనుండి ఏకాకి అవుతుందనీ, మరొక విప్లవ విజృంభణకు బలాన్ని కూడగట్టుకోలేని స్వయంసంపూర్ణ సంస్థగా పార్టీ మారుతుందనీ ఆయన స్పష్టపరిచినాడు. అది పార్టీకి వినాశనకరంగా వుంటుంది, అర్థాత్తూ పార్టీని రద్దుచేస్తుంది. అందుకనే లెనిన్ ఒత్జొవీస్టులను తిరగేసిన లిక్విడేటర్లు (రద్దువాదులు) అని వర్ణించినాడు. లిక్విడేటర్లూ, ఒత్జొవీస్టులూ నిజమైన విప్లవకారులు కాదనీ, కేవలం కార్మికవర్గంయొక్క పెటీబూర్జువా సానుభూతిపరులనీ, వాళ్ల కెవరికీ విప్లవంలోనూ, కార్మికవర్గ విజయంలోనూ నమ్మకం లేదనీ ఆయన తెలియజేసినాడు. అలాంటి అవకాశవాదులను కార్మికవర్గ పార్టీ వదలించుకోవాలని ఆయన అభిప్రాయపడినాడు.

1908 అంతంలో 'ప్రొలెతారియ్' ప్రచురణ అప్పుడు రష్యన్ ప్రవాసిత బృందాల కేంద్రంగా వుండిన పారిస్‌కు మార్చబడింది. లెనిన్, క్రూప్స్కయా కూడా అక్కడికి మారినారు. (వాళ్లు నివసించిన మరీ రోజ్ వీధిలో 4వ నంబరు యిల్లు యిప్పుడు లెనిన్ మ్యూజియం.)

లెనిన్‌కూ, ఆయన కుటుంబానికీ పారిస్‌లో జీవితం కష్టంగా వుండింది. గదులు చౌకగా వుండిన శివార్లలో నివసిస్తూ, ఆయన తన పనికి అవసరమైన వార్తాపత్రికలూ, పత్రికలూ, పుస్తకాలూ

చదవడానికి నేషనల్ గ్రంథాలయానికి దీర్ఘమైన సైకిల్ ప్రయాణాలు చేయవలసి వుండింది. యిది ఆయన కాలంలో చాలా భాగాన్ని హరించేది.

పారిస్‌లో అత్యంత భిన్నమైన రాజకీయ ధోరణులకు చెందిన రష్యన్ ప్రవాసుల బృందం పెద్దది వుండింది. వాళ్ల జీవితం గోలగా, అస్థిమితంగా, కీచులాటలతో నిండివుండింది. యిదంతా లెనిన్‌కు చిరాకు కలిగించి, ఆయన పనికి నష్టం కలిగించేది. ఆయన అప్పుడప్పుడు నగరం వెలుపల విశ్రాంతి కోరేవాడు. కొన్ని సార్లు ఆయన సముద్ర తీరానికి పోగలిగినాడు.

పారిస్‌లోని బోల్షెవిక్ బృందంయొక్క పనిలో లెనిన్ చురుకుగా పాల్గొన్నాడు; రష్యాలోని రాజకీయ సన్నివేశంమీదా, పారిస్ కమ్యూన్* మీదా, యితర విషయాలమీదా ఆయన తరుచుగా ఉపన్యసించినాడు. ఆయన ఫ్రెంచి కార్మికుల జీవితాన్ని గాఢంగా అధ్యయనం చేసినాడు, కార్మికుల సభలకు హాజరైనాడు, కార్మికవర్గ పరిసరాలలోని నాటకశాలలకు, నగరమధ్యంలోని నాటకశాలలనుండి బహిష్కరింపబడిన విప్లవ యితివృత్తపు నాటకాలు ప్రదర్శించేవాటికి, వెళ్లినాడు.

తీవ్ర ప్రగతి వ్యతిరేక సంవత్సరాలలో లెనిన్ తన జీవితోత్సాహాన్నీ, తన సహజ ఉల్లాసాన్నీ, మైత్రీభావాన్నీ నిలుపుకున్నాడు. పనిలో కూరుక పోయినప్పటికీ, ఆయన కొత్త నాటకాలు చూడడానికీ, మ్యూజియంలు దర్శించడానికీ, మిత్రులతో చదరంగం ఆడడానికీ, తన అభిమాన రచయితల గ్రంథాలు మళ్లీ చదవడానికీ తీరిక కలిగించుకునే

---

* పారిస్ కమ్యూన్ – 1871లో పారిస్‌లో కార్మికవర్గ విప్లవం చేత స్థాపించబడిన చరిత్రలో మొట్టమొదటి కార్మికవర్గ నియంతృత్వ ప్రభుత్వం. అది 73 రోజులు – మార్చి 18నుండి మే 28 వరకు – నిలిచివుండింది. – సం.

వాడు. రష్యానుండి వచ్చే రచయితలతో జరిపే సంభాషణలలో ఆయన యువజనుల మనస్థితిలో గాఢమైన ఆసక్తి కనబరిచి, వాళ్లకు యేరకమైన సాహిత్యం అత్యంత ప్రీతిపాత్రమైందని అడిగేవాడు. గతంలో జెనీవాలో లాగే పార్టీ కామ్రేడ్లు ఆయన యింటికి పోవడానికి యిష్టపడేవాళ్లు; మైత్రీ, పరస్పర అపేక్షా, యితరులపట్ల సానుభూతీ, దయా గల ఆ యింటి వాతావరణం వాళ్లను ఆకర్షించేది. "ప్రవాసులలో అత్యధిక భాగం చాలా బీదరికంలో వుండినారు" అని యన్. ఎ. సెమాష్కొ తన స్మృతులలో రాసినాడు. "యీరోజు రాత్రి పడుకునే టప్పుడు, రేపు ప్రొద్దున యేమి తినేదీ మాకు తెలియదు. మాకు పరస్పర సహాయక నిధి ఒకటి వుండింది. వ్లదీమిర్ ఇల్యీచ్ తనకు చేతనైన సకల విధాలా దానికి తోడ్పడేవాడు. యేదైనా ఉపన్యాసం చదవమని తరుచు ఆయన్ను కోరేవాళ్లు; దానినుండి వచ్చిన ఆదాయం బీదరికంలో వున్న కామ్రేడ్లకు సహాయపడడానికి ఉపయోగింపబడేది. పత్రిక సంపాదకత్వమూ, దానికి వ్యాసాలు రాయడమూ, సభలలో ఉపన్యాసాలు యివ్వడమూ, రష్యాతో ఉత్తరప్రత్యుత్తరాలూ – యీ మానవాతీతమైన పనితో అలసిపోయినప్పటికీ, విస్తారమైన శ్రోతలకు కూలంకషమైన, సవివరమైన ఉపన్యాసాలు యివ్వడానికి వ్లదీమిర్ ఇల్యీచ్ యెన్నడూ నిరాకరించలేదు. ఒక కామ్రేడు యిబ్బందులలో వున్నట్లు ఆయన గమనిస్తే, వెంటనే ఆయన అతనికి సహాయపడడానికి పరుగెత్తేవాడు, అతనికి యేదైనా ఉద్యోగం సంపాయించిపెట్టేవాడు – ఒకటి కంటె యెక్కువసార్లు నాకు జరిగింది యిదే."

లెనిన్ పారిస్ చేరిన కొద్ది కాలానికి అక్కడ ఒక అఖిల రష్యా పార్టీ అయిదవ కాన్ఫరెన్సు జరిగింది; దానిలో అత్యంత పెద్ద పార్టీ సంస్థలకు ప్రతినిధులుగా బోల్షెవిక్కులు వచ్చినారు. లిక్విడేషనిజంతోనూ, ఒత్జొవీజంతోనూ పోరాటం యీ కాన్ఫరెన్సులో ప్రధానాంశంగా వుండింది. లెనిన్ ప్రధాన నివేదిక యిచ్చినాడు; దానిమీద చేసిన తీర్మానాలు ప్రగతి

వ్యతిరేక సంవత్సరాలలో పార్టీకి మార్గదర్శక సూచనలుగా ఉపకరించి నాయి. లెనిన్ ప్రతిపాదనమీద, కాన్ఫరెన్సు లిక్విడేటర్లను ఖండించి, వాళ్లతో దీక్షాపూరితమైన పోరాటం చేయవలసిందిగా పార్టీ సంస్థలను ఉద్బోధించింది.

'రోడ్డుమీద' అనే తన వ్యాసంలో లెనిన్ గుర్తించినట్లు యీ కాన్ఫరెన్సు విప్లవం ఓడిపోయిన తర్వాత రష్యా కార్మికోద్యమ అభివృద్ధిలో ఒక మలుపు, బోల్షెవిక్కులకు ఒక ప్రముఖ విజయం. "...బహిరంగ విప్లవంలో తాను వర్గ పార్టీననీ, లక్షోపలక్షలమందిని సమ్మెలలోనూ, 1905 తిరుగుబాటులోనూ, 1906–1907 యెన్నికలలోనూ విజయవంతంగా నడిపించిన పార్టీననీ రుజువుచేసుకున్న సోషల్ డెమోక్రసీ యిప్పుడు కూడా వర్గ పార్టీగా, జనాల పార్టీగా, అగ్రదళంగా, అత్యంత కష్ట కాలంలో సైన్యంలోని అత్యధిక భాగంతో సంబంధం కోల్పోకుండా, యీ కష్టకాలాన్ని అధిగమించడంలో దానికి తోడ్పడగలిగి, దాని దళాలను మరొకసారి దృఢపరచగలిగి, అంతకంతకూ యెక్కువమంది నూతన యోధులను తయారు చేయగలిగేదిగా నిలవ గలుగుతుంది."

పార్టీయొక్క ఆచరణాత్మక కార్యకలాపాలు దాని సిద్ధాంత సూత్రాల సిద్ధాంత స్వచ్ఛత కొరకూ, మార్క్సు, ఎంగెల్సుల బోధపట్ల విధేయత కొరకూ జరిగే పోరాటంతో సన్నిహితంగా లంకెపడాలని లెనిన్ వాదించినాడు. మార్క్సిజంయొక్క తాత్విక సూత్రాలను సవరించే సకల ప్రయత్నాలనూ, సోషలిజంను ఒక కొత్తరకం మతంగా ప్రదర్శించే సకల ప్రయత్నాలనూ ఆయన తీవ్రంగా ప్రతిఘటించినాడు. యీ సవరించే ప్రయత్నం కొంతమంది సోషల్ డెమోక్రట్లు, సిద్ధాంతరీత్యా అస్థిరులైన కొందరు బోల్షెవిక్ వ్యక్తులతో సహా, చేసినారు. యిది రివిజనిస్టుల కొత్త దండయాత్ర, యీసారి మార్క్సిస్టు తాత్విక రంగంమీద.

తాత్విక సమస్యలమీద రివిజనిస్టు అభిప్రాయాల వ్యాప్తి పార్టీకీ, కార్మికవర్గానికీ గొప్ప ప్రమాదంగా వుండింది. అది జారిస్టు రష్యాలో వుండిన బూర్జువా ప్రగతి వ్యతిరేక భావజాలంతోనూ మతంతోనూ రాజీకి దారితీస్తుంది. విప్లవ పోరాట విసర్జన అందులో యిమిడివుంది. రివిజనిస్టులకు గట్టి యెదురు దెబ్బ యివ్వడం అవసరమైంది. యీ కర్తవ్యానికి లెనిన్ పూనుకున్నాడు. మార్క్సిస్టు తత్వశాస్త్ర ప్రచారానికీ, అభివృద్ధికీ ఆయన యెల్లప్పుడూ గణనీయమైన శ్రద్ధ చూపించినాడు. ప్రగతి వ్యతిరేక సంవత్సరాలలో, మార్క్సిస్టు తత్వశాస్త్రాన్ని సమర్థించ వలసిన అవసరం అత్యంత తీవ్రంగా వుండినప్పుడు లెనిన్ 'భౌతిక వాదమూ, ప్రత్యక్షానుభవయుత విమర్శనావాదమూ. ఒక ప్రగతి వ్యతి రేక తత్వశాస్త్రంమీద విమర్శనాత్మక వ్యాఖ్యానాలు' అనే గ్రంథం రాసినాడు (యిది 1908 ఫిబ్రవరి – అక్టోబర్‌లో రాయబడి, వి. ఇల్యీన్ అనే మారుపేరుతో 1909 మేలో ప్రచురింపబడింది). యీ గ్రంథం లెనిన్ సాగించిన విస్తారమైన పరిశోధనయొక్క ఫలితం. ఆయన తత్వశాస్త్రంమీదా, ప్రకృతిశాస్త్రంమీదా, భౌతికశాస్త్రంమీదా జర్మన్, ఫ్రెంచి, యింగ్లీషు, రష్యన్ భాషల్లో వివిధ రచయితలు రాసిన వందలాది పుస్తకాలూ, వ్యాసాలూ అధ్యయనంచేసి, మార్క్సు, ఎంగెల్సుల తాత్విక రచనలూ, అలాగే ప్లెహానొవ్, మేరింగ్, ఫాయెర్ బాఖ్, తదితర తత్వవేత్తల రచనలూ మళ్లీ చదివినాడు. 1908 మేలో లెనిన్ జెనీవానుండి లండన్‌కు బయలుదేరినాడు; అక్కడ ఆయన బ్రిటిష్ మ్యూజియం గ్రంథాలయంలో కృషిచేస్తూ దాదాపు ఒక నెల గడిపినాడు. ఆ పుస్తకం రష్యాలో చట్టబద్ధంగా ప్రచురించడం యెంత కష్టంగా వుండిందీ, లెనిన్ తన బంధువులతో జరిపిన ఉత్తరప్రత్యుత్తరాలద్వారా మనకు తెలుస్తుంది. మాస్కోలోని 'జ్వెనో' ('లంకె') ప్రచురణాల యంచేత దానిని ప్రచురింపజేయడానికి ఐ. ఐ. స్క్వ్యార్త్సోవ్ - స్తెపా నొవ్ తోడ్పాటుతో యేర్పాట్లు చేయబడినాయి. పుస్తకం ప్రచురణను

వేగిర పరచమని ఆయన తన సోదరి అన్నాను ప్రార్థించినాడు. అది వెలువడడం గురించి ఆయన తొందరపడినాడు; యెందుకంటే, 'ప్రొలెతారియ్' విస్తృత సంపాదకవర్గ (అర్థాత్తూ బోల్షెవిక్ కేంద్ర) సమావేశం, ఒత్జోవీజంపట్ల వైఖరి చర్చకు వచ్చే సమావేశం, జరగవలసి వుండింది. 1909 మే అంతంలో ఆయన తన సోదరి అన్నాకు యిలా రాసినాడు: "పుస్తకం అందింది. అది అందంగా ప్రచురింపబడింది.... మొత్తంమీద అది నాకు తృప్తి కలిగించింది."

యీ రచనలో లెనిన్ మార్క్సిస్టు తత్వశాస్త్ర వ్యతిరేకులను గుట్టుకడిగినాడు. ఒక పార్టీయొక్క తత్వశాస్త్రానికీ, దాని విధానానికీ సన్నిహిత సంబంధం వుందనీ, మార్క్సిజం అనేది శాస్త్రీయ సిద్ధాంతానికీ, విప్లవ ఆచరణకూ మధ్య విడదీయరాని ఏకత్వం అనీ ఆయన చూపించినాడు. బూర్జువా తాత్వికుల (మాఖ్, అవెనారియస్)యొక్కా, మార్క్సిస్టు తత్వశాస్త్రంతో తెగతెంపులు చేసుకున్న కొందరు సోషల్ డెమోక్రట్లయొక్కా ప్రగతి వ్యతిరేక అభిప్రాయాలను ఆయన చిత్తు చేసినాడు. తత్వశాస్త్ర రంగంలో మార్క్సిజంనుండి విడిపోయిన యీ సోషల్ డెమోక్రట్లు (ఎ. ఎ. బొగ్దానొవ్, తదితరులు) రాజకీయంగా కూడా తప్పు స్థావరం తీసుకున్నారు. మార్క్సిస్టు తత్వశాస్త్రాన్ని సమర్థించి, విస్తరించడంలోనూ, పార్టీ కార్యకర్తల సిద్ధాంత విద్యాభ్యాసంలోనూ లెనిన్ గ్రంథం అసాధారణమైన పాత్ర వహించింది. ఆధునిక బూర్జువా భావవాద తత్వశాస్త్రానికి వ్యతిరేకంగానూ, రకరకాల ఛాయల, రంగుల రివిజనిస్టులకు వ్యతిరేకంగానూ జరిగే పోరాటంలో యీనాటికీ అది పార్టీయొక్క పదునైన సిద్ధాంత ఆయుధంగా వుంది.

రష్యాలో, ఒత్జోవిస్టులమీద లెనిన్ పోరాటానికి వి. వి. వొరోవ్స్కీ, ఐ. ఎ. తెయొదోరొవిచ్, యై. ఇ. రుద్‌జూతక్, యన్. ఎ. స్క్రీప్నిక్ యింకా అనేక బోల్షెవిక్ కార్యకర్తలూ మద్దతు యిచ్చినారు. అనేక స్మృతులలో వున్న సాక్ష్యం ప్రకారం లెనిన్ గ్రంథం ప్రతివొకరిమీదా

ప్రచండమైన ముద్ర కలిగించింది. రష్యా బయట, తాత్విక వివాద కాలంలో లెనిన్ పంథాను 'ప్రొలెతారియ్' సంపాదకవర్గ సభ్యుడైన ఐ. యఫ్. దుబ్రోవిన్‌స్కియ్ చురుకుగా బలపరిచినాడు.. జెనీవాలో 1908 మేలో జరిగిన ఒక వాగ్వాదంలో అతను బొగ్దానొవ్ భావవాద అభిప్రాయాలకు వ్యతిరేకంగా ఒక ఉపన్యాసం యిచ్చినాడు. అతని ఉపన్యాసానికి ముఖ్యాంశాలను లెనిన్ తయారుచేసినాడు.

పార్టీ కొరకూ, దాని సిద్ధాంత స్వచ్ఛత కొరకూ, నిజమైన మార్క్సిస్టు విధానం కొరకూ లెనిన్ చేసిన పోరాటంలో ఆయన రాజీపడనివాడు. సిద్ధాంత గందరగోళమూ, మోమోటం లేని బహిరంగ వాగ్వాదాన్ని తప్పించుకోవడమూ ఆయన సహించలేదు: యిది పార్టీకి, దేని ప్రయోజనాలను ఆయన అన్నిటికంటె మిన్నగా చూసినాడో దానికి, మరీ హానికరమని ఆయన భావించినాడు. మార్క్సిజంనుండీ, కార్మికుల పార్టీయొక్క విప్లవ పంథానుండీ వైదొలగిన వాళ్లను వాళ్ల గత సేవలు యేవీ లెనిన్‌యొక్క తీవ్ర విమర్శనుండి రక్షింపజాలవు. 1908 మార్చిలో మక్సీమ్ గోర్కీకి రాసిన జాబులో లెనిన్ యిలా రాసినాడు: "ఒకానొక సూత్రం ఘోరమైన తప్పు అనీ, హానికరమనీ ఒక పార్టీ మనిషికి నమ్మకం కలిగితే, దానికి వ్యతిరేకంగా బయటపడడం అతని బాధ్యత. మీరు యిది అర్థం చేసుకోవాలి — తప్పక అర్థం చేసుకుంటారు."

గోర్కీ అభ్యర్థనమీద ఆయన్ను కలుసుకోడానికి 1908 ఏప్రిల్‌లో లెనిన్ కాప్రీకి పోయినాడు. అక్కడ చేరిన వెంటనే ఆయన గోర్కీతో చెప్పినాడు, కాప్రీలో వుండిన బొగ్దానొవ్‌తోనూ, అతని అనుచరులతోనూ తనకు రాజీ చేయడానికి యే ప్రయత్నమూ చేయవద్దని. లెనిన్ రష్యాను గురించి గోర్కీతో దీర్ఘమైన సంభాషణలు జరిపినాడు. గోర్కీ తన బాల్యం గురించీ, యవ్వనం గురించీ, తన దేశాటనాల గురించీ చెప్పిన కథలను ఆయన మైమరిచిన శ్రద్ధతో విని, వాటిని

రాయమని ఆయనకు సలహా యిచ్చినాడు. తదనంతర గోర్కీ 'బాల్యం,' 'నా సేవక జీవితం,' 'నా విశ్వవిద్యాలయాలు' అనే నవలలలో తన జీవితం వర్ణించినాడు. లెనిన్‌తో జరిపిన సంభాషణలు గోర్కీమీద గొప్ప ప్రభావం నెరిపి, తప్పు అభిప్రాయాలను వదలించుకోడానికి ఆయనకు తోడ్పడినాయి. "నాపట్ల ఆయన వైఖరి కఠినమైన ఉపాధ్యాయుని వైఖరీ, దయగల, ప్రాధేయ పూర్వకమైన మిత్రుని వైఖరీ" అని గోర్కీ రాసినాడు.

1909 జూన్‌లో 'ప్రొలెతారియ్' విస్తృత సంపాదకవర్గ సమావేశంలో లెనిన్ ఒత్జోవీస్టులకు వ్యతిరేకంగా తీవ్రంగా మాట్లాడినాడు. కార్మికవర్గ ఉద్యమానికీ, పార్టీ ఐక్యతకూ వాళ్లు యెంత హాని కలిగించేదీ ఆయన చూపించినాడు. బోల్షెవిక్ పార్టీకి ఒత్జోవీజంతో యెందులోనూ సామ్యంలేదని ఆ సమావేశం నొక్కిచెప్పి, పార్టీ సభ్యులు దానితో చురుకుగా పోరాడాలని ఉద్బోధించింది. కొన్ని పార్టీ సంస్థలలో మెన్షివిక్ కార్మికులు చట్ట వ్యతిరేక పార్టీని సమర్థిస్తూ లిక్విడేటర్లకు వ్యతిరేకంగా మాట్లాడిన విషయం కూడా సమావేశం గుర్తించింది. ప్లెహానొవ్ కూడా లిక్విడేటర్లను విమర్శించి వుండినాడు. బోల్షెవిక్కులకూ, మెన్షివిక్కులకూ మధ్య గల మౌలిక భేదాన్ని మరుగుపరచకుండా, పార్టీ అనుకూల మెన్షివిక్కులుగా పేరువచ్చినట్టి సభ్యత్వంలోని యీ భాగంతో పొత్తుకు అనుకూలంగా సమావేశం అభిప్రాయం వ్యక్తంచేసింది. చట్ట వ్యతిరేక పార్టీ కొరకు పోరాడడానికి ఒక సూత్రబద్ధ వేదికమీద పార్టీ బలాల నన్నిటినీ సమీకరించడానికి లెనిన్ ఒక పథకం ప్రతిపాదించినాడు.

లిక్విడేటర్ల లాంటి బాహాటపు అవకాశవాదులమీదనే కాక, తమ అవకాశవాదానికి విప్లవ వాగాడంబరంతో ముసుగుకప్పేవాళ్లమీద కూడా లెనిన్ రాజీలేని పోరాటం సాగించినాడు. యీ పోరాట గతిలో బోల్షెవిక్ పార్టీ తన దళాలను బలపరుచుకొని, తన విప్లవ విధానాన్నీ, యెత్తు

గడలనూ సమర్థించుకొంది. బోల్షెవిక్కులు "విప్లవ వాగాడంబరులను నిర్దాక్షిణ్యంగా గుట్టుకడిగి, బహిష్కరించినారు" గనుక, విప్లవం ఓడి పోయిన తర్వాత బోల్షెవిక్కులు క్రమబద్ధంగా తిరోగమించి, తమ దళాలను నిలుపుకోగలిగినారు, అని తదనంతర కాలంలో లెనిన్ ' "వామ పక్ష" కమ్యూనిజం – ఒక బాలారిష్టం' అనే తన పుస్తకంలో రాసినాడు.

ఉదాత్త "విప్లవ" నుడికారాలు ఉపయోగిస్తూ, రోజువారీ పనులు చేయడానికి శక్తి లేని, లేదా యిష్టం లేని వాళ్లను పార్టీ వదలించు కొంది.

బలమైన విప్లవ పార్టీ కొరకు బోల్షెవిక్కులు చేసే పోరాటానికి ట్రాట్స్కీ ద్వారా అడ్డంకి కలిగింది. తన లక్ష్యం పార్టీలోపల శాంతిని సాధించడమని కపటంగా ప్రకటిస్తూ, ట్రాట్స్కీ లిక్విడేటర్ల పక్షం వహించి, పార్టీ వ్యతిరేక బృందాలతోనూ, ధోరణులతోనూ లెనినిస్టు వ్యతిరేక బ్లాకు నిర్మించినాడు. లెనిన్ ట్రాట్స్కీని వంచకుడుగా, స్వలాభపరుడుగా, అపనిందలు వేసేవాడుగా, మోసగాడుగా గుట్టుకడిగి నాడు. ఆ సంవత్సరాలలోనే ఆయన అతనికి "జూడాస్ ట్రాట్స్కీ" అని పేరుపెట్టినాడు.

ప్రథమ రష్యన్ విప్లవ గుణపాఠాలను పరిశీలించి, వాటిని కార్మికవర్గంలోనూ, విస్తృత జనాలలోనూ ప్రచారం చేయడం ఆ దశలో పార్టీ ముఖ్య కర్తవ్యాలలో ఒకటి అని లెనిన్ గుర్తు చేసినాడు. సామూహిక పోరాటపు సంపన్న అనుభవాన్ని శ్రద్ధగా అధ్యయనం చేయాలని ఆయన ఉద్బోధించి, సమరశీల విప్లవ సంప్రదాయ తత్వంలో కార్మికులకు శిక్షణ యిచ్చినాడు.

విప్లవ ప్రధాన ఫలితం యేమిటంటే, లెనిన్ గమనించినట్లు, కార్మికవర్గం ప్రజాతంత్ర విప్లవంలో నాయక పాత్రను గెలుచుకుంది, పీడిత వర్గాలు సామూహిక విప్లవ పోరాటం చేయడం నేర్చుకున్నాయి.

కార్మికవర్గానికీ, రైతాంగానికీ మధ్య పొత్తును పటిష్ఠం చేయడం యెంత ప్రచండమైన ప్రాముఖ్యం గలది అయిందీ ఆయన వివరించినాడు. రష్యన్ కార్మికవర్గం సాధించింది మహత్తరమైనదని ఆయన నొక్కి చెప్పినాడు: "యితర దేశాలు గెలుచుకోడానికి దశాబ్దాలు పట్టిన లాభాలు రష్యన్ కార్మికవర్గం మూడేండ్ల కాలంలో (1905–1907) చేసిన వీరోచిత పోరాటంద్వారా తనకూ, రష్యన్ ప్రజలకూ గెలుచుకుంది." లెనిన్ రష్యన్ విప్లవం స్వభావాన్ని గురించీ, గుణపాఠాలను గురించీ పుస్తకాలూ, వ్యాసాలూ రాసినాడు, జెనీవాలోనూ, పారిస్‌లోనూ, యితర నగరాలలోనూ సభలలోను మాట్లాడినాడు. యూరప్‌లో విప్లవోద్యమం మరింత విజృంభించడానికి దారితీసి, ఆసియా ప్రజల జాతీయ విమోచన పోరాట అభివృద్ధికి శక్తివంతమైన ప్రేరణగా పనిచేసిన ప్రథమ రష్యన్ విప్లవంయొక్క ప్రచండ అంతర్జాతీయ ప్రాముఖ్యాన్ని ఆయన వెల్లడించినాడు. 1905 నాటి "డ్రెస్ రిహార్సల్" లేకుండా 1917లో అక్టోబర్ విప్లవ విజయం అసాధ్యమై వుండేది అని, తదనంతర కాలంలో, లెనిన్ నొక్కిచెప్పినాడు.

ప్రగతి వ్యతిరేక కాలంలో లెనిన్ వ్యవసాయ సమస్యకు, అనగా రష్యాలో భూ సంబంధాల సమస్యకు, చాలా కాలం అర్పించినాడు. జారిజం కూలదోయబడిన తర్వాత, భూస్వాములనుండీ, పెట్టుబడిదార్ల నుండీ భూములు తీసుకొని, రాజ్యానికి అప్పగించాలనీ, వాటిని రైతులు ఉచితంగా ఉపయోగించుకోవాలనీ ఆయన వివరించినాడు. యీ కాలంలో ఆయన రాసిన పుస్తకాలలో '1905–1907 నాటి ప్రథమ రష్యన్ విప్లవంలో సోషల్ డెమోక్రసీయొక్క వ్యవసాయ కార్యక్రమం' అనేది ఒకటి.

అంతర్జాతీయ కార్మికోద్యమంలోని అవకాశవాదానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటానికి లెనిన్ నాయకత్వం వహించి, విప్లవ శక్తులను సంఘటితపరచడానికీ, దృఢపరచడానికీ చాలా కృషిచేసినాడు. రెండవ ఇంట

ర్నేషనల్ — సోషలిస్టు పార్టీల అంతర్జాతీయ సంఘం — మహాసభలలో ఆయన చురుకైన పాత్ర వహించినాడు, అంతర్జాతీయ కార్మికోద్యమంమీద ఉపన్యాసాలు యిచ్చినాడు.

మూడేండ్లనుండి చూడని తల్లిని కలుసుకోడానికి లెనిన్ 1910 శరదృతువులో స్టాక్‌హోమ్‌కు పోయినాడు. ఆమె డెబ్బై అయిదేండ్ల వయసులో, కొడుకును చూడడానికి, యీ ప్రయాణం చేసింది. లెనిన్ యెప్పటిలాగే మహా దయగా, అపేక్షగా వుండినాడు. స్టాక్‌హోమ్‌లో మరీయా ఉల్యానొవా తన కొడుకు బోల్షెవిక్ బృందంయొక్క సభలో ఉపన్యసించడం మొదటిసారి వినింది. ఆమె వెళ్లే రోజున, లెనిన్ రేవుదాకా వచ్చి ఆమెను సాగనంపినాడు; కానీ ఆయన ఓడలోకి పోలేక పోయినాడు; యెందుకంటే, ఆ ఓడ ఒక రష్యన్ కంపెనీది గనుక, ఆయనను అరెస్టు చేసే ప్రమాదం వుండింది. "తన తల్లిని ఆయన చూడడం యిది చివరిసారి" అని క్రూప్‌స్కయా రాసింది. "ఆయన మనస్సులో అలా అనిపించింది. రేవు వదలిపోయే స్టీమర్‌ను ఆయన దిగులు కన్నులతో చూస్తూ వుండినాడు. యేడేండ్ల తర్వాత, 1917లో, ఆయన రష్యాకు తిరిగిపోయినప్పటికి ఆమె మరణించివుండింది." (లెనిన్ తల్లి 1916లో మరణించింది.)

సెప్టెంబర్ అంతంలో లెనిన్ పారిస్‌కు తిరిగిపోయినాడు.

పార్టీకీ, కార్మికవర్గానికీ అత్యంత కష్టకాలమైన యీ దశలో, తీవ్ర జారిస్టు ప్రగతి వ్యతిరేక దశలో, వాళ్లు పురోగమించవలసిన సక్రమ మార్గాన్ని ఆయన చూపించినాడు; యిది ఆయనకు కీర్తికారణం. లెనిన్ మార్గదర్శకత్వాన్ని అనుసరించి, బోల్షెవిక్కులు పార్టీని పటిష్ఠపరిచి, జారిస్టు నిరంకుశత్వంమీద నూతన దండయాత్ర కొరకు కార్మికవర్గాన్ని సమీకరించి, రష్యాలో మరొక విప్లవం అనివార్యమనే, అది కార్మిక ప్రజల విజయానికి దారితీస్తుందనే విశ్వాసాన్ని మరింత బలపరుచుకున్నారు.

# విప్లవోద్యమంయొక్క నూతన విజృంభణ

రష్యాలో విప్లవోద్యమంయొక్క నూతన విజృంభణ అనివార్యమని లెనిన్ చెప్పిన జోస్యం త్వరలో ధ్రువపరచబడింది. యెంతటి హింసాకాండలూ, దమనకాండలూ దుర్నిరోధమైన విప్లవ పోరాట వృద్ధిని అరికట్టలేకపోయినాయి. 1910లో రష్యాలో కార్మికోద్యమ పునరుద్ధరణ జరిగింది. ఆ సంవత్సరం వేసవిలోనూ, శరదృతువులోనూ సెంట్ పీటర్స్‌బుర్గ్, మాస్కో, తదితర పెద్ద నగరాలలో సమ్మెలూ, ప్రదర్శనలూ, సభలూ, యితర రాజకీయ చర్యలూ జరిగినాయి. తరువాతి సంవత్సరాలలో విప్లవోద్యమానికి ఊపు పెరుగుతూనే వుండింది. రైతాంగమూ, సైన్యమూ, నౌకాసైన్యమూ పోరాటంలోకి దిగినాయి. జనాల విప్లవోద్యమానికి బోల్షివిక్ పార్టీ నాయకత్వం వహించింది.

రష్యాలోని చట్టబద్ధ మార్క్సిస్టు పత్రికలను, ప్రగతి వ్యతిరేక కాలంలో అణచివేయబడి నలిపివేయబడినవాటిని, పునరుద్ధరించే కర్తవ్యాన్ని లెనిన్ బోల్షివిక్కుల యెదుట వుంచినాడు. 1910 డిసెంబర్‌లో బోల్షివిక్కులు, అనేక కష్టాలు అధిగమించి, సెంట్ పీటర్స్‌బుర్గ్‌లో 'జ్వెజ్దా' ('నక్షత్రం') వారపత్రిక ప్రచురణనూ, మాస్కోలో 'మీస్ల్' ('ఆలోచన') పత్రిక ప్రచురణనూ యేర్పాటుచేసినారు. 'జ్వెజ్దా'లోనూ, 'మీస్ల్'లోనూ లెనిన్ వ్యాసాలూ, అంశాలూ యాభైకి పైగా ప్రచురింపబడినాయి. ఆయన మార్గదర్శకత్వంకింద 'జ్వెజ్దా' సమరశీల మార్క్సిస్టు వార్తాపత్రిక అయింది.

కార్మికులనుండి కొత్త పార్టీ కార్యకర్తలు తయారు కావడం లెనిన్ అమితమైన ఆనందంతో గమనించినాడు; వాళ్ల రాజకీయ శిక్షణకు ఆయన యెంతో శ్రద్ధ వహించినాడు. ప్రముఖ రహస్య పార్టీ సంస్థలకు

చెందిన కార్మికుల కొరకు 1911 వసంతంలో ఆయన పారిస్ సమీపంలో లాంజూమోలో ఒక పార్టీ పాఠశాల యేర్పాటుచేసినాడు. సెంట్ పీటర్స్‌బుర్గ్‌నుండి పారిస్‌కు పోయిన మొదటి కార్మికుల బృందానికి లెనిన్ యెంత ఆప్యాయంగా స్వాగతం చెప్పిందీ, వాళ్లతో పిచ్చాపాటీ మాట్లాడుతూ ఒక సాయంత్రమంతా ఆయన యెలా గడిపిందీ. క్రూప్‌స్కయా తెలిపింది.

సెంట్ పీటర్స్‌బుర్గ్, మాస్కో, సోర్మొవొ, ఎకతెరినొస్లావ్, నికొలాయెవ్, దంబ్రోవా జిల్లా (పోలెండు), బాకూ, తిఫ్లిస్, తదితర నగరాలనుండి పద్దెనిమిదిమంది కార్మికులు ఆ పాఠశాలకు హాజరైనారు. లెనిన్ అర్థశాస్త్రంమీద 29 ఉపన్యాసాలూ, వ్యవసాయ సమస్య మీద 12, రష్యాలో సోషలిస్టు సిద్ధాంత, ఆచరణలమీద 12 యిచ్చినాడు. విద్యార్థుల అభ్యర్థనపై ఆయన చరిత్రమీద భౌతికవాద వ్యాఖ్యానం గురించి కొన్ని ఉపన్యాసాలూ, ఆనాటి సన్నివేశంమీదా, పార్టీ అంతరంగిక వ్యవహారాలమీదా ఒక నివేదికా యిచ్చినాడు. సరళత్వానికీ, స్పష్టతకూ ఆయన ఉపన్యాసాలు ప్రసిద్ధికెక్కినవి. అత్యంత జటిలమైన ఆర్థిక, తాత్విక సమస్యలను తన కార్మిక శ్రోతలకు అర్థమయ్యే సులభ పదాలతో ఆయన వివరించినాడు. తరుచు ఆయన పాఠాలు ప్రతి వొక్కరూ పాల్గొనే ఉత్సాహపూరితమైన చర్చల రూపం ధరించేవి. పట్టుదలతో చాలా అధ్యయనం జరిగేది.

లాంజూమో పాఠశాల పని లెనిన్‌కు సంతోషం కలిగించింది; అది భవిష్యత్ బోల్షెవిక్ పార్టీ పాఠశాలలకూ, కమ్యూనిస్టు విశ్వవిద్యాలయాలకూ నాందీ వంటిది. లెనిన్ నివసించిన యింటివద్ద ఫ్రెంచి కమ్యూనిస్టులు ఒక స్మృతి ఫలకం పెట్టినారు, దానిమీద యిలా లిఖించి: "యిక్కడ 1911లో, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ సిద్ధాంతకారుడూ, నాయకుడూ, సోవియట్ యూనియన్ స్థాపకుడూ అయిన వి. ఐ. లెనిన్ నివసించినాడు."

1911 అంతంలో లెనిన్ ఆర్.యస్.డి.యల్.పి. తరఫున పాల్ లాఫార్గ్ యొక్కా, ఆయన భార్యా, కార్ల్ మార్క్స్ కూతురూ అయిన లౌరాయొక్కా అంత్యక్రియల సందర్భంలో పారిస్‌లో ఉపన్యాసం యిచ్చినాడు. లెనిన్ ఫ్రెంచి భాషలో మాట్లాడినాడు. సంక్షిప్తమైనా, శ్లాఘనీయమైన ఉపన్యాసంలో ఆయన లాఫార్గ్ సేవలను ప్రశంసించినాడు; అతను మార్క్సిస్టు భావాలకు అత్యంత ప్రతిభావంతుడైన ప్రచారకుడని ఆయన వర్ణించినాడు. రష్యన్ కార్మికుల అగ్రదళం యీ భావాల పతాకకింద సమైక్యమై, సంఘటిత సామూహిక పోరాటం చేసి, జారిస్టు నిరంకుశత్వంమీద దెబ్బ తీసింది, అని లెనిన్ అన్నాడు. యిలా చేయడంలో అది, ఉదారవాద బూర్జువావర్గపు ద్రోహమూ, ఊగిసలాటా, అస్థిరత్వమూ వుండినప్పటికీ, సోషలిజంయొక్క ప్రయోజనాన్ని, విప్లవంయొక్క ప్రయోజనాన్ని, ప్రజాస్వామ్యంయొక్క ప్రయోజనాన్ని బలపరిచింది. రష్యన్ విప్లవం "ఆసియా అంతటా ప్రజాతంత్ర విప్లవాల యుగాన్ని ప్రవేశపెట్టింది; యావత్తు నాగరిక ప్రపంచ ప్రజాతంత్ర ఉద్యమంలో యీనాడు 80 కోట్ల ప్రజలు పాల్గొంటున్నారు" అని లెనిన్ అన్నాడు. మార్క్సిస్టు భావాల తత్వంతో సమీకృతమూ ప్రబుద్ధమూ ఐ, బూర్జువా పరిపాలనను కూలదోసి, కమ్యూనిస్టు వ్యవస్థను నెలకొల్పే కార్మికవర్గం చేసే విప్లవ యుద్ధాల యుగం సమీపిస్తున్నదనే విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ లెనిన్ తన ఉపన్యాసం ముగించినాడు.

రష్యాలో కార్మికవర్గ ఉద్యమం పునరుద్ధరింపబడడంతోనూ, లిక్విడేటర్లమీద పోరాటం తీవ్రం కావడంతోనూ పార్టీ సంస్థలను పటిష్ఠపరిచి, వాటి పనిని మెరుగుపరచవలసిన అవసరం గతంలో యెప్పుడూ లేనంత తీవ్రంగా అనుభూతమైంది. అతిత్వరగా పార్టీ కాన్ఫరెన్సు జరిపే సమస్య ఉత్పన్నమైంది. లెనిన్‌తో కలిసి బోల్షెవిక్కులు దానికి చర్యలు తీసుకున్నారు. ప్రముఖ బోల్షెవిక్ జి. కె. ఒర్జొనికీడ్జెతో సహా పార్టీ పాఠశాల విద్యార్థులు కొందరూ, యితర ప్రముఖ పార్టీ

కార్యకర్తలూ కాన్ఫరెన్సుకు యేర్పాట్లు చేయడానికి రష్యాకు పంపబడి నారు. కాన్ఫరెన్సుకు సన్నాహాలు చేయడానికి ఒక రష్యన్ ఆర్గనైజింగ్ కమిషన్ యేర్పాటుచేయబడింది. యీ కమిషన్ పనికి లెనిన్ గొప్ప రాజకీయ ప్రాముఖ్యం యిచ్చినాడు. నాలుగేండ్ల అవ్యవస్థ, గంరదగోళం తర్వాత, మొదటిసారి ఒక రష్యన్ పార్టీ కేంద్రం సమావేశమైంది, అని ఆయన రాసినాడు. "పతాకం యెత్తబడింది, రష్యా అంతటా కార్మిక బృందాలు దానివైపు ఆకర్షింపబడుతున్నాయి, యే విప్లవ ప్రతీఘాత దాడీ దాన్ని కూలదోసే అవకాశం లేదు."

లెనిన్ సూచనమీద కాన్ఫరెన్సును ప్రాగ్‌లో జరపడానికి నిర్ణ యింపబడింది. 1912 ప్రారంభంలో లెనిన్ పారిస్‌నుండి ప్రాగ్‌కు బయలుదేరినాడు. అక్కడ, "ప్రజా భవనం"లో, జెక్ సోషల్ డెమోక్రటిక్ వార్తాపత్రిక ఆవరణలో, పార్టీ చరిత్రలో ప్రాగ్ కాన్ఫ రెన్సుగా పేరుపొందిన అఖిల రష్యా కాన్ఫరెన్సు అత్యంత రహస్యంగా జరి గింది. ఆ కాన్ఫరెన్సు జరిగిన గదికి అర్ధ శతాబ్దంనాటి దాని మొదటి స్వరూపం యిప్పుడు మళ్లీ యివ్వబడింది; అదే భవనంలో 1953 జనవరి 21న ఒక లెనిన్ మ్యూజియం ప్రారంభించబడింది.

కాన్ఫరెన్సును యేర్పరచడంలో జెక్ సోషల్ డెమోక్రట్లు గొప్ప సహాయం చేసినారు. కాన్ఫరెన్సుకు స్థలం చూపించడమే గాక, వాళ్లు ప్రతినిధులను జాగ్రత్తగా చూసుకున్నారు, కార్మికుల యిండ్లలో వాళ్లకు వసతి యేర్పరచినారు. లెనిన్ సెంట్ పీటర్స్‌బుర్గ్ ప్రతినిధి అయిన వై. పి. ఒనూఫ్రియెవ్ అనే కార్మికునితో కలిసి ఒక గదిలో వుండినాడు. "ఆయన యెంత ఉల్లాసంగా, సౌజన్యపూరితంగా, సౌహార్ద్రపూరితంగా వుండినాడంటే, ఆయన్ను అనేక సంవత్సరాలుగా యెరిగినట్లు మేము ఆయనతో చనవుగా వుండినాము" అని ఒనూఫ్రియెవ్ రాసినాడు. "ఆయన యెవరితోనైనా మాట్లాడేటప్పుడు, అత్యంత ముఖ్యమైనదేదో దాన్ని యెప్పుడూ గుర్తించగలిగేవాడు. ఆయన అంత సరళంగా, మాట్లాడ

డానికి అంత సులభంగా వుండడం మాకు అచ్చెరువూ, ఆనందమూ కలిగించేది." ప్రతి ప్రతినిధీ లెనిన్ అభిమానంతో, శ్రద్ధతో చూసుకునే వాడు. రష్యాలోని కార్మికవర్గం గురించీ, రైతాంగం గురించీ, దేశంలోని సన్నివేశం గురించీ ఆయన జ్ఞానం అందరికీ అచ్చెరువు కలిగించేది.

కాన్ఫరెన్సు పని అంతటికీ లెనిన్ దర్శకత్వం వహించినాడు. ఆనాడు రష్యాలో వుండిన పార్టీ సంస్థలలో దాదాపు అన్నిటికీ ప్రాతినిధ్యం వహించిన ఆ కాన్ఫరెన్సు, ఆయన ప్రతిపాదనమీద, సమర్థవంతమైన కేంద్ర సంస్థలను యేర్పరచి, పార్టీని పునరుజ్జీవింప చేసే బాధ్యత గల అత్యున్నత పార్టీ సంస్థగా ప్రకటించుకొంది. లెనిన్ ప్రారంభోప న్యాసం యిచ్చి, సమావేశాలకు అధ్యక్షత వహించి, నివేదికలు యిచ్చి, కార్యక్రమంలోని ముఖ్యాంశాలమీద తీర్మానాలు రచించినాడు, స్థానిక ప్రాంతాల ప్రతినిధుల నివేదికలు రాసి వుంచుకున్నాడు.

ఆనాటి సన్నివేశంమీదా, పార్టీ కర్తవ్యాలమీదా లెనిన్ చిత్తు తీర్మానాన్ని కాన్ఫరెన్సు ఆమోదించింది. పురోగామి కార్మికవర్గ జనా నికి సోషలిస్టు విద్యాబోధన శిక్షణ యిచ్చి, సంఘటితపరిచి, సమీకరించ డానికీ, గతంలోకంటె యెక్కువగా చట్టబద్ధ అవకాశాలను వినియో గించుకునే చట్టవ్యతిరేక పార్టీ సంస్థను పునస్థాపించడానికీ దృఢమైన ప్రయత్నాలు యింకా చేయవలసిన అవసరాన్ని ఆ తీర్మానం పార్టీ సంస్థల దృష్టికి తెచ్చింది. అలాంటి సంస్థ కార్మికవర్గ ఆర్థిక పోరాటం నడిపించగల సామర్థ్యం కలిగివుంటుంది, అది మాత్రమే "మరింత తరుచౌతున్న కార్మికవర్గ రాజకీయ చర్యలలో అగ్రేసరత్వం వహించ" గలిగి వుంటుంది అని ఆ తీర్మానం నొక్కిచెప్పింది.

అంతర్జాతీయ సోషలిస్టు బ్యూరో కార్యకలాపాలమీదా, అవకాశ వాదులతో పోరాటంమీదా, అంతర్జాతీయ కార్మికోద్యమంలోని సన్ని వేశంమీదా లెనిన్ యిచ్చిన నివేదికను ప్రతినిధులు యెంతో ఆసక్తితో విన్నారు. సోషలిస్టు విప్లవాల యుగం, లెనిన్ మాటల్లో చెప్పాలంటే,

"బూర్జువావర్గంమీద జరిగే యుద్ధాల" యుగం, అయిన నూతన చారిత్రక యుగం గురించీ, యీ సందర్భంలో, అంతర్జాతీయ కార్మికోద్యమంలో విప్లవ సోషల్ డెమోక్రట్లకూ సంస్కరణవాదులకూ మధ్య జరిగే పోరాటం గురించీ ముఖ్యమైన సూత్రీకరణలు ఆ నివేదికలో వుండినాయి. జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీలోని సన్నివేశం గురించి లెనిన్ ప్రత్యేకంగా వివరించినాడు. ఆ పార్టీలోని అంతర్గత సంబంధాలు అత్యంత తీవ్ర రూపం ధరించడం — "పైన ఐక్యతా, అడుగున రెండు భిన్న ధోరణులూ" — ఆయన గుర్తించినాడు. ఆయన ఇలా అన్నాడు: "జర్మన్ సోషల్ డెమోక్రట్లు నిస్సందేహంగా ఒక నూతన యుగాన్ని — సోషలిస్టు విప్లవ యుగాన్ని — సమీపిస్తున్నారు. ఆర్థిక, సైనిక సంక్షోభాలూ, క్లిష్ట ప్రపంచ పరిస్థితులూ, అన్నీ యీ యుగ లక్షణాలను వెలికి తేవడానికి అభిముఖంగా వున్నాయి."

జనాలతో సన్నిహిత సంబంధాన్ని నిస్సందేహం చేసి, కార్మికవర్గ ఉద్యమ విజృంభణకు అనుగుణంగా వుండే పార్టీ కృషియొక్క నూతన, మరింత పట్టువిడుపులు గల సంస్థా రూపాల సమస్యకు లెనిన్, కాన్ఫరెన్సులో తాను యిచ్చిన ఉపన్యాసాలలో, చాలా శ్రద్ధ అర్పించినాడు. పార్టీ సంస్థలు చట్టబద్ధ కృషియొక్క సకల రూపాలనూ — ముఖ్యంగా దూమ బృందంద్వారానూ, ట్రేడ్‌యూనియన్లద్వారానూ, చట్టబద్ధ కార్మిక సంఘాలద్వారానూ — నేర్పుగా వినియోగించుకోడానికి గల ప్రాముఖ్యతను ఆయన మళ్లీ నొక్కిచెప్పినాడు.

చట్టబద్ధ కార్మిక సంఘాలద్వారా పార్టీ సంస్థ నిర్వహించవలసిన పనిని గురించి, అనగా ఉపన్యాసాలు యేర్పాటుచేయడం, గ్రంథాలయాల ద్వారానూ, రీడింగు రూములద్వారానూ చట్టబద్ధ బోల్షెవిక్ సాహిత్యాన్ని ప్రచారం చేయడం, క్లబ్బులలో కృషీ, వగైరాల గురించి లెనిన్ దీర్ఘంగా మాట్లాడినాడు. యీ కార్మిక సంఘాలను విస్తరింపజేయడానికి మనం యేమైనా చేసినామా, అని లెనిన్ అడిగినాడు. యీ

సంఘాల గురించి మనం ఫాక్టరీలలోనూ, మిల్లులలోనూ చెప్పినామా? యీ రంగంలో పార్టీ సంస్థలు తగినంత పని చేయలేదని లెనిన్ గుర్తు చేసినాడు. రహస్య శాఖలు పార్టీ పనియొక్క ఆధారాన్ని విస్తృతపరిచే చట్టబద్ధ సంస్థల సమాహారాన్ని నిర్మించవలసివుంది. "పార్టీ సంస్థ తక్కువ లాంఛనబద్ధంగా వుండనీ, కానీ చట్టబద్ధ సంఘాలలోని పనిద్వారా విస్తరిస్తూవుండనీ.... ఒక పార్టీ శాఖ ఉంది; దానికి సెంట్రల్ ఆర్గనైజేషన్‌తో సంబంధం వుంది; ఆ శాఖ దానితో సంవత్సరాని కొకసారి సంబంధం పెట్టుకుంటూ, గతంలోకంటె నూరు రెట్లు యెక్కువ పని చేస్తున్నది" అని లెనిన్ చెప్పినాడు. అదే సమయంలో చట్టబద్ధ సంస్థలలో సాంస్కృతిక పని పార్టీతత్వాన్ని జీర్ణం చేసుకోవాలని నొక్కిచెప్పినాడు లెనిన్. యిది, యితర విషయాలతో పాటు, లిక్విడేటర్లతో చేసే పోరాటంలో విజయానికి హామీ యిస్తుందని ఆయన భావించినాడు. విప్లవ విజృంభణకు సంబంధించిన నూతన పరిస్థితులలో పార్టీ అనుసరించవలసిన రాజకీయ పంథానూ, యెత్తుగడలనూ కాన్ఫరెన్సు నిర్ణయించింది.

కొత్త రకం పార్టీ అయిన బోల్షెవిక్ పార్టీని నిర్మించడంలో ప్రాగ్ కాన్ఫరెన్సు అసాధారణమైన పాత్ర వహించింది. అది పార్టీ మహాసభ ప్రాముఖ్యాన్ని వహించింది. మెన్షివిక్ లిక్విడేటర్లను పార్టీనుండి బహిష్కరిస్తూ కాన్ఫరెన్సు తీర్మానించింది. వాళ్లు పార్టీతో యేమీ సంబంధం లేనివాళ్లుగా ప్రకటింపబడినారు. లిక్విడేషనిజంతో పోరాడాలనీ, కార్మికవర్గ విమోచనకు అది యెంత హానికరమైందీ వివరించాలనీ, చట్టవ్యతిరేక పార్టీ సంస్థలను పునరుద్ధరించి, పటిష్ఠపరచడంలో సర్వ శక్తులూ కేంద్రీకరించాలనీ కాన్ఫరెన్సు పార్టీ సభ్యులందరినీ ఉద్బోధించింది.

అవకాశవాదంతో రాజీ లేదనే ధోరణి లెనిన్ ఉపన్యాసాలలోనూ, కాన్ఫరెన్సు పని సమస్తంలోనూ వ్యాపించి వుండింది. ప్రాగ్ కాన్ఫరెన్సు తీర్మానాలు పెద్ద అంతర్జాతీయ ప్రాముఖ్యం గలవి. అవకాశవాదులతో

సంపూర్ణంగా తెగతెంపులు చేసుకోవడం యితర సోషల్ డెమోక్రటిక్ పార్టీ‌లలోని విప్లవ అంశాలకు ఆదర్శంగా ఉపకరించింది.

కాన్ఫరెన్సు లెనిన్ అగ్రేసరత్వం గల కేంద్ర కమిటీని యెన్ను కుంది; అందులో, రహస్యంగా పనిచేసిన కష్టకాలంలో స్థిరత్వమూ, సాహసమూ ప్రదర్శించినవాళ్లు, పరీక్షల కాగినవాళ్ళు, వుండినారు. వాళ్లలో యఫ్. ఐ. గొలొశ్చేకిన్, జి. కె. ఒర్డ్జొనికీడ్జె, యస్. యస్. స్పన్దర్యాన్ వుండినారు. కేంద్ర కమిటీ ఐ. యస్. బెలొస్తొత్‌స్కీయ్‌నీ, జె. వి. స్టాలిన్‌నూ కోఆప్టు చేసుకొని, కేంద్ర కమిటీ సభ్యు డెవరైనా అరెస్టు అయిన పక్షంలో కోఆప్టు చేసుకోవలసిన సభ్యులుగా ఎ. యస్. బూబ్నొవ్‌నూ, యం. ఐ. కలీనిన్‌నూ, వై. డి. స్తాసొవానూ, యస్. జి. షౌమ్యాన్‌నూ నియమించింది. కేంద్ర కమిటీయొక్క రష్యన్ బ్యూరో యేర్పాటుచేయబడింది. తరువాత కేంద్ర కమిటీ జి. ఐ. పెత్రోవ్‌స్కీయ్‌నీ, వై. యం. స్వెర్ద్లోవ్‌నూ కోఆప్టు చేసుకొంది. గోర్కీకి లెనిన్ ఒక జాబులో యిలా రాసినాడు: “లిక్విడేషనిస్టు బద్మాషులు వున్నప్పటికీ, చివరకు మేము పార్టీనీ, దాని కేంద్ర కమిటీనీ పునరుద్ధరించడంలో విజయం పొందినాము. మాలాగే మీరూ దీనికి సంతోషిస్తారని ఆశిస్తున్నాను.”

కాన్ఫరెన్సు తర్వాత బోల్షెవిక్కులు, లెనిన్‌తో కలిసి, దాని తీర్మానాలను అమలుపరచడానికి చురుకుగా పూనుకొన్నారు. కేంద్ర కమిటీ సభ్యులూ, ప్రతినిధులూ స్థానిక ప్రాంతాలకు వెళ్లి, అక్కడి పనిని గురించి పైకి తెలియజేసినారు. కాన్ఫరెన్సుయొక్క ముఖ్య తీర్మానాలన్నిటినీ కరపత్రాల రూపంలో పునర్ముద్రించి, విస్తృత సభ్యత్వంలో స్థానికంగా పంపకం చేయాలనీ, “కరపత్రాలతో మీరు అన్నిటినీ జయిస్తారు” అని లెనిన్ సిఫారస్ చేసినాడు. పార్టీ సంస్థలతో త్వరగా సంబంధం పునరుద్ధరించుకునే అవసరాన్ని ఆయన నొక్కిచెప్పినాడు: “మరిన్ని సంబంధాలు యివ్వండి. సంబంధాలు, సంబంధాలు, సంబం

ధాలు – మనకు లేనివి అవే. యివి లేకుండా ప్రతిదీ అస్థిరమే'' అని ఆయన రష్యాలోని కేంద్ర కమిటీ బ్యూరో సభ్యులకు రాసినాడు. కాన్ఫరెన్సు తీర్మానాలను పార్టీ సంస్థలు హృదయపూర్వకంగా బలపరిచినాయి.

1912 వసంతంలో, సెంట్ పీటర్స్‌బుర్గ్ కార్మికుల చొరవతో – వాళ్లకు లెనిన్ అండదండలు పూర్తిగా వుండినాయి – చట్టబద్ధ బోల్షెవిక్ దినపత్రిక 'ప్రావ్ద' స్థాపించబడింది. మొదటి సంచిక సెంట్ పీటర్స్‌బుర్గ్‌లో ఏప్రిల్ 22 (మే 5)న, సుదూర సైబీరియన్ అడవిలోని లెనా నదీ తీరాన బంగారు గనులవద్ద జారిస్టు సైన్యాలు కార్మికులమీద జరిపిన కాల్పులకు ఆగ్రహపూరిత నిరసనతో దేశమంతా ఉడికిపోతూవుండిన సమయంలో, వెలువడింది.

'ప్రావ్ద' మొదట వెలువడిన రోజు యిప్పుడు కార్మిక పత్రికా దినంగా ప్రతి సంవత్సరం జరపబడుతున్నది.

రష్యాకు దగ్గరగా వుండాలని లెనిన్ పారిస్ వదలి క్రాకొవ్ చేరినాడు. (యీ భాగం పోలెండు అప్పుడు ఆస్ట్రో హంగేరియన్ సామ్రాజ్యానికి చెంది వుండింది.) అక్కడ ఆయన రెండేండ్లకు పైగా వుండినాడు, ప్రథమ ప్రపంచ యుద్ధం ప్రారంభమైందాకా – చలికాలం క్రాకొవ్‌లోనూ, వేసవికాలం పొరోనిన్ అనే గ్రామంలోనూ వుంటూ. క్రాకొవ్ రష్యన్ సరిహద్దుకు సమీపంలో వుండినందున సెంట్ పీటర్స్‌బుర్గ్ వార్తాపత్రికలు అక్కడికి మూడు రోజుల్లో చేరేవి; అంతేగాక, అక్కడినుండి రష్యాలోని పార్టీ సంస్థలతో ఉత్తరప్రత్యుత్తరాలు జరపడమూ, సూటి సంబంధాలు పెట్టుకోవడమూ సులభతరంగా వుండింది. క్రాకొవ్‌లో, ప్రతిచోటా లాగే లెనిన్ స్థానిక ప్రజల జీవితాన్నీ, కార్మిక జనుల జీవితాన్నీ, పరిసర గ్రామాలలోని బీద రైతుల జీవితాన్నీ అధ్యయనం చేసినాడు. ఆయన పోలిష్ కార్మికోద్యమంతోనూ, పోలిష్ సోషల్ డెమోక్రట్లతోనూ యింకా సన్నిహిత

సంబంధాలు నెలకొల్పుకున్నాడు; వాళ్లకు ఆయన గొప్ప సహాయం చేసినాడు. యెప్పటిలాగే ఆయన కష్టపడి పనిచేస్తూ తన సమస్త కాలాన్నీ, శక్తినీ పార్టీ పనికి, కార్మికవర్గ ప్రయోజనానికి అర్పించినాడు.

పోలిష్ ప్రజలు తమ దేశంలో లెనిన్ ఉనికికి సంబంధించిన ప్రతిదాన్నీ ప్రేమతో భద్రపరుచుకున్నారు. క్రాకొవ్‌లోనూ, పొరోనిన్‌లోనూ లెనిన్ మ్యూజియంలు పెట్టినారు, లెనిన్ యే యిండ్లలో నివసించి, పనిచేసుకున్నాడో వాటి గోడలకు స్మృతి ఫలకాలు పెట్టినారు.

లెనిన్ 'ప్రావ్ద'కు రోజువారీ శ్రద్ధ అర్పించినాడు. సంపాదకులతో ఆయన ఉత్సాహపూరితమైన ఉత్తరప్రత్యుత్తరాలు జరిపి, పత్రిక విజయాలకు ఆనందించి, దాని తప్పులనూ, పొరపాట్లనూ సవరించుకోడానికి దానికి తోడ్పడినాడు. పత్రిక వెనువెంటనే కార్మికులలో పంపకం కావడానికీ, దాని సంఖ్యను పెంచడానికీ ఆయన కష్టపడి కృషి చేసి, ఫాక్టరీలవద్దా, మిల్లులవద్దా నేరుగా చందాలు తీసుకోవాలని సలహా యిచ్చినాడు. "పార్టీ సూత్రాల విజయం 'ప్రావ్ద'కు విజయం, 'ప్రావ్ద' విజయం పార్టీ సూత్రాలకు విజయం" అని ఆయన రాసినాడు. కార్మికుల వార్తాపత్రిక సమరశీలంగా వుండాలి, అగ్రభాగంలో నడవాలి, సమస్యలను సూటిగా యెదుర్కోవాలి, కార్మికవర్గ ప్రయోజనాలకూ, విప్లవానికీ హాని చేసేవాళ్లను గుట్టుకడగాలి.

లిక్విడేటర్లపట్ల కార్మికవర్గ పార్టీ యే పంథా అవలంబించవలసిందీ లెనిన్ ఓర్పుగా వివరించినాడు. "లిక్విడేటర్లతో యేకత్వాన్ని గురించి యేవిధంగానూ మాట్లాడలేము: పార్టీని పార్టీ విధ్వంసకులతో యేకం చేయలేము" అని లెనిన్ 'ప్రావ్ద' సంపాదకులకు రాసినాడు. విమర్శకు చెవి ఒగ్గాలనీ, తప్పులను మూసిపెట్టుకోకూడదనీ, వాటిని ఒప్పుకొని, సవరించుకునే ధైర్యం వుండాలనీ ఆయన 'ప్రావ్ద' సిబ్బందికి బోధించినాడు. "సవరించబడిన తప్పు యిక యెంత మాత్రమూ తప్పు

కాదు. సవరించబడని తప్పు చీము పట్టిన పుండు ఔతుంది" అని ఆయన నొక్కిచెప్పినాడు.

పత్రికను నడపడంలో సంపాదకుల విజయాలను (అత్యంత విజయవంతమైన వ్యాసాలూ, పత్రికయొక్క మరింత పెద్ద పరిమాణమూ, పెరుగుతున్న చందాదార్ల సంఖ్యా, వగైరాలను) లెనిన్ పదేపదే గుర్తిస్తూనే, 'ప్రావ్దా' సాధించినదానితో తృప్తిపడకూడదనీ, విస్తృత పాఠకవర్గాన్ని సంపాయించడానికి తన కృషిని సడలించకూడదనీ గుర్తు చేసినాడు.

'ప్రావ్దా'కు లెనిన్ దాదాపు ప్రతిరోజూ రాసేవాడు. దాని కాలంలలో బోల్షెవిక్ పార్టీ నాయకుడు కార్మికవర్గ జనాలకు మార్క్సు బోధయొక్క సారాన్నీ, విప్లవ మార్క్సిస్టు సిద్ధాంతంయొక్క ప్రాముఖ్యాన్నీ వివరించినాడు. సరళంగా, స్పష్టంగా రాయబడిన ఆయన వ్యాసాలు పాఠకునిలో కార్మికవర్గ అంతర్జాతీయతనూ, వర్గ సంఘీభావాన్నీ, సకల దేశాల కార్మికుల ప్రయోజనాల ఐక్యతనూ కలిగించినాయి. లెనిన్ తరుచుగా సమ్మె ఉద్యమానికి సంబంధించిన సమస్యలమీద రాసినాడు. 1912లో బ్రిటిష్ బొగ్గు గనిపనివాళ్ల సమ్మె పురోగతిని వర్ణిస్తూ ఆయన "నీ చేయి సంకల్పిస్తే చక్రాలన్నీ తిరగడం మానుకుంటాయి" అనే జర్మన్ కార్మిక గేయంలోని మాటలు ఉటంకించినాడు. ఆచరణ ఐక్యతయొక్కా, సమ్మెదార్ల ధైర్యంయొక్కా, సహన శక్తియొక్కా ప్రాముఖ్యాన్ని ఆయన నొక్కిచెప్పినాడు. 1912 – 1914 కాలంలో 'ప్రావ్దా' లెనిన్ వ్యాసాలు 280కి పైగా ముద్రించింది, అందులో అత్యధిక భాగం "వ్ల. ఇల్యీన్," "వి. ఫ్రేయ్," "వి. ఐ.," "టి," "ప్రావ్దీస్ట్," "గణాంక శాస్త్రజ్ఞుడు," "పాఠకుడు" వగైరా మారుపేర్లతో.

రష్యా ఆర్థిక వెనుకబాటుతనం గురించి ఆయన ఆగ్రహంతోనూ, భయంతోనూ రాసినాడు; ప్రజలను దారిద్ర్యానికీ, పీడనకూ, అవిద్యకూ గురిచేసిన దోపిడీవర్గాలను ఆయన ఖండించినాడు.

పెట్టుబడిదారీ వ్యవస్థ శాస్త్రవిజ్ఞానంమీదా, సాంకేతిక విజ్ఞానంమీదా, సంస్కృతిమీదా గుదిబండగా పనిచేస్తున్నదని లెనిన్ చూపించినాడు. పెరుగుతున్న కార్మికవర్గ బలంపట్ల భయంతో సామ్రాజ్యవాదులు వెనుకబడినదాన్నీ, మరణోన్ముఖమైనదాన్నీ అంతటినీ బలపరచడానికీ, బాల్యంలో వున్నదాన్నీ, కొత్తదాన్నీ అంతటినీ నలిపివేయడానికీ సిద్ధంగా వున్నారు. "కానీ, బాల్యంలో వున్నది పెరుగుతున్నది, యెన్ని చేసినా అది అత్యున్నత శక్తిగా బయటపడుతుంది" అని లెనిన్ రాసినాడు. చైనా విప్లవాన్నీ, యితర ఆసియా దేశాల జాతీయ విమోచనోద్యమాన్నీ ఆయన గాఢంగా బలపరిచినాడు.

'ప్రావ్ద'ద్వారా లెనిన్ కార్మికవర్గ సంఘటనయొక్కా, ఐక్యతయొక్కా ప్రాముఖ్యాన్ని వివరించినాడు. "అనైక్యంగా వున్న కార్మికులు శూన్యం. సమైక్యంగా వున్న కార్మికులు సమస్తం." రాబోయే విప్లవ విజయంలో విశ్వాసాన్ని ఆయన పార్టీలోనూ, కార్మికవర్గంలోనూ కలిగించినాడు.

కార్మికులలో 'ప్రావ్ద' చాలా ప్రీతిపాత్రంగా వుండింది; స్వయంగా కార్మికులు వసూలు చేసిన డబ్బుతో అది నడపబడింది. పత్రికకు కార్మికుల విరాళాలు పార్టీ సభ్యత్వ రుసుముతో సమానంగా లెనిన్ పరిగణించినాడు. పార్టీ సంస్థలను పటిష్ఠపరచడంలోనూ, కార్మిక జనానికి రాజకీయ విద్య గరపడంలోనూ పత్రిక ముఖ్యమైన పాత్ర వహించింది. లిక్విడేటర్లకూ, ట్రాట్స్కీయిెట్లకూ, ఒట్జొవీస్టులకూ, యితర అవకాశవాదులకూ వ్యతిరేకంగా అది పోరాటం చేసింది. కవ్వింపులూ, హింసలూ యెన్నైనా ధ్వంసం చేయలేని సామూహిక బోల్షెవిక్ పార్టీకి దృఢమైన పునాదిని వేయడానికి అది తోడ్పడింది. ఒక కొత్త తరం విప్లవ కార్మికులను, లక్షలాది పురోగామి కార్మికులను, తరువాత అక్టోబర్ సోషలిస్టు మహా విప్లవంలో నిర్ణయాత్మక పాత్ర వహించవలసి వుండినవాళ్లను, 'ప్రావ్ద' పెంచింది.

'ప్రావ్దా' సంపాదక సిబ్బందిలోనూ, చురుకైన వ్యాస రచయితలలోనూ, వివిధ కాలాలలో, యన్. యన్. బతూరిన్, దెమ్యాన్ బేద్నియ్, కె. యస్. యెరెమేయెవ్, యన్. కె. క్రూప్స్కయా, వి. యం. మోలొతొవ్, వి. ఐ. నేవ్స్కియ్, యం.యస్. ఒల్మీన్స్కియ్, యన్. ఐ. పొద్వోయ్స్కియ్, యన్. జి. పొలెతాయెవ్, కె. యన్. సమోయ్‌లొవా, యం. ఎ. సవేల్యెవ్, యన్. ఎ. స్క్రిప్నిక్, జె. వి. స్టాలిన్, వై. యం. స్వెర్ద్లోవ్, పి. ఐ. స్తుచ్క, ఎ. ఐ. ఉల్యానొవ - యెలిజారొవా, తదితరులు వుండినారు. నాల్గవ దూమలోని బోల్షెవిక్ ప్రతినిధులు పత్రికకు చురుకైన వ్యాస రచయితలుగా వుండినారు. మక్సీమ్ గోర్కి రచనలు కూడా 'ప్రావ్దా'లో ప్రచురింపబడినాయి.

జారిజంయొక్క కఠిన పరిస్థితులలో లెనినూ, ఆయన సహచరులూ 'ప్రావ్దా'ను యేర్పరచడమూ, దానిని విప్లవ విధాన సాధనంగానూ, జనాలకు రాజకీయ విద్య గరిపే సాధనంగానూ ఉపయోగించడమూ సమస్త అంతర్జాతీయ కార్మికోద్యమ చరిత్రలోనూ అసాధారణమైన ఘటన. లెనిన్ 'ప్రావ్దా'యొక్క ఉత్తమ సంప్రదాయాలు – పార్టీపట్లా, విప్లవంపట్లా భక్తీ, ఉన్నత సూత్రాలూ, సిద్ధాంత ఊగిసలాటపట్ల రాజీలేని వైఖరీ, జనాలకు సన్నిహితత్వమూ – సమస్త ప్రపంచంయొక్క ప్రగతిశీల, కమ్యూనిస్టు, విప్లవ పత్రికలకు ఆదర్శంగా ఉపకరిస్తాయి.

1912 శరదృతువులో నాల్గవ స్టేట్ దూమకు యెన్నికలు జరిగినాయి. యెన్నికల ప్రచారంలో పాల్గొనడం జనాలతో పార్టీ సంబంధాలను పటిష్ఠపరచడానికీ, పార్టీ సంస్థల పనికి దోహదం కలిగించడానికీ తోడ్పడుతుందని లెనిన్ భావించినాడు. "పార్టీని నిర్మించే పని యెన్నికల ఫలితంమీద చాలా యెక్కువగా ఆధారపడుతుంది" అని ఆయన రాసినాడు.

లెనిన్‌చేత రచింపబడి, కేంద్ర కమిటీ సంతకం చేసిన కరపత్ర రూపంలో విడుదల చేయబడిన పార్టీ యెన్నికల వేదిక యెన్నికల ప్రచా

రంలో పార్టీకి మార్గదర్శిగా ఉపకరించింది. బోల్షెవిక్కులు మూడు మౌలిక డిమాండ్లు పెట్టినారు: ప్రజాతంత్ర రిపబ్లిక్, యెనిమిది గంటల పనిదినం, భూ యెస్టేట్లన్నిటినీ స్వాధీనపరుచుకోవడం. అలంకారికంగా యీ డిమాండ్లను "మూడు స్తంభాలు" అన్నారు.

లెనిన్ యెన్నికల ప్రచార పురోగతిని శ్రద్ధగా గమనిస్తూ, యెన్నికలలో కార్మికులు పాల్గొనడానికి యెలా దోహదం కలిగించవలసిందీ 'ప్రావ్దా'కు సూచనలు యిచ్చినాడు. ఫలితాలతో తృప్తిపడడానికి ఆయనకు కారణం వుండింది. రష్యన్ కార్మికవర్గంలో అయిదింట నాలుగువంతులు సాంద్రీకరింపబడిన ఆరు ప్రధాన పారిశ్రామిక గుబెర్నియాలలోనూ కార్మిక నియోజకవర్గాలు దూమకు బోల్షెవిక్ ప్రతినిధులను యెన్నుకున్నాయి.

లెనిన్ బోల్షెవిక్ ప్రతినిధుల పనికి దర్శకత్వం వహించి, ప్రముఖ రాజకీయ సమస్యలమీద వాళ్ల ఉపన్యాసాలు రచించి, దూమను విప్లవ వేదికగా ఉపయోగించడం వాళ్లకు నేర్పినాడు. దూమలోని కార్మికులైన ప్రతినిధుల ప్రథమ ఉపన్యాసాలకు ఆయన వివరంగా ముఖ్యాంశాలు రాసియిచ్చినాడు. యీ ముఖ్యాంశాలు దూమలోని సోషల్ డెమోక్రటిక్ బృందంయొక్క చిత్తు ప్రకటనకు ఆధారమైనాయి. రష్యన్ సోషల్ డెమోక్రసీ సోషలిస్టు కార్మికవర్గపు అంతర్జాతీయ మహాసైన్యంలో ఒక దళమనీ, పెట్టుబడిదారీ వ్యవస్థను అంతరింపజేసే సమయం దగ్గరికి వస్తున్నదనీ, దారిద్ర్యం గానీ, మానవునిమీద మానవుని దోపిడీ గానీ లేని సోషలిస్టు సమాజాన్ని లక్షోపలక్షల సమైక్య కార్మికులు సృష్టిస్తారనీ సోషల్ డెమోక్రటిక్ బృందం సభ్యులు తమ ప్రథమ ఉపన్యాసాలలో ప్రకటించాలని లెనిన్ సలహా యిచ్చినాడు.

బోల్షెవిక్ ప్రతినిధులు లెనిన్ సలహా, సహాయమూ పొందడానికి తరుచు క్రాకొవ్‌కు ఆయనవద్దకు వెళ్లేవాళ్లు. యీ సంభాషణలనూ, సమావేశాలనూ వాళ్లు ప్రగాఢమైన అనురాగంతో స్మరిస్తారు. తాను

లెనిన్‌ను చూడడాన్ని దూమ ప్రతినిధి యం. కె. మురానొవ్ యిలా వర్ణిస్తాడు: "లెనినూ, క్రూప్స్కయా రెండు గదుల చిన్న యింటిలో వుండినారు. సాదా మేజాలూ, కుర్చీలూ, రెండు యినప మంచాలూ, ఒక చౌక బట్టల బీరువా — ఫర్నిచర్ దాదాపు అంతే. కానీ, విడిగా వున్న స్థలమంతా షెల్ఫులలోనూ, కిటికీలలోనూ పేర్చబడి, నేలమీద మట్టసంగా గుట్టలుగా పెట్టబడిన పుస్తకాలతోనూ, పత్రికలతోనూ, వార్తాపత్రికలతోనూ ఆక్రమించబడివుంది."

నీవు చెప్పేది యెంత గాఢ శ్రద్ధతో వినే అసాధారణమైన నేర్పు లెనిన్‌కు వుండిందంటే "నీవు మరింత కచ్చితంగా, మరింత సూటిగా మాట్లాడేటట్లు చేస్తుంది అది. అదే సమయంలో ఒక మామూలు కార్మికుని అయిన నాకు ఆయన తన బౌద్ధిక ఆధిక్యం ఒక క్షణం కూడా అనుభూతం కానిచ్చేవాడు కాదు" అని మురానొవ్ అన్నాడు.

దూమలో తమ కర్తవ్యాన్ని బోల్షివిక్ ప్రతినిధులకు లెనిన్ యెలా వివరించిందీ మరొక దూమ ప్రతినిధి ఎ. వై. బదాయెవ్ చెప్పినాడు. "కార్మికవర్గం బలంగా, శక్తివంతంగా వుందనీ, విప్లవం మళ్లీ లేచి, బ్లాక్ హండ్రెడ్స్‌ను వాళ్ల మంత్రులతో, వాళ్ల ప్రభుత్వంతో సహా తుడిచి పారవేసే రోజు దూరంలో లేదనీ దూమ వేదికనుండి దినదినమూ బ్లాక్ హండ్రెడ్స్‌వాళ్లకు జ్ఞాపకం చేయడం కార్మికుడైన ప్రతినిధి కర్తవ్యం" అని లెనిన్ చెప్పినాడు. కార్మికుడైన ప్రతినిధి ఒక సవరణ, లేదా ఒక బిల్లు కూడా ప్రతిపాదించవచ్చు; కానీ అతని చర్య లన్నిటికీ ఒకే ఒక లక్ష్యం వుండాలి: "అతను జారిస్టు వ్యవస్థను ఖండించాలి, ప్రభుత్వంయొక్క దారుణ నిరంకుశత్వాన్ని బట్టబయలు చేయాలి, కార్మికవర్గపు దళిత స్థితిని గురించీ, పాశవిక దోపిడీని గురించీ మాట్లాడాలి" అని లెనిన్ అన్నాడని బదాయెవ్ చెప్పినాడు.

దూమలోని సోషల్ డెమొక్రటిక్ బృందంలో ఆరుగురు బోల్షివిక్కులూ కాక, పారిశ్రామికేతర గుబెర్నియాలనుండి యెన్నికైన యేడు

గురు మెన్షివిక్కులు వుండినారు. బోల్షివిక్ ప్రతినిధుల కార్యకలాపాలను నిరోధించడానికి మెన్షివిక్ లిక్విడేటర్లు తమ ఏకవ్యక్తి మెజారిటీని ఉపయోగించినారు. కార్మికవర్గ ప్రయోజనాలకు వ్యతిరేకంగా వుండిన మెన్షివిక్ ప్రతినిధుల విచ్ఛేదక చర్యలను 'ప్రావ్ద'ద్వారా లెనిన్ ఖండించి నాడు. ఆరుగురు బోల్షివిక్ ప్రతినిధులకూ యేడుగురు మెన్షివిక్ ప్రతినిధులకూ మధ్య జరిగిన పోరాటాన్ని లెనిన్ యీ మాటల్లో వర్ణించినప్పుడు, దాని సారాన్ని ఆయన సూక్ష్మంగా వెల్లడించినాడు: "కార్మికులు తమ సొంత కార్మికవర్గ పార్టీని నిర్మించుకోకుండా లిక్విడేటర్లు అడ్డుపడడానికి పూనుకున్నారు — 'ఆరుగురికీ, యేడుగురికీ మధ్య' జరిగే పోరాటంయొక్క అర్థము అదే. కానీ వాళ్లు అడ్డుపడలేరు. పోరాటం కష్టమైనది, కానీ కార్మికుల విజయం నిస్సందేహం." కార్మికులలో మెజారిటీయొక్క అండదండలతో బోల్షివిక్ ప్రతినిధులు డూమలో ఒక స్వతంత్ర బృందంగా యేర్పడినారు.

లెనిన్ మార్గదర్శకత్వంకింద కార్మికులైన ప్రతినిధులు ఎ. వై. బదాయెవ్, జి. ఐ. పెత్రోవ్‌స్కీయ్, యం. కె. మురానొవ్, యఫ్. యన్. సమోయ్‌లొవ్, యన్. ఆర్. షగొవ్ సాహసంతో జనాలలో ప్రచారమూ, ఆందోళనా సాగించినారు. వాళ్లు ఫాక్టరీలవద్దా, మిల్లులవద్దా ఉపన్యాసాలు యిచ్చినారు, కొత్త పార్టీ సంస్థలు నెలకొల్పినారు, 'ప్రావ్ద'కు వ్యాసాలు రాసినారు, సమ్మెదార్లకు సహాయం యేర్పాటుచేసినారు, కేంద్ర కమిటీ అప్పగించిన పనులు నిర్వర్తించినారు. వ్యతిరేకంగా వుండిన బ్లాక్ హండ్రెడ్స్‌వాళ్ల డూమలో వాళ్లు కార్మికవర్గ పార్టీ ప్రతిష్ఠను సమున్నతంగా నిలిపినారు. బోల్షివిక్ ప్రతినిధులు "గంభీరోపన్యాసాలలోనూ, బూర్జువా మేధావి వర్గాలలో స్వాగతం పొందడంలోనూ కాక, కార్మిక జనాలతో సంబంధాలు పెట్టుకోవడంలోనూ, ఆ జనాలలో కర్తవ్య నిష్ఠతో పనిచేయడంలోనూ, రహస్య ప్రచారకులుగా, కార్యకర్తలుగా. సాదా, నిరాడంబర, కష్ట, కృతజ్ఞతారహిత, మహా ప్రమాదకరమైన

విధులు నిర్వర్తించడంలోనూ రాణించినారు'' అని లెనిన్ రాసినాడు. సమస్త అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికీ బోల్షివిక్కుల ''పార్లమెంటరీ'' అనుభవంయొక్క ప్రాముఖ్యాన్ని లెనిన్ పదేపదే నొక్కి చెప్పినాడు.

కేంద్ర కమిటీ 1913లో క్రాకొవ్‌లోనూ, పొరోనిన్‌లోనూ పార్టీ కార్యకర్తలతో జరిపిన సమావేశాల నిర్ణయాలు పార్టీనీ, పార్టీ ఐక్యతనూ పటిష్ఠపరచడంలో ముఖ్య పాత్ర వహించినాయి. యీ సమావేశాలకు లెనిన్ అధ్యక్షత వహించినాడు.

వీటికి ఆయన యెంతో ప్రాముఖ్యం యిచ్చినాడు. యీ విషయం, ఉదాహరణకు, క్రాకొవ్ సమావేశం పని జరుగుతూ వుండిన కాలంలో ఆయన పారిస్‌కు పంపిన ఒక ఉత్తరం రుజువుచేస్తుంది. ''నేను సమావేశంలో యీ ఉత్తరం రాస్తున్నాను. యిది అద్భుతంగా సాగుతున్నది. 1912 జనవరి కాన్ఫరెన్సుకంటె దీనికి తక్కువ ప్రాముఖ్యం వుండబోదు. సకల ముఖ్య సమస్యలమీదా, ఐక్యతతో సహా, తీర్మానాలు వుంటాయి.

''సకల తీర్మానాలూ ఏకగ్రీవంగా ఆమోదింపబడుతున్నాయి.... బ్రహ్మాండమైన విజయం!'' విప్లవ కార్మికోద్యమంలో ఐక్యత కొరకు జరిగే పోరాటంయొక్క ప్రత్యేక ప్రాముఖ్యాన్ని సమావేశం నొక్కిచెప్పింది. 'లిక్విడేషనిజంపట్ల వైఖరిమీదా, ఐక్యతమీదా' లెనిన్ ప్రతిపాదించిన తీర్మానంలో, చట్టవ్యతిరేక సంస్థనూ, విప్లవ యెత్తుగడలనూ గుర్తించే ప్రాతిపదికమీద కార్మికులే స్వయంగా సాధించేటట్టి కిందినుండి ఐక్యత, అనే నినాదాన్ని సమావేశం ప్రతిపాదించింది. ''చట్టవ్యతిరేక సంస్థయొక్క ఐక్యతా, దాన్ని నిర్మించడానికి కార్మికులందరికీ విజ్ఞప్తీ పరమ ముఖ్యం'' అని లెనిన్ రాసినాడు.

రష్యానుండి పార్టీ కార్యకర్తల రాక లెనిన్‌కు యెంతో సంతోషం కలిగించింది. ''క్రాకొవ్‌లోని స్థావరం ఉపయోగకరమని తేలింది: మనం

క్రాకొవ్‌కు మారడం 'గిట్టుబాటు అయింది' (ఉద్యమం దృష్ట్యా)"
అని ఆయన 1913 జనవరిలో గోర్కీకి రాసినాడు.

సమావేశంమీద తన "విజ్ఞప్తి"లో లెనిన్ 1912వ సంవత్సరాన్ని రష్యన్ కార్మికవర్గ ఉద్యమంలో గొప్ప చారిత్రక మలుపు అన్నాడు. రష్యాలోని సమ్మె ఉద్యమం పరిమాణంలో ప్రపంచంలో యెక్కడా, యెక్కువ అభివృద్ధి అయిన దేశాలలో కూడా, లేనంత విస్తృతంగా వుందనీ, రష్యా ఒక నూతన విప్లవ విజృంభణ యుగంలో ప్రవేశించిందనీ ఆయన అన్నాడు. బోల్షెవిక్ పార్టీ బలంలోనూ, సంఖ్యలోనూ పెరిగిందనీ, కార్మిక జనాలలో దాని పలుకుబడి విస్తరించిందనీ గాఢ సంతృప్తితో ఆయన గమనించినాడు. విప్లవకరమైన సమ్మెలనూ, ప్రదర్శనలనూ, సభలనూ సకల విధాలా బలపరచడమూ, అభివృద్ధి చేయడమూ, యేర్పాటుచేయడమూ కార్మికులతో ఏకకాలిక, సమైక్య ఆచరణలోకి రైతులను ఆకర్షించడమూ పార్టీ సంస్థల కర్తవ్యమని ఆయన చెప్పినాడు. విప్లవ ప్రయోజనానికి సేవచేయడం ప్రతి పార్టీ సభ్యుని ప్రధాన కర్తవ్యమని లెనిన్ రాసినాడు.

1913 వసంతంలో క్రూప్‌స్కయా ఆరోగ్యం క్షీణించసాగింది. ఆమే, లెనినూ క్రాకొవ్‌నుండి పొరోనిన్ గ్రామానికి మారినారు. మంచి దృశ్యం గల యెత్తైన చోట వాళ్లు ఒక యిల్లు అద్దెకు తీసుకున్నారు. పర్వతాలలో షికార్లు పోవడం లెనిన్‌కు యిష్టం. తీవ్రమైన పని తర్వాత యిది ఆయనకు అభిమాన విశ్రాంతి రూపం. క్రూప్‌స్కయా ఆరోగ్యం మెరుగు కాకపోవడంతో, చికిత్స కొరకు వాళ్లు బెర్న్‌కు (స్విట్జర్లెండ్) పోవలసివచ్చింది. జూలై ఆఖరులో లెనినూ, క్రూప్‌స్కయా పొరోనిన్‌కు తిరిగివచ్చినారు.

స్విట్జర్లెండులో వుండగా లెనిన్ జూరిచ్‌లోనూ, జెనీవాలోనూ, లొసాన్‌లోనూ, బెర్న్‌లోనూ, తర్వాత పారిస్‌లోనూ, లైప్జిగ్‌లోనూ, క్రాకొవ్‌లోనూ జాతీయ సమస్యమీద ఉపన్యసించినాడు. ఆయన ఉప

న్యాసాలు — భావాల గాంభీర్యమూ, కొత్తదనమూ, వాటిని వివరించిన స్పష్టమైన, సరళమైన, శక్తివంతమైన పద్ధతీ — శ్రోతలమీద గాఢమైన ముద్ర వేసినాయి.

ఆనాడు జాతీయ సమస్యకు ప్రత్యేక ప్రాముఖ్యం వుండింది. బూర్జువావర్గమూ, భూస్వాములూ, ప్రపంచ యుద్ధానికి సన్నద్ధమౌతూ, కార్మికవర్గ దళాలను చీల్చే ప్రయత్నంలో జాతీయ ద్వేషాన్ని రెచ్చగొట్టుతూ వుండినారు. జారిస్టు ప్రభుత్వం జాతీయ విమోచనోద్యమాన్ని గొంతు నులుముతూ, ఒక జాతిని మరొక జాతిమీదికి వుసికొల్పుతూ వుండింది. కార్మికోద్యమంయొక్క అంతర్జాతీయ ఐక్యత దాని బలానికి ప్రధాన మార్గమని యెంచి, లెనిన్ ఆ ఐక్యతను సంరక్షించే బాధ్యతను బోల్షివిక్కుల ముందు వుంచినాడు. రష్యాలాంటి బహుజాతీయ దేశంలో, రష్యన్ కార్మికవర్గంయొక్క వర్గపోరాటం పీడిత జాతుల కార్మికుల, శ్రామిక జనాల పోరాటంతో సమ్మిళితం కావడం అత్యంత ముఖ్యం.

'జాతీయ సమస్యమీద విమర్శనాత్మక వివరణలు,' 'జాతుల స్వయంనిర్ణయ హక్కు' అనే తన వ్యాసాలలో లెనిన్ జాతీయ సమస్యమీద మార్క్సిస్టు కార్యక్రమాన్నీ, బోల్షివిక్ పార్టీయొక్క జాతీయ విధానాన్నీ విస్తరించి, సమర్థించినాడు. లెనిన్ రూపొందించిన జాతీయ విధానంయొక్క మౌలిక డిమాండ్లు యివి: సకల జాతులకూ సంపూర్ణంగా సమానమైన హక్కులు, జాతుల స్వయంనిర్ణయ హక్కు (అనగా, విడిపోయి స్వతంత్ర రాజ్యాలుగా యేర్పడే హక్కు), సకల జాతుల కార్మికులూ సమష్టి కార్మిక సంస్థలలో సన్నిహితంగా ఏకం కావడం.

ప్రధానమైన విషయం కార్మికవర్గ అంతర్జాతీయతా పతాక కింద సమీకృతమైన సకల జాతుల కార్మికుల సమైక్యత, అని లెనిన్ నొక్కిచెప్పినాడు. కార్మికవర్గ దళాలలోకి బూర్జువా జాతీయత చొరబడడానికి వ్యతిరేకంగానూ, జాతీయ ఏకాకితనానికీ, సంకుచిత

మనస్తత్వానికీ వ్యతిరేకంగానూ ఆయన రాజీలేని పోరాటం చేసినాడు. యూక్రేనియన్ జాతిని ఏకం చేసే ముసుగులో యూక్రేనియన్ కార్మిక వర్గానికీ, రష్యన్ కార్మికవర్గానికీ మధ్య సంబంధాలను బలహీన పరచడాన్ని ప్రచారం చేసే యూక్రేనియన్ జాతీయవాదులను ఆయన విమర్శించి, యిలా రాసినాడు: "మహా రష్యన్, యూక్రేనియన్ కార్మికుల సమైక్య ఆచరణ వుంటే, స్వతంత్ర యూక్రేన్ సాధ్య మౌతుంది; అలాంటి ఐక్యత లేకుండా అది అసంభవం." జోస్యంలాంటి యీ మాటలు కీయెవ్‌లోని లెనిన్ స్మృతి చిహ్నంయొక్క శిలా వేదికమీద సువర్ణాక్షరాలలో లిఖింపబడివున్నాయి. సకల సోవియట్ జాతుల, సకల ప్రపంచ శ్రామిక ప్రజల మహాదేశికునిపట్ల తమ గాఢమైన అనురాగానికీ, కృతజ్ఞతకూ చిహ్నంగా యూక్రేనియన్ ప్రజలు యీ చిహ్నం స్థాపించినారు.

బోల్షెవిక్ పార్టీ ఒక్కటే సకల పీడిత జాతుల హక్కులకూ, ప్రయోజనాలకూ నిజమైన సంరక్షకుడనీ, భూస్వాములమీదా, పెట్టుబడిదార్లమీదా చేసే పోరాటంలో జాతుల ఐక్యత నాశనం కాని శక్తి అనీ లెనిన్ తన రచనలలో చూపించినాడు.

రష్యాలో విప్లవోద్యమం స్థిరంగా విస్తరిస్తూ వుండింది. 1914 ప్రథమార్ధంలో దాదాపు 15 లక్షల మంది కార్మికులు పాల్గొన్న సమ్మెలు జరిగినాయి. ఆర్థిక సమ్మెలు రాజకీయ సమ్మెలతో లంకెవేయబడినాయి. దేశం మరొక విప్లవంవైపు జరుగుతూ వుండింది. బోల్షెవిక్కులు తమ పార్టీ మహాసభకు సన్నాహాలు చేసినారు. కానీ, సామ్రాజ్యవాద యుద్ధ ప్రారంభం మహాసభ జరగకుండా అడ్డుపడింది.

విప్లవ కార్యకలాపాలలో కాకలు తీరి, బోల్షెవిక్ పార్టీ, లెనిన్ నాయకత్వంకింద, ప్రపంచ యుద్ధం తేబోయే కఠోర పరీక్షలకు సన్నద్ధమయింది.

# కార్మికవర్గ అంతర్జాతీయతకు విధేయత

1914 వేసవిలో ప్రారంభమైన సామ్రాజ్యవాద యుద్ధం పెద్ద సామ్రాజ్యవాద దేశాల బృందాలు రెండింటిమధ్య ఘర్షణ: ఒకవైపున జర్మనీ, ఆస్ట్రియా హంగరీ, టర్కీ, బల్గేరియాలు కూడా, మరొకవైపున బ్రిటన్, ఫ్రాన్సు, రష్యా. రెండు బృందాలూ దురాక్రమణ విధానం అనుసరించినాయి. తదనంతరం అమెరికా సంయుక్త రాష్ట్రాలు, జపాన్, ఇటలీ, తదితర దేశాలు యుద్ధంలో ప్రవేశించినాయి. అది ప్రపంచ యుద్ధం అయింది, ప్రజలకు దారుణమైన ఉత్పాతంగా వుండింది; శ్రామిక జనాలు దానిని భరించవలసివచ్చింది.

యుద్ధం మొదలైనప్పుడు లెనిన్ పారోనిన్‌లో వుండినాడు. మొట్టమొదటినుండి ఆయన యుద్ధానికి తీవ్రమైన వ్యతిరేకి. ఆస్ట్రియన్ అధికార్లు, తప్పుడు సమాచారంమీద ఆధారపడి, జారిస్టు ప్రభుత్వానికి అనుకూలంగా గూఢచారి చర్యలు సాగిస్తున్నాడనే అభియోగంమీద లెనిన్‌ను అరెస్టు చేసినారు. (లెనిన్ యిల్లు సోదా చేసినప్పుడు, వ్యవసాయ సమస్య మీద ఒక లిఖితపత్రం పోలీసులకు దొరికింది; అందులోని గణాంక పట్టికలు రహస్య భాష అని అనుకున్నారు.) అభియోగం తీవ్రమైనది; దానికి మరణ శిక్ష వుంది. పోలెండు, ఆస్ట్రియాలలోని ప్రముఖ పబ్లిక్ వ్యక్తులు లెనిన్ రక్షణకు ముందుకు వచ్చి, ఆయనమీద వున్న అభియోగం అసంబద్ధమైనదని రుజువు చేసినారు. రెండు వారాలు నిర్బంధంలో వుంచిన తర్వాత సైనిక అధికార్లు ఆయన్ను విడుదల చేయవలసి వచ్చింది.

జారిజంకూ, సామ్రాజ్యవాద యుద్ధానికీ వ్యతిరేకంగా కార్మికుల విప్లవ పోరాటాన్ని నడిపించే పనిని, తన అరెస్టు మూలంగా ఆగిపోయి

నట్టిదాన్ని, కొనసాగించడం అత్యవసరమని లెనిన్ భావించినాడు. కానీ, ఆస్ట్రియాలో — యుద్ధమగ్నమైనట్టి దేశంలో — యిది మహా కష్టంగా వుండింది. కనుక ఆయన స్విట్జర్లాండ్‌కు పోవడానికి అనుమతి పొందినాడు. అక్కడ, మొదట బెర్న్‌లోనూ, తరువాత జూరిచ్‌లోనూ, ఆయన 1917 మార్చి 27 (పాత కాలెండరు ప్రకారం) దాకా వుండినాడు.

యుద్ధం అనుకోకుండానే వచ్చిందా? లేదు. పెట్టుబడిదార్లు యుద్ధానికి సన్నద్ధులౌతున్నారని లెనిన్ పదేపదే హెచ్చరించి, దానికి వ్యతిరేకంగా పోరాడవలసిన అవసరాన్ని ఉద్బోధించినాడు. యుద్ధంపట్ల సోషల్ డెమొక్రట్ల యెత్తుగడలు ష్టుట్‌గార్ట్ (1907)లోనూ, బాసెల్ (1912)లోనూ అంతర్జాతీయ సోషలిస్టు మహాసభలలో రూపొందించబడినాయి. పశ్చిమ యూరపియన్ సోషలిస్టు పార్టీల నాయకులు యుద్ధాన్ని వ్యతిరేకించడానికీ, యుద్ధం ప్రారంభమైతే పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోయడానికి కార్మికవర్గాన్ని సమీకరించడానికీ, ప్రతిజ్ఞ బూనినారు. కానీ, యుద్ధం ప్రారంభమైనప్పుడు, యీ పార్టీల నాయకులు కార్మికవర్గానికి ద్రోహంచేసి, బాహాటంగా తమ దేశాల బూర్జువావర్గాల పక్షం వహించినారు. ఫ్రాన్సులో, బ్రిటన్‌లో, బెల్జియంలో సోషలిస్టులు మంత్రివర్గాలలో చేరినారు; జర్మనీలో వాళ్లు యుద్ధరుణాలకు అనుకూలంగా వోటుచేసినారు. వాళ్లు తమ దేశాల సామ్రాజ్యవాద ప్రభుత్వాల విధానాలను సమర్థించి, యుద్ధానికి అండదండలు యివ్వవలసిందిగా తమ జాతులకు విజ్ఞప్తిచేసినారు. వాళ్లు సోషలిజం కొరకు పోరాటమూ, వివిధ దేశాల కార్మికుల వర్గ సంఘీభావమూ, ఆ కార్మికుల అంతర్జాతీయ ఐక్యతా — యివన్నీ శాంతికాలపు పనులనీ, యుద్ధ కాలంలో వాళ్లు తమ బూర్జువా వర్గంతో పోరాటం చేయకూడదనీ, సర్వమూ యుద్ధ ప్రయోజనాలకు లోబరచబడాలనీ వాదిస్తూ, కార్మికులలో జాతీయ దురహంకార ప్రచారం సాగించినారు. అలాంటి అభిప్రాయాలు కలిగిన సోషలిస్టులు సోషల్

జాతీయ దురహంకారవాదులుగా — మాటలలో సోషలిస్టులూ, చేతలలో జాతీయ దురహంకారులూగా — పేరుకెక్కినారు. రష్యాలో ప్లెహానొవ్, అలెక్సిన్స్కియ్, మాస్లొవ్, తదితరులు సోషల్ జాతీయ దురహంకార విధానం అనుసరించినారు.

సోషలిస్టులలో మరొక భాగం, జర్మనీలో కౌట్స్కి, రష్యాలో ట్రాట్స్కి, ఫ్రాన్సులో లోంగె నాయకత్వాన మధ్యమార్గ స్థావరం స్వీకరించినారు; అందువలన వాళ్లకు సెంట్రిస్టులని పేరు వచ్చింది. సెంట్రిస్టులు మాటలలో సోషల్ జాతీయ దురహంకారవాదులతోనూ, వాళ్ల వ్యతిరేకులతోనూ తమ అనంగీకారాన్ని ప్రకటిస్తూ ఫలితంలో సోషల్ జాతీయ దురహంకారవాదులకు సకల విధాల అండదండలూ యిచ్చి, వాళ్ల చర్యలను సమర్థించి, కార్మికులను మోసగించడానికి వాళ్లకు సహాయపడినారు. యిది సోషలిస్టు పార్టీల నాయకులు సోషలిజంకూ, అంతర్జాతీయతకూ చేసిన లజ్జాకరమైన ద్రోహం. యుద్ధానికి వ్యతిరేకంగా సకల దేశాల కార్మికుల పోరాటానికి నాయకత్వం వహించ వలసిన రెండవ ఇంటర్నేషనల్ కూలిపోడానికి అది దారితీసింది. ఇంటర్నేషనల్ విడివిడి, పరస్పర వ్యతిరేక జాతీయ పార్టీలుగా విచ్ఛిన్నమైంది. సోషల్ డెమోక్రసీ నాయకుల ద్రోహం కార్మికోద్యమాన్ని బద్దలు చేసింది. కార్మికులు వెంటనే సంఘటిత పద్ధతిలో యుద్ధానికి వ్యతిరేకంగా పనిచేయలేకపోయినారు.

చరిత్రలోని యీ కీలక తరుణంలో లెనిన్, తాను సృష్టించి పెంచిన బోల్షివిక్ పార్టీతో కలిసి, కార్మికవర్గ అంతర్జాతీయతా పతాకను సమున్నతంగా పట్టుకున్నాడు. యుద్ధంమీద యుద్ధం ప్రకటించ వలసిందిగా లెనిన్ చేసిన సాహసపూరిత ఉద్బోధ ప్రపంచ మంతటా ప్రతిధ్వనించింది. ఆయుధాలు తిప్పవలసింది యితర దేశాలలోని కూలి బానిసలైన మన సోదరులమీదికి కాదు, ప్రగతి వ్యతిరేక బూర్జువా ప్రభుత్వాలమీదికి, అని లెనిన్ చెప్పినాడు. యిది కార్మికవర్గ విప్లవానికి పిలుపు.

సామ్రాజ్యవాద యుద్ధంమీద పోరాటానికి లెనిన్ స్పష్టమైన కార్యక్రమం తయారుచేసినాడు. బెర్న్‌కి పోయిన మరుదినం ఆయన స్థానిక బోల్షెవిక్ బృంద సమావేశంలో ఉపన్యసించినాడు. అందులో ఆయన యుద్ధంపట్ల వైఖరిమీద నివేదిక యిచ్చి, 'యూరపియన్ యుద్ధంలో విప్లవ సోషల్ డెమొక్రసీ కర్తవ్యాలు' అనే తన సూత్రాలను వివరించినాడు. యుద్ధ స్వభావానికీ, కార్మికవర్గంయొక్కా, దాని పార్టీ యొక్కా కర్తవ్యాలకూ, యెత్తుగడలకూ సంబంధించిన ప్రశ్నలకు ఆయన స్పష్టమైన జవాబులు యిచ్చినాడు. ప్రారంభమైన ప్రపంచ యుద్ధం సామ్రాజ్యవాద యుద్ధమని ఆయన స్పష్టం చేసినాడు. యుద్ధం పెద్ద పెట్టుబడిదారీ దేశాల బూర్జువావర్గాలచేత ప్రారంభించబడి, దేశాలను గెలుచుకోవాలనే తమ జాతి వ్యతిరేక పథకాలను అమలుపరిచే ఉద్దేశంతో రష్యా బూర్జువావర్గమూ, జారిజమూ అందులో కలిసినాయి. కార్మికవర్గంయొక్కా, దేశంలోని సకల శ్రామిక జనాలయొక్కా పెరుగుతున్న విప్లవోద్యమాన్ని అరికట్టే సాధనంగా కూడా బూర్జువాలూ, భూస్వాములూ యుద్ధాన్ని పరిగణించినారు.

''మాతృదేశ రక్షణ'' అనే అవకాశవాద విజ్ఞప్తిని లెనిన్ ''సామ్రాజ్యవాద యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చండి,'' తమ తమ దేశాల బూర్జువావర్గాలకు వ్యతిరేకంగా కార్మికవర్గమూ శ్రామిక జనాలూ చేసే యుద్ధంగా మార్చండి, అనే నినాదంతో యెదుర్కొన్నాడు. యీ నినాదం కార్మికవర్గంయొక్కా, సకల శ్రామిక జనాలయొక్కా ప్రాణభూతమైన ప్రయోజనాలను వ్యక్తంచేసి, యుద్ధంపట్ల కార్మికవర్గ యెత్తుగడల మీద అంతర్జాతీయ సోషలిస్టు మహాసభలు చేసిన నిర్ణయాలకు అనుగుణంగా వుండింది. అది బోల్షెవిక్ పార్టీకి ప్రధాన నినాదం అయింది.

పురోగామి దేశాలన్నిటిలోనూ యుద్ధం సోషలిస్టు విప్లవ సమస్యను ముందుకు తెచ్చిందని లెనిన్ గుర్తుచేసినాడు. జాతీయ దురహం

కారాన్ని తిప్పికొట్టడమూ, వర్గ సంఘీభావం కొరకూ, తమ సోషలిస్టు విశ్వాసాల కొరకూ, తమ అంతర్జాతీయత కొరకూ పోరాడడం సోషలిస్టుల యొక్కా, వర్గచైతన్యపూరిత కార్మికులయొక్కా కర్తవ్యం. శ్రామిక జనాలు సంఘటితమై, బూర్జువావర్గంతో నిర్ణయాత్మక పోరాటానికి సన్నద్ధం కావాలి, అంతర్యుద్ధానికి సన్నద్ధం కావాలి. రష్యాలో యిది ప్రధాన కర్తవ్యంతో — జారిస్టు నిరంకుశత్వంమీద పోరాటం కొన సాగించడంతో — ముడివడివుంది. లెనిన్ యీ నినాదం పెట్టినాడు: "యుద్ధంలో మీ సొంత ప్రభుత్వ ఓటమి." యుద్ధరంగంలో ఓటమి కార్మికవర్గ శత్రువులను — పాలక పీడక వర్గాలను — బలహీనపరిచి, ప్రజల విజయాన్ని సులభం చేస్తుంది, అని ఆయన ఉద్ఘాటించినాడు.

కార్మికవర్గ ప్రయోజనాల కొరకు విజయవంతమైన పోరాటం చేయడానికి సకల దేశాల విప్లవ అంతర్జాతీయవాదులు అవకాశవాదులతో, రెండవ ఇంటర్నేషనల్‌తో తెగతెంపులు చేసుకొని, యుద్ధానికి వ్యతిరేకంగా పోరాటం చేయగల చట్టవ్యతిరేక సంస్థలు నెలకొల్పాలని లెనిన్ భావించి నాడు. కొత్త, నిజంగా విప్లవకరమైన, కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌ను సృష్టించాలని ఆయన ఉద్బోధించినాడు.

మొదటి ప్రపంచ యుద్ధంలో బోల్షివిక్ పార్టీయొక్క ముఖ్య కర్తవ్యాలనూ, యెత్తుగడలనూ నిర్వచించిన నినాదాలు అవి. యీ యెత్తుగడలను అవలంబించాలని లెనిన్ సకల దేశాల సోషలిస్టులనూ ఉద్బోధించినాడు. యిందులో వ్యక్తీకరింపబడింది బోల్షివిజంయొక్క కార్మి కవర్గ అంతర్జాతీయత — సామ్రాజ్యవాద యుద్ధ హత్యాకాండకు వ్యతిరే కంగా చేసే పోరాటంలో వివిధ జాతుల కార్మికుల వర్గ సంఘీభావాన్నీ, ఐక్యతనూ సాధించడం లక్ష్యంగా గల బోల్షివిజంయొక్క అంతర్జాతీయత. లెనిన్ సూత్రాలు రష్యాలోనూ, విదేశాలలోనూ పార్టీ సంస్థలచేత ఆమోదింపబడి, ఆచరణాత్మక విప్లవ కార్యకలాపాలకు మార్గదర్శిగా అవలంబింపబడినాయి.

గొప్ప కష్టాలు యెదుర్కొంటూ లెనిన్ పార్టీ కేంద్ర పత్రిక 'సోత్సియాల్ డెమోక్రట్' ప్రచురణను (ఒక సంవత్సరం విరామం తర్వాత) పునరుద్ధరించడంలో కృతకృత్యుడైనాడు. 1914 నవంబర్‌లో వెలువడిన 33వ సంచికలో 'యుద్ధమూ, రష్యన్ సోషల్ డెమోక్రసీ' అనే శీర్షికతో, ఆర్.యస్.డి.యల్.పి. కేంద్ర కమిటీయొక్క ప్రణాళిక ప్రచురింపబడింది; యిది యుద్ధంమీద తన సూత్రాల ఆధారంతో లెనిన్ చేత రచింపబడింది. బోల్షివిక్కుల విప్లవ ఉద్బోధలను రష్యాలోనే కాక, యితర దేశాలలో కూడా వీలైనంత యెక్కువమంది కార్మికులవద్దకు తీసుకపోవడానికి లెనిన్ సకల ప్రయత్నాలూ చేసినాడు. ప్రణాళికను విదేశ భాషల్లోకి అనువదించడానికి ఆయన యేర్పాట్లుచేసి, దాని ప్రతులను వివిధ దేశాల సోషల్ డెమోక్రటిక్ వార్తాపత్రికలకు పంపినాడు. ఆర్.యస్.డి.యల్.పి.(బి.) కేంద్ర కమిటీకీ పార్టీ సంస్థలకూ మధ్య సంబంధాలు పటిష్ఠపరచడంలోనూ, విప్లవ భావాలు ప్రచారం చేయడంలోనూ 'సోత్సియాల్ డెమోక్రట్' వార్తాపత్రిక ప్రచండమైన పాత్ర వహించింది.

లెనిన్ నాయకత్వంకింద బోల్షివిక్ పార్టీ యుద్ధానికి వ్యతిరేకంగా తీవ్రమైన పోరాటం చేసింది. జారిజంకూ, బూర్జువావర్గానికీ వ్యతిరేకంగా చేసే పోరాటానికి సమీకృతం కావడానికి కార్మికులకు తోడ్పడడానికి దూమలోని బోల్షివిక్ ప్రతినిధులు కార్మికులలో విప్లవ కార్యకలాపాలు అభివృద్ధిచేసినారు. లెనిన్ సూచనలమీద, ఆ కాలంలో జరిగిన సకల అంతర్జాతీయ సోషలిస్టు కాన్ఫరెన్సులలోనూ బోల్షివిక్కులు యుద్ధం మీదా, శాంతిమీదా తమ పార్టీ నినాదాలు వివరించినారు.

బోల్షివిక్కులు తమ దేశ ప్రయోజనాలను లక్ష్యంచేయరనీ, దేశభక్తి రహితులనీ బూర్జువావర్గమూ, దాని తాబేదార్లూ – బోల్షివిక్ నినాదాలకు వ్యతిరేకులైన అవకాశవాదులు – చేసే ఆరోపణలు అబద్ధమని లెనిన్ నిరూపించినాడు. యీ నిందాప్రచారకుల యోగ్యతకు

తగినట్లుగా వీళ్లను యెదురు దెబ్బ కొట్టి, నిజమైన దేశభక్తి అర్థాన్ని ఆయన వివరించినాడు.

'మహా రష్యన్ల జాతీయ గర్వం' అనే తన వ్యాసంలో, సోష లిస్టులకూ, వర్గచైతన్యపూరిత కార్మికులకూ జాతీయ గర్వభావం పరా యిది కాదని ఆయన రాసినాడు. వాళ్లు తమ ప్రజలను ప్రేమించి, వాళ్ల విజ్ఞానాభివృద్ధి కొరకూ, జాతీయ, సాంఘిక పీడననుండి వాళ్ల విమోచన కొరకూ పోరాడుతున్నారు. బోల్షివిక్ పార్టీ దేశ ప్రయో జనాలకు అంకితమైందనీ, సరిగా అర్థంచేసుకుంటే, రష్యా కార్మికుల జాతీయ ప్రయోజనాలు ప్రపంచ కార్మికవర్గపు సోషలిస్టు ప్రయో జనాలతో ఏకీభవిస్తాయనీ లెనిన్ గుర్తుచేసినాడు. తమ దేశ స్వాతంత్ర్యం కొరకూ, స్వేచ్ఛ కొరకూ, సోషలిజం కొరకూ జరిగే పోరాటంలో అద్భుత మైన వీరత్వమూ, స్థిరత్వమూ ప్రదర్శించి, శాస్త్రవిజ్ఞానంలోనూ, సంస్కృతిలోనూ ప్రముఖ విజయాలతో మానవజాతిని సంపన్నం చేసిన మహా రష్యన్ ప్రజలను చూసి ఆయన గర్వించినాడు.

యుద్ధంయొక్క నిజమైన స్వభావాన్ని గ్రహించడమూ, యుద్ధం పట్లా, "మాతృదేశ రక్షణ" నినాదంపట్లా తమ వైఖరిని సరిగా నిర్వచించుకోవడమూ కార్మికులకు లెనిన్ నేర్పినాడు. యుద్ధాలలో న్యాయమైనవీ, అన్యాయమైనవీ వున్నాయని ఆయన చెప్పినాడు. అన్యాయ యుద్ధాలు పరదేశాక్రమణ యుద్ధాలు, సామ్రాజ్యవాద యుద్ధాలు, బూర్జువావర్గం ప్రారంభించే యుద్ధాలు. అవి తమ దేశ స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కొరకు పోరాడే జాతుల జాతీయ విమోచనోద్యమాన్ని నలిపివేయడానికి చేసే యుద్ధాలు. అవి తన విమోచనకు పోరాడడానికి లేచిన కార్మికవర్గంమీద బూర్జువావర్గం చేసే యుద్ధాలు. అలాంటి యుద్ధాలు బూర్జువావర్గ పాలనను పటిష్ఠపరచడానికీ, యితర జాతు లను కొల్లగొట్టడానికీ, బానిసలను చేయడానికీ చేయబడతాయి. అందు

కనే కార్మికులు అలాంటి యుద్ధాలను వ్యతిరేకించి, "మాతృదేశ రక్షణ" నినాదం తమను మోసగించడానికి ఉద్దేశింపబడిందని గుర్తించాలి.

న్యాయమైన యుద్ధాలు సామ్రాజ్యవాద దురాక్రమణదారులకు వ్యతిరేకంగా జాతులు చేసే ఆత్మరక్షణార్థక యుద్ధాలూ, జాతీయ విమోచన యుద్ధాలూ, పెట్టుబడిదారీ దాస్యంనుండి విముక్తి కొరకు కార్మికవర్గం చేసే అంతర్యుద్ధాలూ, సామ్రాజ్యవాద దాడినుండి సోషలిస్టు రాజ్యాలను రక్షించడానికి చేసే యుద్ధాలూ. న్యాయమైన యుద్ధాలలో కార్మికులు "మాతృదేశ రక్షణ" నినాదాన్ని సమర్థించాలి. "1914–1916 సామ్రాజ్యవాద యుద్ధంలోనూ, సామ్రాజ్యవాద యుగానికి సహజమైన యితర సామ్రాజ్యవాద యుద్ధాలలోనూ మాతృదేశ రక్షణకూ, ఆత్మరక్షణార్థక స్థావరానికీ మనం వ్యతిరేకం" అని ఆయన రాసినాడు. "కానీ, సామ్రాజ్యవాద యుగంలో కూడా 'న్యాయమైన,' 'ఆత్మరక్షణార్థక,' విప్లవ యుద్ధాలు వుండవచ్చు." అన్యాయ యుద్ధాలకు వ్యతిరేకంగా చేసే పోరాటంలో వివిధ దేశాల కార్మికుల అంతర్జాతీయ సంఘీభావం ప్రధాన పాత్ర వహించాలని లెనిన్ వివరించినాడు.

యుద్ధకాలంలో సోషల్ డెమోక్రటిక్ కార్యకలాపాలకు సంబంధించిన ముఖ్య సమస్యలన్నిటినీ చర్చించడానికి పార్టీ మహాసభ జరపడం విధాయకంగా వుండింది. కానీ, యుద్ధకాల పరిస్థితులలో అది అసాధ్యంగా వుండింది. మహాసభకు బదులు విదేశాలలోని బోల్షెవిక్ సంస్థల కాన్ఫరెన్సు 1915 ఫిబ్రవరిలో బెర్న్‌లో జరిగింది. కాన్ఫరెన్సుకు లెనిన్ అధ్యక్షత వహించినాడు. ఆయన 'యుద్ధమూ, పార్టీ కర్తవ్యాలూ' అనే నివేదిక యిచ్చి, యుద్ధ స్వభావమూ, "మాతృదేశ రక్షణ" నినాదమూ, జారిస్టు రాజరికాన్ని ఓడించడమూ, యితర పార్టీలపట్లా, బృందాలపట్లా వైఖరీ, వగైరాలాంటి ముఖ్య సమస్యలన్నిటిమీదా చిత్తుతీర్మానాలు సమర్పించినాడు. జనాల విప్లవ ఆచరణకు పూర్తి

అండదండలు యివ్వడంద్వారానూ, దాన్ని అభివృద్ధి చేయడంద్వారానూ, కార్మికవర్గ ఐక్యతను పటిష్ఠపరచడంద్వారానూ మాత్రమే యుద్ధం అంతం చేయబడగలదనీ, నిజమైన ప్రజాస్వామిక శాంతి నెలకొల్పబడ గలదనీ యీ తీర్మానాలు నొక్కిచెప్పినాయి. సోషలిస్టుల తక్షణ కర్తవ్యాలు యిలా వుండినాయి: యుద్ధ రుణాలకు వ్యతిరేకంగా వోటుచెయ్యడం; బూర్జువా ప్రభుత్వాలనుండి తమ ప్రతినిధుల ఉపసంహరణను డిమాండు చెయ్యడం; చట్టవ్యతిరేక సంస్థలు నెలకొల్పడం; యుద్ధ రంగంలోని సైనికులమధ్య చెలిమికీ, కార్మిక ప్రజల విప్లవ చర్యల కన్నిటికీ అండ దండలు యివ్వడం. యీ కాన్ఫరెన్సు నిర్ణయాలకు మహాసభ నిర్ణయాల బలం వుండింది; యివి యుద్ధ వ్యతిరేక పోరాటంలో జనాలను సమీ కరించే పనిలో పార్టీ సంస్థలకు మార్గదర్శిగా ఉపకరించినాయి.

ఒక క్షణం విఘ్నం లేకుండా లెనిన్ తన పార్టీ పని సాగించినాడు. ఆయన జూరిచ్, మోంత్రో, బెర్న్, జెనీవా, తదితర స్విస్ పట్టణాలలో ఉపన్యాసాలు యిచ్చినాడు, సామ్రాజ్యవాద ప్రభుత్వాల రక్తపాతపు నేరా లనూ, ఆ ప్రభుత్వాలతో అవకాశవాదుల సహకారాన్నీ ఆగ్రహపూరితంగా ఖండించినాడు. రెండవ ఇంటర్నేషనల్ తన శ్రేణులలో అవకాశవాదులను సహించినందున అది కూలిపోయిందని ఆయన చూపించినాడు. అవకాశ వాదులు శాంతికాలంలో కార్మికుల పార్టీలలోపల బూర్జువావర్గ ప్రయో జనాల కొరకు రహస్యంగా పనిచేసిన కార్మికవర్గ శత్రువులని లెనిన్ రాసినాడు. యుద్ధకాలంలో వాళ్లు బాహాటంగా కార్మికులకు వ్యతిరేకంగా బూర్జువావర్గ పక్షం వహించి, జాతీయ దురహంకార విధానాన్ని అనుసరించినారు. వాళ్లతో చురుకుగా పోరాటం చేయాలని ఆయన డిమాండు చేసినాడు. "మనం ఓర్పుగా వుండజాలం, లౌక్యంగా వుండ జాలం, లజ్జాకరమైన జాతీయ దురహంకారాన్ని మనం మన శక్తి అంతటితోనూ వ్యతిరేకించాలి!!" అని ఆయన రాసి, ప్రతి దేశంలోనూ

సోషలిస్టుల ప్రథమ కర్తవ్యం తమ దేశంలోని జాతీయ దురహంకారులతో పోరాడడం అనే విషయాన్ని నొక్కిచెప్పినాడు.

సెంట్రిస్టులను – కౌట్స్కీ, ట్రాట్స్కీ, తదితరులను – విమర్శించడంలో లెనిన్ మరీ తీవ్రంగా వుండినాడు. "యిప్పుడు నాకు కౌట్స్కీ అంటే యెప్పుడూ లేనంత ద్వేషం, అసహ్యం" అని ఆయన రాసినాడు. "అవకాశవాదులు కండ్లకు కనపడే దుష్టశక్తి. కౌట్స్కీ నాయకత్వాన వున్న జర్మన్ 'సెంటర్' ప్రచ్ఛన్న దుష్టశక్తి, లౌక్యంగా రంగుపూయబడింది, కార్మికుల కండ్లనూ, మనస్సునూ, అంతరాత్మనూ మైలపరిచేది, అన్నిటికంటె ప్రమాదకరమైనది."

మార్క్సిజంను వికృతపరచడానికి అవకాశవాదులు చేసే ప్రయత్నాలను లెనిన్ తనకు అంత విలక్షణమైన విప్లవ సమరశీల మార్క్సిస్టు ఆవేశంతో గుట్టుకడిగినాడు. యుద్ధ సంవత్సరాలలో లెనిన్ రష్యన్ సోషల్ డెమొక్రట్లలోని అవకాశవాదపు నూతన వ్యక్తీకరణలతో పోరాటం చేయవలసివచ్చింది. బుహారిన్, ప్యతకోవ్ బృందంయొక్క తప్పు అభిప్రాయాలను గుట్టుకడగడానికి ఆయన తగినంత శ్రద్ధ అర్పించినాడు; వాళ్లు సోషలిజం కొరకు చేసే పోరాటానికీ, ప్రజాస్వామ్యం కొరకు చేసే పోరాటానికీ సంబంధం లేదని అన్నారు. ప్రజాస్వామ్యం కొరకు చేసే పోరాటం సోషలిజంను దగ్గరికి తెస్తుందని వాళ్లు గ్రహించలేక పోయినారు. ఆ కాలంలో బుహారిన్ రాజ్య సమస్యమీదా, కార్మికవర్గ నియంతృత్వంమీదా అర్ధ అరాజకవాద స్థావరం అవలంబించినాడు. యీ బృందంపట్ల జి. జినోవ్‌యెవ్ రాజీ స్థావరం స్వీకరించినాడు. అతను కూడా యుద్ధ సమస్యమీద మార్క్సిజంనుండి వైదొలగే నేరం చేసినాడు; అందుకుగాను అతన్ని లెనిన్ తీవ్రంగా విమర్శించినాడు. అవకాశవాదంమీద లెనిన్ పోరాటం ఆయనకు ఆయన రాజకీయ వ్యతిరేకుల ద్వేషాన్ని సంపాయించిపెట్టింది. ఒక జాబులో ఆయన యిలా రాసినాడు: "అది అంతే, నా రాత. ఒకటి తర్వాత ఒకటి పోరాటపు దండయాత్ర –

రాజకీయ మతిమాలినతనంమీదా, అల్పబుద్ధిమీదా, అవకాశవాదంమీదా, వగైరా.

"యిది 1893నుండి సాగుతున్నది. దాని మూలంగా అల్ప బుద్ధుల ద్వేషం కూడా అలాగే సాగుతున్నది. కానీ, యీ రాతకు బదులు అల్పబుద్ధులతో 'శాంతి'ని నేను కోరుకోను."

అంతర్జాతీయ అవకాశవాదంమీదా, దాన్ని సమర్థించే కౌట్స్కీయైట్లమీదా రాజీలేని పోరాటం చేసే కర్తవ్యాన్ని లెనిన్ బోల్షివిక్కుల ముందు వుంచినాడు. యిది అంతర్జాతీయ కర్తవ్యమని ఆయన గుర్తుచేసినాడు. యిది మనమీద పడింది, మరెవరూ లేరు. దీనినుండి మనం తిరోగమించకూడదు.

లెనిన్‌యొక్క ఆవేశపూరిత సత్యవాక్కులు సకల అడ్డంకులనూ, యుద్ధశ్రేణులనూ దాటి ప్రగతిశీల భావాలు గల కార్మికులకు చేరినాయి. కఠినమైన యుద్ధకాలపు చట్టాలు వుండినప్పటికీ, లెనిన్ రష్యాలోని బోల్షివిక్ సంస్థలతో సంబంధాలు పునస్థాపించుకోవడంలో కృతకృత్యుడైనాడు; జారిజంతోనూ, బూర్జువావర్గంతోనూ యెలా పోరాడవలసిందీ, సామ్రాజ్యవాద యుద్ధంతో యెలా పోరాడవలసిందీ సూచనలు యిస్తూ ఆయన వాటికి ఉత్తరాలూ, వ్యాసాలూ పంపినాడు.

కష్టాలు అపారంగా వుండినాయి. జారిజం బోల్షివిక్కులమీద కసాయి దమనకాండ ప్రారంభించింది. దూమలోని బోల్షివిక్ ప్రతినిధులు, వాళ్ల విప్లవ కార్యకలాపాలకుగాను, సైబీరియాకు ప్రవాసం పంపబడినారు. కేంద్ర కమిటీమీదా, పెట్రోగ్రాడ్* కమిటీమీదా, యింకా అనేక యితర పార్టీ సంస్థలమీదా పదేపదే దాడులు చేయబడినాయి. విప్లవ భావాలు గల పురోగామి కార్మికులు సైబీరియాకు ప్రవాసం

---

* సెంట్ పీటర్స్‌బుర్గ్ పేరు 1914 ఆగస్టులో పెట్రోగ్రాడ్ అని మార్చబడింది. – సం.

పంపబడినారు, లేదా యుద్ధరంగానికి పంపబడినారు. కానీ లెనిన్‌కు పార్టీ బలంలోనూ, రష్యా కార్మికవర్గ బలంలోనూ, సకల అడ్డంకులనూ అధిగమించడానికి వాటికి గల సామర్థ్యంలోనూ దృఢమైన విశ్వాసం వుండింది. "మన పార్టీ పని యిప్పుడు నూరురెట్లు కష్టమైంది. అయినా మనం దాన్ని కొనసాగిస్తాం! 'ప్రావ్ద' వేలకొలది వర్గచైతన్య పూరిత కార్మికులను తయారుచేసింది. వాళ్లనుండి కొత్త సమష్టి నాయకత్వం – పార్టీయొక్క రష్యన్ కేంద్ర కమిటీ – నిర్మింపబడుతుంది" అని లెనిన్ రాసినాడు.

పార్టీకి వ్యతిరేకంగా జారిస్టు ప్రభుత్వం పెద్ద గోల చేసినప్పటికీ, పార్టీ యుద్ధానికి వ్యతిరేకంగా చురుకైన పోరాటం చేసింది. అది కార్మికవర్గాన్నీ, శ్రామిక ప్రజలనూ రాబోయే విప్లవానికి సన్నద్ధులను చేసింది. 'సోత్సియాల్ డెమోక్రట్'లో ప్రచురింపబడిన వ్యాసాలలో లెనిన్ పార్టీకీ, కార్మికవర్గానికీ ఉత్పన్నమైన సమస్యల కన్నిటికీ సమాధానాలు యిచ్చినాడు. విప్లవం కనుచూపుమేరలో వుందని ఆయన నమ్మినందున, విప్లవంలో పార్టీ పంథాను ఆయన జాగ్రత్తగా రూపొందించినాడు. 'కొన్ని ప్రధానాంశాలు' అనే వ్యాసంలో 1915లో ఆయన యిలా రాసినాడు: "ప్రస్తుత యుద్ధంలో విప్లవం కార్మికవర్గ పార్టీ చేతిలో అధికారం వుంచితే, అది యేమి చేస్తుంది అనే ప్రశ్నకు మా సమాధానం యిది: వలసలకూ, పరాధీనంగా, పీడింపబడుతూ, హక్కులు తొలగింపబడివున్న జాతుల కన్నిటికీ స్వేచ్ఛ యిచ్చే షరతుమీద సకల యుద్ధమగ్న దేశాలకూ మేము శాంతి ప్రతిపాదిస్తాము." మరి యిది రష్యా కార్మికవర్గం అధికారం స్వీకరించి, బోల్షెవిక్ పార్టీ పాలక పార్టీ అయిన వెంటనే చేయబడింది.

అత్యంత కఠినమైన యుద్ధకాల పరిస్థితులలో పార్టీ, లెనిన్ నాయకత్వాన, తన అంతర్జాతీయ విప్లవ కర్తవ్యాన్ని నిర్వహించి, కార్మికవర్గ, శ్రామిక జనాల ప్రయోజనాల కొరకూ, కార్మికవర్గ

అంతర్జాతీయతా సూత్రాల అమలు కొరకూ యెలా పోరాడవలసిందీ కార్మికుల పార్టీల కన్నిటికీ చూపించింది.

శ్రమ అనకుండా, పట్టుదలగా లెనిన్ పశ్చిమ యూరపియన్ పార్టీలలో కార్మికవర్గ అంతర్జాతీయతను అనుసరించేవాళ్లను సమీకరించి, ఏకం చేసినాడు. ఆయన బల్గేరియా, హాలండ్, స్వీడెన్, నార్వే, తదితర దేశాల వామపక్ష సోషలిస్టులతో ఉత్సాహపూరితమైన ఉత్తరప్రత్యుత్తరాలు జరిపి, అవకాశవాదులతో తెగతెంపులు చేసుకొమ్మనీ, చీలిపోయిన రెండవ ఇంటర్నేషనల్ స్థానంలో మూడవ, కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌ను సృష్టించమనీ వాళ్లను ఉద్బోధించినాడు.

రష్యన్ బోల్షివిక్కులూ, పశ్చిమ యూరప్ సోషల్ డెమొక్రటిక్ పార్టీలలో వాళ్లను అనుసరించే వామపక్షీయులూ ఆనాటి కార్మికోద్యమంలో తృణప్రాయమైన మైనారిటీగా వుండినారు. కానీ విప్లవ మార్క్సిజం గెలుపొందక తప్పదని లెనిన్ దృఢంగా విశ్వసించినాడు. బోల్షివిక్కులు సంఖ్యలో కొద్దిమంది అయినా పరవాలేదు, వాళ్లకు లక్షోపలక్షల అండదండలు వుంటాయి, యెందుకంటే బోల్షివిక్కుల స్థావరం ఒక్కటే సరైనది, అని ఆయన అన్నాడు.

విప్లవ అంతర్జాతీయవాదుల ఐక్యత మార్క్సిజంయొక్క సిద్ధాంత స్థావరాల పునాదిమీద నిర్మింపబడాలని లెనిన్ భావించినాడు. యుద్ధం సోషల్ డెమొక్రట్లముందు వుంచిన సమస్యల నన్నిటినీ మరింత పూర్తిగా స్పష్టపరచడానికి లెనిన్ 'సోషలిజమూ, యుద్ధమూ' అనే తన పుస్తకం ప్రచురించినాడు. యీ పుస్తకం రష్యన్, జర్మన్, ఫ్రెంచి, నార్వీజియన్, తదితర భాషల్లో వెలువడింది; యిది విప్లవ అంతర్జాతీయవాదులలో ఐక్యతకు ముఖ్యమైన పాత్ర వహించింది.

వామపక్ష అంశాలను ఏకంచేయడానికీ, అవకాశవాదులతో పోరాడడానికీ లెనిన్ త్సిమ్మెర్‌వాల్డ్ (1915 సెప్టెంబర్)లోనూ, కింతాల్ (1916 ఏప్రిల్)లోనూ జరిగిన అంతర్జాతీయ సోషలిస్టు కాన్ఫరెన్సులను

వినియోగించుకున్నాడు. త్సిమ్మెర్‌వాల్డ్‌లో లెనిన్ ఒక వామపక్ష బృందాన్ని సృష్టించడంలో కృతకృత్యుడైనాడు; అది కార్మికులలో విప్లవ ప్రచారం చురుకుగా సాగించింది. త్సిమ్మెర్‌వాల్డ్ వామపక్ష అనుయాయులు చాలామంది యుద్ధానికీ, అవకాశవాదులకూ వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ముఖ్యమైన పాత్ర నిర్వహించి, తరువాత తమ తమ సొంత దేశాలలో కమ్యూనిస్టు పార్టీలను స్థాపించే పనిలోనూ, నూతన, నిజంగా విప్లవ కరమైన మూడవ ఇంటర్నేషనల్‌ను స్థాపించే పనిలోనూ చురుకైన భాగస్వాములైనారు.

లెనిన్ పనియొక్క ప్రచండమైన ప్రమాణం ఆయనకు పెద్ద భారంగా వుండింది. ఆయన చాలా బీద పరిస్థితులలో జీవిస్తూవుండినాడు. అంత లేమిడి ఆయన యెన్నడూ అనుభవించలేదు. ఆయన రచనలు ఆయన ప్రధాన ఆదాయ మార్గం; కానీ యుద్ధ వ్యతిరేక వ్యాసాలకూ, పుస్తకాలకూ ప్రచురణకర్త దొరకడం కష్టంగా వుండింది. ఒక కామ్రేడ్‌కు రాసిన జాబులో ఆయన యిలా అన్నాడు: "వ్యక్తిగతంగా నా విషయం యేమిటంటే, నేను సంపాయించుకోవలసిన అవసరం వుంది. లేకపోతే, మేము కేవలం ఆకలితో చస్తాము, నిజంగా!! జీవన వ్యయం విపరీతంగా వుంది, బతకడానికి యే ఆధారమూ లేదు."

లెనిన్ చాలా సాదాగా జీవిస్తూ, అత్యంత సాదా అయిన దుస్తులతోనూ, కేవలం అవసరమైన వస్తువులతోనూ తృప్తిపడినాడు. జూరిచ్‌లో ఆయనా, ఆయన భార్యా ఒక యిరుకు వీధిలో, చిన్న పెరడు గల ఒక పాత మబ్బు టింట్లో నివసించినారు. కమ్మెరెర్ అనే చర్మకారునితో అద్దెకు తీసుకున్న వాళ్ల గది చీకటిగా, అసౌకర్యంగా వుండింది. తన స్మృతులలో క్రూప్‌స్కయా యిలా రాసింది: "అదే డబ్బుకు మేము అంతకంటె చాలా మంచి గది అద్దెకు తీసుకొని వుండగలం, కానీ మా యింటివాళ్లంటే మాకు యిష్టం. అది విప్లవ దృక్పథం గల కార్మికవర్గ కుటుంబం;

వాళ్ళు సామ్రాజ్యవాద యుద్ధాన్ని ఖండించినారు.... జాతీయ దురహం కారం సూచనప్రాయంగా కూడా లేదు. ఒకసారి మొత్తం ఒక స్త్రీల అంతర్జాతీయ బృందం స్విట్జర్లాండ్ చేరినప్పుడు శ్రీమతి కమ్మెరెర్ ఆగ్రహంతో అన్నది: 'సైనికులు న్యాయంగా తమ ప్రభుత్వాలమీదికి ఆయుధాలు మళ్లించాలి!' అటు తర్వాత మరొక యింటికి మారే మాట ఇల్యీచ్ చెవిని చొరనివ్వలేదు.'' లెనిన్ పుస్తకాలకూ, తాను నిత్యం పని చేసుకునే గ్రంధాలయాలకూ డబ్బు ఖర్చుపెట్టడానికి యెప్పుడూ వెనుకాడ లేదు. యింటివద్ద ఆయనకు వివిధ భాషలలో పుస్తకాలూ, వార్తా పత్రికలూ, పత్రికలూ కుప్పలు తెప్పలుగా వుండినాయి. ఆర్థిక పరిస్థి తులు యెలా వుండినప్పటికీ, లెనిన్ నిత్యం కష్టపడి పనిచేసేవాడు, యెల్లప్పుడూ ఆయన సమయం హేతుబద్ధంగా, సమర్థవంతంగా క్రమ బద్ధం చేయబడివుండేది.

విప్లవోద్యమాన్ని నడిపించే ఆచరణాత్మక పని కాక, తీవ్ర సిద్ధాంత కృషికి లెనిన్ చాలా సమయం అర్పించినాడు. వివిధ దేశాల సాంఘిక చరిత్రను వివరించే ప్రపంచ సాహిత్యాన్ని ఆయన గాఢంగా అధ్యయనం చేసి నాడు. ఆయనకు తత్వశాస్త్రంలో, అర్థశాస్త్రంలో, ఇంజనీరింగులో, పరిశ్రమలలో, వ్యవసాయంలో, కార్మికవర్గ విప్లవోద్యమంలో, వలస, పరాధీన దేశాల పీడిత ప్రజల పోరాటంలో, యింకా అనేక యితర సమస్య లలో ఆసక్తి వుండింది. ఆయన మార్క్స్, ఎంగెల్సుల రచనలను మరీ గాఢంగా అధ్యయనం చేసినాడు, వాళ్ల రచనలు మళ్లీ మళ్లీ చదివి నాడు, క్రూప్స్కయా అన్నట్లు, ''సోషలిస్టు విప్లవ యుగాన్నీ, దాని మార్గాలనూ, అభివృద్ధినీ మరింత స్పష్టంగా అవగాహన చేసు కోడానికి.''

మానవజాతి యిప్పుడు ప్రవేశించిన నూతన యుగంయొక్క సారాన్ని వెల్లడించిన మొదటి మార్క్సిస్టు లెనిన్. యిరవయ్యవ శతాబ్దినాటికి పెట్టుబడిదారీ వ్యవస్థ తన అభివృద్ధిలో నూతన దశ అయిన సామ్రాజ్య

వాద దశలో ప్రవేశించిందని ఆయన 'సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క అత్యున్నత దశ' అనే గ్రంథంలో చూపించినాడు.

సామ్రాజ్యవాదంలో గొప్ప గుత్త సంస్థలు అవతరించినాయి. అందువలన లెనిన్ సామ్రాజ్యవాదాన్ని గుత్త పెట్టుబడిదారీ వ్యవస్థ అన్నాడు. ప్రపంచంలోని ముడిసరుకుల నిధులలో, పరిశ్రమలలో, మార్కెట్లలో విస్తారమైన భాగాన్ని గుత్త సంస్థలు అదుపులో పెట్టుకున్నాయి. అవి బూర్జువా దేశాల ఆర్థిక, రాజకీయ జీవితంమీద పెత్తనం చేయనారంభించి, తమ అభీష్టాన్ని ప్రభుత్వాలకు ఆజ్ఞాపించసాగినాయి. యావత్ ప్రపంచమూ కొద్దిపాటి సామ్రాజ్యవాద దేశాల మధ్య పంపకమైపోయింది. అసమాన ఆర్థిక, రాజకీయ అభివృద్ధి ప్రక్రియ తీవ్రతరమైంది. పెట్టుబడిదారీ వ్యవస్థ ఆలస్యంగా అభివృద్ధి అయిన జర్మనీ, జపాన్, అమెరికా సంయుక్త రాష్ట్రాల లాంటి దేశాలు బ్రిటన్, ఫ్రాన్సు లాంటి పురోగామి పెట్టుబడిదారీ దేశాలతో వేగంగా సమానమై, ప్రపంచ పునర్విభజనను డిమాండు చేసినాయి. పెట్టుబడిదారీ దేశాల మధ్య వైరుధ్యాలు తీవ్రతరమైనాయి. యీ పరిస్థితులలో సామ్రాజ్యవాద యుద్ధాలు అనివార్యం.

తమ లాభాల వేటలో సామ్రాజ్యవాదులు కార్మికులమీదా, మొత్తం శ్రామిక జనాలమీదా దోపిడీని తీవ్రతరం చేసి, వాళ్ల పరిస్థితిని దుర్భరం చేసినారు. కార్మికవర్గం విప్లవ అవసరాన్ని గుర్తించసాగింది. అదే సమయంలో కొద్దిపాటి సామ్రాజ్యవాద దేశాలకూ, కోటానుకోట్ల ప్రజలు బానిసలుగా చేయబడినట్టి వాటి వలసలకూ, అర్ధవలసలకూ మధ్య వైరుధ్యాలు తీవ్రతరమైనాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ సమాజ అభివృద్ధికి తీవ్రమైన ఆటంకంగా తయారైంది. "ముందు ప్రగతిశీలంగా వుండిన పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రగతి వ్యతిరేకం అయింది" అని లెనిన్ రాసినాడు. "...సోషలిజంను అవలంబించడమూ, లేక వలసలద్వారా, గుత్తసంస్థలద్వారా, అధిక సౌకర్యాలద్వారా, రకరకాల జాతీయ

పీడనద్వారా పెట్టుబడిదారీ వ్యవస్థను కృతకంగా నిలిపివుంచడానికి 'గొప్ప' రాజ్యాల మధ్య సాయుధ పోరాటాన్ని సంవత్సరాల తరబడి, దశాబ్దాల తరబడి కూడా, అనుభవించడమా అనేది మానవజాతిని యెదుర్కొన్నది." సామ్రాజ్యవాదం మానవజాతిని సోషలిస్టు విప్లవానికి నడిపిస్తున్నదనీ, సోషలిస్టు విప్లవాన్ని యీనాటి అత్యవసర కర్తవ్యంగా చేస్తున్నదనీ, సామ్రాజ్యవాదం సోషలిస్టు విప్లవంయొక్క ప్రాంగణమనీ లెనిన్ గుర్తు చేసినాడు.

కార్మికవర్గ విప్లవ విజయ సంభావ్యతా సమస్యపట్ల లెనిన్ కొత్త వైఖరి అవలంబించినాడు. అంతకుముందు మార్క్సిస్టులు ఒక దేశంలో సోషలిస్టు విప్లవ విజయం అసంభవమని నమ్మినారు. అభివృద్ధి అయిన పెట్టుబడిదారీ దేశాలలో అన్నిటిలోనూ, లేదా అత్యధిక భాగంలో ఏకకాలంలో జరిగితేనే విప్లవం విజయవంతం కాగలదని వాళ్ళు ఊహించినారు. సామాజిక అభివృద్ధికి సంబంధించిన నూతన సమాచారం ఆధారంతో లెనిన్, సోషలిస్టు విప్లవం ప్రారంభంలో కొన్ని పెట్టుబడిదారీ దేశాలలో, విడిగా వున్న ఒక్క పెట్టుబడిదారీ దేశంలో కూడా, విజయవంతం కాగలదనే నిర్ణయానికి వచ్చినాడు.

యిది ప్రచండమైన ప్రాముఖ్యం గల శాస్త్రీయ ఆవిష్కరణ. అది కార్మికులకు సామ్రాజ్యవాద యుద్ధంనుండి బయటపడే మార్గాన్నీ, సామ్రాజ్యవాదం సృష్టించిన కష్టాలనుండి తప్పించుకునే మార్గాన్నీ చూపించింది: ప్రతి దేశపు కార్మికవర్గమూ యితర దేశాలలో విప్లవ సన్నివేశం పక్వమైందాకా వేచివుండనక్కరలేదు. కార్మికవర్గం తన సొంత దేశంలో బూర్జువావర్గాన్ని కూలదోయడానికీ, అధికారం వశంచేసుకోడానికీ, సోషలిజంకు పరివర్తనను సాధించడానికీ కృషి చేయాలి.

సకల దేశాలూ సోషలిజంకు చేరుకోవడం అనివార్యమని ఒకవైపున రుజువులు చూపిస్తూ, అదే సమయంలో లెనిన్, సోషలిస్టు విప్లవం ఒకరి కోరికనుబట్టీ, ఉత్తరువునుబట్టీ జరగజాలదని గుర్తుచేసినాడు. అది

భిన్న దేశాలలో భిన్న కాలాలలో పక్వమౌతుంది; ప్రతి దేశమూ సోషలిస్టు పరివర్తనయొక్క యేదో ఒక రూపానికీ, వేగానికీ తన సొంతంది యేదో కొంత యిస్తుంది. లెనిన్ సిద్ధాంతం సోషలిస్టు విప్లవ విజయంలో కార్మికుల విశ్వాసాన్ని పటిష్ఠపరిచి, వాళ్ల విప్లవ చొరవకూ, శక్తులకూ దోహదం కలిగించింది. లెనిన్ బోధలు సరైనవని రుజువు చేసే ఘటనలు త్వరలోనే జరిగినాయి.

యుద్ధం మానవ ప్రాణాలను అపారంగా బలితీసుకొని, విస్తారమైన భౌతిక వనరులను ఖర్చుచేసి, కార్మిక కర్షకుల భుజాలమీద క్రుంగదీసే భారం మోపింది. జనాల బాధలు సకల దేశాలలోనూ యుద్ధ వ్యతిరేక విప్లవోద్యమానికి వూపు యిచ్చినాయి. సమ్మెలూ, ప్రదర్శనలూ, యితర కార్మికవర్గ నిరసన రూపాలూ మరింత తరుచైనాయి.

రష్యా విప్లవ కార్మికులు, లెనిన్ పార్టీచేత నడిపించబడి, యుద్ధానికి వ్యతిరేకంగా పోరాడే అంతర్జాతీయ కార్మికవర్గంలో అగ్రదళాలలో వుండినారు. సైనిక పరాజయాలూ, ఆర్థిక వినాశనమూ, కరవూ జారిజం తుదముట్ట కుళ్లిపోయిందనీ, దేశాన్ని పాలించడానికి బొత్తిగా అసమర్థమనీ చూపించినాయి. జారిజంయొక్క విధానంపట్ల ప్రజలలో సకల భాగాలలోనూ అసంతృప్తి పెరిగింది. రష్యాలో రాబోతున్న విప్లవాన్ని లెనిన్ స్పష్టంగా చూసి, జోస్యం చెప్పినాడు. నిజమే, విప్లవం త్వరలో ప్రారంభమైంది.

జారిజంమీద మొదటి తిరుగుబాటు చేసినవాళ్లు పెట్రోగ్రాడ్ కార్మికులు. 1917 జనవరి 9న, రక్తపాత ఆదివారపు వార్షికదినంనాడు, పెట్రోగ్రాడ్‌లో గొప్ప యుద్ధ వ్యతిరేక ప్రదర్శన జరిగింది. మాస్కోలోనూ, బాకూలోనూ, నీజ్ని - నొవ్‌గొరొద్‌లోనూ అలాంటివే ప్రదర్శనలు జరిగినాయి. అప్పటినుండి రష్యా అంతటా రోజురోజుకూ కార్మికుల విప్లవ ఆచరణ తీవ్రమైంది.

1917 ఫిబ్రవరిలో, బోల్షెవిక్ పార్టీ పిలుపు నందుకొని, పెట్రోగ్రాడ్ కార్మికులు 2,00,000 మందికి పైగా కార్మిక స్త్రీ పురుషులు పాల్గొన్న సార్వత్రిక రాజకీయ సమ్మె యేర్పాటుచేసినారు. యీ సమ్మె మహత్తరమైన రాజకీయ ప్రదర్శనగా అభివృద్ధి అయింది. "నిరంకుశత్వం నశించాలి!" "యుద్ధం నశించాలి!" "మాకు తిండి కావాలి!" అనే నినాదాలతో కార్మికులు తండోపతండాలుగా వీధుల్లోకి వచ్చినారు. జారిస్టు నిరంకుశత్వాన్ని కూలదోయడానికీ, తాత్కాలిక విప్లవ ప్రభుత్వాన్ని సృష్టించడానికీ, ప్రజాతంత్ర రిపబ్లిక్‌ను స్థాపించ డానికీ, యెనిమిది గంటల పనిదినాన్ని ప్రవేశపెట్టడానికీ, భూ యెస్టేట్లను స్వాధీనపరుచుకోడానికీ, యుద్ధాన్ని ఆపడానికి పిలుపు యిస్తూ పార్టీ కేంద్ర కమిటీ ఒక ప్రణాళికను విడుదల చేసింది.

జారిస్టు ప్రభుత్వం పెరుగుతున్న విప్లవాన్ని సైనికుల సహాయంతో నలిపివేయాలని ప్రయత్నించింది, కానీ వెల్లువను అరికట్ట డానికి దానికి శక్తి లేకపోయింది. సైనికులు జారిజంకు వ్యతిరేకంగా కార్మికుల పక్షం వహించినారు. లెనిన్ జోస్యం నిజమైంది, కార్మిక కర్షకులు, విప్లవ మార్క్సిస్టు పార్టీచేత నడిపించబడి, విజయం పొందినారు. శతాబ్దాలుగా రష్యా ప్రజలను పీడించిన నిరంకుశత్వం కూలదోయబడింది. పెట్రోగ్రాడ్ కార్మికుల సైనికుల విప్లవ చొరవకు మాస్కో, తదితర నగరాల కార్మికులూ, సైనికులూ అండదండలు యిచ్చినారు. వాళ్లు జారిస్టు ఉద్యోగులను తొలగించి, రాజరిక వ్యవస్థను బ్రద్దలు చేసినారు. రష్యాలో బూర్జువా ప్రజాతంత్ర విప్లవం గెలిచింది.

విప్లవ గతిలో కార్మిక, సైనిక ప్రతినిధుల సోవియట్లు ఉద్భవించినాయి. యిది గొప్ప లాభం. కానీ, సోవియట్లలోకి ప్రవేశించిన మెన్షివిక్కులూ, సోషలిస్టు రివల్యూషనరీలూ కార్మిక కర్షకుల ప్రయోజనాలకు ద్రోహం చేసి, బూర్జువావర్గం నెలకొల్పిన తాత్కాలిక ప్రభుత్వాన్ని రాజ్యాధికారం వశంచేసుకోనిచ్చినారు. ఆవిధంగా ద్వంద్వ

అధికారం ఉద్భవించింది — బూర్జువావర్గ నియంతృత్వానికి ప్రాతినిధ్యం వహించే తాత్కాలిక ప్రభుత్వమూ, కార్మిక కర్షకుల విప్లవ ప్రజా తంత్ర నియంతృత్వానికి ప్రాతినిధ్యం వహించే సోవియట్లూ.

విప్లవం దేశంలో ఒక నూతన సన్నివేశాన్ని సృష్టించింది. జారిస్టు నిరంకుశత్వం యిక యెంతమాత్రమూ లేదు, రాజకీయ స్వాతంత్ర్యాలు ప్రకటింపబడినాయి: వాక్, పత్రికా, సభా, సంఘ, వగైరా స్వాతంత్ర్యాలు. కార్మికులూ, సైనికులూ ప్రజల విప్లవ డిమాండ్లను సాధించడానికి కృతనిశ్చయులైనారు. కొత్త యెత్తుగడలు రూపొందించు కొని, దేశ భావి అభివృద్ధి మార్గాలూ, యుద్ధమూ, శాంతీ, భూమీ లాంటి సమస్యలతో వ్యవహరించే కర్తవ్యం సకల రాజకీయ పార్టీలకూ యెదురైంది.

అప్పుడు అధికారంలో వుండిన బూర్జువా పార్టీలైన కాడెట్లూ, అక్టోబరిస్టులూ* తమ పరిపాలనను గట్టిపరుచుకోడానికీ, సోవియట్లను అణకువగా వుంచడానికీ, విప్లవాన్ని ఆపడానికీ, యుద్ధం కొనసాగించ డానికీ ప్రయత్నించినారు. రాజరికాన్ని కూలదోయడంతో యుద్ధం న్యాయ మైన యుద్ధం అయిందనీ, యుద్ధం కొనసాగించాలనీ, తరువాత రాజ్యాంగసభ సమావేశమై, అన్ని సమస్యలనూ పరిష్కరిస్తుందనీ చెప్పుతూ వాళ్లు కార్మికులను మోసగించినారు. వాస్తవంలో వాళ్లకు ప్రజల విప్లవ డిమాండ్లను తీర్చే ఉద్దేశం లేదు. విప్లవ కార్మిక, సైనికులతో వ్యవహరించే పనిని తమకు యుద్ధ పరిస్థితులు సులభ తరం చేస్తాయని, తమకు ముందు వుండిన జారిజం లాగే, వాళ్లు నమ్మినారు.

---

* అక్టోబరిస్టులు — బడా భూస్వామ్య, బూర్జువావర్గ ప్రయో జనాలకు ప్రాతినిధ్యం వహించిన విప్లవప్రతీఘాత పార్టీ. — సం.

మెన్షివిక్కులూ, సోషలిస్టు రివల్యూషనరీలూ ప్రజలను మోస గించడానికి బూర్జువావర్గానికి సహాయపడినారు. వాళ్లు రాజరికం కూలి పోవడంతో బూర్జువా పరిపాలన స్థిరంగా వుంటుందనీ, యెందుకంటే సోషలిస్టు విప్లవానికి రష్యాలో పరిస్థితులు యింకా పక్వంగా లేవనీ, కార్మికులు తమ చేతుల్లోకి అధికారం తీసుకొని దేశాన్ని పాలించడానికి యింకా సిద్ధంగా లేరనీ వాదించినారు. తాత్కాలిక ప్రభుత్వం ప్రతి విషయంలోనూ తన యిష్టం వచ్చినట్లు నడిచేటట్లు మెన్షివిక్కులూ, సోషలిస్టు రివల్యూషనరీలూ చేసినారు. వాళ్లు సోవియట్లను కార్మికుల, అత్యంత బీద రైతుల విప్లవ అధికారపు అంగంగా కాక, తాత్కాలిక ప్రభుత్వపు తోకగా చూసినారు.

ఫిబ్రవరి విప్లవం మొట్టమొదటి రోజులనుండి బోల్షెవిక్ పార్టీ రహస్య స్థితినుండి బయటికి వచ్చి, తన బలాలను సమీకరించింది. ప్రముఖ పార్టీ నాయకులలో చాలామంది – యఫ్. ఇ. జెర్జీన్స్కియ్, జి. కె. ఒర్డ్జొనికీడ్జె, వై. యం. స్వెర్డ్లోవ్, జె. వి. స్టాలిన్, వై. యం. యరొస్లావ్స్కియ్ తదితరులు – జైలునుండి గానీ, ప్రవాసంనుండి గానీ తిరిగివచ్చినారు. 'ప్రావ్దా' ప్రచురణ పునరుద్ధరింపబడింది; మొదటి సంచిక 1917 మార్చి 5న వెలువడింది.

స్విట్జర్లెండులో వుండగా లెనిన్ రష్యలో విప్లవ పరిణామాలను సన్నిహితంగా గమనించినాడు. ఫిబ్రవరి విప్లవ విజయం గురించి తెలి సిన వెంటనే ఆయన రష్యాలోని బోల్షెవిక్కులకు టెలిగ్రాం యిచ్చి, తన 'దూరంనుండి ఉత్తరాలు' రాసినాడు; వాటిలో ఆయన విప్లవం పార్టీముందు పెట్టిన సమస్యల కన్నిటికీ సవివరమైన జవాబులు యిచ్చినాడు. యిది బూర్జువావర్గాన్ని అధికారంలో పెట్టినట్టి విప్లవ ప్రథమ దశ మాత్రమే అనీ, తాత్కాలిక ప్రభుత్వాన్ని నమ్మజాలమనీ ఆయన గుర్తుచేసినాడు. బూర్జువావర్గానికి తన అధికారాన్ని గట్టిపరుచుకునే అవకాశం యివ్వకూడదనీ, సోవియట్లకు అధికారం

బదలాయించడానికీ, ప్రగతి వ్యతిరేక శక్తులమీద చావు దెబ్బ కొట్టడానికీ, సోషలిస్టు విప్లవానికి సన్నద్ధం కావడానికీ సకల ప్రయత్నాలూ చేయాలనీ ఆయన వాదించినాడు.

రష్యా విప్లవ కార్మికులకు ఆయన ఆవేశపూరితమైన విజ్ఞప్తి చేసినాడు. "జారిస్టు రాజరికాన్ని కూలదోయడంలో మీరు నిన్న కార్మికవర్గ వీరత్వపు అద్భుతాలు నిర్వహించినారు. దాదాపు సమీప భవిష్యత్తులో... భూస్వాముల, పెట్టుబడిదార్ల అధికారాన్ని కూలదోయడానికి మీరు అదే వీరత్వపు అద్భుతాలు మళ్లీ నిర్వహించవలసి వుంది" అని ఆయన రాసినాడు.

కార్మిక ప్రజల ప్రభుత్వం మాత్రమే యుద్ధాన్ని అంతంచేసి నిజమైన ప్రజాతంత్ర శాంతిని సాధించగలదనే విషయాన్ని జనాల మనసులకు యెక్కించడానికి వాళ్లలో విస్తారమైన వివరణాత్మక కృషి సాగించే కర్తవ్యం లెనిన్ బోల్షివిక్కులయెదుట వుంచినాడు.

మెన్షివిక్కులతో ఏకమయ్యే ప్రయత్నాలకు వ్యతిరేకంగా లెనిన్ హెచ్చరిక చేసినాడు. కొంతమంది బోల్షివిక్కులు చేసిన అలాంటి ప్రయత్నాలు విప్లవ పోరాట అభివృద్ధిని ఆటంకపరిచి, పార్టీకి తీవ్ర ప్రమాదంగా వుండినాయి.

కానీ, 'ప్రావ్ద' సంపాదకవర్గ సభ్యుడైన కామెనెవ్ లెనిన్ సూచనలు గల ఉత్తరాలను రహస్యంగా వుంచుకున్నాడు. 'దూరంనుండి ఉత్తరాలు'లో మొదటిది మాత్రమే 'ప్రావ్ద'లో ముద్రింపబడింది; అది కూడా తాత్కాలిక ప్రభుత్వం గురించిన లెనిన్ వర్ణననూ, పెటీబూర్జువా రక్షణవాద పార్టీల నాయకులమీద ఆయన విమర్శనూ మెత్తబరిచే ధోరణి గల పెద్ద కత్తిరింపులతోనూ, సవరణలతోనూ ముద్రింపబడింది.

బోల్షివిక్కులు జనాలలో విస్తారమైన కృషి ప్రారంభించినారు. కానీ, కొన్ని బోల్షివిక్ కమిటీలూ, కొందరు ప్రముఖ పార్టీ కార్యకర్తలూ తప్పు స్థావరం తీసుకున్నారు. అధికారమంతా సోవియట్లకు బదలాయించడానికి పోరాటం కొనసాగించాలని వాదించడానికి బదులు వాళ్లు తాత్కా

లిక ప్రభుత్వ కార్యకలాపాలమీద "జనాల అజమాయిషీ" నెలకొల్పాలని ఉద్బోధించినారు, అజమాయిషీ అంటే ప్రదర్శనలూ, నిరసనలూ, బహిరంగ ప్రకటనలూ యేర్పాటుచేయడం అనే అర్థంలో. యివి తప్పు యెత్తుగడలు, యెందుకంటే బూర్జువా తాత్కాలిక ప్రభుత్వం సామ్రాజ్యవాద విధానాన్ని విసర్జించి, యుద్ధాన్ని అంతంచేసి, ప్రజలకు శాంతినీ, తిండినీ, భూమినీ యివ్వగలదనే తప్పు అభిప్రాయాన్ని యివి ప్రజలకు కలిగిస్తాయి.

తాత్కాలిక ప్రభుత్వంమీదా, యుద్ధంమీదా కామెనెవ్ అర్ధ మెన్షివిక్ స్థావరం తీసుకున్నాడు. 'ప్రావ్ద'లో రాసిన ఒక వ్యాసంలో అతను తాత్కాలిక ప్రభుత్వానికి అండదండలు యివ్వాలనీ, యుద్ధాన్ని కొనసాగించాలనీ, తరువాత తాత్కాలిక ప్రభుత్వం శాంతి సంధిని ప్రతిపాదించేటట్లు దానిమీద ఒత్తిడి తేవాలనీ విజ్ఞప్తి చేసినాడు.

తాత్కాలిక ప్రభుత్వం వెంటనే శాంతి సంప్రదింపులు ప్రారంభించేటట్లు దానిమీద ఒత్తిడి తెచ్చే విధానాన్ని స్టాలిన్ బలపరిచినాడు. ఏప్రిల్ మధ్యలో స్టాలిన్ తన తప్పు అభిప్రాయాలను విసర్జించి, లెనిన్ స్థావరాన్ని స్వీకరించినాడు.

విప్లవ వార్త విదేశాలలోని సోషల్ డెమొక్రటిక్ ప్రవాసులలో ప్రచండమైన సంచలనం కలిగించి, ఆనందంతో విప్లవానికి స్వాగతం చెప్పే సభల పరంపరను ప్రారంభించింది.

రష్యాకు తిరిగిపోవడానికి లెనిన్ తహతహలాడినాడు. "యిలాంటి సమయంలో యిక్కడ కూర్చోవడం మాకందరికీ యెంత యమయాతనగా వుందో మీరు ఊహించుకోగలరు" అని ఆయన రాసినాడు. ఆలస్యం లేకుండా రష్యాకు తిరిగిపోయే మార్గాల కోసం ఆయన తీవ్రంగా ప్రయత్నించినాడు. "విప్లవ వార్త అందిన క్షణంనుండి ఇల్యీచ్‌కి నిద్ర లేదు. అత్యంత అసంభవమైన పథకాలు నిర్మిస్తూ ఆయన రాత్రులు గడిపినాడు" అని క్రూప్‌స్కయా తన స్మృతులలో రాసింది.

రష్యా కార్మిక ప్రజలు తమ నాయకుని ఆగమనాన్ని తీవ్రమైన తహతహతో యెదురుచూసినారు. కానీ తాత్కాలిక ప్రభుత్వం రకరకాల అడ్డంకులు కలిగించింది. స్వదేశానికి తిరిగిరావడానికి అనుమతింపబడ కూడని లెనిన్, తదితర బోల్షెవిక్కుల పేర్లు గల బ్లాక్‌లిస్టులు అది విదేశాలలోని తన ప్రతినిధులకు పంపకం చేసింది.

స్విస్ సోషల్ డెమోక్రట్ల సహాయంతో లెనిన్ ఒక బోల్షెవిక్కుల బృందమూ, యితర ప్రవాసులూ స్వదేశానికి పోవడానికి యేర్పాట్లు చేయడంలో చివరకు కృతకృత్యుడైనాడు.

1917 ఏప్రిల్ 3(16) రాత్రి, దాదాపు పదేండ్ల ప్రవాసం తర్వాత, లెనిన్ పెట్రోగ్రాడ్ చేరినాడు. విప్లవ రష్యా వర్ణించనలవి గాని ఉత్సాహపు దృశ్యాలతో తన మహా నాయకునికి స్వాగతం యిచ్చింది. యెర్ర పతాకలు పట్టుకున్న వేలాది కార్మికులూ, పురుషులూ, స్త్రీలూ ఆయన్ను కలుసుకోడానికి ఫిన్లండు స్టేషన్‌వద్ద గుమికూడినారు. విప్లవ సైనిక, నౌకాసైనిక దళాలు ఆయనకు గార్డ్ ఆఫ్ ఆనర్ యేర్పాటుచేసినాయి. అభివాదాల, జయజయ ధ్వానాల కేకల మధ్య లెనిన్ తనకోసం కాచుకొని వున్న సాయుధ శకటం అధిరోహించి, నూతన, సోషలిస్టు విప్లవం కొరకూ, సోవియట్ల అధికారం కొరకూ పోరాడాలని ఆవేశపూరిత విజ్ఞప్తితో కార్మికులకూ, సైనికులకూ, నౌకా సైనికులకూ ఉపన్యసించినాడు.

# అక్టోబర్ విప్లవ నాయకుడు

పెట్రోగ్రాడ్‌కు వచ్చిన వెంటనే లెనిన్ ద్విగుణీకృతమైన పట్టుదలతో పనిలో మునిగినాడు. ఏప్రిల్ 4న బోల్షెవిక్కుల సమావేశంలో ఆయన విప్లవ కార్మికవర్గ కర్తవ్యాలమీద తన థీసిస్‌లు చదివినాడు;

యివి 'ఏప్రిల్ థీసిస్‌లు'గా చరిత్రలో ప్రసిద్ధికెక్కినాయి. నూతన చారిత్రక సన్నివేశంలో పార్టీ అనుసరించవలసిన సరియైన పంథాను నిర్ణయించడంలో అవి నిర్ణయాత్మక అంశంగా వుండినాయి. బూర్జువా వర్గానికి అధికారం యిచ్చిన బూర్జువా డెమోక్రటిక్ విప్లవంనుండి, అధికారాన్ని కార్మికవర్గానికీ, అత్యంత బీద రైతులకూ అప్పగించే సోషలిస్టు విప్లవానికి పరివర్తనను సాధించడానికి ఒక నిర్దిష్టమైన, కచ్చితమైన పథకం యీ థీసిస్‌లలో లెనిన్ రూపొందించినాడు.

తాత్కాలిక ప్రభుత్వం పెట్టుబడిదార్ల, భూస్వాముల ప్రయోజనాలను రక్షిస్తున్నదనీ, యుద్ధం యింకా పరదేశాక్రమణ యుద్ధంగానే వుందనీ లెనిన్ చూపించినాడు. "తాత్కాలిక ప్రభుత్వానికి అండదండలు యివ్వవద్దు!" "సర్వాధికారమూ సోవియట్లకు!" అనే నినాదాలు ఆయన ప్రతిపాదించినాడు. సోవియట్ల అధికారం మాత్రమే జాతికి శాంతినీ, రైతులకు భూమినీ, ఆకలిగొన్నవాళ్లకు తిండినీ యివ్వగలదని ఆయన వాదించినాడు. అదే సమయంలో ఆయన, ప్రజల విశ్వాసం గల సోవియట్లు తాత్కాలిక ప్రభుత్వాన్ని బలపరుస్తున్నందున దాన్ని కూలదోయడానికి పిలుపు యివ్వడానికి సమయం యింకా పక్వం కాలేదని హెచ్చరిక యిచ్చినాడు. పట్టుదలతో, ఓపికతో కూడిన ప్రయత్నాల ద్వారా కార్మిక ప్రజలను తమవైపుకు మళ్లించవలసివుంది. సోవియట్లలో మెజారిటీ సంపాయించవలసివుంది, వాటిని బోల్షెవిక్ సోవియట్లుగా చేయవలసివుంది. యీ పరిస్థితి వున్నప్పుడు, కార్మికులకూ, అత్యంత బీద రైతులకూ అధికారం అప్పగించడం వీలౌతుంది. సోషలిస్టు విప్లవ విజయం కార్మికులకూ రైతాంగంలో అత్యంత బీద విభాగానికీ మధ్య వుండే దృఢమైన పొత్తుమీద ఆధారపడిందని లెనిన్ గుర్తుచేసి, గ్రామీణ ప్రాంతంలో విస్తారమైన వివరణాత్మక కృషియొక్క ప్రాముఖ్యాన్ని నొక్కి చెప్పినాడు.

ఆర్థిక రంగంలో పార్టీ కర్తవ్యాలను కూడా లెనిన్ నిర్వచించినాడు. యివి యేవంటే: భూ యెస్టేట్లను స్వాధీనపరుచుకోవడమూ, సమస్త భూమినీ జాతీయం చేయడమూ, అనగా భూమిమీద సొంత ఆస్తిని రద్దు చేయడమూ, దాన్ని రైతులయొక్క, వ్యవసాయ కూలీలయొక్క ప్రతినిధుల సోవియట్లకు బదలాయించడమూ. ఫాక్టరీలమీదా, మిల్లులమీదా, సమస్త సామాజిక ఉత్పత్తిమీదా, పంపకంమీదా కార్మికుల అజమాయిషీని నెల కొల్పాలని లెనిన్ ప్రతిపాదించినాడు. కార్మిక సైనిక ప్రతినిధుల సోవియట్ యొక్క అజమాయిషీకింద పెట్టబడే ఒకే ఒక జాతీయ బాంకిగా దేశంలోని బాంకులన్నీ లీనంకావాలనే డిమాండును కూడా ఆయన పెట్టినాడు.

పార్టీ మహాసభ జరపాలనీ, పార్టీని కమ్యూనిస్టు పార్టీగా పేరు మార్చాలనీ, దాని కార్యక్రమం చాలామేరకు పూర్తిచేయబడింది గనుక దాన్ని సవరించాలనీ ఆయన ప్రతిపాదించినాడు. కార్యక్రమంయొక్క ప్రధాన లక్ష్యం — జారిజంను కూలదోయడం — సాధింపబడింది. బోల్షెవిక్కుల, విప్లవ మార్క్సిస్టుల ఆచరణాత్మక కర్తవ్యం మూడవ, కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌ను సృష్టించడం, అని లెనిన్ చెప్పినాడు.

లెనిన్‌యొక్క 'ఏప్రిల్ థీసిస్‌లు' మహత్తర కార్యక్రమాత్మక పత్రంగా, నూతన చారిత్రక పరిస్థితులలో రష్యన్ కార్మికవర్గ విప్లవ పోరాట మార్గాన్ని వెలిగించే జ్యోతిగా వుండినాయి.

లెనిన్ పార్టీ కేంద్ర కమిటీకి నాయకత్వం వహించి, 'ప్రావ్దా' సంపాదకవర్గానికీ పెట్రోగ్రాడ్ బోల్షెవిక్ సంస్థ పనికీ దర్శకత్వం వహించినాడు. పెట్రోగ్రాడ్ నగర కాన్ఫరెన్సూ, ఆర్.యస్.డి.యల్.పి. ఏడవ (ఏప్రిల్) అఖిల రష్యా కాన్ఫరెన్సూ ఆయన నాయకత్వంకింద జరిగినాయి. యీ రెండవది రష్యాలో జరిగిన బోల్షెవిక్కుల మొదటి చట్టబద్ధ కాన్ఫరెన్సు. యీ కాన్ఫరెన్సులలో యిచ్చిన ఉపన్యాసాలలో లెనిన్ తన 'ఏప్రిల్ థీసిస్‌ల'లో రూపొందించబడిన పార్టీ కార్యక్రమాన్నీ, యెత్తుగడలనూ

వివరించినాడు. సోషలిస్టు విప్లవానికి రష్యా యింకా పక్వం కాలేదనే మెన్షివిక్ ఉద్ఘాటనలను పునశ్చరణ చేసే కామెనెవ్, రీకొవ్, వాళ్ల తృణప్రాయ అనుచరులూ తీసుకున్న స్థావరాన్ని లెనిన్ ఖండించి, విప్లవం పట్ల వాళ్ల సందేహాత్మక ధోరణినీ, రష్యాలో సోషలిజం విజయం పొందగలదనే భావాన్ని వాళ్ళు నిరాకరించడాన్నీ నిశితంగా విమర్శించినాడు. పార్టీ అవకాశవాదులను తిప్పికొట్టి, సోషలిస్టు విప్లవం కొరకు లెనిన్ పోరాట పథకాన్ని ఆమోదించి, దాన్ని ఆచరణాత్మక కార్యకలాపాలకు ఆధారంగా చేసుకొంది.

లెనిన్ నాయకత్వాన బోల్షెవిక్కులు పార్టీ విధానాన్ని కార్మికులకూ, సైనికులకూ, రైతులకూ వివరించే పనినీ, జనాలకు రాజకీయ విద్య గరిపి, వాళ్లను సంఘటితపరిచే పనినీ సాగించినారు. యీ విస్తారమైన కార్యకలాపాల్లో లెనిన్ కేంద్రంలో వుండి, పెట్రోగ్రాడ్‌లోని పుతీలొవ్, ఒబూహొవ్, త్రూబొచ్నీ, తదితర ఫాక్టరీల, మిల్లుల కార్మికుల సమావేశాల్లో తరుచుగా మాట్లాడి, సైనికుల, నౌకా సైనికుల సభల్లో ఉపన్యసించినాడు.

పుతీలొవ్ ఫాక్టరీలో కార్మికుడైన వి. వి. వసీల్యెవ్ అలాంటి ఒక సమావేశం గురించిన తన స్మృతులలో యిలా రాసినాడు: "పుతీలొవ్ కార్మికులు సోషలిస్టు రివల్యూషనరీ అయిన చెర్నోవ్‌ను అప్పుడే వేదిక నుండి తరిమేసి వుండినారు. అప్పుడు 'లెనిన్ వచ్చినాడు!' అనే వార్త ఫాక్టరీ అంతటా వ్యాపించింది. రోలింగ్ షాపు బయట వున్న పెద్ద చౌకు... త్వరగా జనంతో నిండి పోయింది. యిరవై అయిదు వేలమంది గుమికూడినారు. కార్ఖానాల కప్పులమీద కూడా జనం కూర్చొని వుండినారు.

"ఒక్క మాట జారిపోతుం దేమో అన్న భయంతో మేము లెనిన్ చెప్పేది చెవు లప్పగించి విన్నాము. అది కష్ట కాలంగా వుండింది. యుద్ధం కొనసాగుతూ వుండింది, ఇంధనం లేక ఫాక్టరీలు నిలిచి

పోయివుండినాయి, ఆహారం కొరతగా వుండింది. కార్మికులం అనేక ప్రశ్నలకు స్పష్టమైన జవాబుల కోసం యెదురుచూసినాం. వ్లదీమిర్ ఇల్యీచ్ ఆ జవాబులు యిచ్చినాడు. సోవియట్ల అధికారం మాత్రమే సామ్రాజ్యవాద హత్యాకాండను అంతమొందించి, ప్రజలకు శాంతీ, తిండీ, పనీ యివ్వగలదని ఆయన నిరూపించినాడు."

లెనిన్ చెప్పిన ఆవేశపూరిత సత్య వాక్కులు కార్మిక ప్రజల గుండెలకు సూటిగా తాకి వాళ్లను ఉత్తేజితుల్ని చేసినాయి: అలాంటి ఒక సభకు హాజరైన సెమ్యాన్నికొవ్ వర్క్స్ కార్మికుడు వి. పి. యెమెల్యానొవ్ యిలా చెప్పినాడు: "ఆయన మాటలు జనాన్ని ఏకం చేసినాయి, యేమి చేయవలసిందీ, యెలా చేయవలసిందీ ప్రతి కార్మికునికీ తెలియ పరిచినాయి.... లెనిన్ మాటలు మూడు వేలమంది భవిష్యత్ యోధులకు ఆయుధాలుగా వుండినాయి. ఆయన మాటలు విన్న కార్మికుల, నౌకాసైనికుల, సైనికుల హృదయాలనూ, మనస్సులనూ ఆయన భావాలు వశం చేసుకున్నాయి.... లెనిన్ మాటలతో ఉత్తేజం పొంది మేము ప్రతి ఒకరమూ నేరుగా పోరాటంలో దుముకాలనే కోరికతో దహించుకపోయినాము."

రైతు ప్రతినిధుల ప్రథమ అఖిల రష్యా మహాసభలో మాట్లాడుతూ లెనిన్ భూ యెస్టేట్లను తక్షణం ఆక్రమించుకోవాలని ఉద్బోధించి, వ్యవసాయ కూలీల, అత్యంత బీద రైతుల స్వతంత్ర సంస్థయొక్క అవసరం గురించి మాట్లాడినాడు. ఆయన పత్రికలకు గణనీయమైన శ్రద్ధ అర్పించినాడు. ఆయన వ్యాసాలు 'ప్రావ్ద'లో తరుచుగా వచ్చేవి. తన ఉపన్యాసాలలోనూ, వ్యాసాలలోనూ లెనిన్ తాత్కాలిక ప్రభుత్వపు విప్లవ ప్రతీఘాత విధానాన్నీ, మెన్షివిక్కులూ, సోషలిస్టు రివల్యూషనరీలూ అనుసరించిన రాజీ విధానాన్నీ గుట్టుకడిగి, బోల్షెవిక్ నినాదాలను వివరించినాడు. సర్వాధికారమూ సోవియట్లకు సంక్రమించడంద్వారా మాత్రమే, బూర్జువా పరిపాలన తనను యే చిక్కులోకి నడిపించిందో

ఆ చిక్కునుండి రష్యా బయటపడగలదని ఆయన కార్మికులకూ, సైని కులకూ గట్టిగా చెప్పినాడు. కార్మికులూ, రైతులూ, సైనికులూ అంతకంతకూ యెక్కువగా లెనిన్ భావాలలోని సత్యంపట్ల నమ్మకం కుదిరి, బోల్షివిక్కులవైపు తిరిగినారు. వాళ్ళు లెనిన్‌కు రాసిన జాబులలో ఆయనపట్ల తమ కృతజ్ఞతనూ, పోరాడడానికి తమ సంసిద్ధతనూ, ఆయన భావాలపట్ల తమ పరమ భక్తినీ వ్యక్తం చేసినారు. యుద్ధరంగం నుండి రాసిన జాబులో ఒక బృందం సైనికులు యిలా అన్నారు: "కామ్రేడ్, మిత్రుడైన లెనిన్, సైనికులు ఒక్కుమ్మడిగా నీవెంట యెక్కడికైనా నడవడానికి సిద్ధంగా వున్నారనీ, నీ భావం నిజంగా కర్షక కార్మికుల యిచ్ఛను వ్యక్తం చేస్తుందనీ జ్ఞాపకంవుంచుకో."

బూర్జువావర్గాన్ని తృప్తిపరుస్తూ తాత్కాలిక ప్రభుత్వం కార్మి కులు సంపాయించిన విప్లవ లాభాలమీద అంతకంతకూ యెక్కువగా దురాక్రమణ చేసింది. అది సామ్రాజ్యవాద యుద్ధాన్ని కొనసాగించి, సైనిక సమూహాలను యుద్ధరంగానికి తరిమి, యుద్ధరంగాలలో తమ రక్తం ధారవోస్తూ, దారుణమైన కష్టాలూ, బాధలూ భరించే కార్మిక కర్షకుల స్థితిని మెరుగు పరచడానికి యేమీ చేయలేదు. తాత్కాలిక ప్రభుత్వ విధానంపట్ల జనాలు తమ అసంతృప్తిని ప్రకటించినారు. దాడి ప్రయత్న ఫలితంగా యుద్ధరంగంలో జరిగిన కొత్త సైనిక నష్టాల వార్త విని జూలై 3న కార్మికులూ, సైనికులూ పెట్రోగ్రాడ్ వీధుల్లోకి పోయి, అధికారమంతా సోవియట్లకు బదలాయించాలని డిమాండు చేసినారు. లెనిన్ సూచనలమీద బోల్షివిక్కులు ప్రదర్శనకు నాయకత్వం వహించి, ఉద్యమానికి శాంతియుత, సంఘటిత స్వభావం యివ్వడానికి ప్రయత్నించి నారు.

తాత్కాలిక ప్రభుత్వం, అప్పుడు సోవియట్లమీద అజమాయిషీ కలిగివుండిన సోషలిస్టు రివల్యూషనరీల, మెన్షివిక్కుల ఆమోదంతో, ప్రదర్శకులను సాయుధ బలంతో యెదుర్కొంది. మరొకసారి పెట్రోగ్రాడ్

వీధుల్లో రక్తం ప్రవహించింది. బోల్షెవిక్ పార్టీమీదా, కార్మిక సంస్థల మీదా కఠినమైన శిక్షాచర్యలు తీసుకోబడినాయి. పార్టీ సభ్యులు చాలా మంది జైలులో తోయబడినారు. జూలై 4 రాత్రి మిలిటరీ పాఠశాల విద్యార్థులు 'ప్రావ్ద' ఆఫీసులమీద దాడి చేసినారు. అర్ధగంట క్రితం ఆఫీసుకు పోయివుండిన లెనిన్ కొద్దిలో తప్పించుకున్నాడు. బూర్జువా తాత్కాలిక ప్రభుత్వం సంపూర్ణ అధికారం వశం చేసుకొంది. రష్యాలో ద్వంద్వ అధికారం అంతమైంది. శాంతియుత విప్లవాభివృద్ధి దశ గతించి, విప్లవ యుద్ధాల దశ ప్రవేశించింది.

బోల్షెవిక్ పార్టీని నాయకరహితం చేసే ప్రయత్నంలో తాత్కాలిక ప్రభుత్వం లెనిన్‌మీదా, ఆయన అనుచరులమీదా నిందా ప్రచారం ప్రారంభించింది. అది లెనిన్‌ను చట్ట బహిష్కృతుని చేసి, ఆయన అరెస్టుకు వారంటు యిచ్చి, ఆయన్ను పట్టుకోడానికీ, హత్యచేయడానికీ సకల చర్యలూ తీసుకుంది. తాత్కాలిక ప్రభుత్వ నాయకుడైన కేరెన్‌స్కీ లెనిన్ అరెస్టుకు దారితీసే సమాచారం యిచ్చినవాళ్లకు గొప్ప బహుమతి వాగ్దానం చేసినాడు. బూర్జువా పత్రికలు బోల్షెవిక్కులకు వ్యతిరేకంగా గావుకేకలతో గోల చేసినాయి.

ద్వేషపూరిత బూర్జువా నిందాప్రచారానికి సమాధానంగా లెనిన్, పార్టీపట్ల గర్వభావంతో, యిలా అన్నాడు: "మేము మా పార్టీని నమ్మతాము. దానిలో మాకు మన కాలపు మేధా, గౌరవమూ, అంతరాత్మా కనపడతాయి." కమ్యూనిస్టు పార్టీ, విప్లవ కార్మికులూ తమ నాయకున్ని చాలా జాగ్రత్తగా రక్షించుకున్నారు. కేంద్ర కమిటీ నిర్ణయం ప్రకారం లెనిన్ రహస్యంగా వుండసాగినాడు. మూడున్నర నెలలకు పైగా ఆయన రహస్యంగా జీవిస్తూ, పనిచేస్తూ ప్రతి నిముషమూ తాత్కాలిక ప్రభుత్వపు వేటకుక్కలకు పట్టుబడే ప్రమాదానికి గురి అయి వుండినాడు.

కొన్ని దినాలు లెనిన్ పెట్రోగ్రాడ్ కార్మికుల యిండ్లలో తలదాచుకొని, తరువాత గడ్డికోసే ఫిన్నిష్‌వాని వేషంలో, పెట్రోగ్రాడ్ సమీపంలో

రజ్లీవ్ సరస్సు ఒడ్డున ఒక గుడిసెలో నివసించినాడు. ఆయనకు రక్షణగా, సహాయంగా సెస్త్రొరేత్స్క్ వర్క్స్ కార్మికుడైన యన్. ఎ. యెమెల్యానొవ్ వుండినాడు. లెనిన్‌కు ఒక కొడవలీ, దంతే, గొడ్డలీ, కుండా, యింకా గడ్డి కోసేవానికి కావలసినవన్నీ యివ్వబడినాయి. గుడిసె దగ్గర పొదలమధ్య ఒక చిన్న బయలు చేయబడింది; దానిని లెనిన్ హాస్యంగా "నా పచ్చని పఠనాగారం" అనేవాడు. బయలులో రెండు మొద్దులు యేర్పరచబడినాయి, ఒకటి టేబుల్‌గానూ, మరొకటి కుర్చీగానూ ఉపకరించేటట్లు. అక్కడ లెనిన్ పనిచేసుకున్నాడు, వ్యాసాలూ, ఉత్తరాలూ రాసినాడు, 'రాజ్యమూ, విప్లవమూ' అనే తన పుస్తకం తయారుచేసినాడు. క్రమబద్ధమైన, తీవ్రమైన లెనిన్ పనికి యేదీ అంతరాయం కలిగించజాలకపోయింది. అత్యంత ప్రతికూలమైన పరిస్థితులలో కూడా ఆయన బుర్ర భవిష్యత్ పోరాటానికి పథకాలు చురుకుగా రూపొందిస్తూ వుండింది.

రహస్యంగా వుంటూ ఆయన రోజువారీ పార్టీ కార్యకలాపాలకూ, రష్యన్ కార్మికవర్గ పోరాటానికీ దర్శకత్వం వహించడం కొనసాగించినాడు. ఆయన మొత్తం దేశంలోనూ, యుద్ధరంగాలలోనూ జరిగే ఘటనలను సన్నిహితంగా గమనిస్తూ, కేంద్ర కమిటీతో నిత్య సంబంధం కలిగి వుండినాడు. కేంద్ర కమిటీ సభ్యులైన జి. కె. ఒర్జొనికిద్జె, ఐ. ఐ. జోఫ్, ఎ. వి. షొట్‌మాన్, ఐ. ఎ. రాహ్యా, తదితరులు ఆయన్ను చూడడానికి వచ్చేవాళ్లు. పెట్రోగ్రాడ్ ఘటనల గురించి ఆయన వాళ్లను ప్రశ్నించి, వాళ్లకు సూచనలు యిచ్చేవాడు. పార్టీ రహస్యంగా వుండవలసివచ్చినప్పటికీ, కార్మికవర్గం త్వరలో విజయం పొందుతుందని లెనిన్‌కు పరిపూర్ణ విశ్వాసం వుండింది. తన అభిప్రాయంలో అధికారం త్వరలో బోల్షెవిక్కులకు సంక్రమిస్తుందనీ, లెనిన్ రాజ్యాధినేత ఔతాడనీ ఒక కామ్రేడ్ అన్న మాటలు ఒర్జొనికిద్జె లెనిన్‌తో చెప్పినప్పుడు, ఆయన యిలా సమాధానం యిచ్చినాడు: "ఔను, జరగబోయేది అదే." మెన్షెవిక్

సోవియట్లు అధికారం వశం చేసుకునే అవకాశం పోగొట్టుకున్నాయని ఆయన చెప్పినాడు. యిప్పుడు అధికారం సాయుధ తిరుగుబాటుద్వారా మాత్రమే వశం కాగలదు; సాయుధ తిరుగుబాటు రావడానికి ఆలస్యం వుండదు. తిరుగుబాటు జరగడం సెప్టెంబర్, అక్టోబర్‌కంటె ఆలస్యం వుండదు. సోషలిస్టు రివల్యూషనరీలచేతా, మెన్షివిక్కులచేతా అజ మాయిషీ చేయబడే యీ సోవియట్లు విప్లవ ప్రతీఘాత తాత్కాలిక ప్రభుత్వపు తోకలైనాయి గనుక, లెనిన్ సూచనమీద, జూలై ఘటనల తర్వాత, "సర్వాధికారమూ సోవియట్లకు" అనే నినాదాన్ని పార్టీ తాత్కాలీ కంగా ఉపసంహరించుకుంది. యిప్పుడు సాయుధ తిరుగుబాటు సమస్య ముందుకు వచ్చింది.

తన రహస్య స్థలంనుండి లెనిన్ ఆరవ పార్టీ మహాసభకు దర్శకత్వం వహించినాడు. అది 1917 జూలై ఆఖరులో పెట్రోగ్రాడ్‌లో అర్ధ రహస్యంగా జరిగింది; యెందుకంటే బూర్జువావర్గం బోల్షివి క్కులను వేటాడడం తీవ్రతరం చేసి, వాళ్ల మహాసభను భగ్నం చేస్తుందనే భయం కలిగించింది. మహాసభలో చర్చింపబడిన మొదటి ప్రశ్నలలో ఒకటి లెనిన్ తాత్కాలిక ప్రభుత్వంచేత విచారింపబడడానికి కోర్టుకు హాజరు కావాల్నా, లేదా అనేది. లెనిన్ కోర్టుకు హాజరు కారాదని మహాసభ ఏకగ్రీవంగా వోటు చేసి, విప్లవ నాయకునికి యెర వేస్తున్నందుకు నిరసన తెలిపింది. మహాసభ లెనిన్‌కు అభివాదాల సందేశం పంపి, ఆయన్ను గౌరవ అధ్యక్షునిగా యెన్నుకుంది.

స్టాలిన్ యిచ్చిన కేంద్ర కమిటీ నివేదికా, రాజకీయ సన్నివేశంమీద నివేదికా లెనిన్ రాసిన 'రాజకీయ సన్నివేశం,' 'నినాదాలమీద,' 'విప్లవ గుణపాఠాలు,' తదితర రచనలమీద ఆధారపడినాయి. అప్పటి పరిస్థితు లలో శాంతియుత పద్ధతులద్వారా కార్మికవర్గం అధికారం స్వీకరించడం యిక యెంతమాత్రమూ సాధ్యం కాదు గనుక, విప్లవ ప్రతిఘాత బూర్జువావర్గంయొక్కా, భూస్వాములయొక్కా పరిపాలనను సాయుధ

తిరుగుబాటుద్వారా కూలదోయాలని మహాసభ పార్టీని ఉద్బోధించింది. కార్మికవర్గానికీ అత్యంత బీద రైతులకూ మధ్య పొత్తు సోషలిస్టు విప్లవ విజయానికి పూర్వావసరమనే లెనిన్ సూత్రాన్ని మహాసభ నిర్ణయాలు నొక్కిచెప్పినాయి. రష్యాలో సోషలిస్టు విప్లవంలో నమ్మకంలేనివాళ్లందరినీ మహాసభ బలంగా తిప్పికొట్టింది; ఒక దేశంలో సోషలిజం విజయం గురించిన లెనిన్ సిద్ధాంతాన్ని అది బలపరిచింది. యువకులలో కృషి సాగించడంయొక్క ప్రాముఖ్యాన్ని మహాసభ నొక్కిచెప్పి, యువజన సంస్థలు స్థాపించడానికీ, వాటికి పార్టీ నాయకత్వం యివ్వడానికీ అనుకూలంగా ప్రకటించింది. లెనిన్ ప్రతిపాదనలన్నీ మహాసభచేత ఆమోదింపబడి, పార్టీ నిర్ణయాల బలం పొందినాయి. మహాసభ తీర్మానాలు అన్నీ కార్మికవర్గాన్నీ, బీద రైతాంగాన్నీ సాయుధ తిరుగుబాటుకూ, సోషలిస్టు విప్లవ విజయాలకూ తయారుచేయడానికి ఉద్దేశింపబడినాయి. యిది మహాసభ ప్రాముఖ్యం. మహాసభ తరఫున కేంద్ర కమిటీ 'రష్యాయొక్క సకల శ్రామికులకూ, సకల కార్మికులకూ' విజ్ఞప్తి చేసింది. దానిలో సోషలిస్టు విప్లవ విజయంమీద ప్రగాఢ విశ్వాసం ప్రకటించబడింది.

సోషలిస్టు విప్లవం వస్తున్నదని లెనిన్ స్పష్టంగా గమనించి, పార్టీని అందుకు సంసిద్ధం చేసినాడు. మహాసభ తర్వాత పార్టీ, తన నాయకుని మార్గదర్శకత్వంకింద, ఫాక్టరీలలోనూ, సైన్యంలోనూ, గ్రామాలలోనూ కార్మికులలోనూ, సైనికులలోనూ, నౌకా సైనికులలోనూ, రైతులలోనూ విస్తృత స్థాయిలో సంస్థానిర్మాణ కృషీ, వివరణాత్మక కృషీ సాగించింది. రెడ్‌గార్డ్ దళాలు* నిర్మించబడినాయి. కార్మికులు ఆయుధాలు సంపాయించి, వాటిని ఉపయోగించడం నేర్చుకున్నారు.

---

* రెడ్‌గార్డ్ దళాలు, రెడ్‌గార్డులు — అక్టోబరు సోషలిస్టు మహా విప్లవ కాలంనాటి కార్మికవర్గ సాయుధ బలాలు. — సం.

బూర్జువా రాజ్యంపట్ల కార్మికవర్గ పార్టీ వైఖరి యేమిటీ, కార్మిక వర్గం అధికారంలోకి వచ్చినప్పుడు యెలాంటి రాజ్యం నెలకొల్పాలి, అనే ప్రశ్నను ఆసన్న సోషలిస్టు విప్లవం సూటిగా దృష్టి మధ్యంలోకి తెచ్చింది. 1917 శరదృతువులో, లెనిన్ రహస్యంగా వున్నప్పుడు, ఆయన రాసిన 'రాజ్యమూ, విప్లవమూ' అన్న ప్రసిద్ధమైన గ్రంథంలో యీ ప్రశ్నలకు జవాబులు యివ్వబడినాయి. రాజ్యంమీదా, కార్మికవర్గ నియంతృత్వంమీదా మార్క్సు, ఎంగెల్సుల బోధను, అవకాశవాదులు వికృత పరిచినదానిని, లెనిన్ బలపరిచి, నూతన చారిత్రక సన్నివేశం దృష్ట్యా ఆ బోధను అభివృద్ధి చేసినాడు.

బూర్జువా రాజ్యం, అది యెంత ప్రజాస్వామికంగా కనిపించినప్పటికీ, సారంలో బూర్జువావర్గ నియంతృత్వానికి (పెత్తనానికి) ఒక రూపం. బూర్జువా అధికారాన్ని కూలదోయడంలో కార్మికవర్గం తన సొంత నియంతృత్వాన్ని నెలకొల్పవలసి వుంది. పాత రాజ్య యంత్రాంగాన్ని పగలగొట్టి, ముక్కలు ముక్కలు చేసి, దాని స్థానంలో కొత్తది పెట్టాలి. అలాంటి రాజ్యం నిజంగా ప్రజాస్వామికమైనది; యెందుకంటే అది మెజారిటీ ప్రజల ప్రయోజనాలను వ్యక్తం చేస్తుంది. కార్మికవర్గ నియంతృత్వం యెందుకు అవసరమైందీ, దాని చారిత్రక పాత్ర యేమిటైందీ లెనిన్ అసాధారణ స్పష్టతతోనూ, సులభగ్రాహ్యతతోనూ నిరూపించినాడు. "రాజ్యాధికారం, కేంద్రీకృత శక్తి సంస్థ, కేంద్రీకృత హింసా సంస్థ, యిటు దోపిడీదార్ల ప్రతిఘటనను నలిపివేయడానికీ, అటు సోషలిస్టు ఆర్థిక వ్యవస్థను సంఘటితపరిచే కృషిలో జనాభాలో అపారమైన భాగాన్ని — రైతులనూ, పెటీబూర్జువాలనూ, అర్ధ కార్మికులనూ — నడిపించడానికీ కార్మికవర్గానికి అవసరం" అని లెనిన్ రాసినాడు. కార్మికవర్గ నియంతృత్వ సూత్రం మార్క్సిజంయొక్క సారం అని లెనిన్ గుర్తుచేసినాడు; సోషలిజంను నిర్మించడంలో కార్మికవర్గ నియంతృత్వం ప్రధాన పరికరం అని ఆయన భావించినాడు.

'రాజ్యమూ, విప్లవమూ' అనే తన గ్రంథంలో లెనిన్ సోషలి జంనూ, కమ్యూనిజంనూ పరిశీలించడానికి గణనీయమైన శ్రద్ధ అర్పించి నాడు; వాటిని ఆయన కమ్యూనిస్టు సమాజ అభివృద్ధిలో రెండు దశలుగా వర్ణించినాడు. మార్క్సు, ఎంగెల్సుల అభిప్రాయాలను అభివృద్ధి చేస్తూ ఆయన సోషలిజం అనివార్యంగా కమ్యూనిజంలోకి పరిణామం చెందు తుందని చూపించినాడు. ఆ గ్రంథంలో కమ్యూనిస్టు పార్టీ పాత్రమీద ముఖ్యమైన విషయాలు కూడా వున్నాయి. పార్టీ కార్మికవర్గ అగ్రదళమనీ, ప్రజలను సోషలిజంకు నడిపించి, నూతన సమాజ వ్యవస్థను యేర్పాటు చేయగలది అనీ, సమస్త శ్రామిక ప్రజలకూ గురువుగా, మార్గదర్శిగా, నాయకుడుగా వుండగలది అనీ ఆయన నొక్కిచెప్పినాడు. బూర్జువావర్గం లేకుండా, బూర్జువావర్గానికి వ్యతిరేకంగా నూతన జీవిత నిర్మాణానికి దర్శకత్వం వహించగలది కమ్యూనిస్టు పార్టీ ఒక్కటే.

కార్మిక కర్షక రాజ్యం యెలా వుండవలసిందీ, సోవియట్ ప్రభు త్వం యే కార్యక్రమం నిర్వహించవలసిందీ లెనిన్ పుస్తకం పార్టీకీ, కార్మికవర్గానికీ స్పష్టమైన అవగాహన యిచ్చింది. సోవియట్లు రాజ్య రూపం వుండాలని దీనిలో వివరించబడింది. సకల దేశాల కమ్యూనిస్టు పార్టీలకూ, కార్మిక పార్టీలకూ అది ప్రపంచ వ్యాప్త ప్రాముఖ్యం గలది.

ఆగస్టులో, రైలింజను ఫైర్‌మన్ వేషంలో లెనిన్ ఫిన్లండుకు మారినాడు. మొదట ఆయన హెల్సింగ్‌ఫర్స్ (యిప్పుడు హెల్సింకీ) వెలుపల ఒక గ్రామంలో ఒక ఫిన్నిష్ కార్మికుని యింటిలో వుండినాడు, తరువాత నగరంలోకి మారినాడు.

యీమధ్యలో, రష్యాలోని సన్నివేశం అంతకంతకూ వ్యగ్రమౌతూ వుండింది. ఆర్థిక అవ్యవస్థ పెరిగింది, ఇంధనం లేమిడివలన రైల్వే రవాణా దాదాపు ఆగిపోయింది, పట్టణాలకు ఆహార, ముడి సరుకుల సరఫరా నిలిచి పోయింది, లాభార్జన సర్వసాధారణమైంది, జీవన వ్యయం స్థిరంగా పెరుగుతూవుండింది. బూర్జువావర్గ ప్రతినిధులు అమానుషంగా అన్నట్లు,

"కరువు రక్కసి మొండి చేయి"తో విప్లవాన్ని గొంతునులిమే ఆశతో బూర్జువావర్గం ఉద్దేశపూర్వకంగా ఆర్థిక యిబ్బందులను తీవ్రతరం చేస్తూవుండింది. పెట్టుబడిదార్లు ఫాక్టరీలూ, మిల్లులూ మూసివేసి, వేలకొలది జనాన్ని నిరుద్యోగులను చేసి, ఆకలిమంటల పాలు జేసినారు. యీవిధంగా బూర్జువావర్గం కార్మికుల పోరాట సంకల్పాన్ని బ్రద్దలు చేసి, సోషలిస్టు విప్లవాన్ని అరికట్టాలని ప్రయత్నించింది.

యీ కాలంలో లెనిన్ 'ఆసన్న వినాశమూ, దాన్ని యెదుర్కొనే విధానమూ' అనే వ్యాసం రాసినాడు. పాలక పెట్టుబడిదార్లూ, భూస్వాములూ దేశాన్ని ఆర్థిక నాశనంవైపు తోసుకపోతున్నారని ఆయన చూపించినాడు. ఆర్థిక అవ్యవస్థను ఆసరాగా తీసుకొని సోవియట్లనూ, సకల విప్లవ లాభాలనూ అంతమొందించి, బూర్జువావర్గానికి పూర్తి అధికారం తిరిగి అప్పగించాలని వాళ్లు అనుకున్నారు. యీ ఆసన్న వినాశంనుండి బయటపడే మార్గాన్ని లెనిన్ చూపించినాడు. సోషలిజం నిర్మించడంద్వారా మాత్రమే దేశం రక్షింపబడగలదనీ, గమ్యం సోషలిజం అయితే తప్ప ముందుకు పోవడం అనేది వుండజాలదనీ ఆయన స్పష్టం చేసినాడు. యీ దిశలో తీసుకోవలసిన మొదటి చర్యలను ఆయన యిలా భావించినాడు: భూమి జాతీయకరణా, బాంకులను జాతీయం చేసి ఒకేఒక స్టేట్ బాంకిని సృష్టించడమూ, ఉత్పత్తిమీదా, పంపకంమీదా కార్మికుల అజమాయిషీ వెంటనే నెలకొల్పడమూ. యిది నాశనమైన ఆర్థిక వ్యవస్థను పునరావాసం చేయడానికీ, అది సజావుగా నడిచేటట్లు యేర్పరచడానికీ, యుద్ధాన్ని అంతం చేయడానికీ తోడ్పడుతుంది. "విప్లవ ఫలితంగా రష్యా, దాని రాజకీయ వ్యవస్థకు సంబంధించి నంతవరకు, కొద్ది నెలలలో పురోగామి దేశాలతో సమానంగా అభివృద్ధి చెందింది" అని లెనిన్ రాసినాడు.

"కానీ అది చాలదు. యుద్ధం దుర్వారమైనది; నిర్దాక్షిణ్యమైన కాఠిన్యంతో అది మార్గాంతరాలను ప్రతిపాదిస్తుంది: నాశనం కా, లేదా

ఆర్థికంగా కూడా పురోగామి దేశాలతో సమానంగానూ, యింకా యెక్కువగానూ అభివృద్ధి కా....

"నాశనం కా, లేదా శరవేగంతో ముందుకురుకు. చరిత్ర ప్రతిపాదించే మార్గాంతరాలు అవి."

విప్లవ శత్రువుల పన్నాగాలను లెనిన్ ఊహించినాడు. పెట్టుబడి దార్లూ, భూస్వాములూ, ప్రగతి వ్యతిరేక సైనికాధికార్లూ విప్లవానికి వ్యతిరేకంగా కుట్ర పన్నుతున్నారని ఆయన పార్టీనీ, ప్రజలనూ హెచ్చరించి, శత్రువును తిప్పికొట్టడానికి సిద్ధంగా వుండాలని హెచ్చరిక యిచ్చినాడు. ఆయన జోస్యం చెప్పినట్లు, బూర్జువావర్గం విప్లవాన్ని నలిపివేయడానికి ఒక ప్రయత్నం చేసింది. ఆగస్టు 25న, రష్యన్, విదేశ సామ్రాజ్యవాదుల విధేయ సేవకుడైన జనరల్ కోర్నీలొవ్ విప్లవ ప్రతీఘాత తిరుగుబాటు లేవదీసి, పెట్రోగ్రాడ్‌మీదికి సైన్యాలు నడిపించినాడు. విప్లవాన్ని నలిపి వేసి, సైనిక నియంత కావడానికి అతను పథకంవేసినాడు. జనాల పోరాటానికి పార్టీ నాయకత్వం వహించగా, కోర్నీలొవ్ తిరుగుబాటు కొద్ది రోజుల్లో అణచివేయబడింది. లెనిన్ నాయకత్వం గల బోల్షెవిక్ పార్టీ ఒక్కటే తమ ప్రాణప్రదమైన ప్రయోజనాలను రక్షిస్తుందని మరొకసారి కార్మికుల మనస్సులకు సూటిగా తాకింది. జనాలు వడిగా బోల్షెవిక్కులవైపు మళ్లినారు. సోవియట్లకు మళ్లీ జరిగిన యెన్నికలలో బోల్షెవిక్కులకు మెజారిటీ వచ్చింది. ఆగస్టు, సెప్టెంబర్‌లలో పెట్రోగ్రాడ్, మాస్కో సోవియట్లు బోల్షెవిక్కుల అజమాయిషీ కిందికి వచ్చినాయి. సోవియట్లు ప్రతిష్ఠ, బలమూ సంపాయించినాయి.

ఆసన్న విప్లవంనుండి తప్పించుకోడానికి సాధ్యంకాదనీ, కార్మిక ప్రజల్లో బోల్షెవిక్కుల పలుకుబడి పెరుగుతున్నదనీ గమనించి కాడెట్లూ, మెన్షివిక్కులూ, సోషలిస్టు రివల్యూషనరీలూ జనాలను భయపెట్టడానికి ప్రయత్నించినారు. బోల్షెవిక్కులు తమ చేతుల్లోకి అధికారం తీసుకో జాలరనీ, తీసుకుంటే, దేశ పరిపాలనను యేర్పరచజాలరు గనుక పక్షం

రోజులు కూడా అధికారం నిలుపుకోజాలరనీ వాళ్లు పునశ్చరణ చేస్తూ వుండినారు. బూర్జువాలు చేసే యీ ప్రచారం కార్మికవర్గాన్ని జడిపించడానికి ఉద్దేశింపబడిందని 'బోల్షెవిక్కులు రాజ్యాధికారం నిలుపుకోగలరా?' అన్న వ్యాసంలో లెనిన్ చూపించినాడు. బోల్షెవిక్కులు అధికారం వహించి, ప్రతీఘాత విప్లవాన్ని తిప్పికొట్టి, యీ అధికారం నిలుపుకొని, దేశ ఆర్థిక వ్యవస్థను సోషలిస్టు పద్ధతులమీద పునర్నిర్మించే స్థితిలో వున్నారని ఆయన చూపించినాడు. యీ సందర్భంలో సోవియట్లు ప్రముఖ పాత్ర వహించవలసి వుంది; అవి కార్మిక కర్షకుల నూతన ప్రభుత్వ యంత్రాంగంగా వ్యవహరిస్తాయి. బోల్షెవిక్ పార్టీ నాయకత్వమూ, అత్యంత బీద రైతుల అండదండలూ గల కార్మికవర్గం యొక్క అధికార స్వీకారం యింతవరకు పీడింపబడిన లక్షలాది ప్రజల చొరవనూ, శక్తినీ విడుదలచేసి, నూతన జీవిత నిర్మాణాన్ని ముందుకు తోస్తుంది.

యీ సమయంలో లెనిన్ యింకా ఫిన్లండులో రహస్యంగా వుండినాడు; కానీ దేశంలో జరిగేదంతా ఆయనకు తెలియబరుస్తూవుండినారు. మార్క్సిజం గురించి ఆయనకు గల ప్రగాఢ జ్ఞానమూ, దాన్ని ఆచరణాత్మక పోరాటానికి ప్రయోగించే అసాధారణ సామర్థ్యమూ ఘటనల సత్వర అవగాహన పొందడానికీ, పార్టీకి సరైన కార్యాచరణ పంథానూ, వ్యూహాన్నీ, యెత్తుగడలనూ రూపొందించడానికీ ఆయనకు సామర్థ్యం యిచ్చినాయి.

విప్లవం వేగంగా పొందుతున్న వూపు దృష్ట్యా, కార్మికవర్గమూ, అత్యంత బీద రైతులూ అధికారం వశంచేసుకోడానికి ఆచరణాత్మక సన్నాహాలు చేయడమూ, సాయుధ తిరుగుబాటుకు సన్నాహాలు చేయడమూ అనే కర్తవ్యాన్ని పార్టీ కేంద్ర కమిటీముందు పెట్టినాడు లెనిన్. పెద్ద పారిశ్రామిక కేంద్రాలలోని సోవియట్లు యిప్పుడు బోల్షెవిక్కుల అజమాయిషీలో వుండడంతో పార్టీ, లెనిన్ సూచనమీద,

"సర్వాధికారమూ సోవియట్లకు!" అనే నినాదం మళ్లీ ప్రతిపాదించింది. కార్మికవర్గ నియంతృత్వాన్ని నెలకొల్పడానికి బూర్జువా ప్రభుత్వంమీద తిరుగుబాటుకు పిలుపు యిది. దేశంలోని అన్ని ప్రాంతాలలోనూ 250 సోవియట్లకుపైగా యీ నినాదానికి అనుకూలంగా వోటుచేసినాయి.

సెప్టెంబర్ మధ్యలో, యింకా ఫిన్లండులో రహస్యంగా వుండవలసివచ్చిన లెనిన్ పార్టీ కేంద్ర కమిటీకీ, పెట్రోగ్రాడ్ కమిటీకీ, మాస్కో కమిటీకి 'బోల్షెవిక్కులు అధికారం చేబట్టాలి,' 'మార్క్సిజమూ, సాయుధ తిరుగుబాటూ' అనే రెండు చరిత్రాత్మక లేఖలు పంపినాడు; వాటిలో ఆయన సాయుధ తిరుగుబాటుకు సత్వర ఆచరణాత్మక సన్నాహాలు చేసే అవసరాన్ని నిరూపించినాడు. "రెండు రాజధానుల సోవియట్లలోనూ మెజారిటీ సంపాయించిన బోల్షెవిక్కులు... తమ సొంత చేతుల్లోకి రాజ్యాధికారం తీసుకోగలరు, తీసుకొని తీరాలి" అని ఆయన రాసినాడు.

లెనిన్ తిరుగుబాటు పథకాన్ని జాగ్రత్తగా ఆలోచించి, తయారు చేసినాడు. యీ పథకం యిటు విప్లవంయొక్కా, అటు ప్రతీఘాత విప్లవంయొక్కా బలాలనూ, ఆనాడు దేశంలో వుండిన సకల పరిస్థితులనూ గణనలోకి తీసుకుంది. వెంటనే తిరుగుబాటు దళాల హెడ్క్వార్టర్స్ యేర్పరచడమూ, బలాలను తగుచోట్ల నిలపడమూ, కీలక స్థలాలలో అత్యంత విశ్వసనీయమైన దళాలను సాంద్రీకరించడమూ, అనగా ప్రభుత్వ భవనాలను చుట్టు ముట్టడమూ, టెలిఫోన్ ఎక్స్చేంజినీ, టెలిగ్రాఫ్ ఆఫీసునూ ఆక్రమించుకోవడమూ లెనిన్ ప్రతిపాదించినాడు. విప్లవ ప్రతీఘాత సైన్యాలు పెట్రోగ్రాడ్ లోపలికి రాకుండా చేయగలిగి, నగర రక్షణను నిస్సందేహం చేయగల బలీయమైన పోరాట దళాలను నిర్మించాలని ఆయన సిఫారస్ చేసినాడు. విజయవంతమైన సాయుధ తిరుగుబాటుకు యిప్పుడు సకల పరిస్థితులూ పక్వంగా వున్నాయని ఆయన చూపించినాడు. ఫాక్టరీలకూ, సైనిక బారకాసులకూ, జనాలు నివసించే, పనిచేసే అన్ని చోట్లకూ కమ్యూనిస్టులను పంపాలని ఉద్బో

ధించినాడు. "జీవనాడి అక్కడ వుంది, మన విప్లవానికి మోక్ష మూలం అక్కడ వుంది" అని ఆయన రాసినాడు.

కేంద్ర కమిటీ లెనిన్ ఉత్తరాలను ఆదేశాలుగా స్థానిక పార్టీ శాఖలకు సర్క్యులేట్ చేసింది. సాయుధ తిరుగుబాటుకు పార్టీ సన్నాహాలు ప్రారంభించింది. ప్రముఖ పార్టీ శాఖలన్నిటికీ నిర్దిష్ట కర్తవ్యాలు యివ్వబడినాయి. రెడ్‌గార్డ్ దళాలకు అదనపు బలాలు చేర్చి, కొత్త దళాలు నిర్మింపబడినాయి. పెట్రోగ్రాడ్‌లో సైనిక శిక్షకులకు శిక్షణ తరగతులు యేర్పాటుచేయబడినాయి. బాల్టిక్ నౌకాదళంలోని బోల్షెవిక్కులు నౌకా సైనికులలో తిరుగుబాటుకు భూమిక తయారుచేసినారు. బోల్షెవిక్కులకు విధేయంగా వుండిన యుద్ధరంగ సైనిక సంస్థలు కార్మికుల సహాయార్థం పోయే సైనిక దళాలను నిర్మించినాయి.

పెట్రోగ్రాడ్‌కు మరింత దగ్గరగా వుండడానికి సెప్టెంబర్ మధ్యలో లెనిన్ హెల్సింగ్‌ఫర్స్‌నుండి వీబొర్గ్‌కు మారినాడు. సాయుధ తిరుగుబాటు ప్రారంభించడానికి తరుణం వచ్చింది గనుక అధికారం వశం చేసుకోడానికి కట్టుదిట్టమైన సన్నాహాలు చేయండని ఉద్బోధించే లెనిన్ వ్యాసాలను 'రబోచియ్ పూత్' ('కార్మిక పథం') అనే బోల్షెవిక్ వార్తాపత్రిక ముద్రించింది. "సంక్షోభం పక్వమైంది. రష్యన్ విప్లవ భవిష్యత్తు యావత్తూ నిర్ణయం కాబోతున్నది" అని ఆయన రాసినాడు. అనుకూల తరుణం జారవిడువడమంటే సర్వమూ నష్టపడడ మన్నమాట, అని ఆయన అన్నాడు. అక్టోబర్ 1వ తేదీనాడు కేంద్ర కమిటీకీ, మాస్కో, పెట్రోగ్రాడ్ కమిటీలకూ, పెట్రోగ్రాడ్, మాస్కో కమిటీల బోల్షెవిక్ సభ్యులకూ రాసిన జాబులో తిరుగుబాటును వాయిదా వేయకూడదనీ, "మనం వెంటనే తిరుగుబాటుకు పూనుకోవాలి" అనీ లెనిన్ గుర్తుచేసినాడు.

సాయుధ తిరుగుబాటు సన్నాహాలకు దర్శకత్వం వహించడానికి లెనిన్ అక్టోబర్ 7న రహస్యంగా వీబొర్గ్‌నుండి పెట్రోగ్రాడ్‌కు బయలు

దేరినాడు. అదే రోజున ఆయన బోల్షెవిక్కుల నగర కాన్ఫరెన్సుకు ఒక ఉత్తరం పంపినాడు. అక్టోబర్ 8న, ఉత్తర ప్రాంత సోవియట్ల మహాసభ ప్రతినిధులకు రాసిన జాబులో, నిర్ణయాత్మక ఆచరణకు తరుణం వచ్చిందని ఆయన నొక్కిచెప్పినాడు. "ఆలస్యం మరణాంతకం" అని ఆయన రాసినాడు. పార్టీ బలాన్నీ, జనాలను నడిపించడానికి దాని సామర్థ్యాన్నీ ఆయన దృఢంగా నమ్మినాడు, రష్యా విప్లవ కార్మిక వర్గంలో తరగని శక్తి నిధులు యింకా వినియోగింపబడకుండా వున్నాయని ఆయనకు తెలుసు. సాయుధ తిరుగుబాటు విజయవంతంగా అంత మౌతుందని ఆయనకు దృఢ విశ్వాసం వుండింది.

అక్టోబర్ 10న కేంద్ర కమిటీ సమావేశంలో సాయుధ తిరుగుబాటు సమస్య చర్చింపబడింది. లెనిన్ ఒక నివేదిక యిచ్చినాడు; అందులో, కార్మికవర్గమూ, అత్యంత బీద రైతులూ అధికారం వశం చేసుకోడానికి సమయం పక్వమైందని ఆయన చూపించినాడు. సాయుధ తిరుగుబాటుమీద లెనిన్ చరిత్రాత్మక తీర్మానాన్ని కేంద్ర కమిటీ ఆమోదించింది. కామెనెవ్, జినోవ్యెవ్‌లు మాత్రం పిరికితనం ప్రదర్శించి, యీ తీర్మానాన్ని వ్యతిరేకించినారు. పార్టీ లెనిన్ పంథాను స్వీకరించి, తన ఆచరణాత్మక కార్యకలాపాలకు ఆయన తీర్మానాన్ని మూలస్తంభంగా చేసుకుంది. తిరుగుబాటుకు నాయకత్వం వహించడానికి లెనిన్ అగ్రేసరత్వాన ఒక పొలిట్ బ్యూరో యీ సమావేశంలో యెన్నుకోబడింది.

అక్టోబర్ 16న కార్మిక సంస్థల ప్రతినిధులతో కలిసి సంయుక్తంగా జరిగిన కేంద్ర కమిటీ విస్తృత సమావేశానికి లెనిన్ మళ్లీ ఉపన్యాసం యిచ్చినాడు. తిరుగుబాటు వెంటనే ప్రారంభించడం గురించి ఆయన గట్టిగా చెప్పినాడు. సమావేశంలో మెజారిటీ లెనిన్‌ను బలపరిచింది. తిరుగుబాటుకు దర్శకత్వం వహించడానికి యీ సమావేశంలో ఒక విప్లవ సైనిక కేంద్రం యెన్నుకోబడింది; అందులోని సభ్యులు

ఎ. యస్. బూబ్నొవ్, యఫ్. ఇ. జెర్జీన్స్కీ, వై. యం. స్వెర్ద్లోవ్, జె. వి. స్టాలిన్, యం. యస్. ఉరీత్స్కీ.

తిరుగుబాటును వాయిదా వేయడానికి అనుకూలంగా చెప్పబడిన వాదాల నన్నిటినీ లెనిన్ నిరాకరించినాడు. విప్లవ శక్తులను ధ్వంసం చేయడానికి బూర్జువావర్గం యీ ఆలస్యాన్ని వినియోగించుకుంటుందని ఆయన చెప్పినాడు. పార్టీ కార్యకర్తలతోనూ, మిలిటరీ నాయకుల తోనూ ఆయన రహస్య సమావేశాలు జరిపి, రాబోయే యుద్ధాలకు సన్నాహాలు చేయడంలో యేమి ప్రగతి సాధింపబడుతున్నదీ తెల్చుకున్నాడు. తిరుగుబాటుకు జరిగే మిలిటరీ, సాంకేతిక సన్నాహాలను ఆయన తనిఖీ చేసి, సలహాలూ, సూచనలూ యిచ్చినాడు. ఆయన సమస్త ఆలోచనలూ, శ్రద్ధా తిరుగుబాటుకు అర్పించబడినాయి. "ఇల్యీచ్ మరి దేన్ని గురించీ ఆలోచించలేదు" అని క్రూప్స్కాయా తన స్మృతులలో రాసింది. "ఆయన మనస్థితీ, ప్రగాఢ విశ్వాసమూ తమంతకు తామే ఆయన కామ్రేడ్లకు వ్యాపించినాయి." తిరుగుబాటుకు ఆయన నిజమైన ఉత్తేజకుడుగా, ఆర్గనైజరుగా వుండినాడు.

లెనిన్‌యొక్కా, పార్టీ కేంద్ర కమిటీయొక్కా నాయకత్వంకింద దేశమంతటా తిరుగుబాటుకు క్రమబద్ధమైన సన్నాహాలు ప్రారంభించబడినాయి. కేంద్ర కమిటీ స్థానిక ప్రాంతాలకు ఉత్తరాలూ, నిర్దిష్ట ఆదేశాలూ పంపింది. ఆ సమయంలో పెత్రోగ్రాడ్‌లోనూ, మాస్కోలోనూ జరుగుతూవుండిన బోల్షివిక్ కాన్ఫరెన్సులు లెనిన్ తీర్మానాలకు అనుకూలంగా వోటు చేసినాయి. అలాంటి తీర్మానాలు ముప్పైకు పైగా చిల్లర ప్రాంతీయా, గుబెర్నియా, జిల్లా కాన్ఫరెన్సులలో ఆమోదింపబడినాయి. సోవియట్ల అధికారం కొరకు నిర్ణయాత్మక పోరాటానికి పార్టీ తయారౌతూవుండింది. పార్టీ సంస్థలు సాయుధ తిరుగుబాటుకు సన్నద్ధం కావడంలో తోడ్పడడానికి కేంద్ర కమిటీ సభ్యులు స్థానిక ప్రాంతాలకు పంపబడినారు. సడలని ఉత్సాహంతో, పరమమైన విశ్వాసంతో

లెనిన్ పార్టీ సభ్యులను సమీకరించి, వాళ్లను యుద్ధానికి తయారు చేసినాడు. నిత్యం జనాల మధ్యలో, వాళ్ల పోరాటానికి అగ్రస్థానంలో వుండిన పార్టీ లక్షలాదిగా వుండిన కార్మికులనూ, కర్షకులనూ, సైని కులనూ ఒక సమైక్య విప్లవ సైన్యంగా సమీకరించ గలిగింది.

పార్టీచేత ఓడింపబడిన కామెనెవ్, జినోవ్యెవ్‌లు నీచమైన ద్రోహం చేసినారు. సాయుధ తిరుగుబాటు సమస్యమీద కేంద్ర కమి టీతో తమ అనంగీకారం గురించి వాళ్లు మెన్షివిక్ వార్తాపత్రిక 'నోవయ జీజ్న్' ('నూతన జీవితం')లో ఒక ప్రకటన చేసి, తద్వారా పార్టీ రహస్య నిర్ణయాన్ని శత్రువులకు వెల్లడించినారు. సాయుధ తిరుగు బాటును అరికట్టడానికి అత్యవసర చర్యలు తీసుకోవడంలో తాత్కాలిక ప్రభుత్వం క్షణం కూడా ఆలస్యం చేయలేదు.

లెనిన్ కోపంతోనూ, యేవగింపుతోనూ ద్రోహులను ఖండించి, వాళ్లను తీవ్రంగా అభిశంసించాలనీ, పార్టీనుండి బహిష్కరించాలనీ డిమాండు చేసినాడు. "వీళ్లతో నాకు యింతకుముందు గల సన్ని హిత సంబంధాల కారణంగా యీ మాజీ కామ్రేడ్లను ఖండించడానికి నేను వెనుకాడడం సిగ్గుచేటు పనిగా భావించాలి. వాళ్లిద్దరిలో యెవరినీ యిక యెంతమాత్రమూ కామ్రేడుగా నేను భావించననీ, పార్టీనుండి వాళ్లిద్దరి బహిష్కరణ కొరకు నేను కేంద్ర కమిటీలోనూ, మహా సభలోనూ శాయశక్తులా పోరాడుతాననీ నిరాఘాటంగా ప్రకటిస్తున్నాను" అని ఆయన రాసినాడు. కానీ కేంద్ర కమిటీ కామెనెవ్‌నూ, జినోవ్యెవ్‌నూ బహిష్కరించలేదు, పార్టీ తరఫున మాట్లాడకుండా వాళ్లను నిషేధించింది.

సాయుధ తిరుగుబాటుమీద కేంద్ర కమిటీ తీర్మానాన్ని ట్రాట్స్కీ బాహాటంగా వ్యతిరేకించలేదు, కానీ సోవియట్ల రెండవ మహాసభ జరిగిందాకా దాన్ని వాయిదావేయాలని పట్టుబట్టినాడు; అది తిరుగుబాటును అడ్డగించడంతో సమానం. యీ స్థావరాన్ని లెనిన్

తీవ్రంగా వ్యతిరేకించినాడు. "సోవియట్ల మహాసభ కోసం 'వేచివుండడం' వట్టి బుద్ధితక్కువ, లేదా పచ్చి ద్రోహం" అని ఆయన రాసినాడు.

అక్టోబర్ 25కు నిర్ణయింపబడిన సోవియట్ల రెండవ మహాసభ ప్రారంభానికి ముందే సాయుధ తిరుగుబాటు మొదలుకావాలనీ, ఆ రోజున విప్లవంమీద నిర్ణయాత్మకంగా దెబ్బతీయడానికి తయారౌతున్న విప్లవ ప్రతీఘాత శక్తులను తద్వారా ముందే అరికట్టాలనీ లెనిన్ గట్టిగా డిమాండు చేసినాడు. యన్. ఐ. పొద్వోయ్స్కియ్ తన స్మృతులలో యిలా రాసినాడు: "విప్లవాన్ని ప్రారంభించడానికి వ్లదీమిర్ ఇల్యీచ్ మహా తొందరలో వుండినాడు. అత్యంత చురుకైన, స్థిరమైన చర్యలనూ, సకల నగర కీలక స్థానాల సత్వర ఆక్రమణనూ ఆయన పట్టుదలగా డిమాండు చేసినాడు." లెనిన్ సలహామీద తిరుగుబాటు అక్టోబర్ 24న ప్రారంభమైంది. ఉదయం పెందలకడ, తాత్కాలిక ప్రభుత్వం పార్టీ కేంద్ర పత్రిక అయిన 'రబోచియ్ పూత్'ను మూసివేయడానికి ప్రయత్నం చేస్తూవుండగా రెడ్గార్డులూ, సైనికులూ విప్లవ సైనిక కేంద్రం ఉత్తరువులమీద, వార్తాపత్రిక ఆవరణను తమ రక్షణకిందికి తీసుకుని, తిరుగుబాటు హెడ్క్వార్టర్స్ వుండిన స్మోల్నియ్ ఇన్స్టిట్యూట్ చుట్టూ కాపలాదార్లను నియమించినారు.

నెవానదిమీద వంతెనలు యెత్తి, తద్వారా కార్మికుల విప్లవ బలాలను విడగొట్టి, వాటితో విడివిడిగా వ్యవహరించాలని ప్రభుత్వం ఉద్దేశించినట్లు వార్త విని, లెనిన్ స్మోల్నియ్కి పోవడానికి నిశ్చయించుకున్నాడు. అక్టోబర్ 24 రాత్రి పొద్దుబోయిన తర్వాత లెనిన్ తన ప్రాణానికి యెంతో ప్రమాదంతో, కోసక్కులూ*, మిలిటరీ పాఠశాల విద్యార్థులూ

---

* కోసక్కులు – జారిస్టు రష్యాలో అధిక హక్కులు గల ప్రజలలో మిలిటరీ వర్గం. జారిస్టు ప్రభుత్వం వాళ్లను విప్లవోద్యమానికి వ్యతిరేకంగా వినియోగించింది. – సం.

కాపలా కాస్తూవుండిన పెట్రోగ్రాడ్ నిర్జన వీధుల గుండా పోయి, స్మోల్నియ్ చేరుకొని, అక్కడ తిరుగుబాటుకు ప్రత్యక్ష నాయకత్వం వహించినాడు. "స్మోల్నియ్ దీపాలతో వెలిగిపోతున్నది, తీవ్ర కార్యకలాపాలకు రంగంగా వుంది" అని క్రూప్స్కయా రాసింది. "రెడ్‌గార్డులూ, ఫాక్టరీల ప్రతినిధులూ, సైనికులూ ఆదేశాలు పొందడానికి అన్ని చోట్లనుండీ వచ్చినారు." ఫాక్టరీలకూ, మిల్లులకూ, స్థానిక పార్టీ కమిటీలకూ, సైనిక దళాలకూ తిరుగుబాటు ప్రారంభించడానికి ఉత్తరువులు పంపబడినాయి. పథకం ప్రకారం రెడ్‌గార్డ్ దళాలు వివిధ స్థానాలు ఆక్రమించడం ప్రారంభించినాయి. నగరంలోకి వచ్చే మార్గాలు బాల్టిక్ నౌకాదళ సైనికులచేతా, విప్లవ దళాలచేతా, ఫాక్టరీలూ, మిల్లులూ రెడ్‌గార్డులచేతా కాపలా కాయబడినాయి.

లెనిన్ ఆదేశాలకు పూర్తి అనుగుణంగా, అసలైన మిలిటరీ కచ్చితత్వంతోనూ, చాకచక్యంతోనూ తిరుగుబాటు నిర్వహింపబడింది. పోరాట దళాలు గొప్ప ప్రమాణం గల నిర్మాణ పటిష్ఠతతోనూ, క్రమశిక్షణతోనూ, సమన్వయంతోనూ వ్యవహరించినాయి. రాత్రి అంతా లెనిన్ తిరుగుబాటు పురోగతిని గురించి నివేదికలు స్వీకరిస్తూ, ఆదేశాలు యిస్తూవుండినాడు.

అక్టోబర్ 25 (నవంబర్ 7)న ఉదయానికల్లా కేంద్ర టెలిఫోన్ ఎక్స్ఛేంజీ, టెలిగ్రాఫ్ ఆఫీసూ, రేడియో స్టేషనూ, నెవానదిమీద వంతెనలూ, రైల్వే స్టేషన్లూ, సకల ముఖ్య ప్రభుత్వ ఆఫీసులూ తిరుగుబాటు చేసే కార్మికులచేతా, సైనికులచేతా, నౌకాసైనికులచేతా ఆక్రమింపబడివుండినాయి.

జనాల నాయకుడుగా, తిరుగుబాటు యే దిశ పట్టేదీ స్పష్టంగా చూసే విజ్ఞతాయుత, నిర్భయ వ్యూహ రచయితగా లెనిన్ ప్రజ్ఞ ఆయన తిరుగుబాటును నడిపించడంలో కన్నులకు కట్టినట్లు వెల్లడి అయింది. "యీ మహా కల్లోల దినాలలో లెనిన్ ఉత్తేజితుడుగా, ఉల్లాసంగా, యేదో ప్రత్యేక అంతర్వహ్నిచేత రగులుతున్నట్లుగా, సడలు

బాటు లేకుండా, ఆత్మవిశ్వాసంతో, దృఢంగా వుండినాడు'' అని తిరుగుబాటులో పాల్గొన్న ఒక వ్యక్తి అన్నాడు. లెనినూ, బోల్షివిక్ పార్టీ యిచ్చిన నాయకత్వమూ, రెడ్‌గార్డ్ కార్మికుల, సైనికుల, నౌకాసైని కుల ధీర పోరాటమూ, వీరత్వమూ ప్రపంచ చరిత్రలోని ఒక అత్యంత మహత్తర ఘటనయొక్క – భూస్వాముల, పెట్టుబడిదార్ల అధికారాన్ని కూలదోసే ఘటనయొక్క – విజయాన్ని నిస్సందేహం చేసినాయి.

అక్టోబర్ 25 ఉదయం 10 గంటలకు పెట్రోగ్రాడ్ కార్మిక, సైనిక ప్రతినిధుల సోవియట్‌యొక్క విప్లవ సైనిక కమిటీ లెనిన్ రాసిన 'రష్యా పౌరులకు' అనే ప్రకటనను విడుదల చేసింది. తాత్కాలిక ప్రభుత్వం పదవీభ్రష్టం చేయబడిందనీ, రాజ్యాధికారం సోవియట్ల చేతుల్లోకి వచ్చిందనీ, ప్రజలు యే ప్రయోజనం కోసం పోరాడినారో అది సాధింపబడిందనీ ఆ ప్రకటన తెలియజేసింది. మధ్యాహ్నం 2.30 గంటలకు పెట్రోగ్రాడ్ సోవియట్ తన చారిత్రాత్మక సమావేశం జరిపింది. హాలులో లెనిన్ కనిపిస్తూనే ఉత్సాహపు హోరు చెలరేగింది. సోషలిస్టు విప్లవ విజయం గురించీ, సోవియట్ ప్రభుత్వాన్ని యెదుర్కొనే కర్తవ్యాల గురించీ ఆయన ఆవేశపూరితంగా ఉపన్యసించి, రష్యాలో సోష లిజం విజయం పొందుతుందనే విశ్వాసం వ్యక్తంచేసినాడు. ''యిప్పటి నుండి రష్యా చరిత్రలో ఒక నూతన దశ ప్రారంభమౌతుంది. యిది, మూడవ రష్యన్ విప్లవం, చివరకు సోషలిజం విజయానికి దారితీయక తప్పదు'' అని ఆయన అన్నాడు.

తాత్కాలిక ప్రభుత్వ మంత్రులు సమావేశమై వుండిన శీత కాల రాజభవనాన్ని వెంటనే పట్టుకోడానికి లెనిన్ అక్టోబర్ 25 రాత్రి ఉత్తరువు యిచ్చినాడు. 'అరోరా' యుద్ధనౌక కాల్చిన చరిత్రా త్మక కాల్పు శీతకాల రాజభవనంమీద దాడికి సంకేతం యిచ్చింది. విప్లవ దళాలు రాజభవనాన్ని ముట్టడించి పట్టుకున్నాయి. బూర్జువా ప్రభుత్వపు చివరి కోట పతనమైంది.

లెనిన్ అగ్రేసరత్వాన బోల్షెవిక్ పార్టీ రష్యా ప్రజలను వాళ్ళ మహత్తర విజయానికి నడిపించింది. అక్టోబర్ విప్లవ విజయం లెనిని జంయొక్క దిగ్విజయం, అనేక సంవత్సరాల పొడవున లెనినిస్టులు సాగించిన కఠిన శ్రమతో కూడిన కృషియొక్క, తీవ్ర వీరోచిత పోరాటంయొక్క ఫలితం. విప్లవ మార్క్సిస్టు పార్టీచేత నడిపించబడినప్పుడు కార్మికవర్గమూ, అత్యంత బీద రైతులూ యెంత మహత్తర శక్తి అయిందీ అక్టోబర్ సోషలిస్టు విప్లవం యావత్ ప్రపంచ ప్రజలకూ నిరూపించింది.

అది నిజమైన ప్రజా విప్లవం. అది రష్యాలో బూర్జువా వ్యవస్థను శాశ్వతంగా అంతమొందించి, రష్యాలో కార్మికవర్గ నియంతృత్వాన్ని నెలకొల్పి, కార్మిక కర్షకుల రాజ్యాన్ని సృష్టించింది. అక్టోబర్ విప్లవం కేవలం రాజకియాధికారం మారడం కాదు. అది రష్యన్ ప్రజల జీవితాలలో ప్రగాఢ సాంఘిక ఆర్థిక ఉత్పతనానికి సంకేతం. అది దేశ విప్లవాత్మక పునర్నిర్మాణ — నూతన సోషలిస్టు సమాజ నిర్మాణ — ప్రారంభానికి చిహ్నం.

అక్టోబర్ సోషలిస్టు మహా విప్లవ విజయం మానవ చరిత్రలో నూతన ప్రకరణం ఆరంభించింది, సామ్రాజ్యవాద పతనపు, సోషలిజం కమ్యూనిజంల విజయపు యుగాన్ని ప్రవేశపెట్టింది.

# ప్రపంచ ప్రథమ సోషలిస్టు రాజ్య స్థాపకుడు

అక్టోబర్ 25 (నవంబర్ 7) సాయంత్రం స్మోల్నియ్‌లో సోవియట్ల రెండవ మహాసభ ప్రారంభమైంది. 400 బోల్షెవిక్కులతో సహా 650 ప్రతినిధులు, దేశంలో అన్ని ప్రాంతాలనుండి వచ్చినవాళ్ళు,

దానికి హాజరైనారు. సర్వాధికారమూ సోవియట్లకు సంక్రమించిందని మహాసభ ప్రకటించింది. యిది ఒక మహత్తర చరిత్రాత్మక ఘటన.

అక్టోబర్ 26న మహాసభలో లెనిన్ ఉపన్యాసం ప్రతినిధులు మహా ఉత్సాహంతో విన్నారు. మహాసభకు ప్రతినిధిగా వుండిన ఎ. ఎ. అన్ద్రేయెవ్ యిలా రాసినాడు: "లెనిన్ వేదికమీద కనిపించినప్పుడు హాలు అంతా లేచి, ఆయన నిలబడిన వేదికవైపు ఉప్పొంగింది. చప్పట్ల మూలంగానూ, 'లెనిన్ వర్ధిల్లాలి!' అనే కేకల మూలంగానూ ఆయన చాలాసేపు తన ఉపన్యాసం ప్రారంభించలేకపోయినాడు." ప్రతినిధులు కాక, కార్మికులతోనూ, సైనికులతోనూ, నౌకాసైనికులతోనూ హాలు కిటకిటలాడుతూ వుండింది. జనం వేదికమీద లెనిన్‌ను చూడడానికి కిటికీలలోనూ, స్తంభాల దిమ్మెల మీదా, కుర్చీలమీదా నిలబడినారు. హాట్లూ, టోపీలూ గాలిలోకి యెగురవేయబడినాయి, తళతళలాడే తుపాకి సన్నీలు పైకి యెత్తబడినాయి. శాంతిని గురించి లెనిన్ యిచ్చిన ఉపన్యాసం శ్రోతలు నిలిచి వింటూ వుండినారు. ఆ ఉపన్యాసంలో, అన్ని రంగాలలోనూ తక్షణ యుద్ధ విరమణకు పిలుపు యిస్తూ సకల యుద్ధమగ్న దేశాలకూ విజ్ఞప్తిని ఆమోదించాలని కార్మికవర్గ విప్లవ నాయకుడు ప్రతిపాదించినాడు.

లెనిన్ ప్రతిపాదనమీద మహాసభ కోటానుకోట్ల మనస్సులను ఆందోళనపరిచే అత్యంత ముఖ్యమైన సమస్యకు సంబంధించిన 'శాంతి మీద ఉత్తరువు'ను ఆమోదించింది. సోవియట్ ప్రభుత్వ శాంతియుత వైదేశిక విధానపు ప్రథమ చర్య యిది — సామ్రాజ్యవాద బూర్జువావర్గం అనుసరించిన పరభక్షణాత్మక విధానానికి విరుద్ధమైనది. నూతన సోషలిస్టు రాజ్యపు మొట్టమొదటి దినంనుండి దాని వైదేశిక విధానం సకల దేశాల శాంతి సౌహార్దాల సేవలో వుంచబడింది. యుద్ధం మానవ జాతిపట్ల మహా నేరం అని ఆ ఉత్తరువు ప్రకటించింది.

శాంతిమీద ఉత్తరువు మహత్తర చారిత్రక ప్రాముఖ్యం గలది.

తరువాత లెనిన్ భూమిమీద నివేదిక యిచ్చి, తన ముసాయిదా ఉత్తరువును చదివినాడు. అది యెట్టి పరిస్థితులలో రాయబడిందీ వి. డి. బోంచ్-బ్రుయేవిచ్ స్మృతులలో వర్ణింపబడింది; అది ఆయన యింటిలో రాయబడింది. లెనిన్‌కు రెండు రోజులుగా నిద్ర లేదు. ఆయన తిరుగుబాటుకు దర్శకత్వం వహిస్తూవుండినాడు. శీతకాల రాజ భవనం పట్టుబడి, తాత్కాలిక ప్రభుత్వ మంత్రులు అరెస్టు చేయబడి, రెండవ సోవియట్ల మహాసభ ప్రారంభమైన తర్వాత, కొద్ది గంటలు నిద్రపోడానికి లెనిన్ స్మోల్నియ్‌నుండి బోంచ్-బ్రుయేవిచ్ యింటికి పోయి నాడు. కానీ ఆయనకు నిద్ర పట్టలేదు — మరుదినం ఆయన మహా సభలో ఉపన్యసించవలసి వుండింది. కనుక, రాత్రి పొద్దుబోయిన తర్వాత ఆయన మెల్లగా దిగి, యెవరికీ మెలకువ రాకుండా జాగ్రత్త పడుతూ, మునిగాళ్లమీద రాతబల్లవద్దకు పోయి, 'భూమిమీద ఉత్తరువు' రాయడం మొదట పెట్టుతున్నాడు. కాగితంమీద పేనా చకచక కదలుతుంది. అంతా ముందుగానే మనసులో ఆలోచింపబడి సిద్ధంగా వుంది. లెనిన్ తన చరిత్రాత్మక ఉత్తరువు ముసాయిదాను పూర్తి చేసేటప్పటికి నగ రంమీద తెలతెలవారుతూ వుండింది.

భూమి ఉత్తరువు నష్టపరిహారం లేకుండా భూయాజమాన్యాన్ని శాశ్వతంగా రద్దు చేసి, భూమిని ప్రజలకు బదలాయించింది. 15 కోట్ల హెక్టేర్లకు పైగా భూమి ప్రజల చేతుల్లోకి పోయింది. రైతులు దేనికోసం పోరాడుతూ వుండినారో ఆ యుగయుగాల స్వప్నం చివరకు సాధింపబడింది. లెనిన్ ఉత్తరువుద్వారా భూమిమీద సొంత యాజమాన్యం తొలగింపబడి దాని స్థానంలో యావత్ప్రజా, ప్రభుత్వ యాజమాన్యం వచ్చింది; అది తరువాత వ్యవసాయాన్ని సోషలిస్టు పద్ధతులమీద పునర్నిర్మాణం చేయడాన్ని సులభం చేసింది. చప్పట్ల హోరుమధ్య మహాసభ 'భూమిమీద ఉత్తరువు'ను ఆమోదించింది. త్వేర్ గుబెర్నియానుండి

వచ్చిన ఒక రైతు ప్రతినిధి లెనిన్‌కు కృతజ్ఞత తెలుపుతూ ఉపన్యసించినాడు; ఆయన్ను బీదరైతుల అత్యంత స్థిరమైన రక్షకుడుగా అతను వర్ణించినాడు.

రెండవ సోవియట్ల మహాసభ కార్మిక సైనిక ప్రతినిధుల సోవియట్ల అఖిల రష్యా కేంద్ర కార్యనిర్వాహక వర్గాన్ని యెన్నుకొని, ప్రభుత్వాన్ని — ప్రజా కమిస్సార్ల కౌన్సిల్‌ను — నిర్మించింది; దానికి అధ్యక్షుడుగా లెనిన్ యెన్నుకోబడినాడు. తమ ప్రయోజనాలను సాహసంగా సర్వేసర్వత్రా సంరక్షించిన బోల్షెవిక్ పార్టీకి ప్రజలు దేశ నాయకత్వాన్ని అప్పగించినారు. మహాసభకు హాజరుకావడానికి యెన్నికైన ప్రజా ప్రతినిధులు లెనిన్ నాయకత్వాన ప్రపంచ ప్రథమ కార్మిక కర్షక ప్రభుత్వాన్ని నెలకొల్పినారు.

విప్లవానికి సన్నాహాలు చేసి, దాన్ని ఆచరణలో సాధించిన ఆ కాలంలో ప్రపంచంముందు లెనిన్ గొప్ప మార్క్సిస్టు సిద్ధాంతకర్తగా, విజ్ఞత గల కమ్యూనిస్టు పార్టీ నాయకుడుగా, మహోన్నత విప్లవ వ్యూహ రచయితగా కనిపించినాడు.

రాజ్య పరిపాలనలోకి వచ్చి బోల్షెవిక్ పార్టీ ప్రజలపట్ల తన బాధ్యతలను నిర్వర్తించింది: అది శాంతిని ప్రకటించింది, ప్రజలకు స్వేచ్ఛ యిచ్చింది, భూమి యిచ్చింది. కానీ ఆ కార్మికవర్గ పరిపాలనను దృఢపరచవలసి వుండింది. అక్టోబర్ విప్లవ విజయపు మొట్టమొదటి దినంనుండి లెనిన్‌యొక్క సమస్త ఆలోచనలూ, చర్యలూ, ఇచ్ఛా, శక్తీ విప్లవ విజయాలను సంరక్షించడంమీదా, పెంచడంమీదా సాంద్రీకరించబడినాయి.

కార్మికులూ, కర్షకులూ నూతన జీవితాన్ని నిర్మించడానికి పూనుకున్నది అత్యంత ప్రతికూలమైన, కష్టమైన పరిస్థితులలో. సోషలిస్టు విప్లవం ఒక్క దేశంలో, అందులోనూ ఆర్థికంగా వెనుకబడిన దేశంలో, జనాభాలో యెక్కువ భాగం చిన్న రైతులు గల దేశంలో విజయవంతమైంది. యుద్ధం యింకా సాగుతూవుండింది. అది దేశాన్ని

నాశనం చేస్తూ, జాతీయ ఆర్థిక వ్యవస్థ నంతటినీ అస్తవ్యస్తం చేస్తూవుండింది. సోవియట్ ప్రభుత్వపు అనేక శత్రువులు దానిమీద కుట్రలూ, తిరుగుబాట్లూ యేర్పాటుచేస్తూ, విధ్వంసక చర్యలూ, రెచ్చగొట్టే చర్యలూ పన్నుతూ, అబద్ధాలూ, నిందలూ ప్రచారం చేస్తూ వుండినారు.

కామెనెవ్, జినోవ్యెవ్, రీకొవ్, వాళ్ల అనుచరులూ పార్టీ పంథాను వ్యతిరేకించినందున పరిస్థితి మరింత తీవ్రమైంది. వాళ్లు భిన్న పార్టీల ప్రతినిధులతో ప్రభుత్వాన్ని నెలకొల్పాలనే మెన్షివిక్కుల, సోషలిస్టు రివల్యూషనరీల డిమాండ్లను బలపరిచినారు. వాళ్ల ప్రవర్తనను లెనిన్ తీవ్రమైన క్రమశిక్షణా భంగంగా ఖండించినాడు. అప్పుడు వాళ్లు కేంద్ర కమిటీకి రాజీనామా చేసినట్లూ, రీకొవ్, జినోవ్యెవ్, నొగీన్‌లు ప్రభుత్వానికి రాజీనామా చేసినట్లూ ప్రకటించినారు. 'సకల పార్టీ సభ్యులకూ, సకల రష్యా శ్రామిక ప్రజలకూ' కేంద్ర కమిటీ పంపిన సందేశంలో లెనిన్ వాళ్ల ప్రవర్తనను ఖండించినాడు, దానిని విప్లవ పరిత్యాగుల, సమ్మె విచ్ఛేదకుల చర్యగా వర్ణించినాడు. యీ కొద్దిపాటి లొంగుబాటుదార్లను వెంటనే తొలగించి, వాళ్ల స్థానంలో కార్మికవర్గ ప్రయోజనం పట్ల భక్తి గలవాళ్లు వుంచబడినారు.

శత్రువుల ప్రతిఘటనను భగ్నం చేయడమూ, పట్టణాలకు ఆహార సరఫరా యేర్పాటుచేయడమూ, ఫాక్టరీలూ, మిల్లులూ పునః ప్రారంభించడమూ, నూతన సోవియట్ రాజ్యాన్ని నిర్మించడమూ అవసరంగా వుండింది.

విస్తారమైన కార్మిక, కర్షక జనాలను సోషలిస్టు నిర్మాణంలో క్రియాత్మకంగా పాల్గొనేటట్లు చేసే కర్తవ్యాన్ని లెనిన్ యెదుట బెట్టినాడు. ధనవంతులు, లేదా ధనికవర్గాలనుండి వచ్చిన అధికార్లు మాత్రమే దేశాన్ని పరిపాలించగలరనే బూర్జువా కట్టుకథను తుడిచి వేయవలసిన సమయం వచ్చిందని ఆయన చెప్పినాడు.

ఒక ప్రజా కమిస్సారియట్‌లోని పదవులలో నియమింపబడిన కొందరు ఫాక్టరీ కార్మికులు ఒకనాడు లెనిన్‌వద్దకు పోయి, తమ కొత్త పదవులకు తాము సరితూగజాలకున్నామనీ, తమ పాత పదవులకు తిరిగిపోవడానికి అనుమతించాలనీ ఆయన్ను అడిగినారు. వాళ్లు చెప్పింది లెనిన్ శ్రద్ధగా విని, యిలా అన్నాడు: ''నేను కూడా యెప్పుడూ రాజ్యాధినేతగా వుండలేదు. కానీ పార్టీ, ప్రజలూ యీ పని నాకు అప్పగించినారు. వాళ్ల విశ్వాసం సరైనదని నేను రుజువు చేయాలి. మీరు కూడా అదే పని చేయాలని నేను సలహా యిస్తున్నాను.''

1917 నవంబర్‌లో లెనిన్ 'ప్రజానీకానికి' ఒక విజ్ఞప్తి రాసినాడు, సోవియట్లచుట్టూ సమీకృతం కావాలనీ, రాజ్య పరిపాలనను తమ సొంత చేతుల్లోకి తీసుకోవాలనీ ప్రజలను కోరుతూ. సభలలోనూ, సమావేశాలలోనూ యిచ్చే ఉపన్యాసాలలో, నూతన జీవితాన్ని నిర్మించడానికి జనాలను ఆయన యెల్లప్పుడూ ఉద్బోధించినాడు. ''సోషలిజం పైనుండి చేసే ఉత్తరువులతో రాదు'' అని ఆయన రాసినాడు. సోషలిజం నిర్మాణంలో జనాల సజీవ సృజనాత్మక కృషి అత్యంత ముఖ్యమైన అంశంగా ఆయన భావించినాడు.

సోవియట్ ప్రభుత్వం స్మోల్నియ్‌లో వుంచబడింది. ఆ భవనం రేయింబగలూ కార్యకలాపాలతో మర్మరిస్తూవుండింది. అక్కడినుండి ఆదేశాలు జారీచేయబడేవి, దేశమంతటినుండీ జనం అక్కడ గుమికూడేవాళ్లు. యీ విస్తారమైన కార్యకలాపాల కేంద్రంలో లెనిన్ వుండేవాడు. కార్మికులూ, సైనికులూ, నౌకాసైనికులూ, రైతులూ ఆయన్ను చూడడానికి వచ్చేవాళ్లు. సుదూర గ్రామాల రైతు ప్రతినిధులు, గ్రామస్థులతో వసూలు చేసిన స్వల్ప డబ్బుతో, లెనిన్‌ను చూడాలనీ, తమ ప్రభుత్వాధినేతతో మాట్లాడాలనీ రాజధానికి ప్రయాణం చేసేవాళ్లు. లెనిన్ తనను చూడడానికి వచ్చిన ప్రతివొకరినీ చూసి, ప్రతివొకరు చెప్పేదీ శ్రద్ధగా విని, సత్వర నిర్ణయాలు చేసి, కార్మిక కర్షకులకు నేర్పి,

వాళ్లనుండి స్వయంగా తానూ నేర్చుకునేవాడు. ఆయన మార్గదర్శక హస్తం శైశవ సోవియట్ రిపబ్లిక్‌లోని ప్రతి జీవిత పార్శ్వంమీదా ప్రయుక్తమయ్యేది. యేదీ ఆయన్ను తప్పించుకునేది కాదు. పార్టీకీ, రాజ్య విధానానికీ సంబంధించిన మౌలిక సమస్యల నన్నిటినీ ఆయన చూసుకునేవాడు.

కొద్ది కాలంలో, దేశంలో తీవ్ర రాజకీయ, ఆర్థిక సంస్కరణలు నిర్వహించబడినాయి. సోవియట్ ప్రభుత్వం చేసిన మొదటి చర్యల్లో ఒకటి యేమిటంటే, ఉత్పత్తిమీదా, పంపకంమీదా కార్మికుల అజమాయిషీని ప్రవేశపెడుతూ లెనిన్ తయారుచేసిన నిబంధనలను అవలంబించడం. కార్మికుల, ఆఫీసు ఉద్యోగుల యెన్నికైన ప్రతినిధులకు ఆయా సంస్థలలోని సకల కార్యకలాపాలనూ అజమాయిషీ చేయడానికీ, పని నిలుపుదలలను అరికట్టడానికీ హక్కు యివ్వబడింది. కార్మికవర్గంచేత పరిశ్రమల నిర్వహణవైపు యిది మొదటి అడుగు.

పాత సైన్యాన్ని రద్దు చేస్తూ, పౌరులను సాంఘిక అంతస్తులుగా విభజించడాన్ని అంతమొందిస్తూ, ఆస్తిపర వర్గాల అధిక హక్కులను రద్దుచేస్తూ ఉత్తరువులు చేయబడినాయి. రైల్వేలూ, వాణిజ్య నౌకా దళమూ, బాంకులూ ప్రభుత్వ ఆస్తి అయినాయి, విదేశ వాణిజ్యమంతా ప్రభుత్వం చేతుల్లోకి పోయింది. తరువాత కొద్దికాలానికి ఫాక్టరీలూ, మిల్లులూ పెద్ద పెట్టుబడిదార్లనుండి తీసుకోబడి, జాతీయ ఆస్తిగా ప్రకటింపబడినాయి. సోవియట్ ప్రభుత్వపు యీ చర్యలు నూతన సామాజిక వ్యవస్థయొక్క విప్లవాత్మక, ప్రజాతంత్ర సారాన్ని కన్నులకు కట్టినట్లు వెల్లడించినాయి.

సోవియట్ రాజ్యపు సకల అంగాలూ, ప్రజా కమిస్సేరియట్లూ లెనిన్‌యొక్క ప్రత్యక్ష తనిఖీకింద నెలకొల్పబడినాయి. లెనిన్ సూచనమీద యీ కింది సంస్థలు నెలకొల్పబడినాయి: అత్యున్నత ఆర్థిక కౌన్సిల్ — జాతీయ ఆర్థిక వ్యవస్థను ప్రణాళికాబద్ధం చేయడానికీ, నిర్వహించడానికీ

మొదటి కార్మికవర్గ సంస్థ, జాతుల వ్యవహారాలకు ఒక ప్రజా కమిస్సా రియట్, విప్లవ ప్రతీఘాత, విధ్వంసక చర్యలకు పోరాటం సల్పేందుకు ఒక అఖిల రష్యా అసాధారణ కమిషన్. లెనిన్ 'శ్రమజీవుల, పీడిత ప్రజల హక్కులపై ప్రకటన' తయారుచేసినాడు; అది మొదటి సోవియట్ రాజ్యాంగానికి ఆధారమైంది. అది రష్యా కార్మిక, సైనిక, కర్షక ప్రతినిధుల సోవియట్ల రిపబ్లిక్‌గా ప్రకటించింది. అది రష్యాలోని సకల జాతులకూ సమాన హక్కులు ప్రకటించింది. సకల జాతులకూ స్వయంనిర్ణయ హక్కు, విడిపోవడంతో సహా, స్వతంత్ర రాజ్యాలుగా యేర్పడడంతో సహా, గ్యారంటీ చేయబడింది. యీ ప్రకటన సోవియట్ యూనియన్‌లోని జాతుల అవిధ్వంసనీయ మైత్రికి దృఢమైన పునాదులు వేసింది.

సోవియట్ ప్రభుత్వం యెవరినుండి పెరుగుతున్న అండదండలు పొందుతూవుండిందో ఆ శ్రామిక జనాలమీద యీ చర్యలన్నీ బలమైన ముద్ర వేసినాయి. జనాలు అంతకంతకూ యెక్కువగా సోవియట్ ప్రభుత్వం వైపు మళ్లినారు.

కానీ, దేశంలోని సన్నివేశం చాలా కష్టంగా వుండింది. యుద్ధాన్ని అంతమొందించడం మొదట చేయవలసిన పనిగా వుండింది. యుద్ధంతో అలసిపోయిన సైనికులు యిండ్లకు పోవడానికి తహతహలాడుతూ వుండినారు. సోవియట్ ప్రభుత్వం పదేపదే ప్రతిపాదించినప్పటికీ, బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికా సంయుక్త రాష్ట్రాల బూర్జువా ప్రభుత్వాలు జర్మనీతో శాంతి సంభాషణలు జరిపే భావాన్ని తిరస్కరించినాయి. ఆ పరిస్థితులలో, జర్మనీతో విడిగా శాంతి సంధి చేసుకోవడం తప్ప మార్గాంతరం లేదని లెనిన్ భావించినాడు. జర్మన్ సామ్రాజ్యవాదులు శాంతి సంభాషణలకు అంగీకరించినారు, కానీ దారిదోపిడీ దొంగలు విధించే షరతులు విధించినారు. సోవియట్ భూభాగంలో పెద్ద భాగాన్ని వాళ్లు డిమాండు చేసినారు.

యీ భారమైన శాంతి షరతులను అంగీకరించడమా, లేక యుద్ధం కొనసాగించడమా అనే మార్గాంతరాలు పార్టీనీ, ప్రభుత్వాన్నీ

యెదుర్కొన్నాయి. శాంతి సంధిమీద సంతకాలు చేయాలని లెనిన్ ప్రతి పాదించినాడు. యుద్ధంతో అలసిపోయిన దేశం పూర్తిగా నిర్వీర్యమైపోయి వుండింది; యుద్ధం కొనసాగిస్తే సోవియట్ అధికారం నాశనమయ్యేది. సోవియట్ రిపబ్లిక్‌ను రక్షించుకోడానికీ, సోవియట్ అధికారాన్ని పటిష్ఠ పరుచుకొని కార్మికవర్గ విప్లవ లాభాలను నిలుపుకోడానికి యెంత చిన్నదైనా కొంత విరామాన్ని పొందడానికీ త్యాగాలు చేయడం అవసరమని లెనిన్ వివరించినాడు. కార్మిక కర్షకులకు సామ్రాజ్యవాద యుద్ధ బీభత్సాలనుండి విశ్రాంతి యివ్వవలసివుంది, జాతీయ ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించవలసి వుంది, విప్లవ లాభాలను సంరక్షించ గల కొత్త కార్మిక కర్షక సైన్యాన్ని సృష్టించవలసి వుంది, అని ఆయన చెప్పినాడు.

కూలదోయబడిన బూర్జువావర్గ అవశేషాలూ, సోషలిస్టు రివల్యూషనరీలూ, మెన్షివిక్కులూ, ట్రాట్స్కీ, "వామపక్ష కమ్యూనిస్టు" లనబడేవాళ్లూ – బుహారిన్, బూబ్నోవ్, లోమొవ్, ఒసీన్‌స్కీ, తదితరులూ – జర్మనీతో శాంతి సంధి చేసుకునే భావాన్ని వ్యతిరేకించినారు. "వామపక్ష కమ్యూనిస్టులు" శాంతి సంభాషణలు ఆపెయ్యాలని డిమాండు చేసి, జర్మనీమీద "విప్లవ యుద్ధం" చేయాలని పిలుపు యిచ్చినారు, దానికి తగిన బలం లేకపోయినప్పటికీ. యీవిధంగా లెనిన్ పంథాను యిటు బూర్జువా, పెటీబూర్జువా పార్టీలూ, అటు కొందరు అస్థిర కమ్యూనిస్టులూ వ్యతిరేకించినారు.

పార్టీలోని సన్నివేశం అత్యంత కష్టంగా వుండింది. దాన్ని గురించి లెనిన్ చాలా బాధపడినాడు. ఆయన పత్రికల్లో "వామపక్ష కమ్యూనిస్టు"లనూ, ట్రాట్స్కీనీ యెదిరించి, "విప్లవ పదజాలం"యొక్క ప్రమాదాన్ని యెగతాళి చేసి, గుట్టుకడిగినాడు. "వామపక్ష కమ్యూనిస్టుల" వైఖరిని దుస్సాహసికమనీ, ప్రపంచ విప్లవ ప్రయోజనాల కొరకు సోవియట్ అధికారాన్ని త్యాగం చేయవచ్చునని ప్రకటించినప్పుడు వాళ్ల

ప్రవర్తనను "విద్ధ్వారం, రాక్షసం" అనీ ఆయన అన్నాడు. సోవియట్ రిపబ్లిక్కును నిలుపుకోవడమూ, పటిష్ఠపరచడమూ శ్రామిక ప్రజల ప్రపంచ విమోచన ఉద్యమానికి లభించగల అత్యుత్తమ అండదండలని ఆయన నొక్కిచెప్పినాడు.

పార్టీ కేంద్ర కమిటీ సమావేశాల్లో శాంతి సమస్య పదేపదే ఆవేశపూరితంగా చర్చింపబడింది. మొదట మెజారిటీ లెనిన్‌ను బల పరచలేదు. కానీ తర్వాత, జర్మనీ విధించిన షరతులమీద శాంతి సంధి చేసుకోవాలనే లెనిన్ ప్రతిపాదన ఆమోదించబడింది. సోవియట్ శాంతి సంభాషణల ప్రతినిధివర్గ నాయకుడుగా నియమింపబడిన ట్రాట్స్కీ లెనినూ, కేంద్ర కమిటీ, సోవియట్ ప్రభుత్వమూ యిచ్చిన ఆదేశాలను ఉల్లంఘించినాడు: జర్మనీ ప్రతిపాదించిన షరతులమీద సంతకం చేయ డానికి అతను నిరాకరించి, తద్వారా శాంతి సంభాషణలు భగ్నం చేసినాడు. ట్రాట్స్కీయొక్క, "వామపక్ష కమ్యూనిస్టుల"యొక్క ప్రవర్తన జర్మన్ సామ్రాజ్యవాదుల కోరికలకు అనుకూలంగా వుండింది. దీన్ని ఆసరాగా తీసుకొని జర్మన్ సైన్యం 1918 ఫిబ్రవరిలో దాడి చేసింది. సామ్రాజ్యవాదులు సోవియట్ అధికారాన్ని గొంతు నులమడానికీ, రష్యాను వలసగా మార్చడానికీ పూనుకున్నారు.

సోవియట్ దేశం ప్రాణాపాయంలో పడింది. దాని రక్షణ యేర్ప రచడానికి లెనినూ, కమ్యూనిస్టు పార్టీ వెంటనే పూనుకున్నారు. ఫిబ్రవరి 21న, ప్రజా కమిస్సార్ల కౌన్సిల్ తరఫున లెనిన్ ప్రజలకు ఒక ఆవేశపూరితమైన విజ్ఞప్తి రాసినాడు: "సోషలిస్టు మాతృదేశం ప్రమాదంలో వుంది!"

"బూర్జువా సామ్రాజ్యవాద జర్మనీ తండాలకు వ్యతిరేకంగా సోవియట్ల రిపబ్లిక్కును భక్తిపూర్వకంగా రక్షించుకోవడం రష్యా కార్మిక కర్షకుల పవిత్ర కర్తవ్యం" అని యీ పత్రంలో వుంది. యావత్తు దేశాన్ని రక్షణకు అనుగుణంగా మార్చవలసివుంది. నాయకుని విజ్ఞప్తి

శ్రామిక జనాలలో బలీయమైన విప్లవ ప్రతిస్పందనను ఉత్పన్నం చేసింది. పెట్రోగ్రాడ్, మాస్కో, ఎకతెరీన్‌బుర్గ్, తదితర నగరాలలోనూ, గ్రామాలలోనూ కార్మిక, కర్షక, సైనిక సభలు పెద్ద యెత్తున జరిగినాయి. లెనిన్ పిలుపు నందుకొని, కమ్యూనిస్టు పార్టీయొక్కా, సోవియట్ ప్రభుత్వంయొక్కా పిలుపు నందుకొని, సోషలిస్టు జన్మభూమిని రక్షించడానికి పదుల వేల కార్మికులూ, కర్షకులూ ఐచ్ఛికంగా ముందుకు వచ్చినారు. విప్లవ ప్రజల నూతన సైన్య దళాలు ప్రతిచోటా ఉద్భవించి, పురోగమిస్తున్న శత్రువును వీరోచితంగా ప్రతిఘటించినాయి, నార్వవద్దా, ప్స్కొవ్‌వద్దా శత్రువును తిప్పికొట్టినాయి.

ఆ రోజుల జ్ఞాపకార్థం యేటా ఫిబ్రవరి 23 సోవియట్ సైనిక దినంగా జరపబడుతున్నది.

శాంతి కుదిరించుకునే సమస్య యెంత తీవ్రమూ, జరూరూ అయిందంటే, కేంద్ర కమిటీ పార్టీ మహాసభ జరపడానికి నిర్ణయించింది. దానికి చురుకైన సన్నాహాలు ప్రారంభించబడినాయి. శాంతి కుదిరించుకోవలసిన అవసరాన్ని ఉద్బోధించే లెనిన్ వ్యాసాలు 'ప్రావ్ద'లో దాదాపు రోజూ ప్రచురించబడినాయి.

వాటి శీర్షికలు యెంత కరుకుగా వుండినాయంటే, అవి యెవరి మీదికి ఉద్దేశింపబడిందీ యేమీ సందేహం లేకపోయింది. ('విప్లవ పద జాలం,' 'దురద,' 'శాంతియా, యుద్ధమా?', 'దురదృష్ట శాంతి,' 'బాధాకరమైన, కానీ అవసరమైన గుణపాఠం.') యీ వ్యాసాలను 'ప్రావ్ద'నుండి స్థానిక వార్తాపత్రికలు పునర్ముద్రించి, దేశమంతటికీ తెలియబరిచినాయి.

యేడవ పార్టీ మహాసభ పెట్రోగ్రాడ్‌లో 1918 మార్చి 6న ప్రారంభమైంది. అక్టోబర్ విప్లవం తర్వాత జరిగిన మొదటి పార్టీ మహాసభ అది. మహాసభకు లెనిన్ అధ్యక్షత వహించినాడు; ఆయన పద్దెనిమిది సార్లు మాట్లాడినాడు. ఆయన యిచ్చిన కేంద్ర కమిటీ

నివేదికలో, బ్రెస్ట్ శాంతి సంధిమీద సంతకాలు చేయడం అవసరమని తిరుగులేకుండా రుజువు చేసినాడు.

మహాసభ మెజారిటీ వోట్లతో లెనిన్ పంథాను ఆమోదించి, సోవియట్ రష్యాకు జర్మనీతో శాంతి అవసరమనే విషయాన్ని నొక్కిచెప్పే 'యుద్ధం, శాంతులమీద' తీర్మానాన్ని అవలంబించింది. సామ్రాజ్య వాదులు మరికొన్ని దాడులు చేయడం తప్పనిసరి గనుక, కార్మిక ప్రజలకూ, పార్టీకీ జాగరూకతా, విప్లవ క్రమశిక్షణా వుండాలనీ, సోషలిస్టు దేశ రక్షణార్థం జనాలను సమీకరించగల సంస్థలను సృష్టించాలనీ మహాసభ ఉద్బోధించింది. మహాసభ సకల దేశాలలోనూ కార్మిక విప్లవ విజయంలో తన ప్రగాఢ విశ్వాసాన్ని వ్యక్తంచేసి, రష్యా కార్మికవర్గం ప్రపంచమంతటా సోదర విప్లవోద్యమానికి అండదండలు యిస్తుందని వాగ్దానం చేసింది.

లెనిన్ నివేదికమీద, పార్టీకి పేరు మార్చాలనే లెనిన్ తీర్మానాన్ని మహాసభ ఆమోదించింది. అప్పటినుండి దాని పేరు రష్యన్ కమ్యూనిస్టు పార్టీ (బోల్షెవిక్). కమ్యూనిస్టు అనే పేరు "మనం కమ్యూనిజంవైపు పురోగమిస్తున్నామని తగినంతగా సూచిస్తుంది" అని లెనిన్ అన్నాడు.

పార్టీకి కొత్త కార్యక్రమం తయారుచేయాలని కూడా మహాసభ నిర్ణయించింది. 1903లో రెండవ మహాసభలో ఆమోదించబడిన మొదటి కార్యక్రమం నిర్వర్తించబడింది — జారు, భూస్వాముల, పెట్టుబడిదార్ల అధికారం కూలదోయబడింది. సోషలిస్టు నిర్మాణ కర్తవ్యాలు నిర్వచింపబడే కొత్త కార్యక్రమం అవసరమై వుండింది. కొత్త కార్యక్రమాన్ని రచించడానికి లెనిన్ నాయకత్వాన ఒక ప్రత్యేక కమిషన్ యెన్నుకోబడింది.

యుద్ధంనుండి ఉపసంహరించుకోవడంవల్ల సోవియట్ రిపబ్లిక్ కార్మికవర్గానికీ, రైతులకూ సోవియట్ అధికారాన్ని పటిష్ఠపరచడానికీ, సోషలిస్టు విప్లవాన్ని అభివృద్ధి చేయడానికీ వాళ్లకు కావలసిన వ్యవధి

నిచ్చింది. దీనికి గాను అత్యున్నత ప్రశంసలు లెనిన్‌కు చెందుతాయి. ఆ పరిస్థితులలోని ఒకేఒక సరైన విధానంయొక్క అమలును నిస్సందేహపరిచింది ఆయన విజ్ఞతా, సూత్రాలకు ఆయన స్థిరంగా అంటిపెట్టుకోవడమూ, ఆయన ఉక్కు సంకల్పమూ. బ్రెస్ట్ శాంతి సంధిమీద సంతకాలు చేయడం లెనిన్ యెత్తుగడల పట్టువిడుపులకూ, రాబోయే యుద్ధాలలో విజయం కొరకు వ్యవధి పొందడానికీ, బలం సేకరించడానికీ, అవసరమైనప్పుడు తిరోగమించే ఆయన సామర్థ్యానికీ చక్కని నిదర్శనం.

1918 మార్చి 11న ప్రభుత్వం మాస్కోకు మారింది. మాస్కో రాజధాని అయివుండింది. ప్రజా కమిస్సార్ల కౌన్సిల్, అఖిల రష్యా కేంద్ర కార్యనిర్వాహక వర్గమూ క్రెమ్లిన్‌లో వుంచబడినాయి. అక్కడ లెనిన్ తన నివాసం కూడా యేర్పరచుకున్నాడు.

శాంతి సంధి దేశ అత్యున్నత అధికారాంగంచేత ఆమోదింపబడవలసి వుండింది. 1918 మార్చి 14న మాస్కోలో సమావేశమైన అసాధారణ సోవియట్ల నాల్గవ మహాసభ శాంతి సంధిని ఆమోదిస్తూ లెనిన్ రచించిన తీర్మానాన్ని, వామపక్ష సోషలిస్టు రివల్యూషనరీల భీకర ప్రతిఘటనయెదుట, అవలంబించింది. వాళ్ళు సోవియట్ ప్రభుత్వంమీద తిరుగుబాటు లేవదీసినారు. యేమైనప్పటికీ జర్మనీతో శాంతి సంధిని బ్రద్దలు చేయాలనే పట్టుదలతో మాస్కోలోని వామపక్ష సోషలిస్టు రివల్యూషనరీలు జర్మన్ రాయబారి మీర్‌బఖ్‌ను హత్య చేసినారు. సోవియట్ ప్రభుత్వం పెద్ద యిబ్బందిలో పడింది. కానీ, పార్టీ, సోవియట్ ప్రభుత్వమూ దృఢత్వం వహించి వామపక్ష సోషలిస్టు రివల్యూషనరీల విప్లవ ప్రతీఘాత తిరుగుబాటును నలిపివేసి, శాంతి భగ్నం కాకుండా చేసినాయి. బ్రెస్ట్ శాంతి సంధి జరిగిన తర్వాత ప్రపంచ విమోచనోద్యమ అభివృద్ధి లెనిన్‌యొక్క నిశితమైన యోచనలనూ, శాస్త్రీయ దూరదృష్టినీ రుజువుచేసినాయి. 1918 నవంబర్‌లో జర్మనీలో విప్లవం చెలరేగింది, యీ పరభక్షణాత్మక సంధి నిరర్థకమైంది.

సోవియట్ అధికారాన్ని పటిష్ఠపరచడానికీ, సోషలిస్టు రాజ్య నిర్మాణాన్ని ప్రారంభించడానికీ లెనినూ, బోల్షివిక్ పార్టీ, ప్రభుత్వమూ శాంతియుత విరామాన్ని వినియోగించుకోడానికి త్వరపడినాయి. యీ పని సులభమైంది కాదు.

భూస్వాముల, పెట్టుబడిదార్ల ప్రభుత్వం కూలదోయబడడంతో, సోవియట్ ప్రజలకు ప్రపంచంలో యే యితర దేశానికీ యెప్పుడూ యెదురుగాని కర్తవ్యం యెదురైంది. వాళ్లు కొత్త రాజ్య యంత్రాంగాన్ని నిర్మించవలసి వుండింది, ఆర్థిక వ్యవస్థకు స్వాస్థ్యం కలిగించవలసి వుండింది, దేశాన్ని నడిపించడం నేర్చుకోవలసి వుండింది. కార్మికులూ, కర్షకులూ యిప్పుడు ఫాక్టరీలకూ, భూమికీ యజమానులు; కానీ యివి యిప్పుడు జాగ్రత్తగా చూసుకొని వృద్ధి చేసుకోవలసిన ప్రభుత్వ సమష్టి ఆస్తి అని వాళ్లు అందరూ గుర్తించలేదు.

సోషలిజం తత్వంలో జనాలకు కొత్త శిక్షణ యివ్వడం యెలా? కొత్త పద్ధతిలో పనిచేయడం వాళ్లకు నేర్పడం యెలా? – లెనిన్‌ను పూర్తిగా ఆవరించిన సమస్యలు. స్వయంగా తాను అనేక పనులలో మునిగిపోయి, రోజూ బోలెడు జరూరైన ఆచరణాత్మక సమస్యలతో వ్యవహరిస్తూ, లెనిన్ రష్యాలో సోషలిస్టు నిర్మాణానికి సాధారణ పంథా రూపొందించి, సోవియట్ వైదేశిక, దేశీయ విధానానికి మౌలిక సూత్రాలు నిర్ణయించినాడు. 1918 ఏప్రిల్ 29న, అఖిల రష్యా కేంద్ర కార్య నిర్వాహక వర్గ సమావేశంలో ఆయన సోవియట్ ప్రభుత్వ తక్షణ కర్తవ్యాల గురించి నివేదిక యిచ్చినాడు. తన నివేదికలోనూ, ఆ విషయంమీద రాసిన పుస్తకంలోనూ ఆయన అక్టోబర్ విప్లవ విజయానికి దారితీసిన కారణాలను వెల్లడించి, రష్యా ఆర్థిక వ్యవస్థను సోషలిస్టు పద్ధతులమీద పునర్నిర్మించే కర్తవ్యాన్ని యెదుట వుంచి, నూతన సమాజ మార్గానికి అడ్డుపడుతున్న కష్టాలను చూపించి, ఉత్పత్తిని సంఘటితపరచడం

నేర్చుకోవాలని కార్మికులను ఉద్బోధించినాడు. నూతన సోషలిస్టు ఆర్థిక వ్యవస్థను సృష్టించడం ప్రధాన కర్తవ్యమని ఆయన బోధించినాడు. ఆయన యిలా రాసినాడు: "యిది అత్యంత కష్టమైన కర్తవ్యం; యెందుకంటే, యిది కోటానుకోట్ల ప్రజల జీవితపు ఆర్థిక పునాదులను, అత్యంత లోతుగా పాతుకున్నవాటిని, నూతన పద్ధతిలో సంఘటితపరిచే పని. యిది అత్యంత సంతృప్తిదాయకమైన కర్తవ్యం; యెందుకంటే, యిది (ప్రధాన బాహ్య రేఖల్లో) నిర్వర్తించబడిన తర్వాత మాత్రమే, రష్యా సోవియట్ రిపబ్లిక్ మాత్రమే గాక, సోషలిస్టు రిపబ్లిక్ కూడా అయింది అని చెప్పడానికి వీలౌతుంది."

ప్రజల్లో, కార్మిక కర్షకుల్లో సంఘటితపరిచే ప్రజ్ఞ పుష్కలంగా వుందని లెనిన్ చెప్పినాడు. పెట్టుబడిదారీ వ్యవస్థ దానిని గొంతు నొక్కి, వ్యర్థపరిచింది. వీళ్లను కనుక్కోవాలి, నిలదొక్కుకోడానికి వీళ్లకు తోడ్పడాలి, వికసించడానికి అవకాశం యివ్వాలి.

ఆ బూర్జువాల వందిమాగధుల గురించి — జనాల సృజనాత్మక సామర్థ్యాలను విశ్వసించకుండా, సోవియట్ అధికారంమీద నిందలువేసే మెన్షివిక్కుల గురించి — లెనిన్ యేవగింపుతో మాట్లాడినాడు. క్రిలోవ్ కథను మనసులో వుంచుకొని ఆయన యిలా రాసినాడు: "పెద్ద, పాత అడవిని నరికివేయడంలో యెగిరిపోయే ప్రతి పేడుకూ బూర్జువా సమాజపు చిన్న కుక్కలు మొరగనీ. కార్మికవర్గ యేనుగును చూసి మొరగడానికి కాకపోతే చిన్న కుక్కలు వున్నదెందుకు? అవి మొరగనీ. మనం మన దారిన పోతాం."

లెక్కాచారం యేర్పాటుచేయడమూ, ఉత్పత్తినీ, పంపకాన్నీ అజమాయిషీ చేయడమూ అవసరమని లెనిన్ గుర్తు చేసినాడు. "డబ్బుకు క్రమబద్ధంగా, నిజాయితీగా లెక్కలు రాయండి, పొదుపుగా పనులు నిర్వహించండి, సోమరిగా వుండకండి, దొంగిలించకండి, కచ్చితమైన శ్రమ క్రమశిక్షణను పాటించండి" అని ఆయన స్పష్టమైన, అసందిగ్ధ

గ్గపు మాటల్లో నినాదం యిచ్చినాడు. శ్రమ ఉత్పాదకతను పెంచమనీ, పెద్దస్థాయి పరిశ్రమలను అభివృద్ధి చేయమనీ, యింధనం, యినుము, యంత్రాల ఉత్పత్తిని వృద్ధి చేయమనీ, అలాగే జనాల విద్యా, సాంస్కృతిక స్థాయిని పెంచమనీ, క్రమశిక్షణను మెరుగుపరచమనీ, సామర్థ్యాన్ని యెక్కువ చేయమనీ ఆయన కార్మికులను ఉద్బోధించినాడు. శ్రమ ఉత్పాదకతను పెంచడం దీర్ఘమైన, కష్టమైన పని అని ఆయన గుర్తు చేసినాడు. సోషలిజం నిర్మించడంలో లెనిన్ సలహాలకూ, సూచనలకూ గొప్ప ప్రాముఖ్యం వుండింది. వాటికి యీనాడు, సోవియట్ ప్రజలు కమ్యూనిజంను నిర్మిస్తున్నప్పుడు, కూడా ప్రాముఖ్యం వుంది.

సోషలిస్టు పోటీని యేర్పరచడానికీ, విస్తృతంగా ఆచరించడానికీ లెనిన్ ప్రత్యేక ప్రాముఖ్యం యిచ్చినాడు. విస్తృత పరిమాణంలో పోటీని ప్రవేశ పెట్టడానికి మొట్టమొదటి సారిగా సోషలిజం వీలు కలిగించింది, అని ఆయన చెప్పినాడు. సోషలిజంను ప్రజలే స్వయంగా సృష్టిస్తారనీ, అది తరగని ప్రజ్ఞానిధులను విడుదల చేస్తుందనీ, చరిత్రను సృష్టించడానికి కోటానుకోట్ల స్త్రీపురుషులను ఉత్తేజపరుస్తుందనీ ఆయన బోధించినాడు.

సోషలిస్టు నిర్మాణానికి లెనిన్ వేసిన పథకాన్ని అమలుపరచడానికి కమ్యూనిస్టు పార్టీ చేసిన ప్రయత్నాలు అసాధారణంగా ప్రతికూలమైన పరిస్థితులలో జరిగినాయి. 1918 వేసవిలో దేశం తీవ్ర ఆహార సంక్షోభపు గుప్పిడిలో వుండింది. కులాక్కులూ, లాభార్జనపరులూ, ఆకలి మంటలద్వారా విప్లవాన్ని నలిపివేయాలనే ఆశతో, ధాన్యాన్ని దాచిపెట్టినారు. "తిండి కోసం పోరాటం — సోషలిజం కోసం పోరాటం!" అని లెనిన్ నినాదం యిచ్చినాడు.

గ్రామాల్లో ప్రచారం చేయడానికి పార్టీ కార్మికులకు పిలుపు యిచ్చింది. "కామ్రేడ్స్, కార్మికులారా, విప్లవం సంక్షోభ స్థితిలో వుందని జ్ఞాపకం వుంచుకోండి. విప్లవాన్ని మీరు మాత్రమే రక్షించ

గలరు, మరెవరూ రక్షించలేరు, అని జ్ఞాపకం వుంచుకోండి'' అని లెనిన్ రాసినాడు.

రాజకీయంగా జాగరూకులైన వేలాది కార్మికులు, ముఖ్యంగా పెట్రోగ్రాడ్‌వాళ్లు, లెనినూ, పార్టీ యిచ్చిన పిలుపు నందుకొని, ఆహార దళాలుగా యేర్పడి, గ్రామాలకు పోయినారు. 1918 జూన్‌లో బీద రైతుల కమిటీలు యేర్పరుస్తూ లెనిన్ ఒక ఉత్తరువుమీద సంతకం చేసినాడు. కులాక్కులతో పోరాడడంలోనూ, పట్టణాలకూ, సైన్యానికీ తిండి సరఫరా చేయడంలోనూ సోవియట్ ప్రభుత్వానికి యీ కమిటీలు పెట్టని కోట అయినాయి. యిదంతా గ్రామాల్లో సోవియట్లను పటిష్ఠపరిచి, మధ్య తరగతి రైతులను సోవియట్ ప్రభుత్వంవైపు తిప్పుకోడానికి తోడ్పడింది.

1918 జూలైలో అయిదవ సోవియట్ల మహాసభ రష్యా రిపబ్లిక్ యొక్క మొదటి రాజ్యాంగాన్ని ఆమోదించింది; అందులో సోషలిస్టు విప్లవ లాభాలు శాసనబద్ధం చేయబడినాయి. "మన రాజ్యాంగంలాంటి దాన్ని ప్రపంచం యెప్పుడూ యెరగదు'' అని లెనిన్ అన్నాడు. "స్వదేశంలోనూ, విదేశాలలోనూ దోపిడీదార్లమీద కార్మికుల పోరాటంయొక్క, సంఘటనయొక్క అనుభవాన్ని యిది మూర్తీభవిస్తుంది.''

## దేశ రక్షణకు

## నాయకత్వం వహించిన లెనిన్

శాంతియుత విరామం త్వరలో ముగిసింది. విదేశ సామ్రాజ్య వాదులూ, కూలదోయబడిన బూర్జువాలూ, భూస్వాములూ రష్యా కార్మిక కర్షక విజయాన్ని అంగీకరించడానికి నిరాకరించినారు. విప్లవ

దావానలం ప్రారంభమైందనీ, అది యితర దేశాలకు వ్యాపించవచ్చుననీ వాళ్ళు గ్రహించినారు. బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికా సంయుక్త రాష్ట్రాల పెట్టుబడిదార్లు తాము రష్యా జారుకూ, భూస్వాములకూ, బూర్జువా లకూ రుణంగా యిచ్చిన వందల కోట్లు పోగొట్టుకోదలచుకోలేదు. రష్యా సహజ సంపదల వినియోగంద్వారా వాళ్ల జేబుల్లోకి ప్రవహిస్తున్న అపారమైన లాభాలను వాళ్ళు పోగొట్టుకోదలచుకోలేదు.

1918 వసంతంలో అమెరికన్, బ్రిటిష్, ఫ్రెంచి సైన్యాలు మూర్మన్స్క్‌ను పట్టుకున్నాయి. జపాన్, బ్రిటిష్ సైనికులూ, తరువాత అమెరికన్ సైనికులూ వ్లదివాస్తోక్‌లో దిగినాయి. కొత్తగా జన్మించిన సోషలిస్టు రాజ్యాన్ని సాయుధ బలంతో నలిపివేసే ప్రయత్నంలో సామ్రాజ్య వాదులు సోవియట్లు భూమిమీద యుద్ధం ప్రారంభించినారు. విదేశ సామ్రాజ్యవాదుల సహాయంతో వైట్‌గార్డులూ, యితర ప్రతీఘాత విప్లవకారులూ అంతర్యుద్ధం ప్రారంభించినారు.

కమ్యూనిస్టు పార్టీ, సోవియట్ ప్రజలూ తమ రిపబ్లిక్ రక్షణార్థం లేచినారు. యీ రక్షణను ప్రపంచ విప్లవోద్యమంపట్ల సోవియట్ రిప బ్లిక్‌యొక్క అత్యున్నత కర్తవ్యంగా లెనిన్ పరిగణించినాడు.

విదేశ మిలిటరీ జోక్యమూ, అంతర్యుద్ధమూ జరిగిన సంవత్స రాలలో లెనిన్ యెంత భారం వహించిందీ వర్ణనకు అందదు. ఆయన ప్రత్యక్ష నాయకత్వంకింద వ్యూహాత్మక పథకాలు రచింపబడినాయి, యెర్ర సైన్యం యుద్ధంలో కాకలు తీరింది. అదనపు బలాలూ, సైని కుల పోరాట సామర్థ్యమూ, ఆహార, వస్త్ర, ఆయుధాల సరఫరాలాంటి సమస్యలతో ఆయన వ్యవహరించినాడు.

కార్మికవర్గ సైన్యానికి తన సొంత సేనాధిపతులు కావలసివుండి నారు. లెనిన్ సూచనమీద ప్రత్యేక శిక్షణా తరగతులు యేర్పాటుచేయబడి నాయి, సేనాధిపతులకు సైనిక శిక్షణా వ్యవస్థ రూపొందించబడింది. సేనా నాయక సిబ్బందియొక్క కేంద్రకం కార్మికులచేతా, విప్లవ కర్షకుల

చేతా నిర్మింపబడింది. యం. వి. ఫ్రూంజె, వి. కె. బ్లూహెర్, యం. యన్. తుహచేవ్‌స్కియ్, యస్. యం. బుద్యోన్నియ్, కె. వై. వొరొషీలొవ్, జి. ఐ. కొతొవ్‌స్కియ్, ఎ. వై. పర్‌హోమెంకొ, వి. ఐ. చపాయెవ్, యన్. ఎ. శ్చోర్స్ లాంటి ప్రముఖ సేనాధిపతులనూ, అనేక యితర అంతర్యుద్ధ వీరులనూ కమ్యూనిస్టు పార్టీ, దాని మహా నాయకుడూ పెంచినారు.

అదే సమయంలో, పాత మిలిటరీ నిపుణుల సేవలను నిర్నిబంధంగా వినియోగించుకోడానికి లెనిన్ అనుకూలంగా వుండినాడు. మిలిటరీ వ్యవహారాలలో వాళ్ల అనుభవ సంపదను వాడుకోవాలని ఆయన విశ్వసించినాడు. యీ పాత నిపుణులవద్ద యువ సేనాధిపతులు మిలిటరీ శిక్షణ పొందినారు. పార్టీ యెవరిద్వారా సైన్యంలో రాజకీయ కృషి సాగించిందో మిలిటరీ కమిస్సార్లు యెర్ర సైన్యం కొరకు సైనికులకు శిక్షణ యివ్వడంలో ప్రముఖ పాత్ర వహించినారు.

దేశ రక్షణకు సంబంధించిన ముఖ్య సమస్యల వివరాలు అన్నీ లెనిన్ చూసుకునేవాడు. క్రెమ్లిన్‌లో తాను పనిచేసుకునే గదినుండి దేశంలోని అన్ని ప్రాంతాలకూ ఆయన ఉత్తరువులూ, సూచనలూ, ఆదేశాలూ పంపేవాడు. తరుచు ఆయన రాత్రి పొద్దుపోయిన తర్వాత యే అధికారికో టెలిఫోన్ చేసి, ఫలానా దళం యుద్ధరంగానికి పంపబడిందా, దానికి కావలసిన ఆహారమూ, ఆయుధాలూ, మొదలైనవన్నీ యివ్వబడినాయా, అని విచారించేవాడు. విశ్రాంతీ, నిద్రా మాను కొని ఆయన మిలిటరీ చర్యల పురోగతిని గమనిస్తూ, విజయాన్ని నిస్సందేహం చేయడానికి అన్ని చర్యలూ తీసుకున్నాడు. సేనాధిపతులను ఆయన తన ఆఫీసుకు పిలిపించి, యుద్ధరంగ సన్నివేశం గురించీ, సైన్య అవసరాల గురించీ ప్రశ్నించేవాడు. సైన్యానికి సాధ్యమైన సహాయమంతా చేయండని ఆయన ప్రజలను ఉద్బోధించినాడు. కార్మిక కర్షక రాజ్యాన్ని సంరక్షించడానికి తన రక్తం ధారవోస్తున్న యెర్ర

సైన్యం మనిషితో పోలిస్తే మన సకల కష్టాలూ, యిబ్బందులూ తృణప్రాయమని ఆయన రాసినాడు.

సామ్రాజ్యవాదుల బలాధిక్యమూ, నమ్మశక్యంగాని కష్టాలూ — ఆహారంలో, దుస్తులలో, ఆయుధాలలో, మందుగుండు సామగ్రిలో తీవ్రమైన కొరత — వుండినప్పటికీ, నూతన సామాజిక వ్యవస్థ గెలుస్తుందని లెనిన్ దృఢంగా విశ్వసించినాడు. తన విశ్వాసాన్ని ఆయన ప్రజలకు యెక్కించినాడు. దాదాపు ప్రతిరోజూ, అప్పుడప్పుడు రోజుకు కొన్ని సార్లు కూడా, ఆయన పెద్ద కార్మికుల సభల్లోనూ, యెర్ర సైన్యం సభల్లోనూ ఉపన్యసించేవాడు, మహాసభల్లోనూ, ఫాక్టరీలలోనూ, మిల్లుల లోనూ మాట్లాడేవాడు.

లెనిన్ యొక్క దృఢమైన చేయీ, ఉక్కు సంకల్పమూ, స్పష్టమైన విప్లవ ఆలోచనా ప్రతి కమ్యూనిస్టుకూ, యావత్తు దేశానికీ స్ఫూహలో వుండినాయి. నాయకుని తీవ్రమైన ఉపన్యాసాలూ, న్యాయం గెలుస్తుందనే ఆయన అచంచలమైన విశ్వాసమూ కార్మికులకూ, కర్షకులకూ ధైర్యం యిచ్చి, వాళ్లను సమీకరించి, అంతిమ విజయంలో ఆశనూ, విశ్వాసాన్నీ వాళ్లకు కలిగించింది.

మాస్కో 'దినామొ' వర్క్స్ ఉద్యోగి అయిన ఎ. జి. పన్యూనిన్ లెనిన్ ఉపన్యాసాల బలమైన ప్రభావాన్ని వర్ణించినాడు. "ఉద్రేకపరిచే ఆయన మాటలు విన్న తర్వాత నేను నేరుగా యుద్ధరంగంలో దూకడానికి సిద్ధంగా వుండినాను. ఆకలితో, వుత్త కాళ్లతో, చింపిరి పాతలతో, కానీ ఉత్సాహంతో, విశ్వాసంతో మేము ఆయన ప్రతి మాటనూ ఆపోశన పట్టినాము" అని అతను రాసినాడు.

ప్రజల ఆత్మిక వృద్ధిపట్ల, సంస్కృతిని వాళ్లకు అందుబాటులో వుంచడంపట్ల, లెనిన్ శ్రద్ధ కనబరిచినాడు.

1918 జనవరిలో సోవియట్ల మూడవ అఖిల రష్యా మహాసభలో ఆయన మాట్లాడుతూ, పాత రోజుల్లో, పెట్టుబడిదారీ వ్యవస్థలో,

సాంకేతిక విజ్ఞానంయొక్కా, సంస్కృతియొక్కా లాభాలన్నీ ధనికులకు మాత్రమే అందుబాటులో వుండినాయనీ, శ్రామిక ప్రజలకు అందుబాటులో లేవనీ చెప్పినాడు. యిప్పటినుండి శాస్త్ర విజ్ఞానంయొక్క అద్భుతాలన్నీ, సంస్కృతియొక్క లాభాలన్నీ యావత్తు జాతికీ చెందినాయని ఆయన అన్నాడు.

అప్పుడప్పుడే అవతరించిన సోవియట్ సాహిత్య పురోగతిని లెనిన్ యెంత శ్రద్ధగా గమనిస్తూ వుండిందీ ఆయన మిత్రులూ, బంధువులూ తెలిపినారు. బేద్నియ్, సెరాఫిమోవిచ్, గోర్కీల రచనలు ఆయన మళ్లీ మళ్లీ చదివి, వాటిని తన రచనల్లోనూ, ఉపన్యాసాల్లోనూ ఉపయోగించుకున్నాడు. వాళ్ల రచనలు ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయడం ఆయనకు పూర్తి యిష్టం.

లెనిన్‌కు పని వొత్తిడి యెక్కువగా వుండేది. ఆయన విశ్రాంతి అల్లా క్రెమ్లిన్‌లో షికారుపోవడమూ, యెప్పుడైనా ఒక ఆదివారంనాడు తన భార్యతోనూ, తన సోదరి మరీయాతోనూ కలిసి స్పారో గుట్టలకు (యిప్పుడు లెనిన్ గుట్టలు), లేదా మాస్కోయొక్క మరొక శివారుకు పోవడమూ.

యీమధ్యలో, దేశంలోని ప్రతీఘాత విప్లవకారులు, సామ్రాజ్యవాదులచేత డబ్బూ, ప్రోత్సాహమూ పొంది, సోవియట్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుట్రలు పన్నుతూ, లెనిన్‌నూ, ఆయన సహచరులనూ హత్యచేయడానికి పథకాలు వేస్తూ వుండినారు. 1918 ఆగస్టు 30న కప్లాన్ అనే ఒక సోషలిస్టు రివల్యూషనరీ లెనిన్‌ను హత్య చేయడానికి దారుణమైన ప్రయత్నం చేసింది. ఆమె దగ్గరినుండి కాల్చి, ఆయనను తీవ్రంగా గాయపరిచింది. గుండ్లు విషలిప్తమైనవి. లెనిన్ కొనప్రాణంతో వుండినాడు. డాక్టర్లు రేయింబగలూ క్రెమ్లిన్‌లో ఆయన మంచంవద్ద కావలి కాచినారు.


పార్టీ, యావత్తు దేశమూ తమ నాయకుని ఆరోగ్యాన్ని గురించిన వార్తల కోసం తహతహతో వేచివుండినాయి. దేశమంతటినుండి రేయింబ

గలూ మాస్కోకు ప్రశ్నలు ప్రవహించినాయి. లెనిన్ కోలుకోవడం ప్రారంభించినప్పుడు ప్రజల ఆనందానికి హద్దులు లేవు. కార్మికులనుండీ, కర్షకులనుండీ ఆయనకు వేలకొలది అభినందనలు వచ్చినాయి. 1918 సెప్టెంబర్‌లో 'ప్రావ్ద' యిలా రాసింది: "లెనిన్ తన అనారోగ్యంతో పోరాడుతున్నాడు. దాన్ని ఆయన జయిస్తాడు! కార్మికవర్గం అలా సంకల్పిస్తున్నది. విధికి దాని ఆజ్ఞ అది!" పంకోవ్ తాలూకా రైతులు యిలా రాసినారు: "కామ్రేడ్ లెనిన్, మా సౌభ్రాతృ అభినందనలు పంపుతున్నాము. మాకోసమూ, సామ్రాజ్యవాదులను యేడిపించడానికీ త్వరపడి ఆరోగ్యం పుంజుకోండి." సెప్టెంబర్ 12న యెర్ర సైన్యం సిమ్‌బీర్స్కను విముక్తిచేసింది; మొదటి సైన్యం సైనికులు లెనిన్‌కు యిలా తంతె యిచ్చినారు: "ప్రియమైన వ్లదీమిర్ ఇల్యీచ్, మీ జన్మ పట్టణం పట్టుకోవడంద్వారా మీ గాయాల్లో ఒకదానికి కసితీర్చుకున్నాము; మరొక గాయానికి కసితీర్చుకోడానికి సమార పట్టుకుంటాము." దీనికి లెనిన్ యిలా జవాబిచ్చినాడు: "నా జన్మ పట్టణం సిమ్‌బీర్స్క పట్టు కోవడం అద్భుతమైన టానిక్, నా గాయాలకు ఉత్తమమైన చికిత్స. నాకు కొత్త ఆయుస్సూ, కొత్త శక్తీ కలిగినట్లుంది. యెర్ర సైన్యం సైనికులకు వాళ్ల విజయానికిగాను అభినందనలు, వాళ్ల సకల త్యాగా లకుగాను శ్రామిక ప్రజలందరి తరఫునా కృతజ్ఞతలు." గాయాలనుండి కోలుకొన్న వెనువెంటనే ఆయన పార్టీకీ, దేశానికీ మళ్లీ నాయకత్వం వహించినాడు.

1918–1919 చలికాలంలో యుద్ధరంగంలో పోరాటం మళ్లీ తీవ్రంగా చెలరేగింది. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్సు, జపాన్‌ల సామ్రాజ్య వాదులు సోవియట్ రష్యామీదికి విస్తారమైన బలాలు సమీకరించినారు. ఉత్తరానా, ఒదేస్సలోనూ, క్రైమియాలోనూ, ట్రాన్స్‌కకేషియాలోనూ, మధ్య ఆసియాలోనూ, దూరప్రాచ్యానా వాళ్లు సైన్యాలు దింపినారు. పదిలక్షల సైనికులకు పైగా, నఖశిఖ పర్యంతం ఆయుధాలు ధరించి,



రెడ్ స్క్వేర్‌లో లెనిన్, నవంబర్ 7, 1919
ఫోటో



క్రెమ్లిన్‌లో తన పఠనాగారంలో లెనిన్
ఫోటో 1918

సోవియట్ రిపబ్లిక్కును అన్ని దిక్కులా చుట్టుముట్టినారు. సామ్రాజ్య వాదులు వైట్‌గార్డ్ సేనాధిపతులకు, ముఖ్యంగా కొల్చాక్‌కు, సహాయ పడినారు. 1919 వసంతంలో కొల్చాక్ సైన్యం దాడి చేసింది.

పార్టీ నాయకత్వంకింద ప్రజలు విప్లవ శత్రువులకు తమ ప్రతిఘటనను తీవ్రం చేసినారు. "తూర్పు యుద్ధరంగానికి సాయంగా వెళ్లండి!" అని లెనిన్ పిలుపు యిచ్చినాడు. యిరవై వేలమంది కమ్యూనిస్టులూ, కొన్ని వేలమంది యువ కమ్యూనిస్టు లీగు సభ్యులూ, అరవై వేలమందికి పైగా ట్రేడ్‌యూనియన్ సభ్యులైన కార్మికులూ కమ్యూనిస్టు పార్టీ పిలుపు నందుకొని యుద్ధరంగానికి బయలుదేరినారు.

కష్టాలను లెనిన్ మూసిపెట్టలేదు, ఆయన యెల్లప్పుడూ ప్రజలకు సత్యం చెప్పినాడు, సత్యం చెప్పమని పార్టీకి బోధించినాడు. కమ్యూనిస్టులు ఫాక్టరీలకూ, గనులకూ, గ్రామాలకూ వెళ్లి, సోవియట్ రిపబ్లిక్ యే సంక్షోభస్థితిలో వున్నదీ ప్రజలకు చెప్పి, తమ సోవియట్ అధికారాన్ని పటిష్ఠపరిచి, సంరక్షించుకోవలసిందిగా కార్మికులకూ, కర్షకులకూ, సైనికులకూ, నౌకాసైనికులకూ విజ్ఞప్తి చేసినారు. వాళ్ళు యుద్ధరంగంలోని అత్యంత ప్రమాదకరమైన భాగాలకు వెళ్లి, తమ వ్యక్తిగత ఆదర్శంద్వారా, సాహసకార్యాలు చేసేటట్లు సైనికులకు ఉత్తేజం కలిగించినారు. కమ్యూనిస్టు పార్టీయొక్క సుస్థిరమైన విధేయతా, ఆ కఠోరమైన దినాలలో ఉద్రేకాలకు లోనుగాని దాని ఆలోచనాశీలతా, విజయంలో దాని అచంచలమైన విశ్వాసమూ దాన్ని జనాలకు యింకా సన్నిహితం చేసినాయి. విజయవంతమైన యుద్ధం చేయడానికి బలమైన, సుసంఘటితమైన గృహరంగం అత్యవసరం అని లెనిన్ చెప్పినాడు. ప్రపంచంలో కెల్ల అత్యుత్తమమైన సైన్యం కూడా, దానికి ప్రజల అండదండలు లేకపోతే, ధ్వంసమౌతుంది. సైన్యానికి ఆయుధాలు కావాలి, తిండి కావాలి, దుస్తులు కావాలి. యిది గృహరంగ కర్తవ్యం. యుద్ధ

రంగంలోని సైన్యానికి యితోధిక సహాయం చేయాలని లెనినూ, పార్టీ నిత్యం ఉద్బోధించినారు.

కార్మికులూ, సమస్త శ్రామిక జనాలూ నాయకుని పిలుపు నందుకొని శ్రమ రంగంలో వీరోచిత కృషి చేసినారు. 1919 వసంతం మొదలుగా సుబ్బోత్నిక్‌లు (జీతం లేకుండా స్వచ్ఛంద శ్రమ), మొదట మాస్కో రైల్వే కార్మికులు ప్రారంభించినట్టివి, దేశమంతటా యేర్పాటు చేయబడినాయి. 'మహా ప్రారంభం' అనే తన వ్యాసంలో లెనిన్ యీ సుబ్బోత్నిక్‌లను చరిత్రాత్మక ప్రాముఖ్యం గల ఘటనగా, శ్రమపట్ల కమ్యూనిస్టు వైఖరియొక్క వాస్తవ ప్రారంభంగా వర్ణించినాడు. శ్రమ ఉత్పాదకతను పెంచడంలోనూ, మొత్తం సమాజానికి చెందిన ప్రతి మణుము ధాన్యం, బొగ్గు, యినుము, తదితర ఉత్పాదితాలపట్ల జాగ్రత్త వహించడంలోనూ సాధారణ కార్మికులు ఆసక్తి కనబరిచినప్పుడు కమ్యూనిజం మొదలౌతుంది, అని ఆయన అన్నాడు. 1920 మే 1న క్రెమ్లిన్‌లో యేర్పాటుచేయబడిన ఒక సుబ్బోత్నిక్‌లో లెనిన్ స్వయంగా పాల్గొన్నాడు.

శ్రమ ఉత్పాదకతను వీలైనన్ని విధాలా పెంచమని లెనిన్ కార్మికులను ఉద్బోధించినాడు. "అంతిమ పరిశీలనలో నూతన సమాజ వ్యవస్థకు అత్యంత ముఖ్యమైనది, ప్రధానమైనది శ్రమ ఉత్పాదకత" అని ఆయన రాసినాడు.

సోవియట్ రిపబ్లిక్ పద్నాలుగు దేశాల దండయాత్రనుండి ఆత్మ రక్షణ చేసుకోవలసి వచ్చింది. ప్రతిదాన్నీ జోక్యందారీ శక్తులనూ, ఆంతరంగిక విప్లవ ప్రతీఘాత శక్తులనూ ఓడించే కర్తవ్యానికి అనుగుణంగా మార్చ వలసి వుండింది. యుద్ధకాల నిబంధనలు పరిశ్రమలలోనూ, రవాణాలోనూ, అలాగే సైన్యంలోనూ, నౌకాదళంలోనూ ప్రవేశపెట్టబడినాయి. సైన్యానికీ, కార్మికులకూ సరఫరా చేయడానికి సోవియట్ ప్రభుత్వం దేశంలోని స్వల్ప ఆహార నిధులను పంపకం

చేయడంలో కఠినమైన చర్యలు అవలంబించవలసి వచ్చింది. అదనపు నిధులు స్వాధీనపరుచుకునే పద్ధతి ప్రవేశపెట్టబడింది; ఆ పద్ధతికింద, సైన్యానికీ, కార్మికులకూ తిండిపెట్టడానికి రైతులు ప్రభుత్వానికి అదనపు ధాన్యం యివ్వవలసి వుండింది. ముట్టడి వేయబడిన కోట స్థితిలో వున్నందున సోవియట్ రిపబ్లిక్ మరొక విధంగా నిలబడ జాలదు, అని లెనిన్ అన్నాడు. సార్వజనిక నిర్బంధ శ్రమ విధానం ప్రవేశ పెట్టబడింది, పనిచేసినవాళ్లకు మాత్రమే ఆహారం యివ్వబడేది. "యుద్ధ కమ్యూనిజం" అనబడే ఆర్థిక విధానం, యుద్ధంచేతా, ఆర్థిక వినా శనంచేతా అవసరమైన తాత్కాలిక చర్య, అవలంబించబడింది.

విదేశ జోక్యందారులమీదా, ఆంతరంగిక ప్రతీఘాత విప్లవంమీదా పోరాటం ఉచ్చస్థితిలో వుండినప్పుడు, యెనిమిదవ పార్టీ మహాసభ జరిగింది. అది మార్చి 18న, పారిస్ కమ్యూన్ దినాన, ప్రారంభ మైంది. కమ్యూనార్డులు దేన్ని గురించి కలగన్నారో, దేనికోసం పోరాడి నారో, దానిని రష్యన్ కార్మికవర్గం నెరవేర్చింది. యిది మహాసభ ప్రతినిధులలో ఉత్సాహం కలిగించి, యితర దేశాల సోషలిస్టు విప్లవ విజయంలో విశ్వాసాన్ని సృష్టించింది. కేంద్ర కమిటీ పనిమీదా, పార్టీ కార్యక్రమంమీదా, గ్రామీణ ప్రాంతంలో పనిమీదా లెనిన్ నివేదికలు యిచ్చినాడు. సోవియట్ రాజ్యం మినహాయింపులు లేకుండా శాంతి విధానం అవలంబిస్తున్నదని లెనిన్ గుర్తుచేసినాడు. కానీ బూర్జువా రాజ్యాలు సోవియట్ రిపబ్లిక్‌మీద భీకరమైన పోరాటం చేస్తున్నాయి. కనుక దేశ రక్షణ శక్తిని పటిష్ఠపరుచుకోవడం అవసరం.

గ్రామీణ ప్రాంతాలలోని పనిమీద నివేదిక ముఖ్యంగా మధ్య తరగతి రైతులపట్ల వైఖరికి సంబంధించిన సమస్యకు వినియోగింపబడింది. కార్మికవర్గం అత్యంత బీద రైతాంగంతో కలిసి అక్టోబర్ సోషలిస్టు విప్లవాన్ని నిర్వహించింది. వ్యవసాయ కూలీలూ, బీద రైతులూ సోవియట్ ప్రభుత్వానికి నిర్నిబంధమైన అండదండలు యిచ్చినారు. కానీ గ్రామీణ

జనాభాలో అత్యధిక భాగం మధ్య తరగతి రైతులు. వాళ్లలో చాలామంది వేచిచూద్దాం అనే వైఖరి అవలంబించి వుండినారు. 1918 శరదృతువులో మధ్య తరగతి రైతులు సోవియట్లవైపు మళ్లడం ప్రారంభించినారు. లెనిన్ దీనిని ముఖ్యమైన ఘటనగా గుర్తించినాడు. మధ్య తరగతి రైతుతో గట్టి పొత్తు చేసుకోడానికి యిప్పుడు సమయం వచ్చిందని ఆయన మహాసభలో ప్రకటించినాడు. యీ పొత్తు లేకుండా సోషలిజం నిర్మించడం అసంభవం అని ఆయన అన్నాడు. లెనిన్ నివేదిక ఆధారంతో మహాసభ మధ్య తరగతి రైతుతో గాఢమైన పొత్తు విధానాన్ని ఉద్బోధించే తీర్మానాన్ని ఆమోదించింది.

కులాక్కులతో పోరాడడానికి బీద రైతులమీద ఆధారపడుతూ, మరొక వైపున కార్మికవర్గానికీ మధ్య తరగతి రైతాంగానికీ మధ్య పొత్తును పటిష్ఠపరచడానికి ఉద్దేశింపబడిన పార్టీ విధానం అంతర్యుద్ధంయొక్క విజయంలోనూ, సామ్రాజ్యవాదుల, వైట్‌గార్డుల ఓటమిలోనూ, సోషలిజం నిర్మాణంలోనూ నిర్ణయాత్మక అంశంగా వుండింది.

యెనిమిదవ మహాసభ పార్టీకి కొత్త కార్యక్రమాన్ని ఆమోదించింది. కొత్త కార్యక్రమం, లెనిన్ నాయకత్వం వహించిన కమిటీచేత రూపొందించబడి, పెట్టుబడిదారీ వ్యవస్థకూ సోషలిజంకూ మధ్య గల పరివర్తన దశ అంతటా కమ్యూనిస్టు పార్టీ కర్తవ్యాలను నిర్వచించింది. కార్యక్రమం శాస్త్రీయ పునాదిమీద ఆధారపడిందనీ, వాస్తవికంగా వుందనీ, నూతన, సోషలిస్టు సమాజ నిర్మాణంలో కార్మికవర్గానికీ, పార్టీకీ ఉపకరిస్తుందనీ లెనిన్ తన కార్యక్రమంలో నొక్కిచెప్పినాడు.

కార్యక్రమం గొప్ప ఉత్సాహపు ప్రదర్శనల మధ్య యేకగ్రీవంగా ఆమోదింపబడింది. యిది చరిత్రలో మొట్టమొదటిసారిగా, అధికారంలోకి వచ్చి, సోషలిస్టు సమాజాన్ని నిర్మిస్తున్న కమ్యూనిస్టు పార్టీయొక్క కార్యక్రమం. కొత్త కార్యక్రమంయొక్క అంతర్జాతీయ ప్రభావం గురించి మాట్లాడుతూ లెనిన్ యిలా అన్నాడు:

"మన కార్యక్రమం ప్రచారానికీ, ఆందోళనకూ యెంతో ప్రయోజనకరమైన విషయంగా ఉపకరిస్తుంది. 'యిక్కడున్నారు మన కామ్రేడ్లు, మన సోదరులు; యిక్కడ మన సమష్టి లక్ష్యం వాస్తవవౌతున్నది' అని కార్మికులు చెప్పేటట్లు చేసే పత్రం యిది."

సోవియట్ రాజ్యాన్ని నిర్మిస్తూ, దేశాన్ని సంరక్షించే అపారమైన పనిలో నిమగ్నుడై కూడా లెనిన్ అనేక కార్మిక ప్రతినిధివర్గాలకూ, సోదర కమ్యూనిస్టు పార్టీల ప్రతినిధులకూ స్వాగతం చెప్పడానికి వ్యవధి సంపాయించుకునేవాడు. తనతో కలిసి పనిచేసేవాళ్లపట్లా, సాధారణ పార్టీ సభ్యులపట్లా ఆయన యెప్పుడూ శ్రద్ధా, దయా కనబరిచేవాడు. ఆయన మనుషులపట్ల ఉపకారశీలమైన ఆసక్తి చూపించేవాడు. కార్మిక ప్రజలు విశ్రాంతి తీసుకునే ఆరోగ్య కేంద్రాలు నెలకొల్పడానికీ, పాఠశాలల, పిల్లల సంస్థల పనిని మెరుగుపరచడానికీ చర్యలు ఆయన ప్రేమపూర్వకమైన శ్రద్ధతో రూపొందించినాడు. ప్రజలపట్ల అదే ఉపకారశీల వైఖరిని ఆయన సకల పార్టీ కార్యకర్తలకూ, ఆఫీసు ఉద్యోగులకూ నేర్పినాడు.

పాత పార్టీ సభ్యుడు అయిన వి. ఎ. కర్పిన్స్కీ యిలా రాసినాడు: "వ్లదీమిర్ ఇల్యీచ్ అందరికంటె భిన్న మనిపించే అరుదైన మానవ గుణం ఆయనకు వుండింది. యేమిటంటే, తన కామ్రేడ్లతో – కేంద్ర కమిటీ సభ్యుడైనా, సాధారణ పార్టీ సభ్యుడైనా – మాత్రమే గాక, మొత్తంమీద మనుషులతో, లబ్ధప్రతిష్ఠునితోనైనా, ఆఫీసు నౌకరుతోనైనా, ఆయన సంబంధాలలో ఆయన కుండిన ఔదార్యమూ, ప్రతిస్పందనశీలతా, సమయోచితత్వమూ, సరళత్వమూ, నమ్రతా."

శ్రామిక ప్రజలు లెనిన్‌ను అదే హార్దిక అనురాగంతో చూసినారు. శ్రామిక ప్రజల మహా నాయకునికి పంపబడే వేలాది అభినందనలు రోజూ వచ్చి పడేవి. క్లిన్‌త్సీలోని స్తోదోల్ మిల్లు కార్మికులు లెనిన్‌కు ఒక ఉత్తరమూ, కానుకగా కొంత గుడ్డా పంపినారు. తమ మిల్లుకు

ఆయన పేరు పెట్టినామని వాళ్లు రాసి, తమ సొంత చేతులతో నేసిన గుడ్డతో ఒక సూటు కుట్టించుకొమ్మని ఆయన్ను కోరినారు.

లెనిన్ గాఢంగా చలించిపోయి, యిలా జవాబిచ్చినాడు: "ప్రియమైన కామ్రేడ్స్, మీ అభినందనలకూ, కానుకకూ అత్యంత హార్దికమైన కృతజ్ఞతలు. మీ కొక రహస్యం చెపుతాను — యిలాంటి కానుకలు మీరు నాకు పంపకూడదు. యీ రహస్యాన్ని కార్మికుల్లో వీలైనంత విస్తృతంగా వ్యాప్తిచేయాలని మిమ్మల్ని మనస్ఫూర్తిగా అర్థిస్తున్నాను. దయయుంచి నా అత్యుత్తమ కృతజ్ఞతలూ, అభినందనలూ, శుభాకాంక్షలూ స్వీకరించండి. భవదీయుడు, వి. ఉల్యానొవ్ (లెనిన్)."

1919 తొలి రోజుల్లో ఇవనోవ్ అనే ఒక రైతు లెనిన్‌ను చూడడానికి పోయినాడు. అతను స్వస్థలానికి తిరిగివచ్చిన తర్వాత, తాలూకా కార్యనిర్వాహక వర్గ విధానాన్ని లెనిన్ ఆమోదించినాడనీ, ఆయన తన అభినందనలూ, హృదయపూర్వక కృతజ్ఞతలూ పంపినాడనీ చెప్పినాడు. ఇవనోవ్ యింకా యితర విషయాలు చెప్తూ, లెనిన్ వేడిలేని గదిలో పనిచేసుకుంటాడని చెప్పినాడు. దానిమీద మిలినోవా తాలూకా కార్యనిర్వాహక వర్గం ఒక తీర్మానం చేసింది. "కార్యనిర్వాహక వర్గ ఖర్చుతో కామ్రేడ్ లెనిన్‌కు ఒక రైలు బండెడు వంటచెరకు పంపాలనీ, అవసరమైతే, ఆయన ఆఫీసులో యినప స్టౌ అమర్చడానికి ఒక కమ్మరిని పంపాలనీ." యిది ప్రజలు తమ నాయకునిపట్ల చూపించిన హృదయస్పందకమైన శ్రద్ధకు ఒక వ్యక్తీకరణ.

లెనిన్ తరుచు సభల్లో మాట్లాడేవాడు. అప్పుడు ఆయన నూతన జీవితాన్ని నిర్మించమని ప్రజలను ఉద్బోధించి, యెలా నిర్మించవలసిందీ వాళ్లకు నేర్పినాడు. లోహకార్మికుల, గనిపనివాళ్ల, రైల్వే కార్మికుల, మిల్లు కార్మికుల సభల్లో ఆయన ఉపన్యసించినాడు. ఆయన సరళంగా, సూటిగా మాట్లాడేవాడు. ప్రగాఢ ఆత్మవిశ్వాసంయొక్కా, శ్రామిక ప్రజల శక్తిలో సుస్థిరమైన నమ్మకంయొక్కా బలంతో

ఆయన ఉపన్యాసాలు శ్రోతలను ఉర్రూతలూపేవి. యితర కార్మికులతో కలిసి లెనిన్‌యొక్క స్వాగతం పొందిన ఎ. ఎ. నికీషిన్ అనే బాకూ నూనె కార్మికుడు యిలా చెప్పినాడు: "మేము క్రెమ్లిన్‌లోనుండి బయటికి వచ్చి, మా అభిప్రాయాలను సరిపోల్చుకోసాగినాము. వ్లదీమిర్ ఇల్యీచ్ అసాధారణ విషయాలను అసాధారణ భాషలో మాట్లాడుతాడని మేము ఊహించినాము.... వ్లదీమిర్ ఇల్యీచ్‌కి మా జీవితం తప్ప సొంత జీవితం లేదనీ, మాగురించి సర్వమూ ఆయనకు తెలుసుననీ, మా అవకాశాలను ఆయన అధ్యయనం చేసినాడనీ, మా పనిలో అంతరాయాలు కలిగించే విభాగాలను ఆయన తెలుసుకొని, మొహమోటం లేకుండా గుర్తుచేసినాడనీ మాకు సులభంగా అర్థమైంది. ఆయన తన ప్రశంసనీయమైన సరళత్వంతోనూ, అసాధారణ హార్దికతతోనూ మాకు అందరికీ అచ్చెరువు కలిగించినాడు. అయిదు నిముషాలు ఆయనతో గడిపిన తర్వాత మేము పాత మిత్రులమైనట్లు మాకు అనిపించింది, మనస్సులలో సంకోచాలు లేకుండా మేము పూర్తి స్వేచ్ఛ అనుభవించినాము. యిబ్బంది యేమీ లేకుండా అంతా సరళంగా, సహజంగా, సులభంగా వుండింది. యీ సరళత్వమే, యీ సమ్మోహనకరమైన ప్రవర్తనే కార్మికవర్గ నాయకుడూ, గురువూ, మిత్రుడూ అయిన వ్లదీమిర్ ఇల్యీచ్‌లో యెవరైనా మెచ్చుకొనేది." "మన ఇల్యీచ్" అని కార్మికులూ, కర్షకులూ ఆయన్ను ప్రేమతో అనేవాళ్లు.

లెనిన్‌కు ప్రజల సృజనాత్మక శక్తులలో దృఢమైన విశ్వాసం వుండింది. "కార్మికులయొక్కా, కార్మికుల ఉద్యమంయొక్కా అనివార్య ప్రపంచ విజయంలో నేను విశ్వాసం పొందేది, ప్రతి కమ్యూనిస్టు లాగే, కార్మికుల, కార్మిక జనాల స్థిరత్వంనుండి" అని లెనిన్ రాసినాడు. సాధారణ కార్మికులూ, కర్షకులూ విస్తారమైన పరిమాణంలో పార్టీ, పరిపాలనా, ట్రేడ్‌యూనియన్ కార్యకలాపాల్లోకి ఆకర్షింపబడాలని ఆయన కోరినాడు. స్త్రీలు పౌర కార్యకలాపాల్లోకి ఆకర్షింపబడాలని ఆయన

నొక్కి చెప్పేవాడు. లక్షోపలక్షల స్త్రీలు పౌరజీవితంలో పాల్గొంటే సోష లిజంను నిర్మించే పని స్థిరమైన పునాదిమీద వుంటుందని ఆయన అన్నాడు. ఆయన తరుచు మహిళా కార్మిక, కర్షకుల సభల్లోనూ, కాన్ఫరెన్సులలోనూ ఉపన్యసించి, పెట్టుబడిదారీ దేశాలలోని శ్రామిక స్త్రీల అవమానకరమైన దళిత స్థితిని గురించి చెప్పేవాడు. స్త్రీలకు ప్రపంచంలోని బూర్జువా దేశాలన్నీ వంద సంవత్సరాలలో చేసిన దాని కంటె యెక్కువ సోవియట్ ప్రభుత్వం స్వల్ప కాలంలో చేసిందని ఆయన గుర్తుచేసి, సోషలిస్టు రాజ్యాన్ని సంరక్షించడంలోనూ, నిర్మించ డంలోనూ క్రియాత్మక పాత్ర వహించాలని స్త్రీలను ఉద్బోధించేవాడు.

ఒక సందర్భంలో లెనిన్ 'త్వోర్‌చెస్త్వో' ('సృజన') పత్రికమీద వ్యాఖ్యానిస్తూ రచయిత ఎ. సెరఫిమోవిచ్‌ని యిలా అడిగినట్లు అతను చెప్పినాడు: "మరి యిది చెప్పండి — సోవియట్ మహిళ జీవితం గురించి, రైతు మహిళ జీవితం గురించి, మీరు యెందుకు యేమీ రాయరు? యెంతైనా, కొత్తగా పునర్నిర్మింపబడిన రాజ్యంలో, సోషలిస్టు రాజ్యంలో, ఆమె ప్రచండమైన పాత్ర నిర్వహిస్తున్నది. మొట్టమొదటిసారిగా ఆమె పౌర కార్యకలాపాల విస్తృత రంగంలో అడుగు పెడుతున్నది. స్త్రీలు, గ్రామాల్లో కూడా, చదువుకోడానికీ, విద్య పొందడానికీ యెంత శ్రద్ధ కనబరుస్తున్నారో చూడండి. కొద్ది యేండ్ల కాలంలో మనకు మహిళా డాక్టర్లూ, మహిళా వ్యవసాయ శాస్త్రజ్ఞులూ, మహిళా ఇంజనీర్లూ, మహిళా శాస్త్రజ్ఞులూ, మహిళా రాజనీతిజ్ఞులూ వుంటారు." కొద్ది క్షణాలు ఆలోచించి ఆయన మళ్లీ యిలా అన్నాడు: "ఔను, మన స్త్రీలను గురించి మనం రాయాలి. మన జీవితం యెలా పురోగమించేదీ వాళ్లమీద యెంతో ఆధారపడివుంది."

లెనిన్ యువజనుల మిత్రుడు. యువజనోద్యమాన్ని ఆయన సన్నిహితంగా గమనిస్తూ, సరైన రాజకీయ స్థావరం అవలంబించడానికి దానికి తోడ్పడినాడు. ఆయన సలహామీద పార్టీ యువజనుల రాజకీయ

విద్యను పార్టీలోని ప్రముఖ కమ్యూనిస్టులకు అప్పగించింది. ఆయన మార్గదర్శకత్వంకింద యువ కమ్యూనిస్టు లీగు, కొమ్సొమోల్, సృష్టింపబడింది. యిప్పుడు దానికి లెనినిస్టు కొమ్సొమోల్ అని గౌరవనీయ నామం వుంది. 1918 అక్టోబర్‌లో జరిగిన మొదటి కొమ్సొమోల్ మహాసభయొక్క ప్రతినిధివర్గం లెనిన్‌వద్దకు వెళ్లింది. 1920 శరదృతువులో ఆయన 'యువజన సంఘాల కర్తవ్యాల' మీద మూడవ కొమ్సొమోల్ మహాసభలో ఉపన్యసించినాడు. వైట్‌గార్డ్ జనరల్ వ్రాంగెల్‌మీద తీవ్రమైన పోరాటం జరిగే సమయంలో ఆ మహాసభ జరిగింది. ప్రతినిధులు లెనిన్‌నుండి అంతర్జాతీయ, ఆంతరంగిక సన్నివేశంమీద నివేదికను ఆశించినట్లు తెలిపినారు. కొమ్సొమోల్ కర్తవ్యాలు వాళ్లకు బాగా తెలిసినట్లు అనిపించింది: బూర్జువాలతో పోరాడడం. అయితే లెనిన్ యువజనులను చదువుకోండి, చదువుకోండి, చదువుకోండి అని ఉద్బోధించినాడు. కమ్యూనిజం నిర్మించడానికి వాళ్ళ జ్ఞానం సంపాయించవలసి వుందని ఆయన స్పష్టమైన, సరళమైన మాటల్లో వివరించినాడు. శాస్త్ర విజ్ఞానం ఆధారంగా మాత్రమే, మానవజాతి అంతా ప్రోగుచేసిన జ్ఞానం ఆధారంగా మాత్రమే కమ్యూనిజం నిర్మించబడగలదని వాళ్లకు ఆయన చెప్పినాడు. యీ జ్ఞానాన్ని పరిశ్రమలలో ఉత్పాదక శ్రమతో కలపవలసి వుంది, వ్యవసాయంలో ప్రయోగించవలసి వుంది. యిది లేకుండా కమ్యూనిజం నిర్మించబడజాలదు. యువ కమ్యూనిస్టు లీగులో సభ్యుడుగా వుండడమంటే తన శక్తులన్నిటినీ సమష్టి లక్ష్యానికి వినియోగించడమన్నమాట. ప్రతి రోజూ, ప్రతి పట్టణంలోనూ, ప్రతి గ్రామంలోనూ యువజనులు కార్మికులతో, కర్షకులతో కలిసి సమష్టి శ్రమకు సంబంధించిన యేదో ఒక పనిని, యెంత చిన్నదైనా, యెంత సరళమైనదైనా, ఆచరించాలి. "చిన్నప్పటినుండి చైతన్యపూరితమైన, క్రమశిక్షణాయుత

మైన శ్రమలో నిమగ్నం కావడం యువ కమ్యూనిస్టు లీగు యువజనుల కందరికీ నేర్పించాలి'' అని ఆయన చెప్పినాడు.

కమ్యూనిస్టు నీతియొక్క ఉన్నత సూత్రాలను లెనిన్ యువ జనులకు వెల్లడించినాడు. కమ్యూనిస్టు సమాజ నిర్మాణానికి జరిగే పోరాటంమీద కమ్యూనిస్టు నీతి ఆధారపడుతుందని ఆయన అన్నాడు. కమ్యూనిస్టు ఉద్యమంమీద భక్తి, శ్రామిక ప్రజల ఆనందం కొరకు చేసే పోరాటానికి అంకితమైన జీవితం, స్వదేశ ప్రేమ, అంతర్జాతీయత, కమ్యూనిజంకు శత్రువులైనవాళ్లతో రాజీ లేకపోవడం, సమష్టితత్వం — యిది నూతన సమాజ మానవుని నైతిక స్వభావాన్ని రూపుదిద్దేది. మరి దీనికి స్వయంగా లెనిన్ ఉదాహరణప్రాయుడు.

లెనిన్ ఉపన్యాసం యుద్ధరంగంలో వీర కార్యాలూ, గృహరంగంలో నిస్వార్థ కృషీ చేయడానికి యువజనులను ఉత్తేజపరిచింది. ఆయన యువజనుల కిచ్చిన సలహాలూ, సూచనలూ యీనాటికీ, కమ్యూనిస్టు నిర్మాణ దశలో కూడా, తమ ప్రాముఖ్యాన్ని యేమాత్రమూ కోల్పోలేదు.

సోవియట్ అధికారాన్ని పటిష్ఠపరచడం, విదేశ జోక్యందార్లతోనూ, వైట్‌గార్డులతోనూ పోరాడడం, కమ్యూనిస్టు తత్వంలో జనాలకు శిక్షణ యివ్వడం అనే కర్తవ్యానికి తన శక్తులన్నీ అర్పిస్తూ లెనిన్ రష్యన్ కార్మికవర్గంయొక్కా, బోల్షివిక్ పార్టీయొక్కా సంపన్న విప్లవానుభవాన్ని వినియోగించుకొని, నూతన పరిస్థితులలో తాను రూపొందించిన విప్లవ సిద్ధాంతాన్ని అంతర్జాతీయ కార్మికవర్గ ఉద్యమానికి తోడ్పడడానికీ, కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌ను నిర్మించడానికీ ప్రయోగించినాడు. 1918 ఉత్తరార్ధంలో జర్మనీ, ఆస్ట్రియా, ఫిన్లండు, హంగరీ, పోలెండులలో కమ్యూనిస్టు పార్టీలు నిర్మింపబడినాయి. మూడవ ఇంటర్నేషనల్‌ను స్థాపించడానికి 1919 జనవరిలో లెనిన్ యూరప్, అమెరికాల కార్మికులకు విజ్ఞప్తి చేసినాడు. 1919 మార్చిలో మూడవ, కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌యొక్క ప్రథమ మహాసభ మాస్కోలో జరిగింది. మహాసభ

పనికి లెనిన్ దర్శకత్వం వహించినాడు. ఆయన బూర్జువా ప్రజాస్వామ్యంమీదా, కార్మికవర్గ నియంతృత్వంమీదా నివేదిక యిచ్చి, సోవియట్ అధికారంగురించీ, కార్మికవర్గ నియంతృత్వ సారంగురించీ మాట్లాడినాడు.

రెండవ ఇంటర్నేషనల్ నాయకులు మార్క్సిస్టు బోధలను వికృతపరిచి వుండినారు. వాళ్లు కార్మికవర్గ నియంతృత్వ రాజ్యానికి వ్యతిరేకం. వాళ్ల నిజ స్వరూపాన్ని — వాళ్లు బూర్జువావర్గ తాబేదార్లు అని — లెనిన్ బట్టబయలు చేసినాడు.

1918 అక్టోబర్‌లో రాసిన 'కార్మికవర్గ విప్లవమూ, స్వపక్ష ద్రోహి కౌట్స్కీ' అనే గ్రంథంలో లెనిన్ అవకాశవాదంమీద బలమైన దెబ్బ తీసినాడు.

యీ గ్రంథంమీద లెనిన్ ప్రత్యేక ఆవేశంతో కృషిచేసినాడని వి. డి. బోంచ్-బ్రుయేవిచ్ తన స్మృతులలో రాసినాడు. "ఆయన ఆగ్రహంతో మండిపోతూ వుండినాడు," "అసాధారణంగా శక్తివంతమైన యీ పుస్తకం రాస్తూ ఆయన రోజులకు రోజులు రాత్రి పొద్దు బోయిందాకా గడిపినాడు."

లెనిన్‌కు యెందు కింత ఆగ్రహం? యెవరిమీద ఆయన కత్తి యెత్తింది?

1918 ప్రారంభంలో, అవకాశవాదపు సిద్ధాంతకారుడైన క. కౌట్స్కీ 'కార్మికవర్గ నియంతృత్వం' అనే పేరుగల పుస్తకం విడుదల చేసినాడు. అందులో అతను సోషలిస్టు విప్లవానికీ, కార్మికవర్గ నియంతృత్వానికీ సంబంధించిన మార్క్సిస్టు సిద్ధాంతాన్ని వికృతపరిచి, సోవియట్ రాజ్యాన్ని నిందించి, బోల్షివిక్ పార్టీ కార్యకలాపాలను అపఖ్యాతి పాలుచేయడానికి దొడ్డిదారి తొక్కినాడు. లెనిన్ కార్మికవర్గ ప్రయోజనాలకు కౌట్స్కీ చేసిన ద్రోహాన్ని బట్టబయలు చేసి, మార్క్సిజంయొక్క ప్రధాన సూత్రమైన కార్మికవర్గ నియంతృత్వాన్ని అంగీకరించడానికి నిరాకరించినందుకు అతన్ని ఖండించినాడు.

బూర్జువా ప్రజాస్వామ్యాన్ని "శుద్ధ, వర్గేతర" ప్రజాస్వామ్యంగా చూపించడానికి కౌట్స్కీ చేసిన ప్రయత్నాలు నిరర్థకమని లెనిన్ చూపించి నాడు. భిన్న వర్గాలు వున్నంత కాలం వర్గ ప్రజాస్వామ్యం గురించి మాత్రమే యెవరైనా మాట్లాడగలరని ఆయన రాసినాడు. బూర్జువా ప్రజాస్వామ్యం మైనారిటీయొక్క ప్రయోజనాలను వ్యక్తం చేస్తుంది, కాగా కార్మికవర్గ ప్రజాస్వామ్యం "యే బూర్జువా ప్రజాస్వామ్యంకంటెనూ పదిలక్షల రెట్లు యెక్కువ ప్రజాస్వామికమైనది," అది జనాభాలో పరమమైన మెజారిటీ అయిన శ్రామిక ప్రజల ప్రయోజనాల కొరకు పని చేస్తుంది.

సోవియట్లద్వారా నిర్వహించబడే శ్రామిక ప్రజల ప్రభుత్వం కంటె ప్రజాస్వామికమైన ప్రభుత్వం లేదని చూపించడానికి ఆయన రష్యాలోని సోవియట్ ప్రభుత్వ అనుభవాన్ని ఉటంకించినాడు. కార్మిక వర్గ నియంతృత్వం మూలంగానే సోవియట్ ప్రజలు ప్రతీఘాత విప్లవంతోనూ, సామ్రాజ్యవాదుల సాయుధ దాడితోనూ విజయవంతంగా పోరాటం చేయడమూ, ఒక నూతన జీవితాన్ని నిర్మించడం ప్రారంభించ గలగడమూ. సోషలిజం కొరకు రష్యన్ కార్మికవర్గం, రష్యన్ ప్రజల పోరాటంయొక్క ప్రచండమైన అంతర్జాతీయ ప్రాముఖ్యాన్ని లెనిన్ గుర్తుచేసినాడు; యీ పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ, కార్మికవర్గమూ, సోవియట్ రిపబ్లిక్‌లోని సమస్త శ్రామిక ప్రజలూ సకల యితర ప్రజలకూ ఒక ఆదర్శం చూపిస్తున్నారు.

మొదటి మహాసభ మూడవ, కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ స్థాపనను ప్రకటించింది. కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ సృష్టి లెనినిజంకు గొప్ప విజయం. ఇంటర్నేషనల్‌యొక్క యితర మహాసభల పనిలో కూడా లెనిన్ పాల్గొన్నాడు: 1920లో రెండవ మహాసభా, 1921లో మూడవ మహాసభా, 1922లో నాల్గవ మహాసభా. ఆయన అత్యంత ముఖ్యమైన కమిషన్‌లలో పనిచేసినాడు, రైతు సమస్యమీదా, జాతుల

సమస్యమీదా, పీడిత జాతులపట్ల వైఖరిమీదా, వలస సమస్యమీదా, కమ్యూనిస్టు పార్టీల పాత్రమీదా, యెత్తుగడలమీదా మాట్లాడినాడు. కొమింటర్న్ మహాసభల ముఖ్య తీర్మానాలు ఆయనచేత రచింపబడినాయి.

సకల దేశాల కార్మిక, కమ్యూనిస్టు పార్టీల ఐక్యతా సంఘీభావాల ప్రాముఖ్యాన్ని లెనిన్ ప్రత్యేకంగా నొక్కిచెప్పి, కార్మికవర్గ అంతర్జాతీయతా సూత్రాలకు కచ్చితంగా కట్టుబడాలని పట్టుబట్టినాడు.

ఆయన కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ మహాసభల ప్రతినిధులను కలుసుకొని, వాళ్ల దేశాల కార్మికవర్గ ఉద్యమం గురించీ, కమ్యూనిస్టు పార్టీల సంస్థా నిర్మాణం గురించీ వాళ్లతో చర్చించేవాడు. లెనిన్‌తో యీ సమావేశాలూ, సంభాషణలూ విలియం గాల్లహెర్ (బ్రిటన్), మర్సేల్ కషేన్ (ఫ్రాన్సు), ఆంటనిన్ జపాటొత్స్కి (జెకొస్లొవేకియా), క్రిస్టో కబాక్‌చియెవ్ (బల్గేరియా), యింకా అనేక సోదర కమ్యూనిస్టు పార్టీల నాయకుల జీవితాల్లో ప్రముఖ పాత్ర వహించినాయి.

అంతర్జాతీయ కమ్యూనిస్టు, కార్మిక ఉద్యమ నాయకులకు లెనిన్ రాసిన జాబుల్లో ఆయన ప్రపంచ విప్లవ అనివార్య విజయంలోనూ, సకల దేశాలలోనూ నూతన, సోషలిస్టు ప్రజాస్వామ్య విజయంలోనూ తన ప్రగాఢ విశ్వాసాన్ని వ్యక్తంచేసినాడు.

లెనిన్ ప్రగాఢమైన దేశభక్తుడు. ఆయన రష్యానూ, దాని ప్రజలనూ, సంస్కృతినీ, భాషనూ, సాహిత్యాన్నీ ప్రేమించినాడు. అదే సమయంలో ఆయన గొప్ప కార్మికవర్గ అంతర్జాతీయవాది. ఆయన బోల్షివిక్ పార్టీయొక్కా, రష్యా కార్మికవర్గ, శ్రామిక జనాలయొక్కా ప్రయోజనాలనూ, కర్తవ్యాలనూ అంతర్జాతీయ కార్మిక, కమ్యూనిస్టు ఉద్యమ ప్రయోజనాలతోనూ, కర్తవ్యాలతోనూ యెప్పుడూ ముడి పెట్టేవాడు. రష్యాలోని విప్లవాన్ని ఆయన ప్రపంచ సోషలిస్టు విప్లవంయొక్క భాగంగా యెంచినాడు.

ఆయన హంగరీలోనూ, బవేరియాలోనూ (1919 వసంతంలో) సోవియట్ల స్థాపనను అభినందించి, హంగేరియన్ విప్లవ నాయకుడైన బేల కున్‌ను బలపరిచినాడు. క్లారా జెట్కిన్‌కు ఒక ఉత్తరంలో ఆయన యిలా రాసినాడు: "మీరూ, మేరింగ్, జర్మనీలోని యితర స్పార్టకస్ కామ్రేడ్లూ* హృదయ మనఃపూర్వకంగా మాతో వున్నందుకు మాకు యెంతో సంతోషంగా వుంది."

ఆయన కమ్యూనిస్టు, సోషలిస్టు పార్టీలలోని ఘటనలు సన్నిహితంగా గమనిస్తూ, వాటిలోని నిజంగా విప్లవకరమైనవాళ్లను చురుకుగా బలపరిచినాడు, కానీ అదే సమయంలో మార్క్సిజంను యేవిధంగానైనా వికృతపరచడాన్నీ, వెకిలిపరచడాన్నీ ఖండించినాడు. కమ్యూనిస్టు, తదితర కార్మిక పార్టీలమధ్య సంబంధాలు అభివృద్ధిపరుచుకోవడమూ, తమ పార్టీలలోని సన్నివేశాన్నీ తమ కార్యకలాపాలనూ ఒకరికొకరు తెలియబరుచుకోవడమూ అత్యావసరమని ఆయన భావించినాడు; స్వయంగా ఆయన యీ ఆచారానికి సర్వదా కట్టుబడినాడు.

రష్యన్ కమ్యూనిస్టుల అనుభవాన్ని వివిధ దేశాల బాల కమ్యూనిస్టు పార్టీలకు తెలియబరచడానికీ, యీ అనుభవాన్ని వాళ్ల అనుభవంతో కలపడానికీ 1920లో లెనిన్ ' "వామపక్ష" కమ్యూనిజం — ఒక బాలారిష్టం' అనే గ్రంథం రాసినాడు; అందులో ఆయన బోల్షెవిక్ పార్టీయొక్క నిర్మాణ, అభివృద్ధి, పోరాట, విజయాల చరిత్రను గురించి రాసినాడు. పార్టీ యెలా పెరిగి, పరిణతి చెందిందీ, తన కష్టాలను అది యెలా, యెందుకు అధిగమించగలిగిందీ, దాని సంపన్న అనుభవంనుండి యితర కమ్యూనిస్టు పార్టీలు యే గుణపాఠాలు నేర్చుకోగలిగిందీ ఆయన అందులో వర్ణించినాడు.

---

* స్పార్టకస్ లీగు — జర్మన్ వామపక్ష సోషల్ డెమోక్రట్ల విప్లవ సంస్థ. జర్మన్ కమ్యూనిస్టు పార్టీ స్థాపకులలో వీళ్లు కూడా వుండినారు. — సం.

అవకాశవాదులతో, మెన్షివిక్కులతో, సోషలిస్టు రివల్యూషనరీలతో, యితర కార్మికవర్గ శత్రువులతో — మార్క్సిజంయొక్క శత్రువులతో — చేసిన పోరాటంలో బోల్షెవిక్ పార్టీ పెరిగి పరిణతి చెందిందని లెనిన్ రాసినాడు. తన సభ్యులలోని ఉక్కు క్రమశిక్షణ మూలంగానూ, జనాలతో దాని సన్నిహిత సంబంధాల మూలంగానూ, అది సర్వదా మార్క్సిస్టు సిద్ధాంతంచేత నడిపింపబడినందువల్లనూ అది తన అపారమైన కష్టాలను అధిగమించింది. దక్షిణపక్ష అవకాశవాదాన్ని కార్మికవర్గ ఉద్యమానికి ప్రధాన ప్రమాదంగా యెంచుతూనే లెనిన్ కమ్యూనిస్టు పార్టీలలోని "వామపక్ష" నాయకుల — జనాలకు సంబంధించి కమ్యూనిస్టు పార్టీల పాత్రనూ కర్తవ్యాలనూ అపార్థం చేసుకొని, బూర్జువా పార్లమెంటులలోనూ, ట్రేడ్‌యూనియన్లలోనూ పనిచేయడానికి నిరాకరించి, యితర పార్టీలతో ఒప్పందమూ, రాజీ అనే భావాన్ని నిరాకరించినవాళ్ల — పారపాట్లను తీవ్రంగా విమర్శించినాడు. వాళ్లు విప్లవ కార్యాల స్థానంలో విప్లవ పదాలను వుంచినారు. యిది కార్మికవర్గ ప్రయోజనానికీ, యావత్తు ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమానికీ హానికరమూ, అపాయకరమూ; యిది జనాలనుండి పార్టీని యేకాకిని చేయడానికి అభిముఖంగా వుంటుంది. జనాలు యెక్కడైతే వుంటారో అక్కడల్లా కమ్యూనిస్టులు పని చెయ్యాలని ప్రపంచ కార్మికవర్గ నాయకుడు గుర్తుచేసినాడు. ఆయన యెత్తుగడలలో వెసులుబాటును బోధించినాడు, సాధారణ సూత్రాలను నిర్దిష్ట సమస్యలకు ఛాందసంగా వర్తింపజేయడానికి వ్యతిరేకంగా హెచ్చరించినాడు. యే దేశ నిర్దిష్ట లక్షణాలకైనా సంబంధించిన ఆచరణాత్మక సమస్యతో వ్యవహరించడంలో, మౌలిక అంతర్జాతీయ కర్తవ్యాన్ని — సామ్రాజ్యవాదుల అధికారాన్ని కూలదోసి, సోషలిజంనూ, కమ్యూనిజంనూ నిర్మించే కర్తవ్యాన్ని — ఒక క్షణం కూడా కనుమరుగు కానివ్వకూడదు, అని ఆయన గుర్తుచేసినాడు.

కమ్యూనిస్టు పార్టీలు తమ పొరపాట్లను సరిదిద్దుకోడానికీ, కార్మికవర్గ శత్రువులతో మరింత ఫలవంతంగా పోరాడడానికీ, జనాలను తమవెనుక సమీకరించుకొనగలిగి, పోరాటంలో కాకలుదీరిన మార్క్సిస్టు పార్టీలు కావడానికీ ఆయన పుస్తకం తోడ్పడింది. యిది యీనాటికీ ప్రపంచ మంతటా కమ్యూనిస్టు ఉద్యమానికి తన అపార ప్రాముఖ్యాన్ని నిలుపుకుంది.

కార్మిక కర్షకుల ప్రయోజనం కొరకు లెనిన్ చేసిన నిస్వార్థ పోరాటం ప్రపంచ మంతటా శ్రామిక ప్రజల నిరవధిక ప్రేమనూ, విశ్వాసాన్నీ ఆయనకు సంపాయించి పెట్టింది. అంతర్జాతీయ కార్మిక వర్గమూ, సకల దేశాల కమ్యూనిస్టు పార్టీలూ ఆయనను తమ నాయకునిగా, గురువుగా పరిగణించినాయి. కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ రెండవ మహాసభ ప్రతినిధులు లెనిన్‌ను గురించిన తమ ముద్రలు రాసిన ఆల్బంలో కొన్ని రాతలు యివి:

"కామ్రేడ్ లెనిన్‌ను చూసి గర్వించడానికి రష్యన్ కార్మికవర్గానికి సర్వ హక్కులూ వున్నాయి. విప్లవ యుగంలో, లెనిన్ లాంటివాడు అత్యావసరమైనప్పుడు, వాళ్లకు లెనిన్ వుండడం తమ అదృష్టంగా వాళ్లు భావించవచ్చు" అని ఆంటనిన్ జపాటొత్స్కి రాసినాడు.

"లెనిన్ అత్యంత సరళమైన, అత్యంత దూరదృష్టి గల అత్యంత నిశ్చలుడు" అని జాన్ రీడ్ రాసినాడు.

లెనిన్ ప్రాచ్య ప్రజల హృదయాలలో కొత్త ఆశలు మేల్కొల్పి, వాళ్లకు సుఖ మార్గం చూపించినాడని వలస, పరతంత్ర దేశాల ప్రతినిధులు రాసినారు. "మానవజాతియొక్క అత్యంత ఉదాత్త ప్రతినిధి" అని భారతదేశ ప్రతినిధి సారవంతంగా వ్యక్తంచేసినాడు.

ప్రాచ్య పాశ్చాత్య శ్రామిక జనాలూ, పీడిత ప్రజలూ లెనిన్ మాటలకు చెవియొగ్గినారు. 1920ల తొలి భాగంలో లెనిన్ పేరు ఇటలీలోని మారుమూల గ్రామాలలో కూడా తెలిసిందని ఇటాలియన్



వి. ఐ. లెనిన్

గోర్కి, 1922



లెనిన్ సమాధిమందిరంవద్ద
ఫోటో

కమ్యూనిస్టు జెర్మనేట్స్టో రాసినాడు. ఆయనపట్ల తమకు గల ప్రగాఢ గౌరవానికి చిహ్నంగా కొన్ని కార్మిక కుటుంబాలు కొత్తగా పుట్టిన తమ పిల్లలకు "లెనిన్" అనే పేరు పెట్టినారు.

1919 వేసవిలో జోక్యందారులూ, వైట్‌గార్డులూ సోవియట్ రిపబ్లిక్‌మీద తమ వొత్తిడిని తీవ్రంచేసినారు. అంతర్యుద్ధరంగాలలో విదేశ జోక్యందారుల వైట్‌గార్డుల సంయుక్త బలాలతో నిర్ణయాత్మక యుద్ధాలు చేయబడుతూ వుండినాయి. అమెరికా సంయుక్త రాష్ట్రాలు, బ్రిటన్, ఫ్రాన్సు, జర్మనీ, జపాన్‌ల సామ్రాజ్యవాదులు సోవియట్ రిపబ్లిక్‌మీద దాడిలో దెనీకిన్, యుదేనిచ్ సేనానాయకుల సైన్యాలనూ, కొల్చాక్ సైనికులలో హతశేషులనూ ప్రయోగించినారు. యీ దాడి ఫలితంగా పట్టణాలూ, గ్రామాలూ వేలకొలది నాశనమైనాయి, అప్పటికే కాళ్లు విరిగిన ఆర్థిక వ్యవస్థ మరీ బలహీనం చేయబడింది, లక్షలాది ప్రజలు హతులైనారు, కటిక దరిద్రులైనారు. మరొకసారి కమ్యూనిస్టు పార్టీ, లెనిన్ నాయకత్వాన, శత్రువును తిప్పికొట్టడానికి జాతిని సమీకరించింది. మరొకసారి జనాలు తమ సోవియట్ జన్మభూమిని రక్షించుకోడానికి లేచినారు.

యీ సంక్షోభ సమయంలో, కొత్త పురోగామి కార్మిక జనాలను పార్టీలోకి ఆకర్షించడానికి ప్రత్యేక 'పార్టీ వారం' యేర్పాటుచేయాలని లెనిన్ ప్రతిపాదించినాడు. లెనిన్ పిలుపుమీద కార్మికులూ, కర్షకులూ, సైనికులూ వేలమంది పార్టీలో చేరినారు. ప్రజలు కమ్యూనిస్టుల వెనక వున్నారనీ, పార్టీకి ప్రజల హృదయపూర్వక అండదండలు వున్నాయనీ 'పార్టీ వారం' స్పష్టంగా నిరూపించింది. "శ్రామిక ప్రజా బాహుళ్యం మనవెంట వున్నారు. అదే మన బలం. ప్రపంచ కమ్యూనిజంయొక్క అవిజేయతకు మూలం అదే" అని లెనిన్ 'కార్మికుల రాజ్యమూ, పార్టీ వారమూ' అనే వ్యాసంలో రాసినాడు.

1919 అంతంనాటికి యెర్ర సైన్యం దాదాపు అన్ని రంగాలలోనూ శత్రువును ఓడించింది, దేశానికి కాస్త విరామం లభించింది. లెనినూ, పార్టీ వెంటనే తమ శక్తినంతటినీ రవాణా, ఇంధనం పునరుద్ధరణకూ, తదితర కీలక ఆర్థిక విషయాలకూ మళ్లించినారు.

ఆర్థికాభివృద్ధికి ప్రణాళిక తయారుచేయడానికి తొమ్మిదవ పార్టీ మహాసభ జరపడం అవసరమైంది. మొత్తం జాతీయ ఆర్థిక వ్యవస్థను పునరావాసం చేసి, అభివృద్ధిచేసే లక్ష్యంతో యుద్ధకాల పోరాటంనుండి గృహరంగంలో రక్తరహిత పోరాటానికి మారడానికి మార్గాలూ, సాధనాలూ రూపొందించడం యీ మహాసభ ప్రధాన లక్ష్యం.

తొమ్మిదవ పార్టీ మహాసభ 1920 మార్చి 29న మాస్కోలో బొల్షోయ్ థియేటర్‌లో ప్రారంభమైంది. సమావేశం యెనిమిది రోజులు సాగింది; లెనిన్ ఆరు సార్లు మాట్లాడినాడు. లెనిన్ యిచ్చిన కేంద్ర కమిటీ నివేదికలో, ఆర్థిక పునరుజ్జీవన కర్తవ్యాన్ని ఆయన పార్టీముందు వుంచినాడు.

ఆయన ఉద్దేశాల ఆధారంగా, జాతీయ ఆర్థిక వ్యవస్థయొక్క విద్యుదీకరణకు ప్రధాన ప్రాముఖ్యం యిచ్చే ఏకీకృత ఆర్థిక ప్రణాళిక సమస్యను మహాసభ పరిశీలించింది.

ఆనాడు వుండిన దేశ దారిద్ర్య వినాశనాల గుండా లెనిన్ గొప్ప భవిష్యద్దృశ్యాలను దర్శించినాడు. సోవియట్ వ్యవస్థలో సహజంగా వున్న సృజనాత్మక శక్తులు తరగనివనీ, అవి యుద్ధరంగంలో యెంత ఫలవంతంగా వుండినాయో అంత ఫలవంతంగా సోషలిస్టు నిర్మాణంలోనూ వుంటాయనీ ఆయన ప్రగాఢంగా నమ్మినాడు. సోషలిజంనూ, కమ్యూనిజంనూ నిర్మించడానికి భారీ పరిశ్రమలను అభివృద్ధి చేయడమూ, యావత్తు దేశాన్నీ విద్యుదీకరించడమూ అవసరమని ఆయన వాదించినాడు. "కమ్యూనిజమంటే సోవియట్ అధికారమూ, యావత్తు దేశ విద్యుదీకరణమూ" అని ఆయన అన్నాడు. రష్యానిండా దట్టంగా

ఎలెక్ట్రిక్ పవర్ స్టేషన్లూ, శక్తివంతమైన యంత్రాగారాలూ వుంటే, దాని కమ్యూనిస్టు ఆర్థికాభివృద్ధి భావి సోషలిస్టు యూరప్‌కూ, ఆసియాకూ నమూనా ఔతుంది, అని ఆయన అన్నాడు. శాస్త్రవిజ్ఞాన, సాంకేతిక శాస్త్రాల పురోగతి లేకుండా సోషలిజం అసంభవమని ఆయన చెప్పినాడు. కానీ, సోషలిజం లేకుండా శాస్త్రవిజ్ఞానం కూడా పరిపూర్ణంగా అభివృద్ధికాజాలదు. సోషలిజం మాత్రమే శాస్త్రవిజ్ఞానాన్ని పెట్టుబడిదారీ శృంఖలాలనుండి విముక్తి చేయగలదు. పార్టీ, ప్రజలూ తమను యెదుర్కొన్న కష్టాలను యెన్నడూ అధిగమించ జాలరనీ, విద్యుదీకరణ పథకం స్వప్నమనీ ఆనాటి సోవియట్ రిపబ్లిక్ శత్రువులు వాదించినారు. ప్రసిద్ధ యింగ్లీషు సైన్సు కథారచయిత హెచ్. జి. వెల్స్ కూడా లెనిన్‌యొక్క మహత్తర మనోదృశ్యాన్ని హర్షించలేకపోయినాడు. అతను 1920లో మాస్కోకు వచ్చినప్పుడు లెనిన్‌ను "క్రెమ్లిన్‌లోని స్వాప్నికుడు" అన్నాడు. దేశ విద్యుదీకరణకు లెనిన్ సాహసపూరిత పథకంలో అతనికి ఊహాస్వర్గం – "ఎలెక్ట్రీషియన్ల ఊహాస్వర్గం" – తప్ప మరేమీ కనపడలేదు. "పదేండ్ల కాలంలో మేము రష్యాలో యేమి సాధించేదీ మళ్లీ వచ్చి చూడండి" అని లెనిన్ అతనితో అన్నాడు.

1920 ప్రారంభంలో, లెనిన్ చొరవమీద, ప్రముఖ కమ్యూనిస్టు జి. యం. క్రిజిజనోవ్‌స్కి నాయకత్వంకింద ఒక ప్రభుత్వ కమిషన్ యేర్పాటుచేయబడింది; దానిలో ప్రముఖ శాస్త్రజ్ఞులూ, ఇంజనీర్లూ వుండినారు. జి. యం. క్రిజిజనోవ్‌స్కికీ, ఆర్. ఇ. క్లాస్సన్‌కూ, ఎ. వి. వింతర్‌కూ, యితర ప్రముఖ శాస్త్రజ్ఞులకూ ఆయన రాసిన అనేక లేఖలనుబట్టి యీ కమిషన్ పనికి లెనిన్ యేవిధంగా దర్శకత్వం వహించిందీ కొంతవరకు తెలుసుకోవచ్చు. 1920లో వుండిన కఠిన పరిస్థితులలో కమ్యూనిస్టు పార్టీ, దాని నాయకునిచేత నడిపించబడి, విద్యుదీకరణ ఆధారంమీద దేశ ఉత్పాదక శక్తుల అభివృద్ధికి బ్రహ్మాండమైన కార్యక్రమం ప్రారంభించింది. 10, 15 సంవత్సరాలలో 30

పెద్ద పవర్ స్టేషన్లు నిర్మించడానికీ, 1920 నాటికంటె విద్యుచ్ఛక్తి ఉత్పత్తిని పదేడు రెట్లూ, పారిశ్రామిక ఉత్పత్తిని పద్దైదు రెట్లూ పెంచడానికీ పథకం వేయబడింది.

యీ ప్రణాళికను పార్టీ ఆర్థిక కృషియొక్క పునాదిగా, దాని రెండవ కార్యక్రమంగా లెనిన్ పరిగణించినాడు. ఆర్థిక వ్యవస్థయొక్క సకల శాఖల శాస్త్రీయ ప్రణాళికాబద్ధ అభివృద్ధికి అది ప్రారంభం. ఆర్థిక వినాశమూ, బాహ్య, అంతరంగ శత్రువులతో పోరాటమూ వుండిన ఆనాటి పరిస్థితులలో లెనిన్ విద్యుదీకరణ ప్రణాళిక వెంటనే అమలుపరచబడింది. మాస్కో దగ్గర కాషినొ అనే చిన్న గ్రామంలో మొదటి విద్యుద్దీపాలు వెలిగినప్పుడు లెనిన్ యెంత సంతోషించినాడో! ప్రజలు వాటిని ప్రేమగా "ఇల్యీచ్ దీపాలు" అన్నారు.

ప్రణాళిక స్వల్ప కాలంలో పూర్తిచేయబడింది వెల్స్ 1934లో మళ్లీ సోవియట్ యూనియన్‌కు వచ్చినప్పుడు, అతను యిది స్వయంగా చూసినాడు.

కమ్యూనిస్టు పార్టీయొక్కా, దాని మహా నాయకునియొక్కా శ్రమ యెరగని కృషి మూలంగా కార్మికులూ, కర్షకులూ సోవియట్ రిపబ్లిక్‌యొక్క అనేక బలీయ శత్రువులమీద విజయం సాధించినారు.

1920లో సోవియట్ ప్రజలు సామ్రాజ్యవాదుల కొత్త దండయాత్రను తిప్పికొట్టవలసి వచ్చింది. యీసారి పోలిష్ భూస్వాములూ, బూర్జువాలూ బ్రిటిష్, అమెరికన్ సామ్రాజ్యవాదుల అండదండలతో సోవియట్ రిపబ్లిక్‌మీద దాడిచేసినారు.

పోలిష్ యుద్ధరంగానికి బయలుదేరే యెర్ర సైన్యం సైనికులకు 1920 మే 5న యిచ్చిన ఉపన్యాసంలో, సోవియట్ రాజ్యం యుద్ధాన్ని కోరలేదనీ, యుద్ధం దానిమీద రుద్దబడిందనీ లెనిన్ చెప్పినాడు. యుద్ధం ప్రారంభించిన పోలెండు పాలకవర్గాలను ఆయన గుట్టుకడిగి, సోవియట్ రిపబ్లిక్కుకు అండగా పోలిష్ కార్మికులు చేసే వీరోచిత పోరాటాన్ని

అభినందించినాడు. పోలిష్ ప్రజలపట్ల సోవియట్ ప్రజలకు గల ప్రగాఢ సానుభూతిని గురించి ఆయన మాట్లాడినాడు.

సోవియట్ రష్యాను గొంతునులమాలనే సామ్రాజ్యవాదుల పథకం మళ్లీ కూలిపోయింది. 1920 శరదృతువులో వాళ్ల చివరి తాబేదారు అయిన వ్రాంగెల్ దాడికి కూడా అదే గతి పట్టింది.

పెట్టుబడిదారీ ప్రపంచపు శక్తులమీద సోషలిజం మొదటి వరస నిర్ణయాత్మకంగా గెలిచింది. "ప్రతి దాడికీ దేశం తట్టుకొనింది" అని లెనిన్ న్యాయమైన గర్వంతో అన్నాడు.

అంతర్యుద్ధం సోవియట్ ప్రజల చరిత్రాత్మక విజయంతో అంతమై, లెనిన్ చెప్పిన యీ జోస్యాన్ని ధ్రువపరిచింది: "యే జాతిలో కార్మిక కర్షకుల మెజారిటీ తాము తమ సొంత సోవియట్ అధికారం కోసం శ్రమజీవుల అధికారం కోసం పోరాడుతున్నామని గుర్తిస్తారో, అనుభూతి చెందుతారో, చూస్తారో ఆ జాతి యెన్నడూ ఓడిపోజాలదు."

# సోషలిస్టు నిర్మాణానికి ఉత్తేజమూ, రూపమూ యిచ్చినవాడు

కమ్యూనిస్టు పార్టీ, లెనిన్ నాయకత్వం కింద, సోవియట్ ప్రజలను అంతర్యుద్ధపు అగ్నిపరీక్ష లన్నిటిగుండా చాకచక్యంగా, నిర్భయంగా నడిపించింది. కానీ, ఆర్థిక పునరుద్ధరణ మార్గంలో అపారమైన కొత్త అడ్డంకులు యేర్పడినాయి. సామ్రాజ్యవాదులు సోవియట్ రిపబ్లిక్కును సాయుధ బలంతో నలిపివేయలేకపోయినారు, కానీ వాళ్లు దేశాన్ని ఆర్థికంగా యెంతగా నాశనం చేసినారంటే, వాళ్లు తమ సమస్యలకు, లెనిన్ అన్నట్లు, "సగం పరిష్కారం" పొందినారు. యుద్ధానికి

పూర్వమే తక్కువగా వుండిన పారిశ్రామిక ఉత్పత్తి అందులో యేడింట ఒక వంతుకు దిగింది. అన్నిటికంటె యెక్కువగా దెబ్బతిన్నవి వైట్ గార్డులూ, విదేశ దండయాత్రికులూ ఒకప్పుడు ఆక్రమించుకొని వుండిన ప్రాంతాలలోని ఉత్పత్తి సంస్థలు. ఇంధనమూ, ముడిసరుకులూ లేక ఉత్పత్తి సంస్థలలో అత్యధిక భాగం ఆగిపోయినాయి. తలసరి దుక్క యినుము ఉత్పత్తి ఒక కిలోగ్రాముకంటె తక్కువగానూ, తలసరి నూలు బట్టల ఉత్పత్తి ఒక మీటరుకంటె తక్కువగానూ వుండినాయి. రైల్వేలు పూర్తిగా అస్తవ్యస్తమై పోయినాయి. నగరాలలో కార్మికులు పస్తులుండినారు.

వ్యవసాయం పూర్తిగా ధ్వంసమై వుండింది. అంతర్యుద్ధమూ, విదేశీ జోక్యమూ జరిగిన కాలంలో రైతులు తమకు భూమి యిచ్చి, తమను భూస్వాముల శృంఖలాలనుండి విముక్తి చేసిన సోవియట్ ప్రభుత్వానికి అండదండలు యిచ్చినారు. వాళ్లు సకల కష్టాలూ భరించి, యెన్నో త్యాగాలు చేసి, యుద్ధ కమ్యూనిజం అనే విధానాన్ని అంగీకరించివుండినారు. కానీ దేశం శాంతియుత నిర్మాణానికి పూనుకున్నప్పుడు రైతులు అదనపు నిధుల స్వాధీనం పద్ధతిపట్ల అసంతృప్తి వెల్లడించ నారంభించినారు, వ్యవసాయాన్ని పునరుద్ధరించుకోడానికి వాళ్లు పారిశ్రామిక సరుకులూ, యంత్రాలూ డిమాండుచేసినారు; కానీ అవి లేవు. వాళ్లు తమ శ్రమ ఉత్పత్తులను అమ్ముకోడానికీ, తమ పంటను మార్కెట్‌లో అమ్మి పారిశ్రామిక సరుకులను న్యాయమైన ధరలకు కొనుక్కోడానికీ స్వేచ్ఛ కోరినారు; కానీ యివి యుద్ధ కమ్యూనిజం కాలంలో నిషేధింపబడి వుండినాయి.

నూతన సమాజ వ్యవస్థ శత్రువులు రైతులను సోవియట్ ప్రభుత్వంమీదికి రెచ్చగొట్టడానికి వాళ్ల యీ అసంతృప్తిని ఆసరాగా తీసుకున్నారు. మధ్య రష్యాలోనూ, యూక్రేన్‌లోనూ, దోన్ ప్రాంతంలోనూ సైబీరియాలోనూ కొన్ని స్థలాలలో వాళ్లు కులాక్కుల తిరుగు

బాట్లు లేవదీయడంలో కృతకృత్యు లైనారు; యీ తిరుగుబాట్లలో కొందరు మధ్య తరగతి రైతులు కలిసినారు. 1921 మార్చిలో, క్రోన్‌ష్టాడ్ట్‌లో విప్లవ ప్రతిఘాత తిరుగుబాటు చెలరేగింది.

యీ కీలక తరుణంలో లెనిన్ విజ్ఞత మరొకసారి వ్యక్తమైంది: ఆర్థిక విధానంలో ఆయన తీవ్రమైన మలుపు ప్రతిపాదించినాడు. సోషలిస్టు ఆర్థిక వ్యవస్థకు పునాదులు వేయడానికి 1918లో తన 'సోవియట్ ప్రభుత్వ తక్షణ కర్తవ్యాలు' అనే పుస్తకంలో లెనిన్ రూపొందించిన పథకంమీద ఒక అభివృద్ధి ఆయన తయారుచేసిన నూతన ఆర్థిక విధానం!

పారిశ్రామిక కేంద్రాల ధాన్య అవసరాలనూ, ముడిసరుకు అవసరాలనూ తీర్చడానికి వ్యవసాయం బొత్తిగా అశక్తంగా వున్నందువలన, జాతీయ ఆర్థిక వ్యవస్థ పునరావాసం వ్యవసాయంతో ప్రారంభం కావాలని లెనిన్ చెప్పినాడు. యిది లేకుండా పరిశ్రమలను పునరుద్ధరించడమూ, భారీపరిశ్రమల అభివృద్ధికి సాధనాలు సమకూర్చడమూ అసాధ్య మౌతుంది.

రష్యా అత్యధికంగా చిన్నస్థాయి వ్యవసాయపు దేశం అని ఆయన అన్నాడు. కార్మికవర్గం లక్షలాది రైతులతో మైత్రిగా జీవించాలి, వాళ్లకు నూతన మనఃపరిపాకం కలిగించి, వాళ్లను సోషలిస్టు నిర్మాణంలోకి ఆకర్షించాలి. అది నూతన ఆర్థిక విధానం సాయంతో మాత్రమే సాధ్యమౌతుంది.

యీ విధానంయొక్క సారం యేమిటి? యెందుకది నూతనం అనబడింది?

అదనపు నిధుల స్వాధీన పద్ధతి స్థానంలో వస్తు రూపపు పన్నును ప్రవేశపెట్టాలనీ, ధాన్యంలోనూ, యితర అదనపు ఆహార నిధులలోనూ సొంత వ్యాపారం అనుమతింపబడాలనీ లెనిన్ ప్రతిపాదించినాడు. వర్తకాన్ని సక్రమంగా యేర్పాటుచేయడమూ, సహకార సంఘాలను పునర్నిర్మించడమూ అనే కర్తవ్యాన్ని ఆయన పార్టీ ముందు

పెట్టినాడు. కమ్యూనిస్టులు వర్తకం నేర్చుకోవాలనీ, పెట్టుబడిదార్ల కంటె సరసమైన, మేలైన సరుకులు కార్మికులకూ, కర్షకులకూ సరఫరాచేయడం నేర్చుకోవాలనీ ఆయన డిమాండుచేసినాడు. యిది యెక్కువ ధాన్యం ఉత్పత్తిచేయడానికి రైతులకు ప్రోత్సాహం యిస్తుందనీ, తద్వారా యావత్తు జాతీయ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి ఒక వూపు లభిస్తుందనీ ఆయన చెప్పినాడు. నూతన ఆర్థిక విధానం కార్మికవర్గానికీ రైతాంగానికీ మధ్య పొత్తును పటిష్ఠపరిచే ధోరణి కలిగి, సోవియట్ అధికారాన్ని గట్టిపరుస్తుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థనుండి సోషలిజంకు పరివర్తన జరిగే దశలో నూతన ఆర్థిక విధానం ఒక్కటే సరైన విధానంగా వుండింది. మొదట అందులో కొంత తిరోగమనం యిమిడివుండింది; యెందుకంటే అది సొంత వర్తకాన్నీ, సొంతం కూలివాళ్లను పెట్టుకోవడాన్నీ అనుమతించి, తద్వారా పాక్షిక పెట్టుబడిదారీ పునరుద్ధరణకు దారితీసింది. కానీ యిది తాత్కాలిక తిరోగమనం మాత్రమే, సోవియట్ వ్యవస్థకు యేమీ ప్రమాదం కాదు. అధికారం కార్మిక కర్షకుల చేతుల్లో వుండింది. పరిశ్రమలూ, భూమీ, బాంకులూ, రైల్వేలూ, నదీ, సముద్ర రవాణా రాజ్యంయొక్క ఆస్తిగా వుండినాయి.

1921లో జరిగిన పదవ పార్టీ మహాసభ ఒక ముఖ్యమైన ఘటన. నూతన ఆర్థిక విధానానికి మారాలన్న లెనిన్ ప్రతిపాదనను అది ఆమోదించింది. ట్రేడ్‌యూనియన్లమీద ఒక తీర్మానాన్ని, నూతన పరిస్థితులలో వాటి పాత్రనూ, కర్తవ్యాలనూ నిర్వచించేదాన్ని, కూడా ఆ మహాసభ ఆమోదించింది. పరిపాలనకు పాఠశాల, నిర్వహణకు పాఠశాల, కమ్యూనిజంకు పాఠశాల అని లెనిన్‌చేత వర్ణింపబడిన ట్రేడ్ యూనియన్లమీద ఆయన పంథాను ఆ మహాసభ ఆమోదించింది.

దేశాన్ని యెదుర్కొన్న కష్టాలు పార్టీలోపలి సన్నివేశాన్ని ప్రతికూలంగా మార్చినాయి. 1920 అంతంలో పార్టీ సభ్యత్వం 700,000కు

పైగా వుండింది. సగానికి తక్కువగా కార్మికులూ, పాతిక భాగం మాత్రమే రైతులూ వుండినారు; తక్కినవాళ్లు ఉద్యోగస్తులూ, చేతి పనులవాళ్లూ, మేధావులూ. పూర్వపు మెన్షివిక్కులూ, సోషలిస్టు రివల్యూషనరీలూ కొంతమంది పార్టీలోకి చొరబడివుండినారు. కొంతమంది పార్టీ సభ్యులు రాజకీయంగా అస్థిరులు. ట్రాట్స్కీ, బుఖారిన్, తదితర వ్యతిరేకుల నాయకత్వాన పార్టీ వ్యతిరేక బృందాలు తమ కార్య కలాపాలు పునరుద్ధరించినాయి. సోషలిస్టు నిర్మాణ పద్ధతుల సమస్య మీదా, ట్రేడ్‌యూనియన్ల పాత్రమీదా వాళ్లు లెనిన్‌ను, పార్టీ పంథాను వ్యతిరేకించినారు. వాళ్లు పార్టీ క్రమశిక్షణకు భంగం కలిగించినారు, పార్టీని చీల్చడానికీ, బలహీనపరచడానికీ ప్రయత్నించినారు.

లెనిన్ యీ ప్రమాదాన్ని గమనించినాడు. పార్టీ ఐక్యతకు ఆయన నిర్ణయాత్మక ప్రాముఖ్యం యిచ్చినాడు; పార్టీ బలానికి ఐక్యతను ఒక ప్రధాన కారణంగా ఆయన యెంచినాడు. పార్టీలో చీలిక కార్మిక కర్షకుల పొత్తు బద్దలు కావడానికీ, సోవియట్ అధికారం కూలిపోవడానికీ, పెట్టుబడిదారీ వ్యవస్థకు తిరిగిపోవడానికీ విధిగా దారితీస్తుంది, అని లెనిన్ గుర్తుచేసినాడు.

పార్టీలోపల సకల ముఠాల, పార్టీ వ్యతిరేక బృందాల ఉనికినీ కార్యకలాపాలనూ నిషేధించడానికి లెనిన్ పదవ మహాసభలో ఒక తీర్మానం ప్రతిపాదించినాడు. పార్టీ లోపల ఐక్యతను పటిష్ఠపరచడానికి విజ్ఞప్తి చేసే లెనిన్ చిత్తు తీర్మానాన్ని మహాసభ ఆమోదించి, ముఠా కార్యకలాపాలలో పాల్గొన్నందుకు గాను పార్టీ సభ్యు లందరూ, కేంద్ర కమిటీ సభ్యులతో సహా, బహిష్కరణకు గురి ఔతారని ప్రకటించింది. పార్టీ సభ్యత్వ ప్రక్షాళన సాగించాలని 1921లో లెనిన్ ప్రతిపాదించినాడు. పార్టీలో నందుచేసుకొని వున్న పరాయివాళ్లనూ, నిజాయితీ లేని అంశాలనూ, రాజకీయంగా అస్థిరమైన అంశాలనూ, బ్యురాక్రటిక్ అంశాలనూ

యేరివేయడానికి ఆయన పిలుపుయిచ్చినాడు. ప్రక్షాళన ఫలితంగా పార్టీ అంగనిర్మాణం మెరుగై, ఐక్యత బలపడింది.

అదనపు నిధుల స్వాధీనం పద్ధతి స్థానంలో వస్తు రూపపు పన్నును ప్రవేశపెట్టే చట్టాన్ని ఆమోదించిన తర్వాత, యీ నిర్ణయాలు సక్రమంగా అమలుపరచబడేటట్లు చూడడం లెనిన్ నిత్యకృత్యంగా పెట్టుకున్నాడు. వ్యవసాయ ఉత్పత్తిని యెలా అత్యుత్తమంగా యేర్పాటు చేసి, దాని ఉత్పాదకతను పెంచవలసిందీ ఆయన సూచనలు యిచ్చినాడు, వ్యవసాయంలో సోషలిస్టు రంగాన్ని అన్ని విధాలా బలపరిచినాడు, ప్రభుత్వ వ్యవసాయ క్షేత్రాల – లెనిన్ అన్నట్లు, నిజంగా కార్మికవర్గ రూపమైన వ్యవసాయంయొక్క – కార్యకలాపాలను జాగ్రత్తగా అధ్యయనం చేసినాడు, సమష్టి వ్యవసాయ క్షేత్రాలను బలపరిచినాడు, అదే సమయంలో యీ పనిలో మితిమీరిన తొందరపాటును గురించి హెచ్చరించినాడు.

'వస్తు రూపపు పన్ను' అనే పుస్తకంలోనూ, 'అక్టోబర్ విప్లవ నాల్గవ వార్షికం,' 'యిప్పుడు, సోషలిజం సంపూర్ణ విజయం తర్వాతా బంగారు ప్రాముఖ్యం' అనే వ్యాసాలలోనూ లెనిన్ నూతన ఆర్థిక విధానపు అర్థాన్నీ, దాన్ని యెలా అమలుపరచవలసిందీ కార్మికులకూ, కర్షకులకూ సవివరంగా వివరించినాడు. లెనిన్ సూచనలమీద పనిచేస్తూ, పార్టీ జాతీయ ఆర్థిక వ్యవస్థను పునరావాసం చేయడానికీ, ప్రజల పరిస్థితిని మెరుగుపరచడానికీ పూనుకుంది.

లెనిన్ కార్యకలాపాలు శ్రమ యెరగనివి, బహుముఖ్యమైనవి. దొన్‌బాస్ ప్రాంతంలో బొగ్గు పరిశ్రమ గురించీ, బాకూ నూనె పరిశ్రమ గురించీ, యినుము, ఉక్కు పరిశ్రమ గురించీ ఆయన ఆచరణాత్మక సలహాలూ, సూచనలూ యిచ్చినాడు. జాతీయ ఆర్థిక వ్యవస్థకు కూర్స్క్ మాగ్నెటిక్ అనామలీ యెంత ప్రచండమైన ప్రాముఖ్యం గలది అయిందీ ఆయన తరుచు గుర్తుచేసినాడు. మొదటి

ఎలెక్ట్రిక్ పవర్ స్టేషన్లు ఆయన తనిఖీకింద నిర్మింపబడినాయి. ప్రభుత్వ వ్యాపార సంస్థలు లోటులేకుండా పనిచేయడమూ, లాభదాయక సంస్థలుగా చేయడమూ, ప్రోత్సాహక సూత్రాలు ప్రవేశపెట్టడమూ, సరుకుల వాడకంలో పొదుపుకూ, ఉత్పత్తిలో మెరుగుదలకూ బోనస్ బహుమతులు ప్రవేశపెట్టడమూ — యిదంతా పరిశ్రమల పునరావాసానికీ, అభివృద్ధికీ ముఖ్యమని లెనిన్ పరిగణించినాడు. "ట్రస్టులూ, ఫాక్టరీలూ సరిగ్గా అవే స్వయంగా తమ సంస్థలు లోటులేకుండా పనిచేయడానికి బాధ్యత వహించేటట్లు, అంతేకాదు, సంపూర్ణంగా బాధ్యత వహించేటట్లు, స్వావలంబన ప్రాతిపదికమీద నిర్మింపబడినాయని అనుకుంటాను" అని లెనిన్ రాసినాడు.

భౌతిక ప్రోత్సాహ సూత్రానికి లెనిన్ గట్టిగా అనుకూలం. "వ్యక్తిగత లాభం వుంటే తప్ప యే పనీ జరగదు. ప్రోత్సాహాలు సృష్టించడానికి మనం మార్గం కనిపెట్టాలి" అని ఆయన రాసినాడు. అదే సమయంలో, శ్రామిక ప్రజల్లో చైతన్యాన్నీ, బాధ్యతనూ, తమ పనిలో యజమాని ఆసక్తినీ పెంపొందించడం అత్యవసరమని ఆయన అనుకున్నాడు. ప్రభుత్వనిధులు అవకతవక నిర్వహణకూ, దుర్వ్యయానికీ లెనిన్ బద్ధశత్రువు. దుర్వ్యయ నిరోధం కమ్యూనిస్టు సమాజ నియమం. అది యీ లెనిన్ సూత్రంలో వ్యక్తీకరింపబడింది: "యిలాంటి సమయంలో — మరి నిజమైన కమ్యూనిస్టు సమాజానికి యిది యెల్లప్పుడూ వర్తిస్తుంది — ధాన్యమూ, ఇంధనమూ ప్రతి పూడు* నిజంగా పవిత్రమైనది."

జాతీయ ఆర్థిక వ్యవస్థకు బలమైన, కేంద్రీకృత, ప్రణాళికాబద్ధ నిర్వహణను సాధించాలనీ, అదే సమయంలో స్థానిక చొరవకూ,

---

* పూడు — పూర్వకాలపు రష్యన్ తూనికమానము (36 పౌన్లు). — సం.

స్వావలంబనకూ స్వేచ్ఛ యివ్వాలనీ పార్టీ, సోవియట్ ప్రభుత్వమూ లక్షించినాయి. ప్రభుత్వ ప్రణాళికా కమిషన్ కార్యకలాపాలను గురించి లెనిన్‌కు యెంత ప్రగాఢమైన అవగాహన వుండిందీ, ప్రణాళికా రచన వాస్తవ జీవితంతో ముడిబెట్టబడాలనీ, శాస్త్రవిజ్ఞానంచేతా జనాల ఆచరణగత అనుభవంచేతా నడిపించబడాలనీ ఆయన యెంత గట్టిగా డిమాండు చేసిందీ ఆ కమిషన్‌కు అప్పుడు అధ్యక్షుడుగా వుండిన జి. యం. క్రిజినోవ్‌స్కికి ఆయన రాసిన ఉత్తరాలు తెలుపుతాయి.

లెనిన్ తీరిక లేని మనిషి అయినప్పటికీ, శాస్త్రవిజ్ఞాన, సాంకేతిక శాస్త్రాల అభివృద్ధిలో వచ్చే ఆశాజనకమైన అవకాశాలన్నిటినీ సన్నిహితంగా గమనిస్తూ వుండినాడు. దొన్‌బాస్‌లో బొగ్గు పగలగొట్టే యంత్రాలను ఉపయోగించడంలోనూ, హైడ్రాలిక్ పద్ధతిద్వారా యెర్ర బొగ్గును వెలికి తీయడంలోనూ ఆయన ఉత్సాహపూరితమైన ఆసక్తి కనబరిచినాడు. శాస్త్రీయ సృజనలలో ఆయనకు యెంత గాఢమైన ఆసక్తి వుండిందీ, అలాంటివి సృష్టించేవాళ్లకు ఆయన యెలాంటి అండదండలూ, ప్రోత్సాహమూ యిచ్చిందీ తెలియజేసే పత్రాలు మనకు అందినాయి.

వ్యాపార నిర్వహణకూ, రాజ్య యంత్రం పనికీ సంబంధించిన సమస్యలకు లెనిన్ గణనీయమైన శ్రద్ధ అర్పించినాడు. బ్యూరాక్రసీకీ, రెడ్ టేప్‌కూ, అసమర్థతకూ ఆయన శత్రువు. వివిధ కేంద్ర సంస్థలలోని రెడ్ టేప్ సందర్భాలమీద వ్యాఖ్యానిస్తూ లెనిన్ యిలా రాసినాడు: "సోవియట్ పరిపాలనా యంత్రాంగం సకాలంలో, సమర్థవంతంగా, వేగంగా పనిచేయాలి."

సోవియట్ శాసనాలు తయారు చేయడంలో ఆయన క్రియాత్మక పాత్ర వహించి, విప్లవ చట్టబద్ధతను పాటించాలని గట్టిగా పట్టుబట్టినాడు. తొందరపాటుగా, సమయం రాకముందే ఆఫీసు పని విధానం పునర్నిర్మాణం చేసే ధోరణిని ఆయన నిశితంగా విమర్శించినాడు: "ఆఫీసు పని విధానం పునర్నిర్మాణా లంటే నాకు చావుభయం" అని ఆయన

1922 జనవరిలో రాసినాడు. చట్టం చేయబడేముందు ప్రతి ముఖ్యమైన చర్యా మొదట ఆచరణలో పరీక్షింపబడాలని ఆయన సలహా యిచ్చినాడు. శాసననిర్మాణం చేయవలసింది "యెంతో జాగరూకతతో. చూసి అడుగు వేయ్యాలి!" అని ఆయన అన్నాడు.

పరిపాలనా సిబ్బందినీ, పార్టీ కార్యకర్తలనూ లెనిన్‌కంటె బాగా యెవరూ యెరగరు. వాళ్లలో అన్నిటికంటె యెక్కువగా ఆయన మెచ్చుకున్నది యేమిటంటే, కమ్యూనిజంపట్ల భక్తీ, తన పనిని గురించిన పరిజ్ఞానమూ, పార్టీ పంథాను అమలుపరచడంలో దృఢత్వమూ, వీటికితోడు పట్టువిడుపులూ, మనుషులపట్ల సమయోచితమైన, దయాపూర్వకమైన వైఖరీ.

అప్పుడప్పుడు పార్టీ కార్యకర్తలను వ్యాపారపు పనులకు మార్చడం ఉపయోగకరమని లెనిన్ భావించి, "కేంద్ర కమిటీ యంత్రాంగాన్ని పటిష్ఠపరచాలి, దానికి స్థానిక ప్రాంతాలతో మరింత సన్నిహిత సంబంధం కలిగించాలి" అని గుర్తుచేసినాడు. "కేంద్ర కమిటీచేత నియమింపబడిన వ్యాపార అధిపతులు స్థానిక ప్రాంతాలను దారిలో పెట్టి, వాటి పనిని తనిఖీచేసి, వాటికి సూచన లివ్వాలి" అని ఆయన ఉద్బోధించినాడు. సిబ్బందితో వ్యవహరించడంలోనూ, వాళ్లకు శిక్షణ యిచ్చే విషయంలోనూ యీ లెనిన్ సూత్రాలచేత పార్టీ నడిపించబడింది.

పరిపాలనపట్ల ఉబలాటాన్నీ, పెత్తనందారీ ధోరణినీ, తనకింది ఉద్యోగులపట్ల కరకుదనాన్నీ లెనిన్ నిశితంగా విమర్శించినాడు. ఒక సందర్భంలో, 1919 మార్చిలో, దేశీయ వ్యవహారాల ప్రజా కమిస్సారియట్ బోర్డు సభ్యుడైన ఎ. జి. ప్రావ్‌దిన్ కరకుగా వ్యవహరిస్తూన్నట్లు లెనిన్ ఫిర్యాదులు విని, అతనికి "మూర్ఖపు పెత్తనందారీ ధోరణి" వున్నందున అతన్ని తీవ్రంగా శిక్షించి, అతని కార్యకలాపాలను అదుపులో పెట్టాలని ప్రజా కమిస్సార్ అయిన జి. ఐ. పెత్రోవ్‌స్కియ్‌తో చెప్పినాడు.

మనుషులను అంచనావేయడంలో శ్రామిక ప్రజల అభిప్రాయా లకు చెవి వొగ్గాలని లెనిన్ సలహా యిచ్చినాడు. "శ్రామిక ప్రజలకు అతీంద్రియ దృష్టిలాంటిది వుంది. దానిద్వారా వాళ్లు నిజాయితీ, కర్తవ్య నిష్ఠగల కమ్యూనిస్టులను తమ నుదుటి చెమట చేత పొట్టపోసు కుంటూ, యే అధిక హక్కులూ, యే పలుకుబడీ లేనివాళ్ల అసహ్యానికి గురి అయ్యే కమ్యూనిస్టులనుండి వేరుచేసి చూడగలరు" అని ఆయన రాసినాడు.

లెనిన్‌కు వుండిన పని భారమూ, 1918లో ఆయనకు తగిలిన గాయపు ఫలితాలూ (ఒక గుండు యింకా ఆయన దేహంలో యిరుక్కొని వుండింది) కలిసి ఆయన ఆరోగ్యాన్ని క్రుంగదీసినాయి. 1921 చలి కాలంనుండి, డాక్టర్ల ఒత్తిడిచేత, ఆయన విశ్రాంతి కొరకూ, చికిత్స కొరకూ తరుచుగా తన పనికి విరామం యివ్వవలసి వచ్చింది. 1922లో ఆయన ఆరోగ్యం తీవ్రంగా వెనుక ముఖం పట్టింది. అనారోగ్యంగా వున్నప్పటికీ ఆయన తన ప్రభుత్వ విధులను రోజూ చూసుకుంటూనే వుండినాడు.

1922 మార్చిలో ఆయన పదకొండవ పార్టీ మహాసభలో ఉపన్యసించినాడు. కేంద్ర కమిటీ తరఫున యిచ్చిన రాజకీయ రిపోర్టులో ఆయన నూతన ఆర్థిక విధానపు మొదటి సంవత్సరాన్ని సమీక్షించినాడు. జాతీయ ఆర్థిక వ్యవస్థయొక్క అన్ని రంగాలలో పురోగతి సాధింపబడిందనీ, కార్మికవర్గానికీ రైతాంగానికీ మధ్య పొత్తు మరింత బలపడిందనీ ఆయన తృప్తితో గుర్తించినాడు. అదే సమయంలో ఆయన లోపాలను విమర్శించి, ప్రభుత్వ, పార్టీ, వ్యాపార సంస్థల పనిని మెరుగుపరచడానికి బోల్షెవిక్ విమర్శ, ఆత్మవిమర్శలకు ఆదర్శం నెలకొల్పినాడు. తిరోగమనం ముగిసిందనీ, పెట్టుబడిదారీ అంశాలమీద దాడి యేర్పాటుచేయడం యిప్పుడు అవసరమనీ లెనిన్ ప్రకటించినాడు. నూతన జీవితాన్ని నిర్మించడంలో పార్టీ పాత్రమీద వ్యాఖ్యానిస్తూ, అక్టోబర్ సోషలిస్టు విప్లవ లాభాలను

ప్రపంచంలో యే శక్తీ తొలగించ లేదనీ, యెందుకంటే అవి యిప్పుడు ప్రపంచ చరిత్రలో భాగమైనాయనీ లెనిన్ జోస్యంలాంటి మాటలు ఉచ్చరించినాడు. లెనిన్ ఉపన్యసించిన చివరి పార్టీ మహాసభ యిది.

వేసవి గడపడానికి లెనిన్ మాస్కో వెలుపల వున్న గోర్కికి మారినాడు. మే ఆఖరులో ఆయనకు జబ్బు తీవ్రంగా తిరగబెట్టింది. జూలై మధ్యలో ఆయన ఆరోగ్యం కాస్త మెరుగు కావడంతో ఆయన తన పదవికి సంబంధించిన ఉత్తరప్రత్యుత్తరాలు మళ్లీ ప్రారంభించి, తనకు పుస్తకాలు పంపాలని డిమాండుచేసినాడు. ఆ దశలో ఆయన చదివిన సాహిత్యం – వివిధ భాషల్లో 32 భిన్న వార్తా పత్రికలూ, 137 పత్రికలూ, అనేక పుస్తకాలూ – గోర్కిలోని మ్యూజియంలో భద్రపరచబడింది.

దేశమంతటినుండి కార్మికులూ, కర్షకులూ లెనిన్‌కు ఆదుర్దాతో కూడిన అభినందన సందేశాలు పంపినారు; వాటిలో వాళ్లు తమ నాయకునిపట్ల ప్రేమను వ్యక్తం చేసి, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించినారు. "వ్లదీమిర్ ఇల్యీచ్‌కి మూడు నెలలు సెలవు యివ్వాలనీ, డాక్టర్ల ఉత్తరువులు పాటించి, శ్రామిక ప్రజల కొరకు మళ్లీ బలం పొందాలని వెంటనే ఆయన్ను కోరాలనీ," మాస్కోలోని ప్రథమ 'గొజ్నాక్' అనే ఫాక్టరీ కార్మికులు తీర్మానం చేసినారు.

తమ్‌బోవ్ జిల్లా రైతులు యిలా రాసినారు: "మా అత్యంత ప్రియతమమైన గురూ, కామ్రేడ్, జిల్లా మహాసభ ప్రతినిధులమైన మేము, 15,000 రైతుల తరఫున, మీరు త్వరగా, పూర్ణంగా కోలుకోవాలని మా శుభాకాంక్షలు పంపుతున్నాము. మళ్లీ మా సంక్షేమానికి ఉత్తరువులమీద మీరు యెప్పుడు సంతకాలు చేసేదీ మా సోదర గ్రామస్థులు తెలుసుకోవాలని అంటున్నారు.... మీరు తొందరపడి లేవకూడదని ప్రార్థిస్తూ, మీకు మంచి విశ్రాంతీ, పరిపూర్ణ ఆరోగ్యమూ ఆకాంక్షిస్తున్నాము."

అక్టోబర్‌లో లెనిన్ మళ్లీ పనిలో ప్రవేశించినాడు. ఆయన ప్రజా కమిస్సార్ల కౌన్సిల్‌కు అధ్యక్షత వహించినాడు, పార్టీ కేంద్ర కమిటీ పనిలో పాల్గొన్నాడు, ఉపన్యాసాలు యిచ్చినాడు.

1922 నవంబర్ 13న, కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ యొక్క నాల్గవ మహాసభలో, లెనిన్ 'అయిదేండ్ల రష్యన్ విప్లవమూ, ప్రపంచ విప్లవ అవకాశాలూ' అనే పేరు గల నివేదిక యిచ్చినాడు. నూతన ఆర్థిక విధానం ప్రాతిపదికమీద సోవియట్ అధికారం యేమి సాధించిందీ లెనిన్ ప్రతినిధులకు చెప్పినాడు. కమ్యూనిస్టు పార్టీ విధానం మూలంగానూ, కార్మికుల వీరోచిత శ్రమ మూలంగానూ సోవియట్ రిపబ్లిక్ సాధారణ ఆర్థిక పురోగతిని సాధించడంలో కృతార్థత పొందిందని ఆయన చెప్పినాడు. ఫైనాన్షల్ వ్యవస్థ బలపడింది, వర్తకం సువ్యవస్థితం చేయబడింది, రైతు వ్యవసాయం పురోగతిని సాధించింది, లఘు పరిశ్రమల పునరావాసంవైపు ఒక అడుగు వేయబడింది, భారీ పరిశ్రమల స్థితిలో కొంత మెరుగుదల కనపడుతున్నది, కార్మికుల స్థితిగతులు మెరుగైనాయి, సంస్కృతీ రంగంలో కూడా పురోగతి జరిగింది. యీ విజయాలు కమ్యూనిస్టు పార్టీయొక్కా, సోవియట్ ప్రభుత్వంయొక్కా సరైన విధానాల ఫలితమని లెనిన్ చూపించినాడు.

బోల్షెవిక్ పార్టీ అనుభవాన్నీ, రష్యన్ విప్లవ గుణపాఠాలనూ ఛాందసంగా కాక, సృజనాత్మక తత్వంలో జీర్ణం చేసుకోవాలని ప్రతినిధులకు తెలుపుతూ ఆయన తన ఉపన్యాసం ముగించినాడు.

1922 నవంబర్ 20న లెనిన్ మాస్కో సోవియట్ విస్తృత సమావేశంలో ఉపన్యాసం యిచ్చినాడు; అందులో ఆయన వైట్ గార్డులూ, జోక్యందారులూ ఓడిపోయిన తర్వాత దేశంలోని సన్నివేశాన్ని సమీక్షించి, ప్రజలను యెదుర్కొనే కర్తవ్యాలను చిత్రించి, వాటిని యెదుర్కోడానికి మార్గాలూ, సాధనాలూ సూచించి, జాతీయ ఆర్థిక వ్యవస్థను నడపడంలో పొదుపూ, సక్రమ నిర్వహణల అవసరాన్ని

ఉద్బోధించినాడు. సోషలిస్టు సమాజాన్ని నిర్మించడంలో పార్టీ పాత్రను ఆయన ప్రత్యేకంగా నొక్కిచెప్పినాడు. "నూతన ఆర్థిక విధానపు రష్యా సోషలిస్టు రష్యా ఔతుంది" అనే ప్రగాఢ విశ్వాసాన్ని ఆయన వ్యక్తంచేసినాడు. అది లెనిన్ చేసిన కడపటి ప్రసంగం.

జాతులమధ్య మైత్రీ బంధనాలను పటిష్ఠపరచడానికి ఆయన చాలా శ్రద్ధ అర్పించినాడు. దోపిడీదార్లకు యెంతో అనుకూలంగా వుండిన జాతీయ పీడనతోనూ, అసమానత్వంతోనూ ఆయన యెల్లప్పుడూ పోరాడినాడు. అక్టోబర్ విప్లవ విజయం తర్వాత జాతీయ రిపబ్లిక్కుల అభివృద్ధిపట్ల లెనిన్ నిరంతరం ఆదుర్దా కనబరిచినాడు; యెందు కంటే, ఆయన జాతుల మైత్రిని సోవియట్ రాజ్య బలం ఆధార పడిన పునాదిగా పరిగణించినాడు. వివిధ సోవియట్ రిపబ్లిక్కులు ఏకైక యూనియన్ రాజ్యంగా ఐక్యం కావాలని ఆయన ప్రతిపాదించినాడు. పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులకు 'యు.యస్.యస్.ఆర్ స్థాపనం మీద'నూ, 'జాతుల సమస్య, లేక "స్వపరిపాలనీకరణ" సమస్య'ను గురించీ ఉత్తరాలు రాసినాడు; వాటిలో ఆయన రిపబ్లిక్కుల ఏకీకరణకు మౌలిక సూత్రాలను ప్రవచించినాడు; అవి యేవంటే సమాన హక్కులు అను భవిస్తూ, కార్మికవర్గ అంతర్జాతీయతా సూత్రాలమీద ఆధారపడిన స్వతంత్ర జాతుల ఐచ్ఛిక సమాఖ్య అయిన సోవియట్ సోషలిస్టు రిప బ్లిక్కుల సమాఖ్యను సృష్టించడం. యిది జాతులమధ్య మైత్రిమీద ఆధారపడిన, అపూర్వమైన, కొత్త రకం బహుజాతీయ రాజ్యం.

సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్కుల సమాఖ్య స్థాపనమీద సోవి యట్ల మొదటి అఖిల యూనియన్ మహాసభ (1922 డిసెంబర్) తీర్మానం చేసింది. లెనిన్ అప్పుడు జబ్బుగా వుండి, మహాసభకు హాజరు కాలేదు. కానీ సమస్త మహాసభ పనీ, సోవియట్ యూనియన్ స్థాపనకు సంబంధించిన ప్రకటనా, యూనియన్ సంధీ ఆయన అభిప్రాయాల మీద ఆధారపడి, జాతుల సమానత్వ, సోదర సహకార భావంచేత

ఉత్తేజితమై వుండినాయి. సోవియట్ యూనియన్ ప్రజా కమిస్సార్ల కౌన్సిల్ అధ్యక్షుడుగా లెనిన్ యెన్నుకోబడినాడు.

1922 డిసెంబర్‌లో లెనిన్‌కు మళ్లీ జబ్బు తిరగబెట్టింది, కానీ జనవరి, ఫిబ్రవరిలలో ఆయన కొద్దిగా కోలుకున్నాడు. యీ దశలో ఆయన యీ ప్రసిద్ధ వ్యాసాలు, ఆయన చివరి వ్యాసాలు, నోటితో చెప్పినాడు: 'మహాసభకు ఉత్తరం,' 'డైరీనుండి కొన్ని పుటలు,' 'సహకారంమీద,' 'మన విప్లవం గురించి,' 'కార్మిక కర్షకుల తనిఖీని మనం యెలా పునర్నిర్మించాలి,' 'తక్కువే మేలు, కానీ మేలుగా వుండాలి.'

ఆయన అజేయమైన సంకల్పమూ, బాధ్యతా పరిజ్ఞానమూ, తన దేశ భవిష్యత్తుపట్లా, దాని యెడతెగని పురోగతిపట్లా ఆయన శ్రద్ధా లెనిన్‌కు తన అనారోగ్యం కలిగించిన బాధతో పోరాడడానికీ, మానవ సహనశక్తికి అసాధ్యంగా కనపడే పనులు సాధించడానికీ శక్తి నిచ్చినాయి. తీవ్రంగా జబ్బు పడినప్పటికీ ఆయన ఆరు వారాల స్వల్ప కాలంలో కొన్ని అసాధారణ రచనలు చేసినాడు.

లెనిన్ చివరి ఉత్తరాల, వ్యాసాల ప్రాముఖ్యం గణనాతీతమైనది. పరస్పరం దగ్గర సంబంధం గల అవి సారభూతంగా ఒక సమగ్ర రచన; అందులో ఆయన తన గత రచనల్లోనూ, ఉపన్యాసాల్లోనూ వున్న నిర్ణయాలనూ, ప్రతిపాదనలనూ అభివృద్ధిచేసి, సోవియట్ యూనియన్‌లో సోషలిజం నిర్మాణ మహా పథకానికి తన విస్తరణను పూర్తి చేసి, ప్రపంచ విమోచనోద్యమ సాధారణ అవకాశాల దృష్ట్యా రష్యా సోషలిస్టు పరివర్తనకు ఒక కార్యక్రమాన్ని రూపొందించినాడు.

సోషలిజం నిర్మించడానికి అవసరమైనవన్నీ రష్యాకు వుండినాయని లెనిన్ భావించినాడు. పరిశ్రమలను, ముఖ్యంగా భారీ పరిశ్రమలను, పునరావాసం చేసి, అభివృద్ధి చేయడమూ, ఆర్థిక, సాంకేతిక వెనుకబాటుతనాన్ని అంతమొందించడమూ, ప్రపంచ అగ్ర దేశాలలో ప్రథమ శ్రేణికి పురోగమించడమూ ప్రధాన కర్తవ్యమని ఆయన గుర్తుచేసినాడు.

యిది సాధించడానికి పెద్ద పరిశ్రమలు అభివృద్ధి చేయడమూ, యావత్తు దేశాన్నీ పారిశ్రామీకరించి, విద్యుదీకరించడమూ, ఉత్పాదక శక్తులను పెంచడమూ అవసరం.

సోషలిజం నిర్మించడానికి కార్మికవర్గానికీ, రైతాంగానికీ మధ్య పొత్తును పటిష్ఠపరచడం అవసరమని లెనిన్ భావించినాడు. కార్మికవర్గం రైతులకు నాయకత్వం వహించి, సోషలిజంను నిర్మించే పనిలోకి వాళ్లను ఆకర్షించి, వాళ్ల చిన్న, చెల్లాచెదరు, వ్యక్తిగత పొలాలను పెద్ద, యాంత్రీకృత, సమష్టి క్షేత్రాలుగా పునర్నిర్మించడానికి వాళ్లకు తోడ్పడ వలసి వుంది. రైతులను సోషలిస్టు నిర్మాణంలోకి ఆకర్షించడానికి ఏకైక మార్గం సహకార సంఘాలద్వారా. సహకార సంఘాలలో రైతుల వ్యక్తిగత ప్రయోజనం రాజ్యంయొక్కా, మొత్తం సమాజంయొక్కా సమష్టి ప్రయోజనాలతో లంకెవేయబడగలదు. రైతుల సహకార సంఘాలకు ట్రాక్టర్లూ, యితర వ్యవసాయ యంత్రాలూ సరఫరా చేయడంద్వారా సోవియట్ రాజ్యం వాళ్లకు సాయం చేయవలసి వుంది. గ్రామీణ ప్రాంతానికి మనం ఒక లక్ష మేలురకం ట్రాక్టర్లూ, వాటికి డ్రైవర్లనూ యివ్వగలిగితే, రైతులు కమ్యూనిజంను కోరు కుంటారు, అని 1919లోనే, యెనిమిదవ పార్టీ మహాసభకు యిచ్చిన నివేదికలో లెనిన్ చెప్పినాడు.

లెనిన్ దృష్టిలో సోషలిజం నిర్మాణం సాంస్కృతిక విప్ల వంతో ముడివడి వుంది. యిది అత్యున్నత ప్రాముఖ్యం గల కర్తవ్యం. విద్యకు యెంత మొత్తమైనా పెట్టడానికి సంకోచించకూడదని ఆయన అన్నాడు. వేగంగా నిరక్షరాస్యతను అంతమొందించడమూ, ప్రాథమిక, సెకండరీ, ప్రత్యేక, ఉన్నత పాఠశాలల సమాహారాన్ని విస్తృతపరచడమూ, శాస్త్రవిజ్ఞాన శాఖ లన్నిటినీ అభివృద్ధి చేయడమూ, ప్రజలలోనుండి మేధావివర్గాన్ని నిర్మించడమూ అనే కర్తవ్యాన్ని ఆయన పార్టీముందు వుంచినాడు.

సోషలిజం నిర్మాణానికి కార్మికవర్గ రాజ్యం ప్రధాన పరికరం అని లెనిన్ బోధించినాడు. సోవియట్ అధికారం పాత రాజ్య యంత్రాంగాన్ని ధ్వంసంచేసి, కొత్త సోవియట్ యంత్రాంగాన్ని సృష్టించి, తన పనిలోకి శ్రామిక జనాలను ఆకర్షించుకుంది. యిది ప్రచండమైన, చరిత్రాత్మకమైన విజయం. కానీ మొదట యీ యంత్రాంగంలో కొన్ని భాగాలు అధ్వాన్నంగా పనిచేసినాయి. బాల సోవియట్ ఉద్యోగులకు పరిపాలనలో యింకా తగినంత అనుభవం లేదు.

రాజ్యాన్ని నడిపించడమూ, నిర్వహణ సంవిధానాన్ని వశపరుచుకోవడమూ లెనిన్ పట్టుదలగా జనాలకు నేర్పినాడు. బ్యూరాక్రసీ, శ్రామిక ప్రజల అవసరాలపట్లా, ప్రయోజనాలపట్లా ముష్కరత్వమూ, పనిపట్ల లాంఛన వైఖరీ — వీటితో లెనిన్ గట్టిగా పోరాడినాడు. ఆయన సొంత జీవితం క్రమశిక్షణకూ, సామర్థ్యానికీ ఉదాహరణ. ఆయన అధ్యక్షత వహించిన ప్రజా కమిస్సార్ల కౌన్సిల్ సమావేశాలు యెప్పుడూ వ్యవహార సరళి కచ్చితత్వంతో నిర్వహింపబడేవి. వాటికి లెనిన్ ఒక్క నిముషం కూడా ఆలస్యం చేసేవాడు కాదు. వక్తలకు మూడునుండి అయిదు నిముషాల కంటె యెక్కువ కాలం యివ్వబడేది కాదు. వక్తలు కచ్చితమైన, సరి చూడబడిన వాస్తవాలూ, అంకెలూ యివ్వాలనీ, స్పష్టమైన ప్రతిపాదనలు చేయాలనీ లెనిన్ డిమాండుచేసేవాడు. వట్టి మాటల మూటలూ, అస్పష్ట ప్రకటనలూ, అనిశ్చిత, దోషభూయిష్ఠ సమాచారమూ అంటే ఆయనకు అసహ్యం. స్థానిక ప్రతినిధుల ఉపన్యాసాలనూ, సాధారణ ఉద్యోగుల అభిప్రాయాలను ఆయన శ్రద్ధగా వినేవాడు. కమిషన్ పనికి కొత్తవాళ్లను నియమించడానికి ఆయన యెప్పుడూ సిద్ధంగా వుండి, వాళ్లకు ప్రత్యేక పనులు అప్పగించేవాడు.

సమష్టి కృషికి ఆయన యెంతో విలువ యిచ్చి, దాన్ని ప్రోత్సహించినాడు. పార్టీ కేంద్ర కమిటీలో గానీ, ప్రజా కమిస్సార్ల కౌన్సిల్‌లో గానీ చర్చించకుండా, ముఖ్యమైన సమస్యలమీద నిర్ణయాలు చేయడం ఆయన

తప్పుగా భావించినాడు. సమస్యలను సర్వతోముఖంగా చర్చించి, సమష్టిగా పరిష్కరించడం ఆయన అభిమతం. సమష్టితత్వాన్ని పార్టీ నాయకత్వానికీ, రాజ్య నాయకత్వానికీ ముఖ్య సూత్రంగా ఆయన భావించినాడు.

యీ సూత్రం లెనిన్ కాలంలో యెన్నడూ ఉల్లంఘించబడ లేదు. అంతర్యుద్ధ కాలంలో, మహాసభలు జరపడం అత్యంత కష్టంగా వుండినప్పుడు కూడా అవి క్రమంగా ప్రతి సంవత్సరమూ జరిగినాయి: 1918లో యేడవ మహాసభ, 1919లో యెనిమిదవ మహాసభ, 1920లో తొమ్మిదవ మహాసభ, 1921లో పదవ మహాసభ, 1922లో పదకొండవ మహాసభ. అనారోగ్య కారణంగా 1923లో పన్నెండవ మహాసభకు లెనిన్ హాజరు కాలేదు, కానీ దాని కార్యక్రమాలు ఆయన సూచనలచేత నడిపించబడినాయి.

అదే సమయంలో, వ్యక్తికి తన పనిపట్ల గల వ్యక్తిగత బాధ్యత సమష్టి నాయకత్వంద్వారా తొలగిపోదని లెనిన్ స్పష్టపరిచినాడు. ప్రభుత్వ, పార్టీ కార్యనిర్వాహకులనుండి ఆయన చొరవనూ, ఉన్నత వ్యక్తిగత బాధ్యతా పరిజ్ఞానాన్నీ, సకల ప్రభుత్వ శాసనాల, నిబంధనల అమలును కచ్చితంగా సరిచూసుకోవాలనీ, ఆయన మాటల్లో, విషయాలు ఆచరణలో యెలా పనిచేసేది తనిఖీచేయాలనీ డిమాండుచేసినాడు. ఆయన కమ్యూనిస్టులకు మరీ ఉన్నతమైన ప్రమాణం పెట్టినాడు. "మీరు బోల్షెవిక్ పార్టీ ప్రతినిధులు" అని ఆయన పదేపదే గుర్తుచేసేవాడు. "మీ ప్రవర్తననుబట్టి ప్రజలు పార్టీని విలువకడతారు. అందువలన ప్రతి చోటా, ప్రతిదాంట్లోనూ ఆదర్శప్రాయంగా వుండవలసిన బాధ్యత వుంది మీమీద." పార్టీ సభ్యులకు యితరులను మించిన అగ్రతాంబూలాలూ, అధిక హక్కులూ లేవనీ, యితరులకంటె యెక్కువ బాధ్యతలు మాత్రం వున్నాయనీ ఆయన నొక్కిచెప్పినాడు.

సోవియట్ సంస్థల పనిలోని లోపాలను బట్టబయలు చేయడంలో సల్లుబాటు లేని లెనిన్ గతకాలపు అవశేషాలను నిర్మూలించాలనీ, రాజ్య

యంత్రాంగంనుండి ఆడంబర ఖర్చును మట్టు లేకుండా తుడిచి వేయాలనీ డిమాండుచేసినాడు. రాజ్య యంత్రాంగాన్ని సరళం చేయడమూ, సిబ్బందినీ, ఖర్చులనూ కనీస స్థితికి కత్తరించడమూ ఆయన అభిమతం. పనిపట్లా, తమ విధులపట్లా నూతన, సోషలిస్టు వైఖరిని అలవరుచుకోవాలనీ, సోవియట్ శాసనాలను కచ్చితంగా పాటించాలనీ ఆయన ప్రజలకు బోధించినాడు. ఆయన లంచగొండితనానికి వ్యతిరేకంగా పోరాడినాడు; దానిని జారిజంనుండి వచ్చిన పాపిష్ఠి వారసత్వం అని ఆయన అన్నాడు. లంచగొండితనానికి కఠినమైన శిక్ష విధించే శాసనం తయారు చేయమని 1918 మేలో ఆయన న్యాయశాఖ ప్రజా కమిస్సార్ అయిన డి. ఐ. కూర్‌స్కీని కోరినాడు.

పార్టీ ఉద్యోగులనుండీ, ప్రభుత్వ ఉద్యోగులనుండీ ఆయన యే క్రమశిక్షణను కోరినాడో దానికి ఆయన స్వయంగా ఆదర్శంగా వుండినాడు. పార్టీ నిర్ణయం ఆయనకు శాసనం; అదే వైఖరిని యితరుల నుండి ఆయన డిమాండుచేసినాడు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించే వ్యక్తి పార్టీ శత్రువులకు తోడ్పడుతున్నాడని ఆయన అనేవాడు.

సోవియట్ శాసనాలూ, సోషలిస్టు సమాజ జీవిత నియమాలూ ప్రతి వొకరికీ విధాయకమని లెనిన్ అన్నాడు. యీ విషయంలో ఆయన యెవరికీ యే మినహాయింపూ యివ్వలేదు. లెనిన్ జీతాన్ని అనధికారికంగా పెంచినందుకు 1918 మేలో ఆయన ప్రజా కమిస్సార్ల కౌన్సిల్ ఆఫీసు మేనేజర్‌ను తీవ్రంగా మందలించినాడు.

ఒకసారి లెనిన్‌కు రుమ్యాంత్సెవ్ గ్రంథాలయం (యిప్పుడు లెనిన్ గ్రంథాలయం)నుండి కొన్ని పుస్తకాలు కావలసివచ్చి, వాటిని తన యింటికి పంపమని కోరుతూ, అది నియమాలకు విరుద్ధమైతే, వాటిని ఒక రాత్రికి, అనగా గ్రంథాలయం మూతపడినప్పుడు, మాత్రం వుంచుకొని, ఉదయం వాపసు యిస్తానని ఆయన తెలిపినాడు.

నమ్రత, సరళత్వం, సహచరాభిమానం లాంటి ప్రశంసనీయమైన గుణాలు వుండినాయి లెనిన్‌కు. తనను గురించిన పొగడ్తలూ, స్తోత్ర పాఠాలూ ఆయన భరించేవాడు కాదు. ఆయన యాబయ్యవ జన్మదినం జరపాలని మాస్కో కమ్యూనిస్టులు నిర్ణయించినారు. దానిపట్ల ఆయన ప్రవర్తన ఎలా వుంది? కొంతమంది ఉపన్యాసాలు విన్న తర్వాత, ఆ ప్రశంసలు యిక వినడానికి ఆయన నిరాకరించినాడు. తరువాత తన ఉపన్యాసంలో ఆయన అహంభావ ప్రమాదాన్ని గురించి కమ్యూనిస్టులను హెచ్చరించి, మిగిలివున్న సమస్యలమీద తన దృష్టిని సాంద్రీకరించమని పార్టీని ఉద్బోధించినాడు.

సోషలిజం శత్రువులతో లెనిన్ రాజీపడేవాడు కాదు. పార్టీ క్రమశిక్షణనూ, ప్రభుత్వ క్రమశిక్షణనూ నిర్లక్ష్యం చేసినవాళ్లపట్లా, అజాగ్రత్తగా పనిచేసినవాళ్లపట్లా ఆయన చాలా కఠినంగా, నిర్దాక్షిణ్యంగా వుండేవాడు. అవసరమైతే అదే పనిని పదిసార్లు చేయాలి, కానీ యెట్టి పరిస్థితులలోనూ ఆ పని పూర్తి చేయాలి, అని ఆయన అనేవాడు.

శ్రామిక ప్రజల ఉత్తరాలకూ, ఫిర్యాదులకూ ఆయన చాలా శ్రద్ధ అర్పించి, సోవియట్ యంత్రాంగపు సిబ్బందికి అలాగే చేయాలని బోధించినాడు. ప్రజా కమిస్సార్ల కౌన్సిల్‌కు లిఖిత రూపంలో వచ్చిన ఫిర్యాదులమీద యిరవై నాలుగు గంటలలోనూ, వాగ్రూపంలో వచ్చిన వాటిమీద నలభై యెనిమిది గంటలలోనూ నివేదికలు రావాలని ఆయన డిమాండు చేసినాడు. అలాంటి ఫిర్యాదుల సందర్భంగా తీసుకున్న నిర్ణయాల పరిపూర్తిమీద కఠినమైన తనిఖీ వుండాలని ఆయన డిమాండు చేసినాడు.

తన చివరి వ్యాసాల్లో ఆయన శాంతియుత వైదేశిక విధానాన్ని అనుసరించవలసిన అవసరం గురించీ, శాంతి కొరకూ, పెట్టుబడిదారీ దేశాలతో వర్తక సంబంధాలు నెలకొల్పుకోవడం కొరకూ, సోషలిస్టు, పెట్టుబడిదారీ వ్యవస్థల మధ్య ఆర్థిక పోటీ కొరకూ పోరాడవలసిన

అవసరం గురించీ మళ్లీ మళ్లీ రాసినాడు. అదే సమయంలో ఆయన నిత్య జాగరూకత వహించాలనీ, దేశ రక్షణ బలాలను పటిష్ఠపరుచు కోవాలనీ, యెర్ర సైన్యాన్ని కనుపాపలా కాపాడాలనీ ఉద్బోధించినాడు. సోషలిజం యితరవాటికంటె ప్రగతిశీలమైన వ్యవస్థ గనుక, చివరకు అన్ని దేశాలలోనూ జయిస్తుందని ఆయన దృఢంగా నమ్మినాడు.

లెనిన్ చివరి రచనల్లో ఒకటి 'మహాసభకు ఉత్తరం.' యీ ఉత్తరం 1924 మేలో పదమూడవ పార్టీ మహాసభ ప్రతినిధి వర్గాలకు చదివి వినిపించబడింది. దానిలో పార్టీ ఐక్యతను నిలుపుకోవలసిన అవసరాన్ని లెనిన్ మళ్లీ నొక్కిచెప్పినాడు. దృఢబంధితమైన, స్థిరమైన కేంద్ర కమిటీ పార్టీ ఐక్యతకు ముఖ్యమైన షరతుగా ఆయన పరిగణించినాడు. 'మహాసభకు ఉత్తరం'లో ఆయన కేంద్ర కమిటీ సభ్యుల సంఖ్యను వందవరకు కాకపోయినా, కొన్ని యిరవైల వరకు పెంచాలని ప్రతిపాదించినాడు. సమష్టి సంస్థగా కేంద్ర కమిటీ ప్రతిష్ఠనూ, అధికారాన్నీ పెంచడానికీ, "కేంద్ర కమిటీలోని చిన్న బృందాల మధ్య ఘర్షణలు పార్టీ భవిష్యత్తుకు మితిమీరిన ప్రాముఖ్యం వహించకుండా నివారించడానికీ" యీ చర్య అవసరమని లెనిన్ రాసినాడు.

కేంద్ర కమిటీని పటిష్ఠపరచడమూ, దాని సభ్యత్వాన్ని పెంచడమూ అనే లెనిన్ పథకాన్ని ట్రాట్స్కీ వ్యతిరేకించినాడు. కానీ కేంద్ర కమిటీ అతన్ని ఓడించింది.

తన ఉత్తరంలో లెనిన్ కొంతమంది కేంద్ర కమిటీ సభ్యుల వ్యక్తిగత గుణాల దృష్ట్యా పార్టీ స్థిరత్వ సమస్యను పరిశీలించి, జినోవ్యెవ్, కామెనెవ్, ట్రాట్స్కీ, బుహారిన్, ప్యతకోవ్, స్టాలిన్‌ల స్వభావాలను సంక్షేపంగా చిత్రించినాడు.

అక్టోబర్ విప్లవానికి ముందు కామెనెవ్, జినోవ్యెవ్‌ల లొంగుబాటు ప్రవర్తన యాదృచ్ఛికం కాదని ఆయన గుర్తుచేసినాడు. ట్రాట్స్కీయొక్క నాన్ బోల్షెవిజంనూ, కేంద్ర కమిటీతో అతని పోరా

టాన్నీ ఆయన ప్రస్తావించి, అతను మితిమీరిన ఆత్మవిశ్వాసంతో వ్యవహరించే మనిషి అనీ, పనిలో వట్టి పరిపాలన పార్శ్వంపట్ల మితిమీరిన ఉబలాటం చూపించేవాడనీ వర్ణించినాడు. అతను మనవెంట ఉంటాడు కానీ, మనవాడు కాడు, అని ఆయన అన్నాడు.

అదే ఉత్తరంలో లెనిన్ స్టాలిన్‌ను కొంత వివరంగా చిత్రించినాడు. తన చేతిలో విస్తృతమైన అధికారం సాంద్రీకరించుకొని, తన పెద్ద వ్యక్తిగత దోషాల మూలంగా స్టాలిన్ ఆ అధికారాన్ని తగినంత విచక్షణతో వుపయోగించ జాలడని ఆయన సందేహాలు వ్యక్తం చేసినాడు. స్టాలిన్‌ను కేంద్ర కమిటీ జనరల్ సెక్రెటరీ పదవినుండి తొలగించే సమస్యను ఆలోచించమని లెనిన్ మహాసభను కోరినాడు. "యెక్కువ సహనమూ, కామ్రేడ్లపట్ల యెక్కువ చిత్తశుద్ధీ, మర్యాదా, సుహృద్భావమూ, తక్కువ చపల చిత్తమూ, వగైరా గుణాల మూలంగా స్టాలిన్‌కంటె భిన్నంగా వుండే" వ్యక్తి ఆ పదవిలో వుండాలని లెనిన్ నమ్మినాడు. పదమూడవ మహాసభ స్టాలిన్‌ను అతని పదవినుండి యెందుకు తొలగించలేదు? మహాసభ ట్రాట్స్కీయిజంతో అతని రాజీలేని పోరాటాన్నీ, పార్టీయొక్క లెనినిస్టు పంథాను అతను రక్షించడాన్నీ గణనలోకి తీసుకొని, అతన్ని పార్టీ కేంద్ర కమిటీ జనరల్ సెక్రెటరీ పదవిలో నిలిపింది.

1923 మార్చి ప్రారంభంలో లెనిన్ ఆరోగ్యం తీవ్రంగా వెనుకముఖం పట్టింది. మేలో ఆయన మళ్లీ గోర్కికి పోయినాడు. పార్టీ, కార్మికులూ, కర్షకులూ తమ నాయకుని ఆరోగ్యం గురించిన ప్రకటనలను ఆతురతతో గమనిస్తూ వుండినారు.

వేసవి మధ్యలో ఆయన ఆరోగ్యం కొంచెం మెరుగైంది. నదేజ్దా క్రూప్‌స్కయా తన స్మృతులలో యిలా వర్ణించింది: "ఒక రోజు ఆయన కారుషెడ్డులోకి పోయి, కారులో కూర్చొని, తనను మాస్కోకు తీసుకపోవాలని పట్టుబట్టినాడు. అక్కడ ఆయన అన్ని గదులలోకీ పోయినాడు, తన ఆఫీసుగదిలోకి పోయినాడు, ప్రజా కమిస్సార్ల కౌన్సిల్

సమావేశమందిరంలోకి చూసినాడు, తరువాత వూర్లో తిరగాలన్న కోరిక వ్యక్తం చేసినాడు. మేము వ్యవసాయ ఎగ్జిబిషన్‌మీదుగా కారులో పోయినాము. ఆయన తన నోటుబుక్కులు సర్దుకున్నాడు, మూడు హేగెల్ సంపుటాలు యెన్నుకున్నాడు, వాటిని తనవెంట తీసుక పోయినాడు.... మరుదినం ఆయన వెనక్కిపోవడానికి తొందరపడినాడు."

1923 నవంబర్ ప్రారంభంలో గ్లూహొవ్ మిల్లునుండి ఒక కార్మికుల ప్రతినిధి వర్గం గోర్కిలోని లెనిన్‌ను చూడడానికి వచ్చింది. వాళ్లు పద్దెనిమిది చెర్రీచెట్లు కానుకగా తెచ్చినారు. వాళ్లను డ్రాయింగు రూములోకి రమ్మన్నారు. కాసేపట్లో తలుపు తెరుచుకుంది, లెనిన్ లోపలికి వచ్చినాడు, చిరునవ్వుతో. ఆయన కార్మికులవద్దకు పోయి, ప్రతివొకరితోనూ కరచాలనం చేసినాడు. అయిదు నిముషాలు ఆయనతో కలిసివున్న తరువాత ప్రతినిధులు ఆలింగనాలతో, ముద్దులతో సెలవు తీసుకున్నారు. ఆయనకు వీడ్కోలు యిచ్చిన చివరివాడు కుజ్నెత్సోవ్ అనే అరవై యేండ్ల ముసలి కార్మికుడు. వాళ్లిద్దరూ ఒకరిచుట్టూ ఒకరు చేతులు పెనవైచి సుమారు రెండు నిముషాలు సేపు అలాగే నిలిచినారు. వృద్ధుడు కన్నీళ్ల మధ్య అన్న మాటలే మళ్లీ అంటున్నాడు: "వ్లదీమిర్ ఇల్యీచ్, నేను కార్మికుణ్ని – కమ్మరివాణ్ణి. మీరు చెప్పిన వన్నీ మేము తయారుచేస్తాము."

వాళ్లు వెళ్లిపోయిన తరువాత లెనిన్ రాత్రి పొద్దుపోయిందాకా గ్లూహొవ్ కార్మికుల అభినందన లేఖను మళ్లీమళ్లీ చదువుతూ కూర్చు న్నాడు. కార్మికులతో అది ఆయన చివరి సమావేశం.

1924 జనవరి 21న, సాయంత్రం 6.50కి మెదడులో రక్తస్రావం మూలంగా లెనిన్ మరణించినాడు.

జనవరి 21న పార్టీ కేంద్ర కమిటీ విస్తృత సమావేశంగా సమావేశమై ప్రజలకు ఒక విజ్ఞప్తి తయారుచేసింది. అందులో యిలా వుంది: "యెవరి సమరశీల నాయకత్వంకింద మన పార్టీ, యుద్ధ

ధూమంచేత ఆవరింపబడి, దేశమంతటా అక్టోబర్ విప్లవ పతాకను దృఢ హస్తంతో నిలబెట్టి, శత్రువుల ప్రతిఘటనను నేలరాచి, పూర్వపు జారిస్టు రష్యాలో శ్రామిక ప్రజల ఆధిపత్యాన్ని సుస్థిరంగా నెల కొల్పిందో, ఆ వ్యక్తి మరణించినాడు. కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ స్థాప కుడు, ప్రపంచ కమ్యూనిజంకు నాయకుడు, అంతర్జాతీయ కార్మికవర్గా నికి ప్రియతముడూ, గర్వకారణమూ, పీడిత ప్రాచ్య పతాకధారి, రష్యాలోని కార్మిక నియంతృత్వపు అధినేత మరణించినాడు."

దుఃఖవార్త దేశమంతటా, ప్రపంచం నలుమూలలా వేగంగా వ్యాపించింది. జనవరి 22న కేంద్ర కార్యనిర్వాహక వర్గ అధ్యక్షుడైన యం. ఐ. కలీనిన్ అప్పుడు జరుగుతూ వుండిన సోవియట్ల పదకొండవ అఖిల రష్యా మహాసభయొక్క ప్రతినిధులకు లెనిన్ మరణ వార్తను ప్రకటించినాడు.

జనవరి 23న లెనిన్ మృతదేహాన్ని గోర్కినుండి మాస్కోకు తెచ్చి, 'హౌస్ ఆఫ్ ట్రేడ్‌యూనియన్స్'లోని 'హాల్ ఆఫ్ కాలమ్స్'లో వుంచినారు. నాలుగు పగళ్లూ, రాత్రులూ భీకరమైన చలిలో లక్షలాది ప్రజలు — కార్మికులూ, కర్షకులూ, యెర్ర సైన్యం సైనికులూ, ఆఫీసు ఉద్యో గులూ, సోవియట్ దేశ మంతటినుండీ ప్రతినిధులూ, పెద్దవాళ్లూ, పిల్లలూ — 'హాల్ ఆఫ్ కాలమ్స్'కు వెళ్లి తమ మహానాయకునికి అంతిమ ప్రణామాలు అర్పించినారు. ప్రజల దుఃఖభారం అపారంగా ఉండింది.

జనవరి 26న, బొల్‌షోయ్ థియేటర్‌లో రెండవ అఖిల యూని యన్ సోవియట్ల మహాసభ స్మారక సమావేశం జరిపింది. మొదటి ఉప న్యాసకుడు సోవియట్ కేంద్ర నిర్వాహక వర్గ అధ్యక్షుడు యం. ఐ. కలీనిన్. సోవియట్ ప్రభుత్వం తన ఆంతరంగిక విధానంలోనూ, వైదేశిక విధా నంలోనూ లెనిన్ ఆదేశాలను తు, చ తప్పకుండా పాటిస్తుందని ఆయన చెప్పినాడు. లెనిన్ పతాకకింద, కమ్యూనిజం పతాకకింద సమీకృతం కావలసిందిగా సమస్త సోవియట్ యూనియన్ శ్రామిక ప్రజలకూ

యావత్ ప్రపంచ నిరాస్తిపరులకూ విజ్ఞప్తి చేస్తూ క్రూప్స్కయా తన ఉపన్యాసం ముగించింది.

మహాసభలోని ఉపన్యాసకులలో జె. వి. స్టాలిన్, కె. జెట్కిన్, యన్. నరిమానొవ్ వుండినారు. క్రాస్ని పుతీలొవెత్స్ వర్క్స కార్మికుల తరఫున ఎ. యన్. సెర్గేయెవ్, పార్టీలో లేని రైతులు తరఫున ఎ. బి. క్రయూష్కిన్, యెర్ర సైన్యం తరఫున కె. వై. వొరొషీలొవ్, యువజనుల తరఫున పి. ఐ. స్మొరోదిన్, శాస్త్రజ్ఞుల తరఫున అకడెమీషియన్ యస్. యఫ్. ఓల్డెన్‌బుర్గ్ మాట్లాడినారు.

మహాసభ లెనిన్ స్మృతిని చిరస్థాయి చేయాలని తీర్మానించి, ప్రపంచ శ్రామిక ప్రజలకు ఒక విజ్ఞప్తిని ఆమోదించింది. కమ్యూనిస్టు భావాలను నేల నాలుగు చెరగులకూ మోసుకపోయే లెనిన్ రచనల విస్తృత, సామూహిక ప్రచారం ఆయనకు అత్యుత్తమ స్మృతి చిహ్నంగా వుంటుందని మహాసభ నొక్కిచెప్పింది.

పెట్రోగ్రాడ్ కార్మికుల అభ్యర్థనమీద, మహాసభ వాళ్ల నగరానికి పేరు మార్చింది; అప్పటినుండి అది లెనిన్‌గ్రాడ్ అయింది.

జనవరి 27 సాయంత్రం 4 గంటలకు అంత్యక్రియలు జరిగినాయి. శవపేటిక రెడ్ స్క్వేర్‌లో ప్రత్యేకంగా నిర్మింపబడిన సమాధి మందిరంలో వుంచబడింది.

సోవియట్ ప్రజలు గాఢ సంతాపంతో తమ నాయకునితో సెలవు తీసుకున్నారు. అంతర్జాతీయ కార్మికవర్గం అయిదు నిముషాల సేపు పని అంతా ఆపాలని పిలుపు యిచ్చింది. ప్రపంచ శ్రామిక ప్రజల నాయకుడూ, గురువూ, వాళ్ల అత్యుత్తమ మిత్రుడూ, రక్షకుడూ అయిన వ్లదీమిర్ ఇలీచ్ లెనిన్‌ను శాశ్వతంగా విశ్రమింపజేసేటప్పుడు మోటారు బండ్లూ, రైళ్లూ నిశ్చలంగా నిలిచినాయి, ఫాక్టరీలలోనూ, మిల్లులలోనూ పని ఆగింది.

లెనిన్ మరణం పార్టీకీ, సోవియట్ యూనియన్ కార్మికవర్గానికీ, ప్రపంచంలోని సమస్త కమ్యూనిస్టు కార్మిక ఉద్యమానికీ తీరని నష్టం. యీ ప్రచండమైన నష్టాన్ని పూరించడానికి పార్టీ మరింత సన్నిహితంగా కేంద్ర కమిటీ చుట్టూ సమీకృతమైంది. పదుల వేల కార్మికులు లెనిన్ పార్టీలో చేరాలని కోరిక వ్యక్తపరిచినారు. కార్మికులను వాళ్ళ పనిచేసే చోటనే పార్టీలో చేర్చుకోడానికి ప్రత్యేక 'లెనిన్ సభ్యత్వ కార్యక్రమం' కేంద్ర కమిటీ ప్రకటించింది; కొద్ది వారాలలో 2,40,000 మంది కార్మికులు పార్టీలో చేరినారు.

లెనిన్ సృష్టించి, కాకలు దీర్చిన కమ్యూనిస్టు పార్టీ ఆయన ఉపదేశాలకూ, బోధలకూ అనుగుణంగా, ఆ మహాపురుషుడు రూపొందించిన పథంవెంట సోవియట్ ప్రజలను నడిపించింది.

# లెనినిజం మహత్తర భావాల దిగ్విజయం

లెనిన్ సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీకీ, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికీ, మానవజాతికీ లెనినిజం అనబడే మహత్తర విప్లవ బోధను, విప్లవ యోచనకూ, విప్లవ ఆచరణకూ ఆ యెడతెగని ఊటను, ఆస్తిగా యిచ్చిపోయినాడు.

యీ శతాబ్ది మలుపులో, పెట్టుబడిదారీ వ్యవస్థ పతనమూ, సోషలిజం, కమ్యూనిజంల వృద్ధీ, విజయాలూ జరిగిన చారిత్రక దశలో, లెనిన్ రచనలు మార్క్సిజం అభివృద్ధిలో ఒక నూతన దశను, లెనినిస్టు దశను, ప్రారంభించినాయి. మార్క్సిజంను, దాని అన్ని

భాగాలనూ – తత్వశాస్త్రాన్నీ, అర్థశాస్త్రాన్నీ, శాస్త్రీయ కమ్యూనిస్టు సిద్ధాంతాన్నీ – లెనిన్ సృజనాత్మకంగా అభివృద్ధి చేసి, కొత్త నిర్ణయాలతోనూ, ప్రతిపాదనలతోనూ దాన్ని సంపన్నం చేసినాడు. లెనినిజంనూ, మార్క్సిజంనూ పరస్పర వ్యతిరేకం అని చెప్పడానికి బూర్జువా సిద్ధాంతవేత్తలూ, రివిజనిస్టులూ చేసే ప్రయత్నాలు చెల్లవు. లెనినిజం అనేది లెనిన్‌చేత విస్తృతంగా అభివృద్ధి చేయబడిన మార్క్సిజమే. యీనాటి పరిస్థితులలో, మార్క్సిజంకు లెనిన్ చేసిన గొప్ప సేవ లేకుండా మార్క్సిజం అనేది వుండజాలదు. మార్క్సిజంకు లెనిన్ యిచ్చిన వ్యాఖ్యానం ఆ సిద్ధాంతంయొక్క నిజమైన సారానికీ, దాని విప్లవతత్వానికీ విధేయంగా వుంది.

లెనినిజం అనేది సామ్రాజ్యవాదంయొక్కా, శ్రామికవర్గ విప్లవాల యొక్కా యుగపు మార్క్సిజం. అది, వలస వ్యవస్థ పతనంచెంది జాతీయ విమోచన ఉద్యమాలు విజయాలు పొందే యుగపు మార్క్సిజం. అది, మానవజాతి పెట్టుబడిదారీ వ్యవస్థనుండి సోషలిజానికీ, కమ్యూనిస్టు సమాజ నిర్మాణానికీ పరిణతి చెందే యుగపు మార్క్సిజం.

లెనినిజం వ్యతిరేకులూ, రివిజనిస్టులూ దానిని భౌగోళిక హద్దులలో పరిమితపరచడంద్వారా దాని అంతర్జాతీయ ప్రాముఖ్యాన్ని బలహీనపరచడానికి ప్రయత్నిస్తారు. లెనినిజం అనేది కేవలం రష్యన్ ఘటన అనీ, అది రష్యన్ పరిస్థితులలో మాత్రమే ఉత్పన్నమై, వ్యాపించగలదనీ వాళ్లు ఉద్ఘాటిస్తారు. యీ కట్టుకథ తప్పు అని జీవితమే రుజువు చేసింది. లెనినిజం మహా అంతర్జాతీయ బోధ, అది సకల దేశాలకు వర్తిస్తుంది. లెనినిజాన్ని కృత్రిమంగా వివిధ జాతీయ, లేక ప్రాంతీయ "రూపాంతరాలు"గా విడదీసే యెలాంటి ప్రయత్నాలైనా ఆ విప్లవ బోధయొక్క సూత్రాలను రివిజనిజానికి దారి తీయిస్తాయి. ఈ బోధ స్వభావరీత్యానే అఖండము. అది ప్రపంచంలోని కమ్యూనిస్టులందరికీ, విప్లవ కార్మికులందరికీ, శ్రామిక ప్రజలందరికీ చెందుతుంది.

మార్క్సిజం లెనినిజం కాల పరీక్షలన్నిటికీ తట్టుకున్న ఒకే ఒక మానవ సమాజ అభివృద్ధి సిద్ధాంతం. మార్క్సిజం లెనినిజం భావాలు సోవియట్ యూనియన్‌లో జరిగే కమ్యూనిజం నిర్మాణంలోనూ, సోషలిస్టు దేశాల ప్రజలు సాధించే విజయాలలోనూ, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంయొక్క, జాతీయ విమోచన శక్తులయొక్క అభివృద్ధిలోనూ సజీవమై వున్నాయి, విజయం పొందుతున్నాయి.

సోవియట్ యూనియన్‌లో సోషలిస్టు నిర్మాణ పథకానికి వి. ఐ. లెనిన్ గాఢమైన శాస్త్రీయ నిరూపణ చేసినాడు. ఆ పథకంలోని ప్రధానాంశాలు సోషలిస్టు పారిశ్రామికీకరణ, వ్యవసాయాన్ని సోషలిస్టు పద్ధతులలోకి మార్చడం, సాంస్కృతిక విప్లవం. ట్రాట్స్కీయిస్టులకూ, దక్షిణపక్ష అవకాశవాదులకూ, జాతీయ పెడమార్గావలంబలకూ వ్యతిరేకంగా సాగించిన రాజీలేని పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ మహత్తర లెనినిస్టు భావాలను కాపాడింది, వాటిని అమలు జరిపింది, ప్రపంచ చారిత్రక ప్రాముఖ్యం గల విజయాలను సాధించింది. ప్రతి పంచవర్ష ప్రణాళికతోనూ యీ విజయాలు ముమ్మరమైనాయి. జారిస్టు కాలంలో వెనుకబడిన దేశంగా వుండిన రష్యా ఒక శక్తివంతమైన సోషలిస్టు రాజ్యంగా, ప్రపంచంలోని అతిపెద్ద రాజ్యాలలో ఒకటిగా తయారైంది. ఇది కార్మికవర్గంయొక్క యావన్మంది సోవియట్ ప్రజల యొక్క వీరోచిత ఘనకార్య ఫలితమే.

కార్మికవర్గ నియంతృత్వ రాజ్యం యీ విజయాలను సాధించడానికి ప్రధాన సాధన. యీనాడు యీ రాజ్యం యావత్ ప్రజా రాజ్యము, కార్మికవర్గం నాయక పాత్ర వహించే రాజకీయ వ్యవస్థ అయింది.

సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ 24వ మహాసభ అనంతరం, (1971–1975) తొమ్మిదవ పంచవర్ష ప్రణాళిక కాలంలో కమ్యూనిజానికి పాదార్థిక, సాంకేతిక ప్రాతిపదికను సృష్టించడంలోనూ, శ్రామిక ప్రజల జీవన ప్రమాణాలను పెంచడంలోనూ, దేశరక్షణ

పాటవాన్ని, భద్రతను నిశ్చయపరచడంలోనూ, మరో పెద్ద ముందడుగు వేయబడింది. యీనాడు సోవియట్ యూనియన్ బొగ్గు, ముడి ఇనుము, నూనె ఉత్పత్తిలోనూ, ఉక్కు, సిమెంటు, ట్రాక్టర్లు, డీసెల్ రైలు ఇంజన్లు, ఖనిజ ఎరువులు, ఉన్ని, పత్తి, తదితర రకాల సరుకుల ఉత్పత్తిలోనూ ప్రపంచంలోకెల్లా ప్రథమ స్థానంలో వుంది.

తొమ్మిదవ పంచవర్ష ప్రణాళికలో వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడంలోనూ, దానికి సాంకేతికంగా కొత్తవైన యంత్రాలను సమకూర్చడంలోనూ, సమష్టి, ప్రభుత్వ వ్యవసాయ క్షేత్రాల ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయడంలోనూ కూడా గొప్ప విజయాలు సాధించబడినాయి. యీ అయిదేళ్లలోనూ వ్యవసాయానికి ప్రచండమైనన్ని కొత్త యంత్రాలు సమకూర్చబడినాయి: 17 లక్షల ట్రాక్టర్లూ, 449 వేల పంటకోత యంత్రాలూ, ఇంకా అనేక ఇతర రకాల యంత్రాలూ. వీటి సహాయంతో వ్యవసాయదారులు వాతావరణ పరిస్థితులు చాలా అననుకూలంగా వున్నప్పటికీ, 1972, 1975 సంవత్సరాలలో అనావృష్టి పర్యవసానాలను అధిగమించగలిగినారు. యెనిమిదవ పంచవర్ష ప్రణాళిక కాలంతో పోల్చిచూస్తే సగటు సాలుసరి ఉత్పత్తి మొత్తాన్ని 13 శాతం అధికం చేయగలిగినారు. సమష్టి క్షేత్ర రైతుల వేతనాలు 25 శాతం పెరిగినాయి. వారి జీవిత పరిస్థితులు కూడా పూర్తిగా మారిపోయినాయి. చాలా విషయాలలో అవి పట్టణ జీవిత పరిస్థితులకు సన్నిహితమైనాయి.

పార్టీయొక్క అత్యున్నత లక్ష్యం సోవియట్ ప్రజల జీవన ప్రమాణాలను పెంచడం. తొమ్మిదవ పంచవర్ష ప్రణాళిక కాలంలో యీ కర్తవ్యం విజయవంతంగా నెరవేర్చబడింది: జాతీయ ఆదాయంలో 80 శాతం నూటికి ప్రజా సంక్షేమం కోసం ఖర్చుచేయబడింది. ఈ విషయంలో అత్యుత్తమ సూచికలలో ఒకటి దేశంలో 56 మిలియన్ల మంది గృహ వసతి మెరుగుకావడం, చాలా విభాగాలకు చెందిన

సోవియట్ శ్రామిక ప్రజల వేతనాలూ జీతాలూ పెరగడం, పింఛనులు పెరగడం, వైద్య సేవలు, పని పరిస్థితులూ, దైనందిన జీవితమూ మెరుగుకావడం.

పెట్టుబడిదారీ ప్రపంచపు తీవ్ర ఆర్థిక సంక్షోభపు పూర్వరంగంలో చూస్తే సోవియట్ ఆర్థిక వ్యవస్థ సాధించిన విజయాలు ప్రత్యేకించి సుస్పష్టం.

సంస్కృతి, విద్యాబోధన, విజ్ఞానశాస్త్ర రంగాలలో సోవియట్ ప్రజలు గొప్ప విజయాలను సాధించినారు. చరిత్రలో మొట్టమొదటి సారిగా, సోషలిజంలో మానవ మేధస్సు, విజ్ఞానశాస్త్రమూ, సాంకేతిక విజ్ఞానమూ ప్రజల శ్రేయస్సు కొరకు వినియోగింపబడతాయని, అవి శ్రామిక ప్రజలకు వ్యతిరేకంగా తిప్పబడజాలవని లెనిన్ చెప్పిన చారిత్రక జోస్యం నిజమైంది: సోవియట్ యూనియన్‌లో సోషలిస్టు సంస్కృతి, నిజంగా ప్రజల సంస్కృతి, సృష్టింపబడింది. అది సాధించిన అతి మహత్తర విజయం, లక్షోపలక్షల శ్రామిక ప్రజలలో కమ్యూనిస్టు చైతన్యాన్ని తీర్చిదిద్దడం.

సోషలిస్టు దేశాలు గొప్ప విజయాలను సాధించినాయి. ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, సైద్ధాంతిక రంగాలలోనూ, సామాజిక జీవితంలోని యితర రంగాలలోనూ వాటి సంబంధాలూ సహకారమూ మరింత సన్నిహితం అయినాయి. కమ్యూనిస్టు పార్టీలు ఒక అనతి క్రమణీయమైన సమరశీల మైత్రిని యేర్పరచుకున్నాయి, అదే సోషలిస్టు కుటుంబానికి ప్రధానమైన మార్గనిర్దేశకమైన శక్తి.

సోవియట్ జీవిత విధానపు ప్రత్యేక లక్షణాలు దేశంలోని అన్ని జాతుల, ఉపజాతుల ప్రజల మధ్య సమష్టితత్వమూ, సహోదరత్వమూ, మైత్రీ కలిగివుండడం. ఇవి ఆరోజు కారోజు మరింత పటిష్టవంతం అవుతున్నాయి. సోషలిస్టు నిర్మాణ కాలంలో ఒక కొత్త చారిత్రక ప్రజా కుటుంబం, అంటే సోవియట్ ప్రజా రూపు దాల్చింది.

సోవియట్ సమాజాభివృద్ధిలో దాని ప్రస్తుతపు దశను వర్ణిస్తూ ఎల్. ఐ. బ్రెజ్నెవ్, 1976 ఫిబ్రవరిలో సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ 25వ మహాసభకు సమర్పించిన పార్టీ కేంద్ర కమిటీ నివేదికలో యిలా అన్నాడు: "మనం ఒక కొత్త సమాజాన్ని, మానవజాతి యింతకు ముందెన్నడూ కని విని యెరుగని సమాజాన్ని సృష్టించినాము. ఇది సంక్షోభాలు లేకుండా, నిరంతరాభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థా, పరిపక్వం చెందిన సోషలిస్టు సంబంధాలూ, నిజమైన స్వేచ్ఛా గల సమాజం. ఇది శాస్త్రీయమైన భౌతికవాద ప్రపంచ దృక్పథం ప్రబలమై వుండే సమాజం. ఇది భవిష్యత్తుపట్ల దృఢ విశ్వాసం గల, ఉజ్వలమైన కమ్యూనిస్టు అవకాశాలు గల సమాజం. దాని ముందు మరింత సర్వతోముఖమైన అభివృద్ధికి అనంత దిఙ్మండలాలు ఆవిష్కృతం అవుతున్నాయి."

సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ 25వ మహాసభ రూపొందించిన పదవ పంచవర్ష ప్రణాళిక (1976–1980) కమ్యూనిస్టు నిర్మాణంలో ఒక కొత్త ముఖ్యమైన దశ అవుతుంది. సోవియట్ ప్రజల సంక్షేమం మరింత పెంచబడుతుంది, ఆరోగ్యరక్షణా, విద్యా, సాంస్కృతిక రంగాలు – నూతన మానవుని తీర్చిదిద్దేందుకూ, సోషలిస్టు జీవిత విధానాన్ని మెరుగుపరచేందుకూ తోడ్పడే ప్రతి అంశమూ – మరింత అభివృద్ధి అవుతాయి.

సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ 25వ మహాసభ ఉద్దేశించిన సాంఘిక ఆర్థిక కార్యక్రమం తన శక్తి సాధ్యతలను వాస్తవంగా పరిగణనలోకి తీసుకోవడంమీద ఆధారపర్చబడింది. అంతకు పూర్వ మెన్నడూ సోవియట్ యూనియన్‌కి యింతటి శక్తివంతమైన ఆర్థిక, శాస్త్ర, సాంకేతిక స్తోమతలు లేవు. యీ నాడున్నంతటి బ్రహ్మాండమైన సంఖ్యలో నేర్పరులైన సిబ్బంది యింతకు పూర్వం

లేదు. ఆర్థిక నిర్మాణంలో యింతటి గొప్ప అనుభవం యింతకు పూర్వం యెన్నడూ దానికి లేదు.

దేశాన్ని యెదుర్కొంటున్న ఆర్థిక సామాజిక కర్తవ్యాలను విజయవంతంగా నెరవేర్చడమన్నది శ్రమ ఉత్పాదకతలో వచ్చే త్వరితమైన పెరుగుదలచేతనూ, మొత్తం సామాజిక ఉత్పత్తి సామర్థ్యంలో వచ్చే అధికమైన పెరుగుదలచేతనూ నిర్ణయించబడుతుంది.

అభివృద్ధి చెందిన సోషలిజాన్ని నిర్మించడమూ, పరిశ్రమ, వ్యవసాయం, శాస్త్రవిజ్ఞానం, సాంకేతిక విజ్ఞానం అభివృద్ధిలో సాధించిన అన్ని విజయాలూ, సోవియట్ ప్రజల సంక్షేమాన్ని పెంచడమూ, సంస్కృతిని అభివృద్ధిపరచడమూ — యివన్నీ సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీయొక్కా, దాని లెనినిస్టు కేంద్ర కమిటీయొక్కా, అచంచల లెనినిస్టూ, ప్రముఖ రాజకీయ నాయకుడూ, శాంతి కోసం నిర్విరామంగా పోరాడే యోధుడూ అయిన ఎల్. ఐ. బ్రేజ్నెవ్ నాయకత్వం వహించే పొలిట్ బ్యూరోయొక్కా ప్రచండమైన రాజకీయ సైద్ధాంతిక, నిర్మాణాత్మక కార్యకలాపాలతో విడదీయరాని విధంగా ముడివడి వున్నాయి.

సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ శాస్త్రీయ కమ్యూనిజాన్ని అనుసరించే పార్టీ, దాని యావత్తు కార్యకలాపానికీ మూలాధారం మార్క్సిస్టు లెనినిస్టు సిద్ధాంతం. సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ లెనిన్ భావాలచే నిరంతరం నడుపబడుతోంది, వాటిని సృజనాత్మకంగా అభివృద్ధి చేస్తోంది, వాటిని ఆచరణలో పెడుతోంది. కమ్యూనిస్టు పార్టీ ప్రజలను కమ్యూనిజం నిర్మాణ దిశగా లెనినిస్టు మార్గంలో నడిపింది, నడుపుతోంది. అభివృద్ధి చెందిన సోషలిజం పరిస్థితులలో సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ యావత్ప్రజల పార్టీ అయింది, కాని అది తన వర్గ స్వభావాన్ని మాత్రం గోల్పోలేదు, అది దేశంలోని ప్రధాన వర్గమైన కార్మికవర్గ పార్టీగా వుండింది, వుంటున్నది. సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ

25వ మహాసభ, పార్టీ శ్రేణుల దృఢమైన ఐక్యతనూ, యేకశీలా భావాన్నీ, లెనినిజం పతాకంపట్ల దాని భక్తి విశ్వాసాలనూ నిరూపించింది.

25వ పార్టీ మహాసభలో ఎల్. ఐ. బ్రేజ్నెవ్ సమర్పించిన నివేదిక నూతన చారిత్రక పరిస్థితులలో మార్క్సిస్టు లెనినిస్టు సిద్ధాంతంయొక్క సృజనాత్మక అభివృద్ధికి నిదర్శన. ఆ నివేదిక అభివృద్ధి చెందిన సోషలిస్టు సమాజ పరిస్థితులలో పార్టీ కార్యకలాపాల ప్రగాఢ విశ్లేషణ చేసి యావన్మంది సోవియట్ ప్రజల కార్యాచరణకు మార్గ దర్శకమైన విస్తృత కార్యక్రమాన్ని నిర్వచించింది. పార్టీకీ ప్రజలకూ మధ్యనున్న అభేద్యమైన ఐక్యతను ఆ నివేదిక నొక్కిచెప్పింది: "ప్రజలకు పార్టీపై గట్టి నమ్మకముంది. పార్టీ దేశాంగ, విదేశాంగ విధానాన్ని వారు పూర్తిగా బలపరుస్తున్నారు. ఇది పార్టీ బలాన్ని శతాధికం చేస్తుంది, శక్తిని ప్రసాధించే అక్షయ పాత్రంగా వుంది." పదవ పంచవర్ష ప్రణాళిక విజయవంతంగా నెరవేర్చబడడానికీ, సోవియట్ యూనియన్ మరిన్ని అద్భుతమైన విజయాలు సాధించడానికీ ఇది చక్కని హామీ అవుతుంది. సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ 25వ మహాసభ చేసిన నిర్ణయాలను శ్రామిక ప్రజలు హృదయపూర్వకంగా ఆమోదిస్తూ, అధికమైన కొత్త సోషలిస్టు బాధ్యతలను తీసుకుని, సోషలిస్టు పోటీని మరింత విస్తృతపరుస్తారు. మహాసభ చేసిన నిర్ణయాలను నెరవేర్చడం ఒక గౌరవప్రదమైన విషయంగా సోవియట్ ప్రజలందరూ భావిస్తున్నారు.

వి. ఐ. లెనిన్‌చే పునాదులు వేయబడిన విదేశాంగ విధానాన్ని కమ్యూనిస్టు పార్టీ, సోవియట్ ప్రభుత్వమూ అచంచలంగా అనుసరిస్తున్నాయి. విభిన్న సామాజిక వ్యవస్థలు గల దేశాల మధ్య శాంతియుత సహజీవనం వుండాలనే సూత్రం యీ విధానానికి మూలం. లెనిన్ ఆదేశాలను అనుసరించి సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ 24వ మహాసభ విస్తృత శాంతి కార్యక్రమాన్ని రూపొందిం

చింది. కమ్యూనిస్టు పార్టీయొక్క, సోవియట్ ప్రభుత్వంయొక్క కార్య కలాపాలన్నీ యీ కార్యక్రమాన్ని నిరంతరాయంగా అమలు జరపడానికి ఉద్దేశింపబడినాయి. యీ కార్యక్రమం దేశ ఆర్థిక, రక్షణ పాటవం మీదనూ, సోవియట్ ప్రజలు సాధించిన విజయాలమీదనూ ఆధార పర్చబడింది. సోవియట్ విదేశాంగ విధానాన్ని రూపొందించడంలోనూ, అనుసరించడంలోనూ ఎల్. ఐ. బ్రెజ్నెవ్ ప్రముఖ పాత్రను నిర్వ హించినాడు.

గడచిన సంవత్సరాలలో సోవియట్ యూనియన్‌యొక్కా, సోషలిస్టు కుటుంబమంతటియొక్కా అంతర్జాతీయ స్థానం గణనీయంగా సుస్థిరపడింది. "ప్రచ్ఛన్న యుద్ధం"నుండి విభిన్న సామాజిక వ్యవ స్థలు గల దేశాల మధ్య శాంతియుత సహజీవనానికీ, ప్రమాదకరమైన ఉద్రిక్తతనుండి సౌమనస్యానికీ, పెట్టుబడిదారీ దేశాలతో పరస్పరం లాభదాయకమైన సహకారానికీ మలుపు జరిగింది. ప్రపంచ రంగంలో బలాబలాల తారతమ్యంలో వచ్చిన మార్పు మూలంగానే యిది సాధ్య మైంది. సోవియట్ యూనియన్ చొరవపై హెల్సింకీలో జరిగిన అఖిల యూరపియన్ సమావేశం సౌమనస్య సాధన మార్గంలో ఒక ముఖ్య మైన ఘటన. సోవియట్ యూనియన్ శాంతికాముక విదేశాంగ విధానం సకల దేశాల ప్రజల మౌలిక ప్రయోజనాలకూ అనుగుణమైనది, వాళ్ళు దానిని బలపరుస్తున్నారు. సోదర సోషలిస్టు దేశాల సన్నిహిత సహకారంతో అది అమలు జరుపబడుతూ వుంది. ప్రపంచ ఘటనల గమనంపై వాటి ప్రభావం అంతకంతకు మరింత ప్రగాఢమూ, శక్తివంతమూ అవు తున్నది. సోవియట్ యూనియన్‌కూ అమెరికా సంయుక్త రాష్ట్రాలకూ మధ్య అనేక ఒప్పందాలపై సంతకాలు జరిగినాయి. అవి శాంతియుత సహజీవన సూత్రాల ఆధారంగా పరస్పరం లాభదాయకమైన సహకారాభి వృద్ధికి ప్రాతిపదికలను వేసినాయి.

సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ 25వ మహా సభ శాంతి పోరాటానికి విస్తృతమైన కార్యక్రమాన్ని రూపొందించి నది, అది సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ 24వ మహాసభ ప్రకటించిన శాంతి కార్యక్రమవు హేతుబద్ధమైన కొనసాగింపూ, అభి వృద్ధీ. యీ కార్యక్రమంలో యీ క్రింది అంశాలు ఉన్నాయి: శాంతిని సుస్థిరమొనర్చేటందుకు సోషలిస్టు దేశాలు సంయుక్తంగా మరింత ఎక్కువ సహాయపడాలి; ఆయుధ పోటీ అంతం కావాలి, సార్వత్రిక సంపూర్ణ నిరాయుధీకరణకు పరివర్తన రావాలి; యుద్ధపు ఆటపట్టులు రద్దు చేయబడాలి, మొట్టమొదట మధ్య ప్రాచ్యంలో సమస్యలు న్యాయ యుతంగా పరిష్కరింపబడాలి. యీ శాంతి కార్యక్రమంలో అంతర్జాతీయ సౌమనస్యాన్ని ప్రగాఢం చేయడానికీ, ఆసియాలో భద్రతా సాధనకు ప్రయత్నించడానికీ, అంతర్జాతీయ సంబంధాలలో బలప్రయోగ విసర్జనకు ఒక ప్రపంచ సంధి కుదుర్చుకోడానికీ, వలస పీడన అవశేషాలన్నిటిని రద్దుచేయడానికీ కూడా చర్యలు, ఇంకా ఇతర చర్యలు తీసుకోవాలని ఉద్దేశింపబడింది.

అదే సమయంలో సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ 25వ మహాసభలో మరో విషయం కూడా బహిరంగంగా ప్రకటించబడింది. అదేమిటంటే, సోవియట్ యూనియనూ వార్సా సంధిపై సంతకాలు చేసిన ఇతర దేశాలూ సుస్థిరమైన శాంతి కొరకూ సౌమనస్యం కొరకూ ఆయుధాల పోటీకీ, మిలిటరీ కూటములకూ వ్యతిరేకంగానూ నిలబడు తూనే నాటో కూటమి వున్నంత కాలమూ, సైనిక వర్గాలు ఆయుధో త్పత్తిని ముమ్మరంగా కొనసాగించుతున్నంత కాలమూ తమ యీ సైనిక రాజకీయ మైత్రిని పటిష్టం చేసుకుంటాయి.

యూరప్‌లో శాంతి, భద్రత, సహకారం, సామాజిక ప్రగతుల కోసం సాగించే పోరాటానికి 1976 జూన్ ఆఖరులో బెర్లిన్‌లో జరిగిన కమ్యూనిస్టు, కార్మిక పార్టీల సమావేశానికి గొప్ప ప్రాముఖ్యం వుంది.

యీ సమావేశం ఆమోదించిన "యూరప్‌లోని శాంతీ, భద్రతా, సహకారమూ, సామాజిక ప్రగతీ కొరకు" అనే పత్రం మార్క్సిజం లెనినిజం సూత్రాలపై ఆధారపడి వుంది. అది సామాజికాభివృద్ధిలో నాయక శక్తి అయిన కార్మికవర్గానికీ, విస్తృత శ్రామిక జనాలకూ ఆయుధాల పోటీని అంతమొందించేందుకూ, అంతర్జాతీయ సౌమనస్యాన్ని పటిష్టంచేయడానికీ, తమ జీవిత హక్కులకు సాగించే పోరాటంలో మార్గదర్శకంగా వుండింది.

సోషలిస్టు దేశాలూ, పెట్టుబడిదారీ దేశాల కార్మికవర్గ ఉద్యమమూ, జాతీయ విమోచన ఉద్యమమూ ప్రధాన విప్లవ శక్తులుగా వున్నాయని సమావేశం తెలియజేసింది. సమస్త ప్రజాతంత్ర శక్తులతో సహా అవి ప్రగతివ్యతిరేక శక్తుల ప్రతిఘటనను అధిగమించగలవు, ప్రపంచ యుద్ధం రాకుండా నివారించగలవు.

శాంతి పోరాటానికీ, సామాజిక ప్రగతి పోరాటానికీ మధ్య వున్న విడదీయరాని సంబంధం వుంటుందని యీ సమావేశం నిరూపించింది. "కమ్యూనిజం వ్యతిరేకతను ఏకాకిని చేసి ఓడించవలసిన" ఆవశ్యకతను గురించీ, కమ్యూనిస్టు పార్టీలకూ, సోవియట్ యూనియన్‌తో ఆరంభించి సోషలిస్టు దేశాలకూ, సోషలిస్టు సామాజిక ప్రగతి శక్తులకూ వ్యతిరేకంగా ప్రచారోద్యమాలను చెలరేగే శక్తులను యెదుర్కొని పోరాడాల్సిన ఆవశ్యకతను గురించీ ఆ సమావేశం ఆమోదించిన పత్రం గొప్ప ప్రాముఖ్యం కలిగివుంది.

కమ్యూనిస్టు పార్టీలు మార్క్సు, ఎంగెల్సు, లెనిన్‌ల మహత్తర భావాలపై ఆధారపడి అంతర్జాతీయ సహకారాన్నీ, సంఘీభావాన్నీ అభివృద్ధి చేస్తాయని ఆ సమావేశం తెలియజేసింది. అది సోదర పార్టీల యొక్క ఐక్యతా, యేకీభావం అనే పతాకాన్ని ఎగురవేసి, నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా తమ తమ పద్ధతులద్వారా, సాధనాలద్వారా

ఘన లక్ష్యాలను సాధించడానికి ఉమ్మడి పోరాటంలో తోడ్పడడానికి వాటి సంసిద్ధతను చూపించింది.

శ్రామిక ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా ప్రపంచాన్ని మార్చడానికి కమ్యూనిస్టు పార్టీలూ సకల కార్మికవర్గమూ సాగించే పోరాటంలో కార్మికవర్గ అంతర్జాతీయత అనే అత్యంత శక్తివంత మైన, విశ్వసనీయమైన ఆయుధం వుండింది, వుంటుంది.

ఆయుధాల పోటీ కావాలనే వారి ప్రధానమైన వాదం సోవియట్ యూనియన్‌నుంచి ప్రమాదం వుందనే కట్టుకథ. అది ఆరంభంనుంచి అంతందాకా ఘోరమైన అబద్ధం అని ఎల్. ఐ. బ్రేజ్నెవ్ అన్నాడు. 25వ మహాసభలో ఆయన యిలా అన్నాడు: "సోవియట్ యూనియన్ యెవరిమీదా దాడిచేయబోవడం లేదు. సోవియట్ యూనియన్‌కు యుద్ధం అవసరం లేదు.... సోవియట్ దేశాన్ని శాంతి దుర్గంగా, శాంతి పతాక ధారిగా యావత్ ప్రపంచ ప్రజలు న్యాయంగా పరిగణిస్తారు. శాంతిని కాపాడడానికీ, పటిష్టం చేయడానికీ, వినాశకర యుద్ధం బెడదనుంచి మానవజాతిని తప్పించడానికీ మనకు చేతనయినదంతా చేస్తున్నాము, యిక ముందూ చేస్తాము." శాంతీ, సోషలిజమూ అవిభాజ్యం.

జనాలను కార్మికవర్గ అంతర్జాతీయతా భావంలోనూ, ప్రజల మధ్య స్నేహభావంలోనూ, బూర్జువా సిద్ధాంతాలకూ, జాతీయవాదానికీ, "దక్షిణపక్ష," "వమపక్ష" రివిజనిస్టులకూ వ్యతిరేకంగా పోరాటాన్ని చేయాలనే భావంలోనూ విజ్ఞానవంతులను చేయడం తమ అత్యంత ముఖ్యమైన కర్తవ్యంగా సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ, యావన్మంది సోవియట్ ప్రజలూ పరిగణించినారు, పరిగణిస్తూన్నారు. కార్మికవర్గ అంతర్జాతీయతనుండి వైదొలగడం అంతర్జాతీయ కార్మిక వర్గ ఉద్యమానికీ, కమ్యూనిస్టు ఉద్యమానికీ, వివిధ దేశాల ప్రజల ప్రయోజనాలకూ కఠిన పర్యవసానాలకు అనివార్యంగా దారితీస్తుందని చరిత్ర అనుభవం నిరూపిస్తుంది.

మార్క్సిజం లెనినిజం పతాకం క్రింద ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం ఒక అజేయమైన శక్తిగా అభివృద్ధి చెందింది. యిది లెనిన్ సిద్ధాంతంయొక్క సజీవత్వానికి తిరుగులేని నిదర్శనం, కార్మికవర్గ అంతర్జాతీయతా సూత్రాలపై కమ్యూనిస్టు, కార్మిక పార్టీలలో ఐక్యతను సుస్థిరమొనర్చమని ఆయన నిర్విరామంగా ఉద్బోధించినాడు

అంతర్జాతీయ కార్మికవర్గ, కమ్యూనిస్టు ఉద్యమంయొక్క అత్యంత అనుభవజ్ఞమైన పటిష్టవంతమైన దళాలలో సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ ఒకటనీ, అది మార్క్సు, ఎంగెల్స్, లెనిన్‌ల మహత్తర బోధలపట్లనున్న అకుంఠిత భక్తి విశ్వాసాలచేతనూ, శ్రామిక ప్రజల మౌలిక ప్రయోజనాల కొరకు జరిగే పోరాటంలో లక్ష్యాలయేకత్వంచేతనూ ఇతర సోదర పార్టీలతో సన్నిహితంగా ముడివడివున్న దళమనే వాస్తవాన్ని కమ్యూనిస్టు పార్టీలలో అధిక సంఖ్య గుర్తిస్తున్నాయి. అంతర్జాతీయ కర్తవ్యాలూ, జాతీయ కర్తవ్యాలూ అవిభాజ్యమైనవనే సూత్రం ఆధారంగా సోవియట్ ప్రజలూ, వారి కమ్యూనిస్టు పార్టీ కార్మికవర్గ అంతర్జాతీయతా విధానాన్ని నిరంతరం అనుసరిస్తున్నారు. సోవియట్ ప్రజల మహత్తర లక్ష్యం అయిన కమ్యూనిజం నిర్మాణం, అదే సమయంలో దాని ప్రధాన అంతర్జాతీయ కర్తవ్యం కూడా.

సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ 25వ మహాసభ అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీకున్న ప్రతిష్టను సుస్పష్టంగా తెలిపింది. ఆ మహాసభ కార్యకలాపంలో 96 దేశాలనుండి వచ్చిన 103 కమ్యూనిస్టు, కార్మిక, జాతీయ-ప్రజాతంత్ర, సోషలిస్టు పార్టీల ప్రతినిధులు పాల్గొనినారు. వారు తమ ప్రసంగాలలో సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాలను హృదయపూర్వకంగా హర్షించినారు.

ఆ మహాసభ కార్యక్రమానికి వచ్చిన అపూర్వమైన అంతర్జాతీయ ప్రతిస్పందన దానికున్న గొప్ప ప్రాముఖ్యాన్ని, సోవియట్ యూనియన్

కమ్యూనిస్టు పార్టీ నిర్వహించే పాత్రపట్ల అధికమైన ప్రశంసాభావాన్ని తెలియజేస్తుంది. అంతర్జాతీయ కమ్యూనిస్టు, కార్మిక ఉద్యమ నాయకుల అభిప్రాయంలో, సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి ఎల్. ఐ. బ్రేజ్నెవ్ నివేదిక మానవతతో నిండివుంది. మానవజాతి అత్యంత ప్రియమైనవిగా యెంచుకునే రెండు లక్ష్యాలు — శాంతి, సంక్షేమము — అందులో వున్నాయి.

* * *

మార్క్స్, ఎంగెల్సుల ఆశయాన్నీ బోధనూ కొనసాగించిన మహనీయుడూ, సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ స్థాపకుడూ, ప్రపంచంలో తొలి సోషలిస్టు రాజ్య నిర్మాతా, ప్రపంచ మంతటిలోని శ్రామిక ప్రజల నాయకుడూ, గురువూ అయిన వి. ఐ. లెనిన్ పుట్టిన దినంనుండి ఒక శతాబ్దికి పైగా గడిచింది.

యావత్తు మానవజాతికీ ఉజ్జ్వల భవిష్యత్తు అయిన కమ్యూనిజానికి మార్గం చూపే లెనిన్ భావాలను సోవియట్ ప్రజలూ, సోషలిస్టు దేశాల ప్రజలూ అంతర్జాతీయ కార్మికవర్గమూ, అభ్యుదయకర మానవాళి అంతానూ నిరంతర మూలాధారంగా యెంచుతున్నారు.

తన బలం అంతటినీ, బౌద్ధిక శక్తుల నన్నిటినీ శ్రమజీవుల ప్రయోజనాల కొరకూ, సౌభాగ్యం కొరకూ జరిగే పోరాటానికి అర్పించిన లెనిన్‌పట్ల ప్రజలకు అపారమైన ప్రేమ వుంది. మన భూమండలంమీది ప్రజలకందరికీ ఆయన పేరు నిరవధికంగా ప్రియమైనది, అది కార్మిక వర్గ విప్లవాలకూ, సోషలిజంకూ ప్రగతికీ సంకేతం అయింది. ప్రపంచం యొక్క కమ్యూనిస్టు పరివర్తనకు సంకేతం అయింది. అజరామరమైన లెనిన్ భావాలు ప్రపంచ చరిత్ర గతిమీద అధికాధిక ప్రభావం నెరపుతున్నాయి.

మూర్తి నాయకుడూ గురువూ, స్ఫటికంలాంటి నైతిక స్వచ్ఛతా, గొప్ప నమ్రతా, నేర్పూ, తరగని విప్లవోత్సాహమూ, అతి ఖచ్చితమైన సూత్రాలూ, అపారమైన నిస్వార్థత, దోపిడిదార్లపట్లా, కార్మికవర్గ శత్రువులపట్లా రాజీలేని వైఖరి, శ్రామిక ప్రజలపట్ల ప్రగాఢమైన ప్రేమ గలిగిన లెనిన్ మహనీయుని స్మృతి సర్వ మానవుల హృదయాల లోనూ, మనస్సులలోనూ శాశ్వతంగా వుంటుంది.

లెనిన్‌ను చూసి, ఆయనతో కలిసి పనిచేసి, ఆయన్ను సన్నిహితంగా యెరిగిన అదృష్టం గల ఆయన సమకాలికులు ఆయన వ్యక్తిత్వంలో కమ్యూనిస్టు సమాజపు మానవుని కుండే లక్షణాలు మూర్తీభవించి వున్నాయని సరిగానే పేర్కొన్నారు.

లెనిన్ పేరూ, ఆయన మహోత్తర ఆశయమూ, బోధలూ అనశ్వరములు, అవి శతాబ్దాల తరబడి, యుగాల తరబడి నిలుస్తాయి.

లెనిన్ ఆశయం అజేయం!

పాఠకులకు మనవి

యీ పుస్తకం అనువాదాన్ని గూర్చీ, కూర్పును గూర్చీ మీ అభిప్రాయాలను "ప్రగతి" ప్రచురణాలయానికి తెలుపండి.

మీ అభిప్రాయాలను యీ కింది చిరునామాకు పంపండి:

Progress Publishers
21, Zubovsky Boulevard
Moscow, USSR

సోవియట్ యూనియన్‌లో ముద్రించబడింది